
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

వేసవికి ముందే విద్యుత్తు కొనుగోళ్లు!



భారీగా కొనుగోలు చేస్తున్న డిస్కమ్‌లు
రోజుకు సగటున 70 మిలియన్ యూనిట్లు
రూ.50 కోట్ల చెల్లింపు.. ఉత్పత్తి తగ్గుదల వల్లే
బహిరంగ విపణిలో టాప్‌లో తెలంగాణ
దక్షిణాదిలో ఐఈఎక్స్ విక్రయిస్తున్న విద్యుత్తులో 90 శాతం కొనుగోళ్లు మనవే

12

మంగళవారం | 4-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 307
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా. 2.31 తదుపరి అష్టమి; నక్షత్రం: అశ్విని రా. 9.50 తదుపరి భరణి; వర్జ్యం: సా.6.04-7.34; దుర్ముహూర్తం: ఉ.9.05-9.50, రా.10.18-11.07; అమృతఘడియలు: మ.3.04-4.34; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.49; సూర్యాస్తమయం: 6.08
వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




గవర్నరా? రాష్ట్రపతా!?

రిటైర్మెంట్ తర్వాత రాజీవ్‌కుమార్‌కు ఏ పదవిస్తున్నారు?
అందుకే బీజేపీకి సీఈసీ సాగిలపడుతున్నారు
ఎన్నికల కమిషన్ అసలు లేదన్నట్లుగా పరిస్థితి ఉంది
ఎన్నికల్లో బీజేపీ పది శాతం ఓట్లను రిగ్గింగ్ చేయవచ్చు
15 శాతం ఆధిక్యం ఇస్తేనే వాళ్ల అక్రమాలకు అడ్డుకట్ట
ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు
ఢిల్లీలో ముగిసిన ప్రచారం.. రేపే 70 సీట్లకు పోలింగ్
హస్తినలో 'జైలు' రాజకీయం!.. సానుభూతికి ప్రయత్నం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: పదవీ విరమణ తర్వాత ఇస్తామంటున్న పదవుల కోసం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ బీజేపీ ఒత్తిళ్లకు సాగిలపడిపోయారని ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర ఆరోపణలు చేశారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రజాస్వామ్యాన్ని పణంగా పెడుతున్నారని ఆరోపించారు. బీజేపీకి అనుకూలంగా ఎన్నికల కమిషన్ పక్షపాతం చూపిస్తోందని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారానికి సోమవారం చివరి రోజు. ఈ సందర్భంగా దేశ రాజధానిలో

మిగతా 2వ పేజీలో...

మైతేయిలను తుపాకులు దోచుకోనివ్వండి



ఆడియోలో మణిపూర్ సీఎం బీరేన్ ఆదేశాలు!
ఆడియో క్లిప్‌లకు ట్రూత్ ల్యాబ్స్ ఫోరెన్సిక్ పరీక్ష
93 శాతం సరిపోలిన ముఖ్యమంత్రి ఆడియో
సుప్రీంకు నివేదిక సమర్పించిన ప్రశాంత్‌భూషణ్
హింసాగ్నికి ముఖ్యమంత్రి వ్యాఖ్యల ఆజ్యం?
సుప్రీంకోర్టులో 'కోహుర్' సంస్థ పిటిషన్
మార్చి 24కు వాయిదా వేసిన ధర్మాసనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: మణిపూర్‌లో జాతుల మధ్య హింసకు ఆ రాష్ట్ర సీఎం బీరేన్ సింగ్ ప్రేరేపించారంటూ లీకైన ఆడియో క్లిప్‌పై హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ట్రూత్ ల్యాబ్స్ ఇచ్చిన ఫోరెన్సిక్ నివేదిక సంచలనం రేపుతోంది. "ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయుధాలను లూటీ చేసేందుకు మైతేయిలకు అవకాశమివ్వండి" అంటూ ఆదేశించే ఆడియో క్లిప్ వైరల్ అయిన విషయం తెలిసిందే..! ఈ క్లిప్‌లోని ఆడియోతో.. సీఎం బీరేన్ సింగ్ గొంతు 93% వరకు మ్యాచ్ అవుతోందని ట్రూత్ ల్యాబ్స్ నివేదిక ఇచ్చింది. ఆ నివేదికను సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సోమవారం సుప్రీంకోర్టుకు

మిగతా 2వ పేజీలో...

ఏ.. బీ.. సీ..!

రాష్ట్రంలో ఎస్సీలు
52.50 లక్షలు
మాదిగలు: **33.5** లక్షలు
మాలలు: **19** లక్షలు

మూడు గ్రూపులుగా ఎస్సీ వర్గీకరణ

దాని ప్రకారమే మాదిగ, మాల సహా ఉప కులాలకు రిజర్వేషన్ల కేటాయింపు
ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ సూచన
దానిపై రెండుసార్లు మంత్రి ఉత్తమ్ నేతృత్వంలోని సబ్ కమిటీ సమావేశం
సీఎం రేవంత్‌ను కలిసి వివరణ
నేడు క్యాబినెట్‌కు.. వెంటనే అసెంబ్లీకి
కులగణన నివేదికపై నేడు అసెంబ్లీలో చర్చ
ఎస్సీ ఉప కులాల వర్గీకరణపైనా అస్త్రశస్త్రాలతో అధికార, విపక్షాలు సిద్ధం

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీలను మూడు గ్రూపులుగా వర్గీకరించాలని ఈ అంశంపై నియమించిన ఏకసభ్య కమిషన్ ప్రభుత్వానికి సూచించినట్టు తెలిసింది. గతంలోలా 'ఏ బీ సీ డీ'గా కాకుండా ఇప్పుడు 'ఏ బీ సీ' గ్రూపులుగా వర్గీకరించాలని ప్రభుత్వానికి సమర్పించిన తన నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. ఆయా గ్రూపుల్లో మాదిగ, మాల సహా మిగిలిన ఉప కులాల జనాభా శాతం, వాటికి ఇప్పటి వరకు వివిధ రంగాల్లో దక్కిన అవకాశాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్లను కేటాయించాలని నివేదికలో పొందుపరిచినట్టు సమాచారం. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఆ కమిషన్ తన నివేదికను సోమవారం ఎస్సీ సంక్షేమ శాఖకు అందించగా.. ఆ శాఖ అధికారులు దానిని మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించారు. నివేదికపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

మిగతా 13వ పేజీలో...



బీసీ గణన పూర్తయిన నేపథ్యంలో గాంధీభవన్ వద్ద సంబరాల్లో పొన్నం

దేశవ్యాప్తంగా కులగణన చేయాలి

తెలంగాణలో పూర్తి.. 90% బీసీ, ఎస్సీ, ఆదివాసీ, మైనారిటీలే: లోక్‌సభలో రాహుల్
బీసీలకు న్యాయం జరిగే సమయం వచ్చింది.. ఎవరు అడ్డుకున్నా సహించం
వెనుకబడిన వర్గాల వారంతా నేడు సంబరాలు జరపాలి: మంత్రి పొన్నం ప్రభాకర్
కులగణన సర్వేతో ముస్లిం రిజర్వేషన్ పరిరక్షణకు బలమైన ఆధారం: షబ్బీర్ అలీ

13

తప్పులతడకగా కులగణన నివేదిక

'ఈడబ్ల్యూఎస్'ను కాపాడే కుట్ర.. సీఎం సమీక్షించాలి: ఆర్.కృష్ణయ్య
బీసీ జనాభా మాత్రమే ఎలా తగ్గింది?.. నివేదికను ఒప్పుకోం: జాజుల
నివేదికలో వివరాలన్నీ గందరగోళం: గుజ్జ సత్యం
రేవంత్.. లెక్క సరైనదైతే స్థానికంలో 56% రిజర్వేషన్ ఇవ్వాలి: కవిత



రిజిస్ట్రేషన్ల ఆదాయం కుదేలు!

₹18,229 కోట్లు	11,600 కోట్లు	340 కోట్లు
ఈ ఆర్థిక సంవత్సర లక్ష్యం	పది నెలల్లో వచ్చింది	నిరుటి కంటే తక్కువ

టార్గెట్ చేరాలంటే రెండు నెలల్లో రూ. 6,629 కోట్లు రావాలి
ప్రస్తుతం సగటు రాబడి రూ. 1,160 కోట్లు మాత్రమే
నిరుటి ఆదాయం రూ. 14,588 కోట్లు చేరడమూ కష్టమే!
ఫిబ్రవరి, మార్చిలో 1700 కోట్లు రాబట్టడంపై అధికారుల దృష్టి
తద్వారా గత ఏడాది కంటే తగ్గకుండా చూసే ప్రయత్నం
ఆశలన్నీ భూ క్రమబద్ధీకరణ దరఖాస్తులపైనే!

హైదరాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల ఆదాయం కుదేలైంది. ఈ ఆర్థిక సంవత్సర లక్ష్యానికి ఆమడదూరంలో ఉంది. గత ఏడాది రాబడిని అందుకోవడమూ కష్టంగానే కనిపిస్తోంది. పది నెలల కాలాన్ని పరిశీలిస్తే ఇది స్పష్టమవుతోంది. 2024-25కు గాను లక్ష్యం రూ.18,229 కోట్లు కాగా.. ఏప్రిల్-జనవరి మధ్య వచ్చింది కేవలం రూ.11,600 కోట్లే కావడం గమనార్హం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ -జనవరి ఆదాయంతో పోల్చి చూస్తే ఇది రూ.340 కోట్లు తక్కువ. దీంతోనే ఈసారి అంచనాలను చేరడం సాధ్యం కాదని అర్థమవుతోంది. ఇక 2023-24లో రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.14,588 కోట్లు రాగా.. దీనిని 22 శాతం (రూ.18,229 కోట్లకు) పెంచుతూ 2024-25కు లక్ష్యాన్ని నిర్దేశించారు. అయితే, అనుకున్నదొక్కటి

మిగతా 14వ పేజీలో...

మళ్లీ రంగంలోకి హైడ్రా

మున్ముందు మరింత ముమ్మరం కానున్న చర్యలు
శంషాబాద్‌లో పార్కు, రోడ్డు కబ్జాల తొలగింపు
ప్రజావాణిలో 71 ఫిర్యాదుల స్వీకరణ

3

'రాజ్‌తరుణ్- లావణ్య' కేసులో మలుపు!



కోర్టు వద్ద మస్తాన్ సాయి

మహిళలకు డ్రగ్స్ అలవాటు చేసి నగ్న వీడియోలు తీసిన మస్తాన్ సాయి
వందల మంది అమ్మాయిల వీడియోలు తీసి, బ్లాక్‌మెయిల్ చేశాడు
పోలీసులకు ఫిర్యాదు చేసిన లావణ్య.. హార్డ్‌డిస్క్ అందజేత
హార్డ్‌డిస్క్ కోసం లావణ్యపై దాడికి యత్నం.. డయల్-100కు ఫోన్
ఆమె ఇంటికెళ్లి మస్తాన్‌సాయిని అరెస్టు చేసిన పోలీసులు
అతడిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో నాలుగు కేసులు

హైదరాబాద్ సిటీ/నార్సింగ్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు రాజ్‌తరుణ్-లావణ్య కేసులో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. ఆ కేసులో కీలకంగా మారిన రవి బవాజీ మస్తాన్ సాయి అలియాస్ మస్తాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తనతో సహజీవనం చేసి, పెళ్లి చేసుకొని, ముఖం చాటేశాడంటూ గత ఏడాది జూలై 4న రాజ్‌తరుణ్‌పై లావణ్య నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసు అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించింది. ఇదే కేసులో తమకు పరిచయస్తుడైన మస్తాన్ సాయి.. చాలా మంది మహిళల ప్రైవేట్ వీడియోలు తీశాడని లావణ్య ఆరోపించింది. అలాగే తన వీడియోలు కూడా తీసి రాజ్‌తరుణ్‌కు చూపించి, అతని నుంచి తనను దూరం చేశాడని తెలిపింది. మస్తాన్ తనపై అత్యాచారం చేసేందుకూ ప్రయత్నించాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. డ్రగ్స్ సరఫరాదారుడిగా మారిన మస్తాన్.. ఎంతోమంది

మిగతా 10వ పేజీలో...



నిర్మాత కేపీ చౌదరి ఆత్మహత్య

ఇంజనీర్ నుంచి సినిమాల వైపు
నష్టాలతో ఆర్థిక సమస్యలు.. డ్రగ్స్‌కు బానిస
అరెస్టు.. జైలు.. బయటకొచ్చి గోవాలో క్లబ్
అక్కడా నష్టాలే.. ఉరి వేసుకొని ఆత్మహత్య
డ్రగ్స్ ముఠాలతో ఉన్న లింకులపై దర్యాప్తు
కేపీ స్వస్థలం ఖమ్మం జిల్లా బోనకల్

హైదరాబాద్ సిటీ, బోనకల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): టాలీవుడ్ నిర్మాత బోడేపూడి కృష్ణప్రసాద్ అలియాస్ కేపీ చౌదరి(44) సోమవారం గోవాలో ఉరివేసుకుని, ఆత్మహత్యకు పాల్పడ్డారు. కబాలితోపాటు తమిళంలో రీమేక్ చేసిన సర్దార్ గబ్బర్‌సింగ్, అర్జున్ సురవరం, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు వంటి సినిమాలకు ఆయన నిర్మాతగా వ్యవహరించారు. సైబరాబాద్

మిగతా 10వ పేజీలో...

పంతానికిపోతే నష్టమే

విభజన సమస్యలపై మొండి పట్టుదల వద్దు
ఇరు రాష్ట్రాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి
తెలంగాణ, ఏపీ సీఎస్‌లకు కేంద్ర హోంశాఖ స్పష్టీకరణ

విభజన వివాదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న విభజన సమస్యలను పరిష్కరించుకునే క్రమంలో ఇరువురూ మొండి పట్టుదలతో వ్యవహరించవద్దని రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కేంద్ర హోంశాఖ తేల్చిచెప్పింది. ఆస్తులు, ఇతర అంశాలపై పంతానికి పోతే ఇరువురికీ నష్టమేనని తెలిపింది. న్యాయస్థానాలను ఆశ్రయిస్తే పరిస్థితులు మరింత జటిలంగా మారి సమస్యల పరిష్కారానికి ఏళ్ల కొద్దీ సమయం పడుతుందని హెచ్చరించింది. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రాష్ట్ర విభజనకు సంబంధించి అపరిష్కృతంగా అనేక సమస్యలు ఉన్నాయి. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు గడిచినప్పటికీ కొన్ని ముఖ్యమైన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ఈ క్రమంలో సోమవారం, కేంద్ర హోం కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షతన రెండు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న విభజన అంశాలను పరిష్కరించుకోవడానికి భేటీ జరిగింది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు ఇతర

మిగతా 12వ పేజీలో...

గ్రూప్-1 ఫలితాలకు లైన్‌క్లియర్

10



జీవో 29 రద్దు చేయాలన్న పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం
గతంలోనూ రిట్ పిటిషన్‌ను తిరస్కరించిన న్యాయస్థానం

రాష్ట్రపతి గౌరవానికి భంగం కలిగించారు

కాంగ్రెస్ అగ్రనేత సోనియాపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు
రాజ్యసభ చైర్మన్‌కు అందజేసిన 40 మంది బీజేపీ ఎంపీలు

2



భారత్‌కు క్యాన్సర్ సవాల్!

భారీగా పెరుగుతున్న మహమ్మారి కేసులు
ఆగ్నేయాసియాలో ఆందోళనకరం
2022లో 24 లక్షల కేసులు వెలుగులోకి
వారిలో 56 వేల మంది చిన్నారులు
15 లక్షల మంది మృత్యువాత
క్యాన్సర్ డే సందర్భంగా డబ్ల్యూహెచ్‌వో

2

ఉప ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

12

పార్టీ నాయకులు, కార్యకర్తలకు కేటీఆర్ పిలుపు
ఎమ్మెల్యేల అనర్హతపై ఒకేసారి వాదనలు వింటాం!
బీఆర్ఎస్ సభ్యుల పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు
కేటీఆర్ పిటిషన్లను కలిపి విచారణ.. 10కి వాయిదా



మే 2న ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష

ఏప్రిల్ 29, 30న అగ్రికల్చర్, ఫార్మసీ ఎంట్రన్స్‌లు
జూన్ 8, 9న ఐసెట్, 16-19 మధ్య పీజీ ఈసెట్
షెడ్యూల్‌ను ప్రకటించిన ఉన్నత విద్యామండలి
ఇకపై 'కీ' అభ్యంతరాలకు ప్రశ్నకు రూ.500



మోహన్‌బాబు, మనోజ్ వాగ్వాదం?

కుటుంబ ఆస్తి వివాదంపై కలెక్టరేట్‌లో విచారణ
అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఎదుటే దూషణలు?
ఆస్తులు, విద్యాసంస్థల విషయమై తీవ్ర సంవాదం
పోలీసులకు పిలుపు.. వచ్చేవారం మళ్లీ విచారణ
వేర్వేరు గేట్ల నుంచి బయటకు తండ్రీకొడుకులు

10

మహా కుంభమేళాలో వేలాదిమంది మృతి!

ఇది నా అంచనా.. వాస్తవాలు చెప్పండి!
తప్పయితే నేను క్షమాపణలు చెబుతా
రాజ్యసభలో ఖర్గే సంచలన వ్యాఖ్యలు
మృతదేహాలను సంగమంలో విసిరేశారు
ఎస్పీ ఎంపీ జయా బచ్చన్ ఆరోపణ
ఉభయసభలను కుదిపేసిన 'తొక్కిసలాట'

ఇంద్రనూయి సోదరికి గ్రామీ అవార్డు

- 71 ఏళ్ల వయసులో చంద్రిక ఘనత
- త్రివేణి ఆల్బమ్‌కు దక్కిన గౌరవం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: పెప్సికో మాజీ సీఈవో ఇంద్రనూయి సోదరి, ప్రముఖ సంగీత విద్వాంసురాలు చంద్రికా కృష్ణమూర్తి టాండన్ ప్రతిష్ఠాత్మక గ్రామీ అవార్డు గెలుచుకున్నారు. భారత సంతతికి చెందిన అమెరికా పౌరురాలైన ఆమె పారిశ్రామికవేత్తగా ఉంటూనే గాయనిగా ఈ ఘనత సాధించారు. 67వ గ్రామీ అవార్డుల్లో భాగంగా "బెస్ట్ న్యూ ఏజ్, యాంబియంట్ ఆర్ చాంట్ ఆల్బమ్" విభాగంలో ఆమె ఆల్బమ్ త్రివేణికి గ్రామీ అవార్డు దక్కింది. తన సంగీత సహకారులైన దక్షిణాఫ్రికాకు చెందిన ఫ్లూట్ విద్వాంసుడు వౌటర్ కెల్లర్‌మ్యాన్, జపాన్‌కు చెందిన సెల్లో విద్వాంసుడు యెరు మట్సుమోటోతో కలసి చంద్రిక ఈ అవార్డు సాధించారు. పారిశ్రామికవేత్తగా, మహా వితరణశీలిగా ఇంద్రనూయి అక్క చంద్రిక గతంలోనే గుర్తింపుపొందారు. చంద్రికా టాండన్ 1954లో చెన్నైలో జన్మించారు. 2015లో భర్త రంజన్ టాండన్‌తో కలసి 100 మిలియన్ డాలర్లు న్యూయార్క్ వర్సిటీకి విరాళంగా ఇచ్చారు.

జాతీయ హైవేలపై ఒకే టోల్ విధానం: గడ్కరీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఏకరూప టోల్ విధానాన్ని తీసుకువచ్చేందుకు కసరత్తు చేస్తున్నామని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఓ ఇంటర్వ్యూలో.. అధిక టోల్ చార్జీల విధింపు, రహదారుల పరిస్థితిపై వాహదారుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందన్న అంశాన్ని ప్రస్తావించిన సందర్భంగా ఏకరూప టోల్ విధానం గురించి గడ్కరీ పేర్కొన్నారు. గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (జీఎన్ఎస్ఎస్) ఆధారిత టోల్ వసూలు వ్యవస్థను తొలుత అమలు చేయాలని నిర్ణయించామన్నారు. 2023-24 సంవత్సరంలో దేశంలో మొత్తం టోలు వసూళ్లు రూ.64,809.86 కోట్లను చేరాయని, క్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఈ వసూళ్లలో 35 శాతం వృద్ధి నమోదైందని తెలిపారు.

కొత్త చట్టం ప్రకారం సీఈసీ, ఈసీల నియామకంపై 12న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: కొత్త చట్టం ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ల నియామకాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై ఈ నెల 12న విచారణ చేపడతామని సుప్రీం కోర్టు ప్రకటించింది. ఏడీఆర్, కాంగ్రెస్ నాయకురాలు జయ ఠాకూర్ ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఎన్నికల కమిషనర్లను ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన స్వతంత్ర కమిటీ నియమించాలని, అలాకాకుండా ప్రభుత్వమే నియమిస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదమని సుప్రీంకోర్టు 2023లో ఇచ్చిన తీర్పు హెచ్చరించిందని ఏడీఆర్ తరపున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు. కానీ ఆ కమిటీలో ప్రధాన న్యాయమూర్తిని తొలగిస్తూ.. ఓ మంత్రికి చోటిస్తూ కేంద్రం కొత్త చట్టం తెచ్చిందని పేర్కొన్నారు. సీఈసీ ఈ నెల 18న పదవీ విరమణ చేస్తున్నందున తమ పిటిషన్లపై ఆలోపే త్వరగా విచారణ చేపట్టాలని ప్రశాంత్ భూషణ్, జయ ఠాకూర్ తరపు న్యాయవాది కోరారు.

చైనాలో ప్రపంచంలోనే పెద్ద మిలిటరీ కమాండ్!

బీజింగ్, ఫిబ్రవరి 3: ప్రపంచంలోనే అతిపెద్ద మిలిటరీ కమాండ్ కేంద్రాన్ని చైనా నిర్మిస్తోంది. రాజధాని బీజింగ్‌కు సమీపంలో 'బీజింగ్ మిలిటరీ సిటీ' పేరిట ఈ నిర్మాణం జరుగుతోంది. ఇది అమెరికా రక్షణశాఖ ప్రధానకార్యాలయం పెంటగాన్ కంటే పది రెట్లు పెద్దదని ఒక ఆంగ్ల వార్తాపత్రిక కథనం పేర్కొంది. 1,500 ఎకరాలలో నిర్మాణం జరుగుతున్నట్టు ఉపగ్రహ చిత్రాల ద్వారా తెలిసినట్టు వెల్లడించింది. అణ్వాయుధ దాడిని సైతం తట్టుకునేలా ఇందులో భూగర్భ నిర్మాణాలు, సొరంగాలు కూడా ఉన్నట్టు తెలిపింది. దీని నిర్మాణాన్ని 2024 మధ్యలో ప్రారంభించారని, చైనా మిలిటరీ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ శతాబ్ది వేడుకలు నిర్వహించే 2027 నాటికి మిలిటరీ ఆధునికీకరణ సాధించాలనే లక్ష్యానికి అనుగుణంగా దీని నిర్మాణం జరుగుతోందని వెల్లడించింది.

డీప్‌సీక్‌కు పోటీగా చాట్‌జీపీటీలో 'డీప్ రీసెర్చ్'

వాషింగ్టన్, ఫిబ్రవరి 3: చైనా తన కృత్రిమ మేధ(ఏఐ) టూల్ 'డీప్‌సీక్'ను తీసుకువచ్చిన నేపథ్యంలో.. దానికి పోటీగా ఓపెన్‌ఏఐ సంస్థ తన చాట్‌జీపీటీలో 'డీప్ రీసెర్చ్'ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందుకోసం జపాన్‌కు చెందిన సాఫ్ట్‌బ్యాంక్(ఎస్‌బీ) సహకారం తీసుకుంది. ఈ రెండు సంస్థలు కలిసి 'ఎస్‌బీ ఓపెన్‌ఏఐ జపాన్' పేరుతో డీప్ రీసెర్చ్‌ను పరిచయం చేశాయి. డీప్ రీసెర్చ్ ప్రస్తుతం అందుబాటులో ఉన్న చాట్‌జీపీటీకి ఏజెంట్‌గా పనిచేస్తుంది. చాట్‌జీపీటీలో సెర్చ్ చేసేప్పుడే.. డీప్‌సెర్చ్‌కు సంబంధించిన ఆప్షన్‌ను ఎంచుకునే వెసులుబాటు కల్పించారు. డీప్ రీసెర్చ్ కొన్ని వందల ఆన్‌లైన్ సోర్స్‌లను పరిశీలించి, ఉత్తమ ఫలితాలతో పరిశోధన పత్రాన్ని సిద్ధం చేస్తుందని ఓపెన్ ఏఐ పేర్కొంది.

జేఈఈ మెయిన్ రెండో విడతకు దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 3: జేఈఈ మెయిన్ రెండో విడతకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 25 తేదీ రాత్రి 9 గంటల వరకు గడువు ఉంది. ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 8 మధ్య పరీక్ష నిర్వహిస్తారు. జనవరిలో మొదటి విడత రాసి, రెండో విడతలో కూడా పరీక్ష రాయాలనుకునేవారు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదు. దరఖాస్తు ఫారమ్ నింపి, నిర్ణీత రుసుము చెల్లిస్తే సరిపోతుంది. మిగతావారు రిజిస్ట్రేషన్ చేసుకుని, దరఖాస్తు నింపాలి. ఈ విడత పరీక్షలు పూర్తయిన తరువాత రెండింటిలో ఉత్తమ స్కోరును (రెండు పరీక్షలు రాస్తేనే) తీసుకుని ఏప్రిల్ 17న ర్యాంకులు ప్రకటిస్తారు. మరోవైపు, సీబీఎస్ఈ 10, 12 తరగతుల హాల్ టికెట్లు విడుదలయ్యాయి. సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షలు ఈ నెల 15 నుంచి మార్చి 18 వరకు, 12వ తరగతి పరీక్షలు ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు నిర్వహిస్తున్నారు.

మహారాష్ట్రలో మొదటి ఏఐ యూనివర్సిటీ!

హైదరాబాద్, ఫిబ్రవరి 3: దేశంలోనే మొదటిసారిగా మహారాష్ట్రలో కృత్రిమ మేధ (ఏఐ) యూనివర్సిటీని నెలకొల్పబోతున్నారు. దీని కోసం టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశామని ఆ రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి ఆశిష్ షెలార్ తెలిపారు. ఈ యూనివర్సిటీ ఏఐ, దాని అనుబంధ రంగాల పరిశోధనను ప్రోత్సహించడంతో పాటు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా నిలుస్తుందన్నారు.

సుంకాల విధింపులో మెక్సికోకు ఊరట

- నెల రోజుల పాటు నిలిపివేసిన ట్రంప్



వాషింగ్టన్, ఫిబ్రవరి 3: సుంకాల విధింపుతో ప్రకంపనలు సృష్టిస్తోన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మెక్సికో విషయంలో కాస్త శాంతించారు. మెక్సికోపై విధించిన సుంకాలను నెలరోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్- ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. మెక్సికో నుంచి అమెరికాకు మాదకద్రవ్యాలు, ఫెంటానిల్ అక్రమ రవాణా, అక్రమ వలసలను కట్టడి చేసేందుకు 10 వేల మంది సైనికులను సరిహద్దుకు తరలిస్తామని షీన్‌బామ్ హామీ ఇవ్వడంతో ట్రంప్ సుంకాల విధింపును నెలరోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. మరోవైపు తమపై సుంకాలు విధించిన అగ్రరాజ్యంపై ప్రతీకారానికి కెనడా సిద్ధమైంది. అమెరికా ఉత్పత్తులపై తామూ 25% సుంకం విధిస్తామని కెనడా ప్రధాని ట్రూడో ఇప్పటికే ప్రకటించారు. తాజాగా ఉత్తర ఒంటారియోలోని గ్రామీణ ప్రాంతాలకు హైస్పీడ్ ఇంటర్నెట్ అందించేందుకు స్టార్‌లింక్‌తో చేసుకున్న రూ.869.92 కోట్ల ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు కెనడాలోని రాష్ట్రం ఒంటారియో ప్రభుత్వం ప్రకటించింది. తమ దేశంతో జగడం పెట్టుకున్నందుకు అమెరికా వాణిజ్య సంస్థలు తప్పక బాధపడతాయని దీనికి ట్రంప్ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. మరోవైపు, పనామాపై త్వరలో శక్తివంతమైన చర్య ఉండబోతోందని, ట్రంప్ హెచ్చరించారు. కాసేపటికే చైనా బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టు నుంచి తాము వైదొలుగుతున్నట్లు పనామా అధ్యక్షుడు ములినో ప్రకటించారు. ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ములినో నిర్ణయం చర్చనీయాంశంగా మారింది.

గవర్నర్ పదవా!? రాష్ట్రపతా!?

(మొదటి పేజీ తరువాయి)



సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఏ స్థాయిలో బీజేపీకి దాసోహమైందంటే.. దేశంలో అసలు ఎన్నికల కమిషన్ లేదన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. రాజీవ్ కుమార్ ఈ నెలాఖరులోనే పదవీ విరమణ చేస్తున్నారు. ఆ తర్వాత ఆయనకు ఏ పదవిని ఇస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గవర్నర్ పదవా!? ఏకంగా రాష్ట్రపతి పదవినే ఇచ్చేస్తున్నారా!? చేతులు జోడించి రాజీవ్ కుమార్‌కు విజ్ఞప్తి చేస్తున్నా! మీ విధిని మీరు నిర్వర్తించండి. ఇంకా పదవులు చేపట్టాలనే దురాశను వదిలేసుకోండి. కెరీర్ చివర్లో దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయకండి" అని విజ్ఞప్తి చేశారు. రాజీవ్ కుమార్ తన బాధ్యతలను నైతిక నిష్ఠతో నిర్వహించాలని, ప్రజాస్వామ్యాన్ని పణంగా పెట్టి వ్యక్తిగత ఆకాంక్షలను నెరవేర్చుకోరాదని విజ్ఞప్తి చేశారు. తమ పార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని, 'డబుల్ ఇంజిన్' సర్కారు అశాంతిని ప్రోత్సహిస్తోందని, పోలీసులకు అధికారాలు లేకుండా చేశారని, ఢిల్లీ పోలీసులు కూడా భయపడుతున్న ఆ గూండా ఎవరని ప్రశ్నించారు.

10 శాతం ఓట్లు రిగ్గింగ్ చేయొచ్చు

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవీఎం)ల ద్వారా బీజేపీ పది శాతం వరకూ ఓట్లను రిగ్గింగ్ చేయవచ్చంటూ ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ తీవ్ర ఆరోపణలు చేశారు. "అందుకే మీరంతా పెద్దఎత్తున ఓటింగ్‌కు తరలి రావాలి. ప్రతి ఓటూ చీపురు కట్ట (ఆప్ గుర్తు)కే వేయాలి. 15 శాతం ఓట్ల ఆధిక్యం వస్తేనే.. వాళ్ల ఎన్ని అక్రమాలు చేసినా మన విజయం ఖాయమవుతుంది. వాళ్ల ఈవీఎంలను ఓడించాలంటే పది శాతం.. ఆపైనే ఆధిక్యం మనకు అవసరం" అంటూ ఓ వీడియో సందేశాన్ని ఢిల్లీ ఓటర్లకు విడుదల చేశారు. మహారాష్ట్ర, హరియాణాల్లో ఎన్నికల అక్రమాల నేపథ్యంలో ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేస్తున్నామని, పోలింగ్ రోజు ప్రతి అంశాన్నీ ఇందులో అప్‌లోడ్ చేస్తామని చెప్పారు. ఒకవేళ, ఈసీ, తమ వెబ్‌సైట్‌లోని గణాంకాల మధ్య తేడా వస్తే అక్రమాలు జరిగినట్లు నిర్ధారణకు వస్తామని చెప్పారు. అలాగే, ఎన్నికకు ముందు బీజేపీ ప్రలోభాలకు చెక్ పెట్టడానికి మురికివాడల్లోని ప్రజలకు స్పై, బాడీ కెమెరాలను పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు.

హస్తినలో ముగిసిన ప్రచారం

రేపే 70 నియోజకవర్గాల్లో ఎన్నికలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి3: దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగిసింది. ప్రచార గడువు ముగిసే చివరి క్షణం వరకూ ఆప్, బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఉధృతంగా ప్రచారం నిర్వహించారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో హోరెత్తించారు. మూడోసారి అధికారంలోకి రావాలని ఆప్, ఎలాగైనా గెలిచి తీరాల్సిందేనని బీజేపీ హోరాహోరీ ప్రచారం నిర్వహించాయి. ఈసారి ప్రతి చోటా పది శాతం అధికంగా ఓట్లు పెరిగేలా చూడాలని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సీఈసీ రాజీవ్ కుమార్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారంటూ కేజ్రీవాల్ ఆరోపించారు. మరోవైపు ఢిల్లీలో నిన్న బీజేపీ మొత్తం 22 రోడ్ షోలు నిర్వహించింది. ఢిల్లీ నుంచి ఆపద ప్రభుత్వాన్ని సాగనంపాలని ప్రధాని మోదీ ఓటర్లకు పిలుపునిచ్చారు. ఢిల్లీలో కొందరు విద్యార్థులతో ముచ్చటించిన ఆయన ఆప్ విద్యావిధానంపై విమర్శలు గుప్పించారు. గ్యారంటీగా పాస్ అవుతారనుకునే విద్యార్థులనే పదో తరగతి పరీక్షలు రాసేందుకు అనుమతించి మిగతా వారిని అడ్డుకుంటున్నారని, ప్రభుత్వం పరువు పోతుందని విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం తగదన్నారు. ఆప్ పాలనలో ఢిల్లీకి దక్కింది చెత్త, విషపు నీరేనని కేంద్ర హోం మంత్రి అమిత్ షా విమర్శించారు. తమకు అధికారమిస్తే ఢిల్లీని ప్రపంచస్థాయి నగరంగా మారుస్తామని హామీ ఇచ్చారు. కుంభకోణాల ఆప్ సర్కారును సాగనంపి వికసిత్ ఢిల్లీ కోసం బీజేపీకి పట్టం కట్టాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఓటర్లకు పిలుపునిచ్చారు.

ఎన్నికలకు గట్టి భద్రత

ఢిల్లీలో రేపు మొత్తం 70 నియోజకవర్గాల్లో ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. 8న ఫలితాలు వెలువడతాయి. 42 వేల మంది పోలీసులు ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. 220 కంపెనీల భద్రతా బలగాలను మోహరించారు. 660 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను సిద్ధం చేశారు. మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లు ఉండగా 13,766 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 3 వేల పోలింగ్ కేంద్రాలను సున్నితమైనవిగా గుర్తించారు. డ్రోన్ల ద్వారా నిఘా కొనసాగిస్తున్నారు.

లోకం తీరు

యూపీఏ, ఎన్డీయేలు నిరుద్యోగ సమస్యను పరిష్కరించ లేదు: రాహుల్



55% మంది ప్రజల్లో ఆప్ సర్కారుపై అసంతృప్తి!

ఢిల్లీలో ఆప్ ప్రభుత్వంపై 55% మంది ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని 'సీ-ఓటర్' సర్వే తెలిపింది. అలాగే కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మధ్య తరగతి వర్గాన్ని బాగానే ప్రభావితం చేస్తోందని వెల్లడించింది. ఈ నెల 1 వరకు సేకరించిన డేటా ఆధారంగా సర్వే ఫలితాలను సోమవారం విడుదల చేసింది. సర్వే ప్రకారం.. ప్రస్తుత ఆప్ సర్కారుపై 43.9% మంది ఆగ్రహంతో ఉన్నారు. ప్రభుత్వం మారాలని కోరుకుంటున్నారు. ఇంకో 10.9% మంది కూడా అసంతృప్తితో ఉన్నప్పటికీ ప్రభుత్వం మారాలని మాత్రం కోరుకోవడం లేదు. 46.1% మంది సర్కారుపై సంతృప్తిగా ఉన్నారు. ఇదే కొనసాగాలని భావిస్తున్నారు. అయితే మొత్తంగా 55% మందిలో అసంతృప్తి ఉండడం పోలింగ్ ముంగిట ఆప్‌ను ఆందోళనకు గురిచేస్తోంది.

హస్తినలో 'జైలు' రాజకీయం!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ఈ దఫా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జైలు చుట్టూ తిరుగుతున్నాయి. జైలుకు వెళ్లివచ్చిన నేతలు సానుభూతి కోసం పదే పదే తమను అన్యాయంగా కారాగారంలో పడేశారని ప్రచారం చేసుకుంటున్నారు. కరుడుగట్టిన నిజాయితీపరుడినని చెప్పుకొనే ఆప్ అధినేత కేజ్రీవాల్ మద్యం పాలసీ స్కాం కేసులో జైలుకెళ్లిన సంగతి తెలిసిందే. ఆయన సన్నిహితుడు సిసోదియా కూడా ఇదే కేసులో అరెస్టయి 17 నెలలు జైల్లో ఉన్నారు. వీరిద్దరి కంటే ముందు నాటి ఆరోగ్యమంత్రి సత్యేంద్ర జైన్ మనీ లాండరింగ్ చట్టం కేసులో అరెస్టయి ఏడాదిన్నర జైల్లో గడిపారు. ఈ ముగ్గురూ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్నారు. ఇక వాయవ్య ఢిల్లీ అల్లర్ల కేసు (2020) నిందితులైన తాహిర్ హుస్సేన్, షిఫా-ఉర్-రహమాన్ కూడా జైల్లో ఉండి నామినేషన్లు వేశారు. నిరుడు లోక్‌సభ ఎన్నికలకు ముందు మద్యం పాలసీ స్కాం కేసులో కేజ్రీవాల్ అరెస్టయ్యారు. కానీ సీఎం పదవికి అప్పుడు రాజీనామా చేయలేదు. ప్రచారం నిమిత్తం ఆయనకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరుచేసింది. ఆయన విస్తృతంగా ప్రచారం చేసినప్పటికీ ఢిల్లీలో ఒక్కచోట కూడా ఆప్ అభ్యర్థిని గెలిపించుకోలేకపోయారు. పంజాబ్‌లో ఆప్ మూడు స్థానాలకే పరిమితమైంది. హరియాణాలో కనీసం పోటీ ఇవ్వలేకపోయింది. కేజ్రీవాల్‌పై ఓటర్లు సానుభూతి చూపలేదని, ఆప్‌పై వారు పెట్టుకున్న భ్రమలు తొలగిపోయాయని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. అయితే, సీఎం కార్యాలయానికి వెళ్లరాదని.. ఫైళ్లపై సంతకాలు చేయరాదన్న షరతులతో మద్యం కేసులో సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన తన పదవికి రాజీనామాచేసి.. ఆతిశీని సీఎం స్థానంలో కూర్చోబెట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ మళ్లీ గెలిచాకే ఆ పదవి చేపడతానని శపథం చేశారు. కాంగ్రెస్‌తో కూడా తెగతెంపులు చేసుకున్నారు. తనను దొంగగా చిత్రించేందుకే బీజేపీ తనను అరెస్టు చేయించిందని విస్తృతంగా ప్రచారం చేశారు. కాగా.. జైలుకు వెళ్లడం అభ్యర్థుల విజయావకాశాలను ఏ మాత్రం ప్రభావితం చేయదని ఢిల్లీ వర్సిటీ ప్రొఫెసర్ అభిషేక్ వ్యాఖ్యానించారు. దేశంలో చాలా మంది నేతలపై క్రిమినల్ కేసులున్నాయని.. అవి వారి రాజకీయ జీవితాలను దెబ్బతీయలేదన్నారు. ఏడీఆర్ విశ్లేషణ ప్రకారం.. ఢిల్లీలో పోటీచేస్తున్న అభ్యర్థుల్లో 19% మందిపై క్రిమినల్ కేసులున్నాయి.

ఢిల్లీ ముస్లిం ఓటర్ల డైలమా!

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికి ఓటేయాలో అక్కడి ముస్లిం ఓటర్లు తేల్చుకోలేకపోతున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఢిల్లీ ఓటర్ల సంఖ్య 1.55 కోట్లు. ఇందులో 13% మంది ముస్లిం ఓటర్లు ఉన్నట్లు అంచనా. మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో కనీసం ఏడు చోట్ల పెద్ద సంఖ్యలోనే ముస్లిం ఓటర్లు ఉన్నారు. పలు స్థానాల్లో ఫలితాలను ప్రభావితం చేయగల స్థాయిలో వారు ఉన్నారని తెలుస్తోంది. ముస్లిం ప్రాబల్య ప్రాంతాల్లో మూడు రకాల ఆలోచనలు నడుస్తున్నాయి. మొదటిది.. బీజేపీని ఏ పరిస్థితుల్లో అడ్డుకోవాలి. ఇందుకోసం ఆప్ పార్టీకే ఓటేయాలి. రెండోది.. 2020లో ఢిల్లీలో అల్లర్లు జరిగినప్పుడు ఆప్ తమను గాలికొదిలేసిందని పలువురు ముస్లింలు ఆగ్రహంతో ఉన్నారు. అందుచేత ఈసారి కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని భావిస్తున్నారు. మూడోది.. ఆప్, కాంగ్రెస్‌లతో వెళ్లడం వల్ల లాభం లేదని.. ఈ సారి ఎంఐఎంతో వెళ్దామని.. ఆ పార్టీ కనీసం ముస్లింల సమస్యలను లేవనెత్తుతోందని ఈ ఆలోచన ఉన్నవారు అంటున్నారు. 2020 అల్లర్ల సూత్రధారులుగా భావిస్తున్న తాహిర్ హుస్సేన్, షిఫా-ఉర్-రహమాన్ ఎంఐఎం అభ్యర్థులుగా పోటీచేస్తుండడంతో మూడో ఆలోచనపై కొందరిలో మొగ్గు కనిపిస్తోంది.

మేకిన్ ఇండియా గుడ్.. కానీ విఫలం!



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ సోమవారం లోక్‌సభలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'మేకిన్ ఇండియా' కార్యక్రమం బాగుందని, ఇది మంచి ఆలోచనని చెప్పారు. అయితే.. ఆచరణలో ఇది విఫలమైందని తెలిపారు. "ప్రధాని ప్రతిపాదిత 'మేకిన్ ఇండియా' కార్యక్రమం నా దృష్టిలో మంచి ఆలోచన. దీని తాలూకు ఫలితం మీ ముందే ఉంది. జీడీపీలో తయారీ రంగం వాటా 2014లో 15.3 శాతం ఉండగా, ప్రస్తుతం అది 12.6 శాతానికి పడిపోయింది. 60 ఏళ్ల చరిత్రలో అత్యంత కనిష్ఠస్థాయికి దిగజారడం ఇదే ప్రథమం. నేనేమీ ప్రధానిని తప్పుపట్టడం లేదు. ఆయన ప్రయత్నించలేదని చెప్పడమూ సరికాదు. ప్రధాని ప్రయత్నించారు. కానీ, విఫలమయ్యారు" అని వ్యాఖ్యానించారు. ఒక దేశంగా ఉత్పత్తి రంగంలో విఫలమై.. దీనిని చైనా చేతిలో పెట్టామని ఆయన విమర్శించారు. అదేవిధంగా ఉద్యోగ, ఉపాధి కల్పనపై రాహుల్ మాట్లాడుతూ.. "మనం వృద్ధి చెందుతున్నాం. కానీ.. మనం ఎదుర్కొంటున్న సార్వత్రిక సమస్య నిరుద్యోగం. దీనిని పరిష్కరించలేకపోతున్నాం. గత యూపీఏ ప్రభుత్వం కావొచ్చు, ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం కావొచ్చు. నిరుద్యోగ సమస్యకు సరైన సమాధానం చెప్పలేకపోతున్నాం" అని అన్నారు. ఇక, రాష్ట్రపతి ముర్ము చేసిన ప్రసంగంపై కూడా రాహుల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆమె ప్రసంగం బోర్ కొట్టిందన్నారు. కృత్రిమ మేధ(ఏఐ) గురించి ప్రస్తావిస్తూ.. మనం ఈ రంగంలో చైనా కంటే పదేళ్లు వెనుకబడ్డామని ఆక్షేపించారు.

మహాకుంభ్ తొక్కిసలాటలో వేలాది మరణాలు

ఇది నా అంచనా.. అసలు లెక్క చెప్పండి.. రాజ్యసభలో ఖర్గే సంచలన వ్యాఖ్యలు

- సంగమంలో శవాలను విసిరేశారు
- మహాకుంభ్ కలుషితం: జయా బచ్చన్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: మహాకుంభమేళాలో ఇటీవల చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటన పార్లమెంటు ఉభయ సభలనూ కుదిపేసింది. విపక్ష పార్టీలకు చెందిన సభ్యులు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. మౌని అమావాస్య సందర్భంగా కోట్ల మంది భక్తులు వస్తారని తెలిసినా సరైన ఏర్పాట్లు చేయకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని సభ్యులు ఆరోపించారు. తొక్కిసలాట ఘటనలో వేలాది మంది చనిపోయారని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే సంచలన ప్రకటన చేశారు. వారందరికీ నివాళులర్పిస్తున్నానన్నారు. దీనిపై అధికార పక్ష సభ్యుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. దీనిపై స్పందించిన చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్.. ఖర్గే చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఖర్గే స్పందిస్తూ.. "తొక్కిసలాట మృతుల విషయంలో ఇది నా అంచనా! ఒకవేళ ఇది తప్పయితే వాస్తవం ఏంటో మీరు చెప్పండి. సరిచేసుకునేందుకు నేను సిద్ధంగా ఉన్నా" అని అన్నారు. ఎవరినో తప్పుపట్టేందుకు తాను 'వేలాదిమంది' అని అనలేదని, కనీసం ఇప్పటికైనా ఎంత మంది చనిపోయారో సమాచారం ఇస్తారని అలా అన్నానని తెలిపారు. ఒకవేళ తాను తప్పు చేసి ఉంటే క్షమాపణలు చెబుతానన్నారు. తొక్కిసలాటలో ఎంత మంది మృతి చెందారో.. ఎంత మంది అదృశ్యమయ్యారో ఇప్పటికైనా లెక్కలు చెప్పాలన్నారు.

మృతదేహాలను విసిరేశారు: జయా బచ్చన్

తొక్కిసలాటలో మృతి చెందిన వారి పార్థివ దేహాలను సంగమంలోకి విసిరివేశారని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) సభ్యురాలు జయా బచ్చన్ ఆరోపించారు. దీంతో పవిత్ర మహాకుంభమేళా కలుషితం అయిపోయిందన్నారు. ఆమె పార్లమెంటు బయట మీడియాతో మాట్లాడారు. "ప్రస్తుతం నీరు ఎక్కువగా కలుషితం అయింది ఎక్కడ? కచ్చితంగా అది కుంభ్‌లోనే. ఎందుకంటే తొక్కిసలాట మృతుల పార్థివ దేహాలను సంగమంలోనే పడేశారు" అన్నారు.

లోక్‌సభలో తీవ్ర నిరసన

మహా కుంభమేళా తొక్కిసలాట ఘటనపై లోక్‌సభలో విపక్ష పార్టీల సభ్యులు ఆందోళన చేశారు. ఈ ఘటనపై చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రశ్నోత్తరాల సమయాన్ని రద్దు చేసి తొక్కిసలాట ఘటనపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్ నేతలు గౌరవ్ గొగోయ్, కేసీ వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించడం లేదని దుయ్యబట్టారు. తొక్కిసలాట ఘటన విపత్తు కాదని, ప్రభుత్వ వైఫల్యమేనని సమాజ్‌వాదీ ఎంపీ నరేశ్ చంద్ర అన్నారు. సర్కారు వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందన్నారు.

సోనియాపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు

కాంగ్రెస్ ఎంపీ సోనియాకు వ్యతిరేకంగా 40 మంది బీజేపీ సభ్యులు రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్‌కు సభా హక్కుల ఉల్లంఘన నోటీసులిచ్చారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన తర్వాత ఆమెపై సోనియా అనుచిత వ్యాఖ్యలు చేశారని బీజేపీ ఎంపీలు ఆరోపించారు. 'పాపం పూర్ లేడీ' అంటూ రాష్ట్రపతిని అవమానించారన్నారు.

మైతేయీలను తుపాకులు దోచుకోనివ్వండి

(మొదటి పేజీ తరువాయి)



సమర్పించారు. కేంద్రం, మణిపూర్ సర్కారు తరఫున వాదనలను వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. కేంద్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్(సీఎఫ్ఎస్ఎల్) పరిశీలన జరగాలని, మూడు వారాల గడువు కావాలని కోరారు. దీంతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌ల ధర్మాసనం విచారణను మార్చి 24కు వాయిదా వేసింది. సీల్డ్ కవర్‌లో సమగ్ర నివేదికను అందజేయాలని సీఎఫ్ఎస్ఎల్‌ను ఆదేశించింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. 2023 మే 3 నుంచి మణిపూర్‌లోని మైదాన ప్రాంతాలకు చెందిన మైతేయీలు, కొండ ప్రాంతాలకు చెందిన కుకీలకు మధ్య జరిగిన ఘర్షణల్లో 200 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.! ఈ హింసతో 70 వేల మంది పౌరులు నిరాశ్రయులయ్యారు. జాతుల మధ్య వైరానికి సీఎం బీరేన్‌సింగ్ ప్రేరేపించారనే ఆరోపణలకు సంబంధించిన ఆడియో క్లిప్‌లపై కుకీ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్(కోహుర్) అప్పట్లోనే సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై తొలుత అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. కోహుర్ తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలను వినిపించారు. నవంబరు 14న జరిగిన విచారణలో.. సీఎం బీరేన్‌దిగా చెబుతున్న ఆడియో క్లిప్‌నకు ఫోరెన్సిక్ పరీక్ష నిర్వహించాలని.. అత్యంత విశ్వసనీయమైన ప్రైవేట్ ఎఫ్ఎస్ఎల్ ట్రూత్ ల్యాబ్స్‌లో ఆ పరీక్షలు జరిపేందుకు అనుమతినివ్వాలని కోరారు. కోర్టు అనుమతితో ప్రశాంత్ భూషణ్ ట్రూత్ ల్యాబ్స్‌ను సంప్రదించగా.. గత నెల 18న నివేదిక వచ్చింది. ఆడియోలో ఉన్న వాయిస్‌కు.. సీఎం బీరేన్‌కు చెందిన వాయిస్‌కు మధ్య 93% సారూప్యత ఉందని ట్రూత్ ల్యాబ్స్ నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం ఈ కేసును సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం విచారిస్తోంది. సోమవారం జరిగిన విచారణ సందర్భంగా ప్రశాంత్ భూషణ్ ధర్మాసనానికి ట్రూత్ ల్యాబ్స్ నివేదికను సమర్పించారు. అయితే విచారణ ప్రారంభానికి ముందు.. ధర్మాసనంలో తాను ఉండడం పిటిషనర్‌కు అభ్యంతరమా? అని జస్టిస్ సంజయ్‌కుమార్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌ను పరోక్షంగా అడిగారు. దానికి ప్రశాంత్ భూషణ్ ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. మణిపూర్ హింసకు సీఎం బీరేన్ ప్రేరేపించారని, ఆయనపై తగు చర్యలు తీసుకోవాలని ధర్మాసనాన్ని కోరారు. దీనిపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యంతరం వ్యక్తం చేశారు. పిటిషన్ వేసిన కోహుర్ సంస్థ వివాదాస్పదమైనదని.. రాజ్యాంగంలోని 226వ అధికరణ మేరకు ఈ కేసును మణిపూర్ హైకోర్టు విచారించాలని వ్యాఖ్యానించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. కేసును మేము విచారించాలా? మణిపూర్ హైకోర్టా? అనేదాన్ని తదుపరి విచారణ సందర్భంగా నిర్ణయిస్తామని వ్యాఖ్యానించింది.

భారత్‌కు క్యాన్సర్ సవాల్!

- ఆగ్నేయాసియాలో పరిస్థితి ఆందోళనకరం
- 2022లో 24 లక్షల కేసులు వెలుగులోకి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: భారత్ సహా ఆగ్నేయాసియా అంతటా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని డబ్ల్యూహెచ్‌వో ఆందోళన వ్యక్తం చేసింది. ఆగ్నేయాసియా ప్రాంతంలో 2022లో కొత్తగా 24 లక్షల కేసులు బయటపడ్డాయని, వారిలో 56 వేల మంది చిన్నారులు కూడా ఉన్నారని తెలిపింది. 2022లో క్యాన్సర్‌తో 15 లక్షల మంది చనిపోయారని వెల్లడించింది. ఈ ప్రాంతంలో నోటి, గర్భాశయ, బాల్య కేన్సర్లు ఎక్కువగా నమోదయ్యాయని డబ్ల్యూహెచ్‌వో ఆగ్నేయాసియా ప్రాంత డైరెక్టర్ సైమా వాజెద్ సోమవారం తెలిపారు. 2050 నాటికి ఈ ప్రాంతంలో కొత్త క్యాన్సర్ కేసులు, మరణాలు 85% పెరిగే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు. క్యాన్సర్ గురించి అవగాహన పెంచడం, తొలిదశలోనే గుర్తించి మెరుగైన చికిత్సను ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో ప్రతిఏటా ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఎంపిక చేసిన థీమ్ 'యునైటెడ్ బై యూనిక్'.. కూడా క్యాన్సర్‌కు వ్యతిరేకంగా సమిష్టిగా పోరాడాలని సూచిస్తుంది. ఇదిలా ఉండగా, భారత్‌లో ప్రతి తొమ్మిది మందిలో ఒకరు తమ జీవితకాలంలో క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని నేషనల్ క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రామ్ నివేదించింది.

ఐఐటీ మద్రాస్‌లో క్యాన్సర్ జీనోమ్ డేటాబేస్

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రముఖ ఉన్నత విద్యా సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఐఐటీ-మద్రాస్ తొలిసారిగా 'కేన్సర్ జీనోమ్ డేటాబేస్'ను ప్రారంభించింది. ఈ విషయాన్ని ఐఐటీఎం డైరెక్టర్ ప్రొఫెసర్ వి కామకోటి ప్రకటించారు. వివిధ రకాలైన కేన్సర్ చికిత్సల కోసం జన్యుపరమైన ఖాళీని భర్తీ చేసేందుకు వీలుగా కేన్సర్ జీనోమ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా సేకరించిన 480 బ్రెస్ట్ కేన్సర్ రోగుల కణజాల నమూనాల నుంచి 960 ఎక్సోమ్ సీక్వెన్సింగ్‌ను పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. భారత్ కేన్సర్ జీనోమ్ అట్లాస్ (బీసీజీఏ) పేరుతో ఈ డేటాబేస్‌ను విడుదల చేసినట్టు వెల్లడించారు.

మళ్లీ రంగంలోకి హైడ్రా

వరుసగా అక్రమ నిర్మాణాల కూల్చివేతలు.. మున్ముందు మరింత ముమ్మరం కానున్న చర్యలు

- కాలనీల చుట్టూ ప్రహరీలను కూల్చేయండి
- రాకపోకలకు ఇబ్బంది కలిగితే ఉపేక్షించొద్దు
- అధికారులకు హైడ్రా కమిషనర్ ఆదేశాలు
- హైడ్రా ప్రజావాణిలో 71 ఫిర్యాదుల స్వీకరణ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కొన్నాళ్లుగా స్తబ్ధుగా ఉన్న హైడ్రా మళ్లీ రంగంలోకి దిగింది. పౌరుల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా చర్యలు చేపడుతోంది. గత రెండు వారాలుగా చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లోని ఆక్రమణల్ని నేలమట్టం చేస్తోంది. ప్రజావాణిలో, అంతకుముందు వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూనే.. కూల్చివేతలు చేపడుతోంది. అదే సమయంలో చెరువుల పూర్తి నీటినిల్వ సామర్థ్యం (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌ల నిర్ధారణపైనా హైడ్రా అధికారులు దృష్టి సారించారు. సర్వే ఆఫ్ ఇండియా, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ), రెవెన్యూ, ఇరిగేషన్, గ్రామ మ్యాపుల ఆధారంగా వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న చెరువుల లెక్కలు వీలైనంత త్వరగా తేల్చాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వివిధ విభాగాల నుంచి 1960-70 నుంచి ఉన్న


ఫిర్యాదులు స్వీకరిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

మ్యాపులను సేకరిస్తున్నారు. ఎన్‌ఆర్‌ఎస్‌సీ, ఎన్‌ఆర్‌ఎస్‌ఏ, సర్వే ఆఫ్ ఇండియాల నుంచి గత, ప్రస్తుత శాటిలైట్ చిత్రాలను తీసుకొని.. ఇంతకుముందు చెరువు ఎంత విస్తీర్ణంలో ఉండేది, ప్రస్తుతం ఎంత మేర ఉందన్నది అంచనా వేస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా శాస్త్రీయంగా జరుగుతోందని, మున్ముందు న్యాయపరమైన, ఇతరత్రా ఇబ్బందులు లేకుండా అన్ని అంశాలనూ పరిశీలిస్తున్నామని రంగనాథ్ చెబుతున్నారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్ధారణకు సంబంధించి దశల వారీగా ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేయాలని భావిస్తున్నారు. నాలుగైదు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని రంగనాథ్ అంటున్నారు.

ప్రస్తుతానికి పార్కులు, రోడ్ల ఆక్రమణలపై...

ఆక్రమణల తొలగింపుపై గతంలోనే హైడ్రా కమిషనర్ స్పష్టతనిచ్చారు. 2024 జూలై 19న హైడ్రా ఏర్పాటు కాగా, ఆ తేదీకి ముందు అనుమతి తీసుకొని నిర్మించిన నివాస భవనాల జోలికి వెళ్లబోమని, అనుమతి లేకుండా చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో చేపట్టిన నిర్మాణాలను మాత్రం ఉపేక్షించబోమని చెప్పారు. 2024 జూలై 19 తరువాత అనుమతులున్నా.. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణాలుంటే నేలమట్టం చేస్తామని స్పష్టం చేశారు. అమీన్‌పూర్‌లోని ముత్తంగి, పోచారంలోని దివ్యనగర్ లే అవుట్‌లో రోడ్లపై నిర్మించిన ప్రహరీని ఇటీవల తొలగించారు. సోమవారం శంషాబాద్‌లోని ఉట్పూరులో 998 చదరపు గజాల పార్కు స్థలంలో, రోడ్డును ఆక్రమించి చేపట్టిన ఆక్రమణలను నేలమట్టం చేశారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణ కాని చెరువుల ఫిర్యాదులను పక్కన పెడుతున్న అధికారులు.. ప్రస్తుతం పార్కులు, రోడ్ల ఆక్రమణ ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

- కాప్రా సర్కిల్ పరిధిలోని వంపుగూడ పక్కన ఎన్ఆర్‌ఐ కాలనీ వాళ్లు ప్రహరీ నిర్మించారు.
- రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో ప్లాట్లను కబ్జా చేశారని పలువురి ఫిర్యాదు. కొన్ని ప్లాట్లు ఆక్రమించి ప్రహరీ నిర్మించారు.
- ఘట్‌కేసర్ మండలం కొర్రెముల గ్రామ పంచాయతీ లే అవుట్‌లో మా ప్లాట్లను నల్ల మల్లారెడ్డి తీసుకున్నారు. 1987లో కొనుగోలు చేసిన స్థలాలను 2010లో రెవెన్యూ రిజిస్ట్రేషన్ల శాఖకు చెందిన రికార్డులు టాంపరింగ్ చేసి ఆక్రమించాడు. రాజకీయ పలుకుబడితో మా స్థలాలు అనుభవిస్తున్నాడని ఖాజా మీరన్ మొయినుద్దీన్ ఫిర్యాదు.

కాలనీల చుట్టూ ప్రహరీలను కూల్చేయండి..!

గేటెడ్ కమ్యూనిటీల తరహాలో కాలనీల చుట్టూ రహదారులపై రాకపోకలకు ఇబ్బంది కలిగేలా నిర్మించిన ప్రహరీలను వెంటనే తొలగించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. గతంలో సెప్టిక్ ట్యాంకుల కోసం కేటాయించిన స్థలాలను.. ప్రజావసరాల స్థలాలుగా పరిగణిస్తూ కబ్జా చేస్తే తొలగించాలన్నారు. సోమవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పౌరుల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 71 ఫిర్యాదులు రాగా.. వీటిలో పార్కులు, రహదారుల ఆక్రమణలకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయి. ఫిర్యాదుదారులకు సంబంధిత ఏరియా అధికారులను పరిచయం చేసి వారితో టచ్‌లో ఉండాలని, క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చినప్పుడు పూర్తి వివరాలు అందజేయాలని సూచించారు.

మంత్రిని అడ్డుకున్నారన్న కేసు కొట్టివేయండి

- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పిటిషన్
- 2021లో అప్పటి మంత్రి జగదీశ్ రెడ్డి మైకు లాక్కొన్నట్టు ఆరోపణ

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మంత్రి మైక్ లాక్కొని, ప్రభుత్వ కార్యక్రమాన్ని అడ్డుకున్నారనే ఆరోపణలపై నమోదైన 2021 నాటి కేసు కొట్టేయాలని కోరుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మునుగోడు నియోజకవర్గంలోని చౌటుప్పల్ మండలం లక్కారంలో 2021 జూలై 26న అప్పటి ప్రభుత్వం నిర్వహించిన ఆహారభద్రత కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఘర్షణ నెలకొంది. అప్పటి మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రొటోకాల్ పాటించకుండా, సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ రాజగోపాల్‌రెడ్డి మైకు లాక్కొని అడ్డుకున్నారు. దాంతో ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించకుండా అడ్డుపడ్డారని చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు కొట్టేయాలని తాజాగా రాజగోపాల్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి, ఫిర్యాదుదారు అయిన తహసీల్దార్‌కు నోటీసులు జారీచేసింది. విచారణ ఈనెల 11కు వాయిదా పడింది.

ఆర్టీసీని ప్రైవేటుపరం చేసేందుకు కంకణం కట్టుకున్న ప్రభుత్వం: జేఏసీ ఛైర్మన్ వెంకన్న

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆర్టీసీని దశలవారీగా ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుందని టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న ఆరోపించారు. ఎంప్లాయీస్ యూనియన్ ఆఫీసులో జేఏసీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమస్యల పరిష్కారానికి తాము ఇచ్చిన సమ్మె నోటీసుపై ఆర్టీసీ యాజమాన్యం తప్పుడు ప్రచారం మానుకోవాలన్నారు. సమ్మె నోటీసు ఇచ్చినప్పటి నుంచి తాము లేవనెత్తిన డిమాండ్లను పక్కన పెట్టి కార్మికులకు సంబంధం లేని అంశాల్ని ప్రస్తావిస్తూ ప్రతిరోజు డిపోల్లో సమావేశాలు ఏర్పాటు చేసి కార్మికుల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలనే ప్రధాన డిమాండ్లుగా జేఏసీ ప్రస్తావిస్తూ పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో జేఏసీ ఉపాధ్యక్షుడు థామస్ రెడ్డి, కోశాధికారి యాదయ్య తదితరులు పాల్గొని పలు అంశాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకున్నారు.

బ్లాక్ మెయిల్‌తో విసిగిపోయి.. వ్యక్తిని గొంతు నులిమి చంపిన వివాహిత

- కాల్ రికార్డింగ్స్ భర్తకు పంపుతానని బెదిరించడంతో ఆ వ్యక్తికి లొంగిపోయిన మహిళ..
- వేధింపులు పెరగడంతోనే హత్య.. యూపీలో ఘటన

బరేలీ, ఫిబ్రవరి 3: ఫోన్ కాల్ సంభాషణలను భర్తకు పంపి.. పచ్చని కాపురంలో చిచ్చుపెడతానంటూ పరిచయస్థుడు చేసిన బ్లాక్‌మెయిల్‌కు ఆమె తలొగ్గింది. పిలిచినప్పుడల్లా అతడి ఇంటికి వెళుతూ ఇష్టంలేకున్నా అతడితో సన్నిహితంగా గడుపుతోంది. రానురాను అతడి చేష్టలకు విసిగిపోయిన ఆ 32 ఏళ్ల ఆ వివాహిత, ఒకానొకరోజు ఏకాంతంగా ఉన్న క్షణంలో అతడిని గొంతు పిసికి చంపింది. యూపీలోని బరేలీలో ఈ ఘటన జరిగింది. హతుడి పేరు ఇక్బాల్. చీరల మీద డిజైన్లు వేసే కళాకారుడతను. బరేలీలో ఉంటున్నాడు. వృత్తిలో భాగంగా ఒకరోజు ఇక్బాల్, ఊర్లో తిరుగుతుండగా వివాహితతో పరిచయమైంది. ఫోన్ నంబర్లు ఇచ్చిపుచ్చుకొని మాట్లాడుకోసాగారు. ఒకరోజు.. అతడామెకు ఫోన్‌చేసి తనతో గడపాలని, లేదంటే ఫోన్ సంభాషణలను భర్తకు చేరవేస్తానని ఆమెను బ్లాక్‌మెయిల్ చేశాడు. భర్త తనను వదిలేస్తే, చిన్నపిల్లలతో తాను దిక్కులేకుండా పోతానని ఆందోళన చెందిన ఆమె, ఇక్బాల్‌కు లొంగిపోయింది. వేధింపులు పెరగడంతో ఇక్బాల్‌ను చంపాలని, లేదంటే తానైనా చావాలని నిర్ణయించుకొంది. ఒకరోజు రాత్రి నిద్రమాత్రలు కలిపిన టీని భర్తతో తాగించి.. అతడు నిద్రలోకి జారుకోగానే రాత్రి 11:30కు ఇక్బాల్ ఇంటికి వెళ్లింది. పడక గదిలో ఏకాంతంగా గడుపుతుండగా ఇక్బాల్ ఛాతీమీద కూర్చొని.. ఒక చేత్తో అతడి నోరు మూసి.. మరో చేత్తో గొంతు పిసికి చంపేసింది. అనంతరం మృతదేహాన్ని లాక్కుంటూ మెట్ల వద్ద పడేసి వెళ్లిపోయింది. హత్య జరిగిన రెండ్రోజుల తర్వాత కేసును పోలీసులు ఛేదించారు.

మిల్లు భూమి కార్మికులకే చెందాలి

- లేఖ విడుదల చేసిన భారత కమ్యూనిస్టు పార్టీ

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆజంజాహి మిల్లు భూమి ఆ కార్మికులకే చెందాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) జయశంకర్, మహబూబాబాద్, వరంగల్ -2, పెద్దపల్లి డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన పేరిట ఓ లేఖను విడుదల చేశారు. ఆ భూమిపై పూర్తి హక్కులు కార్మికులకు వచ్చే వరకు వీరోచిత పోరాటాలు చేయాలని, వరంగల్‌లో ఏడు దశాబ్దాల క్రితం నిజాం కాలంలో అజంజాహి వస్త్ర పరిశ్రమను స్థాపించారని, దానిపై ఆధారపడి వేలాది మంది కార్మికులు జీవించారని, అయితే ప్రభుత్వాలు ఒక పథకం ప్రకారం దాన్ని దివాలా తీసేలా చేశాయని ఆరోపించారు. నాడు అందులో పనిచేసే 451 కార్మికులకు బలవంతపు వీఆర్ఎస్ ఇచ్చి 2002లో మిల్లును మూసివేశారని, ఫలితంగా కార్మికులు రోడ్డున పడ్డారని, తర్వాత పరిశ్రమను పునఃప్రారంభించాలని కోరుతూ కార్మికులు పోరాడుతూనే ఉన్నారని గుర్తు చేశారు. కార్మికుల పోరాటాన్ని పెడచెవిన పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం 2007లో 'కుడా' సంస్థకు 117 ఎకరాల 20 గుంటలు, ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డుకు 65 ఎకరాలు, రాంకీ, హ్యాండ్లూమ్ కార్పొరేషన్‌కు 30 ఎకరాలను అమ్మేసిందని పేర్కొన్నారు. మిల్లు కార్మికులంతా పైసా పైసా కూడబెట్టు కుని 12 గుంటల భూమిని కొనుగోలు చేసి అందులో కార్మిక భవనాన్ని నిర్మించుకున్నారని, ఈ విషయం కోర్టులో ఉండగానే హైకోర్టు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్, వరంగల్‌కు చెందిన సుద్దాల నాగరాజు తప్పుడు పత్రాలు సృష్టించి ఆ భూమని ఓం నమఃశివాయ అనే వ్యాపారికి అమ్ముకున్నారని పేర్కొన్నారు. గతంలో గొట్టిముక్కుల నరేందర్, ఓం నమఃశివాయ లాంటివారు కార్మికుల భవనాన్ని, భూమిని కబ్జాచేసే ప్రయత్నం చేసినప్పుడు చిక్కుడు ప్రభాకర్ కోర్టులో కేసువేసి కార్మికుల పక్షాన నిలిచాడని, నేడు అదే చిక్కుడు ప్రభాకర్ కార్మికులను మోసగించి దోపిడీ వర్గాల పక్షాన నిలబడ్డాడని ఆరోపించారు. అదే విధంగా వరంగల్ కు చెందిన సుద్దాల నాగరాజు అసంఘటిత కార్మిక సంఘం పేరుతో చెలామణి అవుతూ సెటిల్‌మెంట్లు, భూ ఆక్రమణలకు పాల్పడుతూ ఆస్తులు సంపాదించాడని ఆరోపించారు. ఈ విషయంలో కార్మికులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే తమ పరిధి కాదంటూ దబాయిస్తున్నారని మండిపడ్డారు. మిల్లు భూములపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని, భూ ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం ఉన్న భూమిలో కార్మికులకు భవనాన్ని నిర్మించి ఇవ్వాలని, అంతవరకు ప్రజలు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు కార్మికులకు అండగా ఉండాలని వెంకటేశ్ ఆ లేఖలో కోరారు.

12న అమెరికాకు ప్రధాని మోదీ!

- రెండు రోజుల పర్యటన ఖరారు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 : ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 12న అమెరికా వెళ్లనున్నారు. రెండు రోజుల పాటు ఆయన అక్కడ పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా వైట్‌హౌస్‌లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని సమావేశమై చర్చలు జరుపుతారు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడయ్యాక ప్రధాని అమెరికాలో పర్యటించడం ఇదే తొలిసారి. మోదీ ఫ్రాన్స్ పర్యటన ముగిసిన వెంటనే అమెరికాలో పర్యటనకు వెళ్లనున్నారు. జనవరి 20న ట్రంప్ ప్రమాణస్వీకారం చేశాక మోదీ 27న ఆయనకు ఫోన్ చేసి అభినందించారు.

కుల గణన నివేదికలో కాకి లెక్కలు

బీసీలపై సర్కార్‌కు చిన్నచూపెందుకు?.. రేవంత్.. మీరు చెప్తున్న లెక్క సరైనదేనా?

- బీసీల విషయంలో వెనక్కి తగ్గిన రాహుల్
- ప్రస్తుతం ప్రకటించిన నివేదిక ప్రకారమైనా 56.30% రిజర్వేషన్‌ను అమలు చేయాలి
- 'స్థానికం'లో సత్తా చాటుతాం: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్/కరీంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : బీసీ గణనపై కాంగ్రెస్ సర్కార్ కాకి లెక్కలు చెబుతోందని, బీసీలపై ఎందుకింత చిన్నచూపు? అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. స్థానిక ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్‌ను పెంచేందుకు అసెంబ్లీలో బిల్లు పెట్టాలని, బీసీలకు శాశ్వత ప్రయోజనం కలిగేలా సుదీర్ఘ చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంతోపాటు కరీంనగర్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. అనంతరం పెద్దపల్లిలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. రిజర్వేషన్ల విషయంలో 'మేమెంత ఉంటే... మాకంత వాటా' అని నినదించిన కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ.. ఇప్పుడు ఎందుకు వెనక్కి తగ్గుతున్నారని నిలదీశారు. ప్రస్తుతం ప్రకటించిన సర్వే లెక్కల ప్రకారమైనా 46.30శాతం బీసీలు, 10శాతం బీసీ ముస్లింలు.. కలిపి మొత్తం 56.30శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసలు సర్వే నివేదికపైనే తమకు అనేక అనుమానాలు ఉన్నాయని తెలిపారు. 2014లో నిర్వహించిన సకలజనుల సర్వేకు, ఇప్పటి సర్వేకు


కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న కవిత

21 లక్షల మేర బీసీ జనాభా తేడా కనిపిస్తోందని, సకల జనుల సర్వేలో ఓసీల జనాభా చాలా తక్కువని తేలితే.. ఈ సర్వేలో చాలా ఎక్కువగా కనిపిస్తోందన్నారు. దీని వెనుక మతలబు ఏమిటో ప్రభుత్వం చెప్పాలన్నారు. కేవలం ఓసీల జనాభా పెరిగి బీసీ, ఎస్సీ, ఎస్టీల జనాభా తగ్గుతుందా? అని ప్రశ్నించారు. "అప్పటి సమగ్ర సర్వేలో 1.03 కోట్ల ఇళ్లు, 3.68కోట్ల జనాభా ఉన్నట్లు తేలింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చేసిన సమగ్ర కులగణనలో 1.15 కోట్ల ఇళ్లు ఉన్నట్లు లెక్కగట్టారు. 50-52శాతం దాకా బీసీ జనాభా ఉండే అవకాశం ఉండగా.. 46.2శాతం ఉన్నట్లు తేల్చడం బాధాకరం" అని అన్నారు. బీసీ జనాభా విషయంలో మీరు చెబుతున్న లెక్క సరైనదేనా? సీఎం రేవంత్‌రెడ్డి గుండె మీద చెయ్యి వేసుకుని చెప్పాలని డిమాండ్ చేశారు. కనీసం ఈ కాకి లెక్కలతోనైనా బీసీల రిజర్వేషన్ల పెంచడం కోసం అసెంబ్లీలో బిల్లు పెట్టాలన్నారు. రిజర్వేషన్లను పెంచాకనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని కోరారు. గతంలోనూ బిహార్, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఇదే తరహా మోసానికి పాల్పడిందని గుర్తు చేశారు. తెలంగాణ జాగృతి, బీసీ సంఘాలు, రాజకీయ పార్టీలు చేసిన ఉద్యమాల వల్లే ప్రభుత్వం బీసీ జనాభా వివరాలను బహిర్గతం చేసిందని, దీన్ని ప్రజాస్వామిక వాదులంతా స్వాగతించాలన్నారు. డెడికేటెడ్ కమిషన్ ద్వారానే కులగణన జరగాలని కోరినా ప్రభుత్వం ప్లానింగ్ శాఖ ద్వారా సర్వే చేయించిందని, ఈ సర్వే సరిగ్గా జరగలేదని ప్రతి ఒక్కరి మనసుల్లో ఉందని పేర్కొన్నారు. తమ ఇళ్లకు సర్వే కోసం రాలేదని ప్రతి గ్రామంలో చాలామంది అంటున్నారని, సర్వే సరిగ్గా జరగకపోతే వెల్లడించిన డేటా వాస్తవమైనదా? కాదా? అన్న అనుమానాలు కలుగుతున్నాయన్నారు. బీసీల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం సర్వే డేటాను సమీక్షకు పెట్టాలని, 3.5కోట్ల సర్వేపత్రాలను ప్రజలకు అందుబాటులోకి ఉంచాలని కోరారు. ఇందుకోసం బీసీ పెద్దలందరినీ కలుస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదన్న కాంగ్రెస్ నాయకుల విమర్శలపై స్పందిస్తూ.. రావాల్సిన సమయం వచ్చినప్పుడు కేసీఆర్ వస్తారని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కడిగేస్తారని స్పష్టం చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి రాజ్యసభ ఛైర్మన్ ధన్‌ఖడ్ ప్రశంసలు

- బొగ్గు, గనుల శాఖలో సమర్థత, పారదర్శకత తెచ్చే కార్యక్రమాలు చేపడుతున్నారని కితాబు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిపై ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ రాజ్యసభ సాక్షిగా ప్రశంసల వర్షం కురిపించారు. బొగ్గు, గనుల రంగంలో సమర్థత, పారదర్శకత తీసుకొచ్చేందుకు మంత్రి కిషన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. అనుమతుల ఆమోదం సులువుగా జరిగేందుకు బొగ్గు, గనుల శాఖ తీసుకొచ్చిన సింగిల్ విండో వ్యవస్థను మెచ్చుకున్నారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా రాజ్యసభ సభ్యుడు దినేశ్ శర్మ బొగ్గు గనుల శాఖలో సింగిల్ విండో క్లియరెన్స్ వ్యవస్థపై సోమవారం అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా బొగ్గు, గనుల శాఖలో జరుగుతున్న మార్పుల గురించి సభకు వివరించారు. గనుల కార్యకలాపాల్లో డిజిటలైజేషన్ జరుగుతోందని, దీంతో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని చెప్పారు. వేలం వ్యవస్థను తీసుకొచ్చినప్పటి నుంచి వేలం లేకుండా ఒక్క గని కూడా ఎవరికీ కేటాయించలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మంత్రి ప్రసంగం అనంతరం రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ మాట్లాడుతూ.. "సింగిల్ విండో కోల్ వ్యవస్థ చాలా అద్భుతం. గనులు మన సహజ సంపద. ఈ విషయంలో మంత్రిని అభినందించొచ్చు." అని కొనియాడారు.

'ఎక్స్' వేదికగా కేంద్రమంత్రి కృతజ్ఞతలు

"గౌరవనీయులైన ఎంపీ రాజ్యసభలో ఇవాళ అడిగిన ప్రశ్నకు.. బొగ్గు, గనుల రంగంలో పారదర్శకత పెంపొందించేందుకు తీసుకుంటున్న చర్యల గురించి వివరించాను. గనుల రంగంలో సింగిల్ విండో వ్యవస్థను కొనియాడిన గౌరవనీయులైన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ గారికి కృతజ్ఞతలు. ప్రధాని నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో గనుల రంగంలో సమర్థత, పారదర్శకత తెచ్చేందుకు ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చాం." అని కిషన్‌రెడ్డి 'ఎక్స్'లో ట్వీట్ చేశారు.

2008 డీఎస్సీ అభ్యర్థులకు కాంట్రాక్టు టీచర్ పోస్టులు

హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పనిచేయడానికి సిద్ధంగా ఉన్న డీఎస్సీ-2008 అభ్యర్థుల్లో 1,382 మందికి ఒప్పంద ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు కల్పించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు మేరకు ఈ సమస్యపై నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిపింది. అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం డీఈడీ అభ్యర్థులకు సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) ఉద్యోగాల్లో ప్రత్యేకంగా 30 శాతం రిజర్వేషన్ కల్పించడంతో తాము నష్టపోయామంటూ బీఈడీ అభ్యర్థులు అప్పటి నుంచి న్యాయపోరాటం చేస్తున్నారు. డీఈడీ అభ్యర్థులు అర్హులేనంటూ ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లు తాజాగా సోమవారం జస్టిస్ అభినందన్‌కుమార్ షావిలి, జస్టిస్ తిరుమలదేవి ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చాయి. అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. గతంలో ఈ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తున్నామని అందుకు అనుగుణంగా డీఎస్సీ 2008 అభ్యర్థులకు కాంట్రాక్టు టీచర్ ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ విషయాన్ని మంత్రివర్గ ఉపసంఘానికి నివేదిస్తూ గతేడాది ఫిబ్రవరి 24న జీవో 292 జారీఅయిందని తెలిపారు. సర్వీస్ కండిషన్లు తదితర అంశాలపై సబ్‌కమిటీ సూచనల మేరకు ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. 2,367 మందికిగాను 1382 మంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయడానికి ఇప్పటివరకు సమ్మతి వ్యక్తంచేశారని వివరించారు. నియామకాలపై విద్యాశాఖ అందజేసిన ప్రతిపాదనలకు సబ్‌కమిటీ అంగీకారం తెలిపిందని కానీ ఈలోగా ఈ ఏడాది జనవరి 1న శాసనమండలి పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిందని పేర్కొన్నారు. ఈ విషయం చాలా పాతదని, అందులోనూ హైకోర్టు ఆదేశాల మేరకు జరుగుతున్న ప్రక్రియ కాబట్టి ఆ వివరాలు ఎన్నికల కమిషన్‌కు తెలియపర్చి అనుమతి పొందిన తర్వాత నియామక ఉత్తర్వులు అందజేస్తామని తెలిపారు. ఈమేరకు తగిన సమయం ఇవ్వాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

జన్వాడ ఫాంహౌస్‌పై డ్రోన్ కేసు కొట్టివేయండి

- ఎస్సీ, ఎస్టీ కోర్టులోని కేసు కూడా...
- హైకోర్టులో సీఎం రేవంత్‌రెడ్డి క్వాష్ పిటిషన్లు



హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తనపై ఉన్న రెండు కేసులను కొట్టివేయాలని కోరుతూ ముఖ్యమంత్రి దాఖలు చేసిన రెండు క్వాష్ పిటిషన్లను సోమవారం హైకోర్టు పరిశీలించింది. మాజీ మంత్రి కేటీఆర్‌కు చెందినదిగా పేర్కొంటున్న జన్వాడ ఫాంహౌజ్‌పై డ్రోన్ కెమెరా ఎగరేసిన వ్యవహారంలో నార్సింగి పోలీసులు ఆయనపై 2020లో కేసు పెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా జన్వాడ ఫాంహౌస్ కట్టారని ఆరోపిస్తూ ఆ భవనంపై రేవంత్‌రెడ్డి డ్రోన్ కెమెరా ఎగరేసి ఫొటోలు తీశారు. భూయజమానిని బెదిరించి 25 ఎకరాలు కొనుగోలు చేయడంతోపాటు జీవో 111 నిబంధనలను తుంగలో తొక్కి ఆ ఫాంహౌస్‌ను నిర్మించారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. విలాసవంతమైన భవనం, ఈతకొలను, అత్యాధునిక సౌకర్యాలతో ఉన్న ఫాంహౌస్ ఫొటోలు మీడియాకు విడుదల చేశారు. ప్రైవేటు ఆస్తిపై చట్టవిరుద్ధంగా డ్రోన్ ఎగరేశారని పేర్కొంటూ ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం సహా పలు సెక్షన్ల కింద నార్సింగి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ పిటిషన్‌ను కొట్టేయాలని రేవంత్‌రెడ్డి 2020లోనే హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేయగా అది తాజాగా విచారణకు వచ్చింది. రంగారెడ్డి ఎస్సీ, ఎస్టీ కేసుల స్పెషల్ కోర్టులో తనపై ఉన్న 2019 నాటి ఓ కేసును కొట్టేయాలని రేవంత్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. 2020లోనే ఈ పిటిషన్ దాఖలు చేయగా తాజాగా విచారణకు వచ్చింది. ఈ రెండు పిటిషన్‌లపై విచారణ చేపట్టిన జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం.. ప్రభుత్వం, ఫిర్యాదుదారులకు నోటీసులు జారీచేసింది. ఎస్సీ, ఎస్టీ కేసులో దిగువ కోర్టులో ప్రత్యక్ష హాజరు నుంచి రేవంత్ రెడ్డికి మినహాయింపు ఇచ్చింది. తదుపరి విచారణ ఈనెల 20కి వాయిదా పడింది.

అంతరిక్ష పరిశోధనలకు 13,415 కోట్లు

- ప్రధాని మోదీకి ఇస్రో ఛైర్మన్ నారాయణన్ కృతజ్ఞతలు

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో భారత అంతరిక్ష పరిశోధనలకు రూ.13,415 కోట్లు కేటాయించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నామని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ తెలిపారు. ఇస్రో ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా నారాయణన్ స్వగ్రామం కన్యాకుమారి జిల్లా నాగర్‌కోయిల్ సమీపంలోని మేలకాట్టువిలై గ్రామస్తులు సోమవారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నారాయణన్ విలేకరులతో మాట్లాడుతూ... ఇటీవలే వందో రాకెట్ జీఎస్ఎల్వీ ఎఫ్-15ను విజయవంతంగా ప్రయోగించామని, ఇస్రో ఉద్యోగుల సమష్టి కృషికి ఈ విజయం నిదర్శనమని కొనియాడారు.

కుంభమేళా తొక్కిసలాటపై విచారణకు నిరాకరణ

- తొలుత హైకోర్టుకు వెళ్లాలని పిటిషనర్‌కు సూచన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: కుంభమేళాలో తొక్కిసలాటపై విచారణ జరిపేందుకు సోమవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. తొలుత అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. ప్రయాగరాజ్‌లో మౌనీ అమావాస్య సందర్భంగా జరిగిన పుణ్యస్నానాల్లో 30 మంది మరణించడంపై న్యాయవాది విశాల్ తివారీ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. పరిశీలించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం..ఇది దురదృష్టకర సంఘటన అని వ్యాఖ్యానించింది. అయినా తొలుత హైకోర్టును ఆశ్రయించాల్సి ఉంటుందని తెలిపింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ దీనిపై ఇప్పటికే అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలయిందని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యమునా తీరాన...

దేశరాజధాని ఢిల్లీకి వాయుకాలుష్యం కంటే ప్రచార కాలుష్యం ఎక్కువ హాని చేస్తోందని ఓ మేధావి వాపోయారు. బుధవారం ఎన్నికలు జరగబోతున్నందున రాజధానివాసులను ఇంతకాలమూ కుదిపేసిన ఎన్నికల ప్రచారం సోమవారం ముగిసింది. అన్ని పార్టీల నాయకులు ఆఖరునిముషం వరకూ ప్రచారాన్ని హోరెత్తించారు. యాభైఐదుస్థానాలతో మూడోసారి అధికారంలోకి వస్తానని చెప్పుకున్న ఆమ్ ఆద్మీపార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ మళ్ళీ ఎన్నికల సంఘంమీద విరుచుకుపడ్డారు. సీఈసీ రాజీవ్‌కుమార్‌కు రిటైర్‌మెంట్ అనంతరం బీజేపీ ఏదో పెద్దపదవి కట్టబెట్టబోతున్నదన్న రీతిలో ఆయన నర్మగర్భమైన వ్యాఖ్యలు చేశారు. యమునానది కాలుష్యంతో ఢిల్లీ ప్రజల ప్రాణాలను పొరుగురాష్ట్రం హర్యానా ప్రమాదంలో పడవేస్తున్నదని విమర్శలు చేసినందుకు, ఎన్నికలసంఘం పెద్దలు పిలిచి వివరణ కోరడం కేజ్రీవాల్‌కు నచ్చలేదు మరి.

ఇంతకూ హర్యానా ముఖ్యమంత్రి యమున నీటిని తాగారా, తాగినట్టు నటించారా, తాగినట్టే తాగి తిరిగి ఉమ్మేశారా? ఈ ప్రశ్నలకు సమాధానం తెలిసేలోగా ఢిల్లీ ఎన్నికలు ముగుస్తాయి, యమున కాలుష్యం అంశం వెనక్కుపోతుంది, ఎప్పటిలాగానే ఆ నది విషపు నురగలు కక్కుతూ ప్రవహిస్తూనే ఉంటుంది. ఈ వివాదం ఇప్పటిదేమీ కాదు కానీ, కేజ్రీవాల్‌కు యమున కాలుష్యం, తన ప్రజల ఆరోగ్యానికి ముంచుకొచ్చిన ప్రమాదం ఇలా ఎన్నికల ముందే గుర్తుకురావడం బాగోలేదు. హర్యానా నిర్లక్ష్యం కారణంగా మార్గమధ్యంలో కలుషితమై, దేశరాజధానిని చేరుతున్న యమున నీటిని తాము ఎంత అత్యాధునికమైన యంత్రాలు వినియోగించి శుభ్రపరిచినా ఫలితం లేకుండా పోతున్నదని కేజ్రీవాల్ పొరుగురాష్ట్రం మీద దాడిచేసి, పరోక్షంగా బీజేపీని ఆత్మరక్షణంలోకి నెట్టేశారు. యమున నీళ్ళు బాగానే ఉన్నాయని అన్నందుకు, దమ్ముంటే తాగిచూపించడంటూ నీళ్ళ బాటిళ్ళు ముందుపెట్టుకొని మరీ సవాలు చేశారు. నేరుగా నదిలోనే తాగుతానంటూ సవాలు చేసిన హర్యానా ముఖ్యమంత్రి సైనీ నిజానికి ఆ నీటిని తాగలేదని, కేవలం నటించారని ఆ తరువాత విమర్శలు చేశారు. యమున నీటినాణ్యత మీద ఇంత పట్టింపు ఉన్న కేజ్రీవాల్ ఎన్నికల వరకూ ఆగకుండా నీటినాణ్యతమీద ఎప్పుడో చర్చకు దిగాల్సింది. ఢిల్లీని కుదిపేస్తున్న వాయుకాలుష్యానికి కేంద్రాన్నీ, పొరుగు రాష్ట్రాలనూ ఆయన ఎలాగూ తప్పుబడుతూనే ఉన్నారు. ఉద్యమాలకు, పోరాటాలకు కేజ్రీవాల్ పెట్టింది పేరు కనుక, యమున కాలుష్యంమీద హర్యానా నిర్లక్ష్యాన్ని ఎండగట్టి, దానినీ, కేంద్రాన్నీ దారికి తెచ్చి అమీ తుమీ తేల్చుకోవాల్సింది. ఇదేమీ చేయకుండా, తాము ఇంతకాలమూ తాగుతున్న యమున నీటిని తమ పాలకుడే ఎన్నికల ముందు విషం అన్నందుకు ఢిల్లీ వాసులకు ఆగ్రహం కలుగుతుందో, నిజం చెప్పినందుకు బీజేపీ పెద్దలతో పాటు ఎన్నికల సంఘం కూడా ఆయన వేధిస్తున్నదని జాలి కలుగుతుందో చూడాలి.

రాజధానిని చేజిక్కించుకోవడమే అంతిమలక్ష్యంగా అన్ని పార్టీలూ ఢిల్లీవాసులను వరాలజల్లులో తడిపేశాయి. గ్యారంటీల పేరిట ఉచితాలను అనుచితస్థాయికి తీసుకుపోయాయి. ఖజానా సొమ్మును పందేరం చేయడంలో పార్టీలన్నీ పోటీపడ్డాయి, హద్దులన్నీ చెరిపేశాయి. యోజన, సమ్మాన్, జీవన్‌రక్ష ఇత్యాది చక్కని పేర్లతో పోటాపోటీగా గుదిగుచ్చిన పథకాలన్నింటి లక్ష్యమూ ఒక్కటే. ఉచితాలను వెటకరించే, విమర్శించే నరేంద్రమోదీ కూడా ఢిల్లీలో మట్టుకు వెనక్కుతగ్గదల్చుకోలేదు. ఆయన పార్టీ ఒకపక్క వరాలు కురిపిస్తుండగా, తాము అధికారంలోకి వస్తే ప్రస్తుతం అమలవుతున్న పథకాలన్నీ కొనసాగుతాయని ఆయన ప్రజలకు స్వయంగా హామీ ఇస్తున్నారు.

పదిహేనేళ్ళపాటు ఢిల్లీని ఏలిన కాంగ్రెస్‌కు మళ్ళీ అధికారంలోకి రాగలిగేంత శక్తి లేకపోవచ్చును కానీ, ఆప్–బీజేపీ హోరాహోరీ పోరులో అది ఎవరికి ఎక్కువగా నష్టం చేయబోతున్నదన్నది ప్రశ్న. ఆప్ వరుసపాలనమీద విరక్తిచెందినవారు, కేజ్రీవాల్‌ను అవినీతిపరుడిగా నమ్మినవారు, డబుల్ ఇంజన్ సర్కారుకు మొగ్గవచ్చు. పదేళ్ళుగా కఠినంగా ఉన్న ఆర్థికమంత్రి ఢిల్లీ ఎన్నికల దృష్టితోనే ఇంత ఉదారంగా వ్యవహరించారని అనలేం కానీ, శనివారం నాటి కేంద్రబడ్జెట్‌లో ఆదాయం పన్నుమినహాయింపు పరిమితిని 12లక్షలకు పెంచడం మధ్యతరగతి జనాభా అత్యధికంగా ఉన్న దేశరాజధాని నగరాన్ని ప్రభావితం చేయకమానదు. ఆప్ కోటను బద్దలు కొట్టలేకపోయినా, కనీసం ముప్పైస్థానాల్లో బీజేపీ గెలవగలదన్న అంచనాల వల్ల కాబోలు, కేజ్రీవాల్ ఈమారు ఎంతో వినయంగా తన లెక్క తక్కువ చెప్పుకున్నట్టుంది.

అమెరికా గతం... భారత్‌కు భయం!

సామాజిక జీవితంలో అన్నికంటే కష్టమైంది.. గతాన్ని పునరుద్ధరించాలని ప్రయత్నించటం! ప్రవహించే నదిలో రెండోసారి కాలుపెట్టలేమని గ్రీకు తత్వవేత్త హెరాక్లైటస్ 2500 ఏళ్ల క్రితమే చెప్పాడు. ప్రపంచం నిరంతరం మారుతూ ఉంటుంది కాబట్టి గతంలోకి వెళ్లనూలేం. దాన్ని పునరుద్ధరించనూ లేం. ఈ సత్యం సాధారణ వ్యక్తులకూ తెలుసు. అందుకే స్వతహాగా వాళ్లు ఆ ప్రయత్నాలు చేయరు. వర్తమానంలో పడుతున్న బాధలు గతంలో ఉండేవి కావనీ ధర్మం నాలుగు పాదాల మీద నడిచే యుగం ఒకప్పుడు ఉండేదన్న భావన అన్ని నాగరికతల్లో కనపడుతుంది. గతంలో ఉందో లేదో తెలియని అటువంటి యుగం.. భవిష్యత్తులో ఏర్పడాలని కోరుకోటానికీ, దానికోసం ప్రయత్నించటానికీ ఒక ఆదర్శంగా ప్రజలకది అప్పుడప్పుడూ ఉపయోగపడుతుంది. మంచికీ చెడుకూ దాన్ని వాడుకున్న సందర్భాలు చరిత్రలో కనపడతాయి. పలు గిరిజనుల పోరాటాల్లో అది ఎంతోకొంత ఉపయోగపడింది. దానికి భిన్నంగా మతోన్మాదం కోసం, జాత్యహంకారం కోసం, నియంతృత్వ స్థాపన కోసం దాన్ని వినియోగించుకున్న సంఘటనలూ ఉన్నాయి.

ఆధునిక ప్రజాస్వామ్యంలో సంప్రదాయ ధర్మయుగ పునరుద్ధరణకు ప్రయత్నించటం చాలా అరుదు. దాని జోలికి వెళ్లకపోయినా చరిత్ర పుటల్లోకి ఎక్కిన ఘనమైన గతాల పునరుద్ధరణకు ప్రయత్నాలైతే జరుగుతున్నాయి. అమెరికాను మళ్లీ గొప్పదేశంగా మారుద్దామని (మేక్ అమెరికా గ్రేట్ అగెన్) డొనాల్డ్ ట్రంప్, ఆయన అనుచరులూ చేస్తున్న హడావుడిలో ఇదే కనపడుతుంది. నిజమే! ఒకప్పుడు అమెరికాకు అన్నింటా ప్రథమ స్థానమే ఉండేది. అది క్రమేపీ పడిపోతున్నా ఇప్పటికీ అమెరికాకు ఆ స్థానం ఇంకా మిగిలే ఉంది.

భౌగోళికంగా ఎన్నో అనుకూలతలు, ప్రపంచ యుద్ధాల్లో జరిగిన అతితక్కువ నష్టం, వలసదోపిడీయే లేని చరిత్ర, ఆఫ్రికా నుంచి కొనుగోలుచేసిన నల్లజాతి వారితో చేయించిన కఠిన శ్రమ, తిండి గింజలకు ఏ దేశం వైపు చూడాల్సిన అవసరం లేని పరిస్థితి, నిరంతరం కొత్త భూముల్లోకి విస్తరించగలిగే సౌలభ్యం.. ఇలా ఎన్నో ప్రత్యేకతలు అమెరికాను అగ్రస్థానంలో నిలబెట్టాయి. ప్రపంచ యుద్ధాలు... యూరపు దేశాలకూ ఆసియా, ఆఫ్రికాలకూ వినాశనాన్నీ విపరీత జననష్టాన్నీ తెస్తే అవే యుద్ధాలు అమెరికాను వస్తూత్పత్తిలో అగ్రస్థానంలో నిలిపాయి. ఆయుధ తయారీ పరిశ్రమల్లో అమెరికాకు పోటీ లేకుండా చేశాయి.

ఏ దేశానికైనా భారీ పరిశ్రమలూ అవి ఉత్పత్తిచేసే యంత్రాలూ వాటితో తయారైన వస్తువులూ పరికరాలూ ఆయువుపట్టుగా ఉంటాయి. పారిశ్రామిక విప్లవం (1760) బాగా విస్తరించిన తర్వాత ఏ దేశ శక్తినైనా వాటితోనే కొలవటం సాధారణమైంది. ఇప్పుడు దానికి అమెరికాలో కొరత ఏర్పడింది. పలు భారీ పరిశ్రమలు వేరే దేశాలకు తరలిపోయాయి. పారిశ్రామిక ఉత్పత్తుల కోసం ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి వచ్చింది. ఎగుమతులతో పోల్చితే దిగుమతులు పెరిగాయి. 2023లో వాణిజ్య లోటు 779.8 బిలియన్ డాలర్లుగా నమోదైంది. పారిశ్రామిక ఉత్పత్తుల కోసమే కాదు సేవల రంగానికి (సర్వీస్ సెక్టర్) సంబంధించి కూడా ఇతర దేశాలపై ఆధారపడటం పెరిగింది. పొరుగుసేవలు (ఔట్ సోర్సింగ్) అనివార్యమయ్యాయి. సమాచార సాంకేతికత వీటిని సులభం చేసింది. నిరుద్యోగం నిరంతరం పీడించే సమస్యగా మారింది. వలస వచ్చిన విదేశీ నిపుణులతో పోటీపడటం కష్టమైంది.

1945–1970 మధ్య కాలాన్ని ఆర్థికాభివృద్ధిపరంగా పాశ్చాత్య దేశాలకు స్వర్ణయుగంగా భావిస్తారు. ఉద్యోగ కల్పన గరిష్ఠస్థాయికి వెళ్లటం... సామాజిక భద్రతా పథకాల అమలు.. పారిశ్రామిక ఉత్పాదకతలో గణనీయ



> ట్రంప్–మోదీ మధ్య నడవడిక, భావ సారూప్యత సంగతెలా ఉన్నా ఇప్పుడు ఆర్థిక అంశాలే నివురుగప్పిన నిప్పులా మారాయి. మన ఎగుమతుల్లో ఎక్కువ అమెరికాకే జరుగుతున్న నేపథ్యంలో పన్నుల యుద్ధం మొదలైతే ఆ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే వినియోగాన్ని పెంచటానికి ఆదాయపన్ను భారాన్ని తాజా బడ్జెట్‌లో బాగానే తగ్గించారు. ఆ పన్ను కట్టే ప్రజల సంఖ్య చాలా స్వల్పంగా ఉన్న మనదేశంలో ఈ ఆర్థిక వ్యూహం ఎంత ఫలిస్తుందో ఇప్పుడే చెప్పలేం. వ్యవసాయ, సామాజిక రంగాలకు కేటాయింపులు తగినంతగా పెరగకపోవటంతో జరిగే అనర్థాన్నీ తేలికగానూ కొట్టేయలేం.

పెరుగుదల.. సంక్షేమ రాజ్యదృష్టితో ప్రభుత్వాలు వ్యవహరించటం.. కార్మిక సంఘాలు బలంగా ఉండటం.. అసమానతలు అదుపులో ఉండటం ఆ కాలంలో జరిగింది. ఆ తర్వాత సంక్షోభ కాలాలు మొదలయ్యాయి. 1973లో చమురు ఉత్పత్తి దేశాలు కూడబలుక్కుని ధరలు పెంచటం ప్రపంచాన్ని కుదిపివేసింది. 1970 నాటికి బ్యారల్ క్రూడ్ ఆయిల్ ధర 3.35 డాలర్లు ఉంటే 1980ల నాటికి అది 37.38 డాలర్లకు చేరుకుంది. అంతా సర్దుకున్నట్లే కొంతకాలం అనిపించటం, ఆ తర్వాత కొంత కాలానికే ఆర్థికంగా అతలాకుతలం అవ్వటం, తిరిగి మళ్లీ పుంజుకోవటం.. ఇలా ఆర్థిక వ్యవస్థ కొంతకాల వ్యవధిలో పైకీ కిందకీ అవ్వటం సాధారణమైపోయింది.



■ రాహుల్ కుమార్

ఈ సంక్షోభాలకు ప్రభుత్వాల అతి నియంత్రణే కారణమనీ సంక్షేమరాజ్యం కొత్త ఆవిష్కరణలకు అడ్డంకిగా నిలిచిందనీ సామాజిక భద్రతా పథకాలు భారంగా మారాయనీ ప్రభుత్వాల అతి వ్యయం భారంగా పరిణమించిందనీ స్వేచ్ఛా వాణిజ్యానికి ప్రభుత్వాల విధానాలు అవరోధాలయ్యాయనీ, పెట్టుబడుల స్వేచ్ఛా ప్రవాహాలకు అడ్డుగోడలు తయారయ్యాయనీ.. పలు వాదనలు బయలుదేరి సరళీకృత ఆర్థిక విధానాలే వీటికి విరుగుడనే భావన బాగా బలపడింది. మరోవైపు చైనాలోనూ రాజకీయ మార్పులు మొదలయ్యాయి. ప్రైవేటురంగానికి అక్కడ ప్రాధాన్యత పెరిగింది. 1980ల చివరినాటికి రష్యాతో సహా సోషలిస్టు ప్రభుత్వాలన్నీ కూలిపోయాయి. ప్రైవేటీకరణతో అంతా సర్దుకుని ఆర్థిక వృద్ధి పరుగులు తీస్తుందనే భావన ఎన్నాళ్లో నిలవలేదు. యుద్ధాలకూ అంతర్యుద్ధాలకూ అడ్డుకట్టపడలేదు. ఆర్థిక సంక్షోభాలూ సమసిపోలేదు. ఆగ్నేయాసియా దేశాల్లోనూ సంక్షోభం (1998) తలెత్తింది. ఇక 2007–08లో అమెరికాను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం ప్రపంచమంతా ప్రభావాన్ని చూపింది.

ఆర్థిక సంక్షోభాలు తీవ్రమైనప్పుడల్లా రాజకీయాల్లో విపరీత పోకడలు కనపడతాయి. శ్వేతజాతి ఆధిపత్య భావనలతో పాటు వలస జీవులపై వ్యతిరేకతలనూ ఎగదోయటం సంక్షోభాల కాలాల్లో చాలా సులువు. ట్రంప్ చేసిందీ అదే. గడిచిన వైభవాన్ని పునరుద్ధరిస్తామని పదే పదే చెప్పటం సంక్షోభాల కాలంలో ఎక్కువగా కనపడుతుంది. రెండోసారి అమెరికా అధ్యక్షుడైన వెంటనే 'మేక్ ఇన్ అమెరికా' తన ప్రాధాన్యతగా చెప్పటంతో పాటు ఇతర దేశాల్లో ఉత్పత్తిచేసి అమెరికాలో అమ్మాలనుకుంటున్న కంపెనీలు కనీవినీ ఎరగని పన్నులకు సిద్ధం కావాలనీ హెచ్చరించారు. ఇక అమెరికాలోనే తయారుచేసే ఉత్పత్తులకు కనీవినీ ఎరగనట్లుగా పన్నుల రాయితీలను ఇస్తామనీ ప్రకటించారు. పర్యావరణాన్ని పట్టించుకోకుండా చమురు, సహజవాయువు వెలికితీత కోసం 'డ్రిల్ బేబీ డ్రిల్' అనే నినాదానికీ ఊపు తెచ్చారు.

అర్భాటత్వం ఎంతగా ఉన్నా అమెరికాలో తయారీ రంగాన్ని పునరుద్ధరించటం అంత తేలికకాదు. ఒక్క అమెరికానే కాకుండా పాశ్చాత్యదేశాల్లోనూ అది సులువు కాదు. వలస సామ్రాజ్యాల కాలంలో, ఆదిమ తెగలను తుదముట్టించిన కాలంలో ఉన్న అనుకూలతలు పాశ్చాత్య దేశాలకు ఇప్పుడు లేవు. ఏకపక్షంగా ముడిసరుకులను కొల్లగొట్టటమూ ఇప్పుడు సాధ్యంకాదు. ఆసియా దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకుంటున్నాయి. సాంకేతిక పరిజ్ఞానంలోనూ దూసుకువెళుతున్నాయి. ఇక అమెరికాలో స్థూలదేశీయ ఉత్పత్తిలో (జీడీపీ)లో తయారీరంగం వాటా 1950లో 28శాతం ఉంటే 2023 నాటికి 10.2 శాతానికి పడిపోయింది. శ్రామికశక్తిలో 25.6 శాతం మంది తయారీ రంగంలో అప్పుడు ఉంటే 2015 నాటికి ఆ శాతం 7.8కు చేరుకుంది. పరిశ్రమలతో పాటు గనుల తవ్వకం, నిర్మాణ రంగాన్ని కలిపిచూస్తే శ్రామికశక్తి వాటా 1955లో 35.9 శాతం ఉండేది. 2015నాటికి అది 13.6 శాతానికి పడిపోయింది. సేవలరంగంలో ఉద్యోగుల వాటా ఆనాడు 40.7 శాతం ఉంటే 2015 నాటికి అది 69.5 శాతమైంది.

ఆసియా దేశాల్లోని 2023 నాటి పరిస్థితితో పోల్చి చూసినా తయారీ రంగంలో అమెరికా వెనుకబాటు స్పష్టంగా కనపడుతుంది. భారత్ మినహా (13శాతం) చైనా (30.1శాతం), దక్షిణ కొరియా (25.6శాతం) తైవాన్ (33శాతం), జపాన్ (20.6శాతం), వియత్నాం (24శాతం), థాయ్‌లాండ్ (25శాతం), మలేసియా (23శాతం), సింగపూర్ (20–25శాతం) లాంటి దేశాలు తయారీ రంగంలో బాగా ముందున్నాయి. వలసపాలన తర్వాత పారిశ్రామిక అభివృద్ధి కోసం ఆసియా దేశాలు వ్యూహాలు రచించుకుని ముందడుగులు వేస్తున్న తరుణంలోనే అమెరికా పెట్టుబడులు కూడా ఎక్కువ లాభాల కోసం చౌకగా లభ్యమయ్యే శ్రమ, ముడిసరుకులను అన్వేషిస్తూ అక్కడికే చేరుకోవటం మొదలుపెట్టాయి. లాభాపేక్షతో, ఆధిపత్య అవసరాలతో తయారీ రంగం అమెరికాలో క్షీణించింది. సోవియట్ రష్యా, చైనాలను దృష్టిలో ఉంచుకుని జపాన్‌ను రెండో ప్రపంచయుద్ధం తర్వాత బాగా ప్రోత్సహించింది. ఆ దేశ ఎగుమతులను అందుకే ఆపలేకపోయింది. చివరికి జపాన్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు అమెరికా మార్కెట్‌ను ముంచెత్తాయి. రాజకీయ, ఆర్థిక అవసరాలతో చైనాతో చెలిమి చేయాల్సి రావటంతో ఆ దేశ ఉత్పత్తులకు ద్వారాలు తెరవాల్సి వచ్చింది. ప్రస్తుతం చైనా (16.5శాతం), మెక్సికో (14.2 శాతం), కెనడా (13.6శాతం)లు అమెరికా దిగుమతుల అవసరాలు తీర్చటంలో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఈ దేశాలపై మొన్ననే పన్నుల యుద్ధానికి తెరతీశారు.

> ఆధునిక ప్రజాస్వామ్యంలో సంప్రదాయ ధర్మయుగ పునరుద్ధరణకు ప్రయత్నించటం చాలా అరుదు. దాని జోలికి వెళ్లకపోయినా చరిత్ర పుటల్లోకి ఎక్కిన ఘనమైన గతాల పునరుద్ధరణకు ప్రయత్నాలైతే జరుగుతున్నాయి. అమెరికాను మళ్లీ గొప్పదేశంగా మారుద్దామని డొనాల్డ్ ట్రంప్, ఆయన అనుచరులూ చేస్తున్న హడావుడిలో ఇదే కనపడుతుంది.

ఆసియాలో పెద్దదేశంగా ఉండి తయారీరంగంలో అమెరికాకు సవాల్ విసరలేకపోవటం భారత్ విశిష్టతగానే చెప్పుకోవాలి! మూడు దశాబ్దాలుగా బాగా దగ్గరై, అమెరికా కోరుకునే ఆర్థిక విధానాలు చేపట్టినప్పటికీ ట్రంప్ హెచ్చరికల వేడి భారత్‌కూ తగులుతోంది. అధిక పన్నులు తప్పవనే సంకేతాలను ఇవ్వటానికి ఏ అవకాశాన్నీ వదులుకోవటం లేదు. మోదీ 'మేక్ ఇన్ ఇండియా' నినాదం ఇచ్చిన 10 ఏళ్ల నాటితో పోల్చితే తయారీరంగం వాటా పెరగలేదు. అప్పటికంటే (16.7శాతం) తగ్గింది. ట్రంప్–మోదీ మధ్య నడవడిక, భావ సారూప్యత సంగతెలా ఉన్నా ఇప్పుడు ఆర్థిక అంశాలే నివురుగప్పిన నిప్పులా మారాయి. మన ఎగుమతుల్లో అమెరికాకే ఎక్కువున్న నేపథ్యంలో పన్నుల యుద్ధం మొదలైతే ఆ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే వినియోగాన్ని పెంచటానికి ఆదాయపన్ను భారాన్ని తాజా బడ్జెట్‌లో బాగానే తగ్గించారు. ఆ పన్ను కట్టే ప్రజల సంఖ్య చాలా స్వల్పంగా ఉన్న మనదేశంలో ఈ ఆర్థిక వ్యూహం ఎంత ఫలిస్తుందో ఇప్పుడే చెప్పలేం. వ్యవసాయ, సామాజిక రంగాలకు కేటాయింపులు తగినంతగా పెరగకపోవటంతో జరిగే అనర్థాన్నీ తేలికగానూ కొట్టేయలేం.

చరిత్రను పునరావృతం చేయలేం. చేస్తామనే ఆలోచనే భయపెడుతుంది. మన పాలకుల్లోనూ అదెక్కడో కనపడుతోంది! అది ప్రాప్తకాలజ్ఞతే కావచ్చు! సమయోచిత అడుగు వేయటానికి సూచికే కావచ్చు!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

కేటాయింపులకై లాబీయింగ్ తప్పదు!

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగింది. ఎనిమిది ప్రాజెక్టులకు గాను సుమారు రూ.1.63లక్షల కోట్ల నిధులు కావాలని కోరితే ఒక్క పైసా కూడ ఇవ్వలేదు. కొన్ని రాష్ట్రాలకు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు పెద్ద మొత్తంలో బడ్జెట్ కేటాయింపు జరిగింది. పక్కనే ఉన్న తెలంగాణను నిరాశ పరుస్తూ ఆంధ్రాకు బడ్జెట్ కేటాయింపులు ఎందుకు జరిగినాయో చెప్పవలసిన పనిలేదు. ఇకపోతే గుజరాత్ రాష్ట్రం ప్రధానమంత్రి స్వంత రాష్ట్రం కాబట్టి బడ్జెట్ కేటాయింపు జరిగింది. అలాగే– త్వరలోనే ఎన్నికలు జరగబోయే ఢిల్లీ, బిహారు రాష్ట్రాలకు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కొత్త ప్రాజెక్టులకు పెద్ద ఎత్తున కేటాయింపులు జరిగినట్లు కనబడుతుంది. రాష్ట్రాల అవసరాన్ని బట్టి కేంద్రం నిధుల కేటాయింపు జరపాలి. అంతే కాని ఇలా స్వంత పార్టీ అని లేదా ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కేటాయింపులు చేయడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం.

దక్షిణ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున పన్నులు కేంద్రానికి వెళుతున్నా తిరిగి వచ్చేది తక్కువే. కేవలం 40శాతం నిధులు మాత్రమే రాష్ట్రాలకు వస్తున్నాయి. ఈ విషయంపై లోపం ఎచ్చట ఉందని విశ్లేషణ జరగవలసి ఉంది. కొత్త ప్రాజెక్టుల అనుమతి కాని, నిధుల విడుదల వంటి వాటిపై ఢిల్లీలో పెద్ద ఎత్తున లాబీయింగ్ జరుగుతుంది. మన పార్లమెంటు సభ్యులు పార్టీలకు అతీతంగా సంబంధిత శాఖ మంత్రులను, అధికారులను కలసి ఆ ప్రయత్నం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తమిళులు తమలో తాము ఎంత కొట్లాడినా రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీలో మాత్రం అందరు పార్లమెంట్ సభ్యులూ ఏకమై కావలసిన ప్రాజెక్టులు, నిధులు తెచ్చుకుంటారు. గత మూడు నాలుగు శతాబ్దాల నుంచి మన రాష్ట్ర పార్లమెంటు సభ్యులు మాత్రం అటువంటి చొరవ చూపించడం లేదు. అస్తమానం వారి కాంట్రాక్టులు, పర్మిట్లు, పదవుల కొరకు పాకులాడడంతోనే సరిపోయింది. అప్పుడప్పుడు ముఖ్యమంత్రి గారు సంబంధిత మంత్రిగారిని కలసి శాలువా కప్పి వినతిపత్రం ఇచ్చినంత మాత్రాన పనులు కావు.



> కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని ధర్నాలు, నిరసనలు తెలపడం, 'పార్లమెంట్‌లో కేంద్రాన్ని ఎండగడతాం' అని నినదించటాలతో లాభం లేదు. రాష్ట్రంలోని మొత్తం పదిహేడుమంది పార్లమెంట్ సభ్యులు కేంద్రమంత్రి అధ్యక్షతన సంబంధిత మంత్రులను, అధికారులను కలసి నిధుల కోసం లాబీయింగ్ చేయాలి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మొదట్లో కేంద్రంతో ముఖ్యంగా ప్రధానమంత్రితో మంచి సంబంధాలు ఉండేవి. తరువాత రకరకాల కారణాలతో ఆ సంబంధం చెడింది. పరిస్థితి ఎంతవరకు వచ్చిందంటే దేశ ప్రధానమంత్రి రాష్ట్రానికి వస్తే ముఖ్యమంత్రి ఆయనకు స్వాగతం పలుకడం కాని, కలవడం కాని చేయలేదు. ఎన్నికలు జరిగి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత మొదట్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రిని 'పెద్దన్న' అని సంబోధించడం చూసి సంబంధాలు బాగానే ఉన్నాయి అనుకున్నాం. కాని ఇటీవల ఎటువంటి కారణమూ లేకుండా రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రిని వ్యక్తిగతంగా అవమానిస్తూ మహమ్మద్ గజనీతో పోల్చారు. ఇటువంటి మాటలు రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగిస్తాయి.

ప్రస్తుత బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని ధర్నాలు, నిరసనలు తెలపడం, 'పార్లమెంట్‌లో కేంద్రాన్ని ఎండగడతాం' అని నినదించటాలతో లాభం లేదు. రాష్ట్రంలోని మొత్తం పదిహేడుమంది పార్లమెంట్ సభ్యులు కేంద్రమంత్రి అధ్యక్షతన సంబంధిత మంత్రులను, అధికారులను కలసి నిధుల కోసం లాబీయింగ్ చేయాలి. ఇప్పటి కేంద్ర బడ్జెట్‌లో చాలా స్కీములలో బడ్జెట్‌లో నిధులు కేటాయించినా రాష్ట్రాలకు వాటిని కేటాయించలేదు. వీటిలో ముఖ్యంగా అర్బన్ ఛాలెంజ్ ఫండ్, మూలధనం వ్యయం, సంస్కరణలకు ప్రోత్సాహం వంటి వాటిని ఇంకా రాష్ట్రాలకు కేటాయించలేదు. మన పార్లమెంట్ సభ్యులు ఇటువంటి స్కీములో రాష్ట్రానికి నిధుల విడుదల కోసం ప్రయత్నం చేయాలి. ఈ మధ్య రిజర్వ్ బ్యాంకు తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా బలంగా ఉందని, పన్నుల వసూళ్ళలో పెంపుదల కనిపిస్తుందని ప్రకటన విడుదల చేసింది. అటువంటి పరిస్థితుల్లో దుబారా ఖర్చులు, అలివి కాని హామీలు, గ్యారంటీలు, ఉచితాలు తగ్గించి, పేదలకు అవసరమైన, నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి వంటి వాటిపై దృష్టి పెడితే బాగుంటుంది.

తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు రావడం లేదు అన్న దాంట్లో వాస్తవముంది. అయితే రాష్ట్రం గ్రామ పంచాయితీలకు ఎన్ని నిధులు విడుదల చేస్తున్నారు అన్న దానిపై ఆత్మవిమర్శ చేసుకోవాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జీహెచ్ఎంసీకి నిధులు విడుదల కాక హైదరాబాదులో పౌరసేవలకు ఇబ్బంది కలుగుతుంది. గత సంవత్సరంలో గ్రామ పంచాయితీలకు రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులు రాలేదు. ఎన్నికలు జరపకపోవడంతో కేంద్ర నిధులు కూడ ఆగిపోయాయి. చేసిన పనులకు డబ్బులు రాక మాజీ పంచాయితీ సర్పంచ్‌లు నానా ఇబ్బందులు పడుతున్నారు.

ఏదైనా ప్రాజెక్టు కేంద్ర ప్రాజెక్టుగా ప్రకటించాలంటే దానికి కొన్ని నిబంధనలు ఉన్నాయి. ఆ ప్రాజెక్టుపై ఎటువంటి కోర్టు కేసులు ఉండకూడదు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో కేసులు ఉన్నాయి. ముఖ్యంగా పంపులు, ఇతర సామాగ్రి కొనడంలో అవినీతి జరిగిందని కేసు కూడా ఉంది. ఇటువంటి పరిస్థితిలో పాలమూరు ప్రాజెక్టు కేంద్ర ప్రాజెక్టుగా తీసుకోరు. ఇకపోతే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రాజెక్టులు కేంద్ర అనుమతులు లేక అలాగే డి.పి.ఆర్. లేకపోవడంతో చాలా ఆలస్యమైనాయి.

కేంద్రం బడ్జెట్‌లో రాష్ట్రానికి న్యాయం జరుగలేదు. రాష్ట్రం 1.6 లక్షల కోట్ల నిధులు కావాలని అడిగినప్పుడు కొద్దిలో కొద్ది అయినా ఇచ్చినా బాగుండేది. ఇప్పటికైనా కేంద్రం వద్ద రాష్ట్రాలకు పంచని నిధులలో మనకు అధిక భాగం కావాలని మన పార్లమెంటు సభ్యులు రాజకీయాలకు అతీతంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

• యం. పద్మనాభరెడ్డి
ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

బీసీల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం

ఎంత జనాభాకు అంత వాటా.. ఇదే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మాట. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇదే స్ఫూర్తితో పని చేస్తోంది. రాష్ట్ర ఆవిర్భావం నుంచి పదేళ్ల పాటు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాలను, ముఖ్యంగా బీసీలను అణగదొక్కింది. స్థానిక ఎన్నికల్లో 34 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గించి వారికి తీరని అన్యాయం చేసింది. బీసీలకు వారి జనాభా ప్రకారం వాటా దక్కాల్సిందేనని నాడు కాంగ్రెస్ చేసిన పోరాటాన్ని అప్పటి సీఎం కేసీఆర్ పట్టించుకోలేదు. అయితే.. ఇప్పుడు అదే పార్టీ ఎమ్మెల్సీ, కేసీఆర్ కూతురు కవిత బీసీ రిజర్వేషన్ల కోసం రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహించడం బీసీ సమాజం గమనిస్తోంది. అధికారంలో ఉన్న సమయంలో బీసీలకు తీరని అన్యాయం చేసిన బీఆర్ఎస్, ఇదే అంశంపై పోరాటం చేస్తామనడం అవకాశవాద రాజకీయానికి అతిపెద్ద ఉదాహరణ. బీసీలకు రిజర్వేషన్ పెంచాల్సి వస్తుందనే కుట్రతోనే బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేను అధికారికంగా బయటపెట్టలేదు. ఆ సర్వేలో బీసీలు 50 శాతానికి పైగా ఉన్నట్లు తేలినా.. కావాలని వారికి అన్యాయం చేసింది నాటి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం.

బీసీల అభివృద్ధికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల సమయంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించింది. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ హామీ అమలుకు ఇప్పటికే బీసీ కమిషన్‌ను కాంగ్రెస్ ఏర్పాటు చేసింది. కుల గణన ఓ ఉద్యమంలా నిర్వహించింది. ఇందుకోసం ప్రత్యేకంగా కేబినెట్ సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేసింది. మా ప్రభుత్వం చేపట్టిన చర్యలు బీసీ రిజర్వేషన్ల పెంపుపై పార్టీ చిత్తశుద్ధిని తెలియజేస్తున్నాయి. తెలంగాణలో 50 రోజుల పాటు నిర్వహించిన కులగణన సర్వే దేశాన్నే ఆకట్టుకుంది. 1,03,889 మంది అధికారులతో ప్రభుత్వం అత్యంత పకడ్బందీగా నిర్వహించిన కులగణన సర్వే దేశానికే రోల్ మోడల్‌లా నిలిచింది. రాష్ట్రంలో 96.9 శాతం కుటుంబాల వివరాలను అధికారులు సర్వే చేశారు. మొత్తం 3.54 కోట్ల మంది సర్వేలో పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్లను భారీగా పెంచడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కులగణన నివేదిక, బీసీ డెడికేటెడ్ కమిషన్ సిఫారసుల ఆధారంగా 42 శాతానికి మించి రిజర్వేషన్లను ఇవ్వడమే మా ప్రభుత్వ సంకల్పం. ఇందుకు ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా అత్యంత పకడ్బందీగా ముందుకు వెళ్తున్నాం. బీసీల కోసం కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం చేపట్టిన ఈ యజ్ఞానికి అన్ని పార్టీలు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించాలి. రేపు జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రతీ పార్టీ, ప్రతీ సభ్యుడు బీసీ రిజర్వేషన్ల పెంపునకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను బలపరచాలి. బీసీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికి సహకరించాలి.

> కులగణన నివేదిక, బీసీ డెడికేటెడ్ కమిషన్ సిఫారసుల ఆధారంగా 42 శాతానికి మించి రిజర్వేషన్లను ఇవ్వడమే మా ప్రభుత్వ సంకల్పం. ఇందుకు ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా అత్యంత పకడ్బందీగా ముందుకు వెళ్తున్నాం. బీసీల కోసం కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం చేపట్టిన ఈ యజ్ఞానికి అన్ని పార్టీలు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించాలి.



అయితే.. ప్రభుత్వం అత్యంత పకడ్బందీగా చేపట్టిన కుల గణనలో కొందరు ప్రధాన రాజకీయ పార్టీల పెద్దలు పాల్గొనకపోవడం బాధాకరం. ప్రధానంగా బీసీల అభ్యున్నతి కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో వారు పాలుపంచుకోకపోవడం ఆయా వర్గాలపై వారికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. ముఖ్యంగా గత పదేళ్ల పాటు అధికారంలో ఉండి.. నేడు బీసీల గురించి మాట్లాడుతున్న కల్వకుంట్ల ఫ్యామిలీలో కవిత తప్ప, ఎవరూ వివరాలు ఇవ్వలేదు. దీనిపై వారు సమాధానం చెప్పాలి. కొందరు కావాలని వివరాలు ఇవ్వలేదు. ఇప్పటికైనా బీసీల కోసం అన్ని పార్టీలు ముందుకు రావాలి. కుల గణనపై అన్ని రాజకీయ పార్టీలు తమ విధానం ఏమిటో సమాజానికి స్పష్టం చేయాలి. బలహీన వర్గాల కోసం రేపు అసెంబ్లీలో అన్ని పార్టీలు తమ వాదన వినిపించాలి. రేపటి కేబినెట్ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటాం.

కుల గణన చేస్తామని మాట ఇచ్చాం, నిలబెట్టుకున్నాం. బీసీ సోదరులంతా ఉత్సవాలు జరుపుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. కేసీఆర్ నేడు అసెంబ్లీకి రావాలి. కులగణన రిపోర్టు, బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో బీఆర్ఎస్ పార్టీ విధానం ఏమిటో చెప్పాలి. అంతే కానీ ఆయన అసెంబ్లీకి రాకుండా ఎవరితోనో మాట్లాడిస్తే బీసీలకు అన్యాయం చేసిన వ్యక్తిలా చరిత్రలో మిగిలిపోతారు. బీసీలకు న్యాయం జరగాలని కోరుకుంటే కేసీఆర్ అసెంబ్లీకి వస్తారు. ప్రభుత్వం తరఫున బీసీలకు ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతున్నా. గత ప్రభుత్వాల మాదిరిగా కమిటీ రిపోర్టును బీరువాలో, ఫ్రిజ్‌లో పెట్టం. ఆ రిపోర్ట్‌ను అమలు చేస్తాం.. దేశంలో ఆదర్శంగా నిలుస్తాం. ఎవరెన్ని కుట్రలు చేసినా.. ఎంతలా అడ్డుపడ్డా.. బీసీలకు అవకాశాలు.. ఆత్మగౌరవం పెంచడమే.. మా కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం.

గత ప్రభుత్వ హయంలో అరకొరగా ఉన్న డైట్ ఛార్జీలతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఇది గుర్తించిన మా ప్రభుత్వం భారీగా మెస్ ఛార్జీలను పెంచింది. 3 నుంచి 7వ తరగతి వరకు హాస్టల్ విద్యార్థులకు గతంలో రూ.950గా ఉన్న డైట్ ఛార్జీలను రూ.1,330కి పెంచాం. 8 నుంచి 10వ తరగతి వరకు హాస్టల్ విద్యార్థులకు రూ. 1100నుంచి రూ.1,540కి పెంచాం. ఇంటర్ నుంచి పీజీ వరకు హాస్టల్ విద్యార్థులకు రూ.1,500 నుంచి రూ.2,100కి పెంచాం. 3 నుంచి 7వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.55గా ఉన్న కాస్మోటిక్ ఛార్జీలను రూ.175కు పెంచాం. అలాగే 8 నుంచి 10వ తరగతి వరకు రూ.75నుంచి రూ.275కి పెంచాం. ఈ నిర్ణయంతో ప్రభుత్వ హాస్టళ్లలో విద్యను అభ్యసిస్తున్న 7.5 లక్షల మందికి పైగా విద్యార్థులకు లబ్ధి చేకూరింది. పేద, వెనుకబడిన వర్గాల వారిపై మా ప్రభుత్వ కమిట్‌మెంట్‌కు ఇది నిదర్శనం.

రాష్ట్రంలో తొలిదశ కింద 28 యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు మంజూరు చేశాం. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వీటి నిర్మాణాలు సాగుతున్నాయి. ఈ విద్యాలయాల్లో బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఇతర వర్గాల్లోని పేద విద్యార్థులకు కుల మత భేదాలకు అతీతంగా విద్యను అందించనున్నాం. రాష్ట్రంలోని వంద నియోజకవర్గాల్లో సుమారు రూ.12వేల కోట్లతో వీటిని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది మా ప్రభుత్వం. క్యాంప్ ఆఫీసులకు, కలెక్టరేట్లకు కోట్లు ఖర్చు చేసిన కేసీఆర్ ప్రభుత్వం.. గురుకులాల నిర్మాణాలను పట్టించుకోని విషయం తెలిసిందే. కానీ మా ప్రభుత్వం సకల వసతులతో ఇంటిగ్రేటెడ్ గురుకులాల నిర్మాణాలను చేపట్టింది. ఇవి దేశానికే రోల్ మోడల్‌లా మారనున్నాయి.


మహాలక్ష్మి స్కీంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళల సంఖ్య భారీగా పెరిగింది. మహాలక్ష్మి స్కీం వెనుకబడిన, పేద వర్గాల మహిళలకు వరంలా మారింది. 116.13 కోట్ల మంది మహిళా ప్రయాణికులు గతేడాది డిసెంబరు 4 నాటికి ఉచితంగా ప్రయాణించారు. దీంతో వారికి రూ.3,913.81 కోట్ల రవాణా ఖర్చులు మిగిలాయి. ఈ స్కీమ్ ప్రారంభం కాక ముందు సగటున 45 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారు.. ప్రస్తుతం ఆ సంఖ్య 58 లక్షలకు చేరింది. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆ డిక్లరేషన్‌లో పేర్కొన్న ప్రతీ హామీని నెరవేర్చే దిశగా మా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.



■ పొన్నం ప్రభాకర్
బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి

ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నేపథ్యంగా అవతరించిన టీఆర్ఎస్ నాడు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు బలమైన కేడర్.. సంస్థాగత కమిటీలతో ఎంతో బలంగా ఉండేది. రాష్ట్ర ఆవిర్భావం జరిగి 2014లో అధికారం చేపట్టాక కూడా తిరుగులేని శక్తిని ప్రదర్శించింది. కానీ 2016లో జిల్లాల విభజన తర్వాత జిల్లా కార్యవర్గాలు, అనుబంధ కమిటీల నియామకాలను మరిచిపోయింది. చివరకు 2022లో జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించి.. నాటి ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీ చైర్మన్లకే అధ్యక్ష పదవులను అప్పగించి.. కార్యవర్గాలను పూర్తిచేయలేదు. ఇక పార్టీ మండల, అనుబంధ సంఘాలదీ అదే పరిస్థితి. గత అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయానికి ఇది కూడా ఓ కారణమేనన్న చర్చ జరిగింది. ఇక ఆ ఎన్నికలతో పాటు పార్లమెంట్ పోరులో ఎదురైన ఫలితాలతో అటు నేతలు.. ఇటు కేడర్ డీలా పడింది. ఆ పరిస్థితుల నుంచి బయటపడేలా దిశా నిర్దేశం చేసేలా అధినాయకత్వం ఎలాంటి కార్యాచరణ తీసుకోకపోవడం, సరైన రీతిలో గళం విప్పకుండా మౌనంగా ఉండటం పట్ల కేడర్ అసంతృప్తిగా ఉంది. ప్రస్తుతం టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు రావడం.. త్వరలోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీలో ఆవహించిన 'నిశ్శబ్దం'తో తమ భవిష్యత్ ఏంటన్న ఆందోళన ద్వితీయ శ్రేణి నాయకుల్లో కనిపిస్తోంది. ఎన్నాళ్లిలా మౌనంగా ఉండాలన్న ఆవేదన వారి నుంచి వ్యక్తమవుతోంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



ఎన్నాళ్లీ మౌనం?

సంస్థాగత ఎన్నికలపై దృష్టిపెట్టని బీఆర్ఎస్

- అధిష్ఠానం తీరుపై తీవ్ర అసంతృప్తిలో కేడర్
- 2022లో జిల్లా అధ్యక్షుల నియామకం
- ఆ తర్వాత కార్యవర్గం ఊసు మరిచిన వైనం
- మూడేళ్లైనా కానరాని కొత్త కమిటీలు
- అనుబంధ సంఘాలనూ పట్టించుకోని నాయకత్వం
- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తరువాత ముఖం చాటేసిన కీలక నేతలు
- 'లోక్‌సభ'కు ముందు వరంగల్ జిల్లా అధ్యక్ష పదవికి, పార్టీకి అరూరి గుడ్‌బై
- పది నెలలైనా కొత్త అధ్యక్షుడిని నియమించలేని దీనస్థితి
- టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల వేళా కనిపించని హడావిడి
- స్థానిక సమరం సమీపిస్తున్నా ఈ పరిస్థితేంటని శ్రేణుల ఆవేదన
- భవిష్యత్‌పై కార్యకర్తల్లో సన్నగిల్లుతున్న ఆశలు

పదేళ్ల అధికారంలో ఉన్న 'గులాబీ' దళంలో.. గత అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం తర్వాత జోష్ కనుమరుగైంది. సంస్థాగత ఎన్నికలు సమీపిస్తున్నా ఆ ఉత్సాహం మాత్రం కానరావడం లేదు. మూడేళ్ల క్రితం కేవలం జిల్లా అధ్యక్షులను మాత్రమే నియమించిన అధిష్ఠానం జిల్లా కార్యవర్గాలు, అనుబంధ కమిటీల నియామకాలను మరిచిపోయింది. 2014కు ముందు ఉద్యమ నేపథ్యంలో సంస్థాగతంగా ఎంతో బలంగా ఉన్న బీఆర్ఎస్ను అధికారంలోకి వచ్చిన తరువాత మరింత బలోపేతం చేసే దిశగా అధినాయకత్వం దృష్టి పెట్టలేదన్న విమర్శలున్నాయి.ఇక గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి.. అధికారం కోల్పోవడం.. లోక్‌సభ ఎన్నికల్లోనూ అనుకూలించని పరిస్థితుల్లో కేడర్ మరింత నిరుత్సాహానికి గురైందన్న అభిప్రాయాలున్నాయి. ఇందుకు పార్లమెంట్ ఎన్నికలకు ముందు అంటే పది నెలల క్రితం ఆ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాజీనామా చేయగా.. ఇప్పటికీ కొత్త అధ్యక్షుడిని నియమించలేని దీనస్థితిలో ఉందనే ఆవేదన క్యాడర్‌లో ఉంది. ప్రస్తుత టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల వేళ కూడా 'గులాబీ' దళం మౌనంగా ఉంటోంది. ఇక వచ్చే నెలలో స్థానిక ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండటంతో జిల్లా, మండల కమిటీలు లేకుండా ఎలా ముందుకు వెళ్లాలన్న ఆందోళనలో నాయకులున్నారు. ఇదిలానే కొనసాగితే తమ రాజకీయ భవిష్యత్ ఎలా ఉంటోందనని కార్యకర్తలు దిగులు చెందుతున్నారు. రాజకీయంగా ఎదగాలన్న ఆశతో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్న వారు గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

మూడేళ్లుగా కార్యవర్గాలు లేకుండానే..

తెలంగాణ ఉద్యమంలో బీఆర్ఎస్‌కు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలున్నాయి. వాటితో పాటు

మిగతా 7వ పేజీలో...

వరుస ఓటములతో కేడర్‌లో నిర్వేదం..


2023 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమితో కేడర్ డీలా పడింది. ఆ తరువాత 2024 మే 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాల్లో ఓటమి గులాబీ శ్రేణులను మరింత కుంగదీశాయి. వీటికి తోడు జూలై జరిగిన వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి ఓటమితో బీఆర్ఎస్ సైలెంట్ అయిపోయింది. వరుసగా మూడు ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సత్తా చాటడంలో బీఆర్ఎస్ వెనుకబడటంతో కేడర్‌లో నిరుత్సాహం పెరిగింది. దీంతో ఏడాది కాలంగా గులాబీ శ్రేణులు అడపదడపా కార్యక్రమాలకే పరిమితమవుతున్నారు. పార్టీ పిలుపునిచ్చే ఆందోళన కార్యక్రమాల్లో కూడా కొంతమంది నేతలు అంటీముట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత పార్లమెంట్ ఎన్నికల ముందు కీలక నేతలు కారు దిగారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ బీజేపీలోకి వెళ్లగా, వరంగల్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న దయాకర్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మేయర్ గుండు సుధారాణితో పాటు కీలకమైన నేతలు కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యారు. దీంతో క్యాడర్‌లో నిరుత్సాహం నిండింది. వరంగల్ జిల్లా అధ్యక్ష పదవికి గత ఏప్రిల్ నెలలో అరూరి రమేష్ రాజీనామా చేస్తే పది నెలలు కావస్తున్నా కొత్త అధ్యక్షుడిని నియమించలేని దీనస్థితిలో అధిష్ఠానం ఉన్నదనే నిర్వేదంలో కార్యకర్తలున్నారు. వరంగల్‌తూర్పు మాజీ ఎమ్మెల్యే నరేందర్, జడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్నతో పాటు మరికొందరు నేతలు జిల్లా అధ్యక్ష పదవిని ఆశించినప్పటికీ, అధిష్ఠానం ఖాళీగానే ఉంచిందికానీ, ఎవరికి అప్పగించ లేదని సొంతపార్టీలోనే విమర్శలు వినిపిస్తున్నాయి.



క్రమంగా.. విస్తరిస్తోంది!

7

గతేడాది ఉమ్మడి జిల్లాలో నమోదైన క్యాన్సర్ కేసులు	
మహబూబాబాద్	1,278
హనుమకొండ	598
వరంగల్	552
జనగామ	344
జయశంకర్ భూపాలపల్లి	162
ములుగు	59



- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న క్యాన్సర్ కేసులు
- పట్టణ ప్రాంతాల్లో తీవ్రత ఎక్కువ
- కేసుల్లో మహబూబాబాద్ జిల్లా టాప్
- ములుగు జిల్లాలో తక్కువ..
- మహిళల్లో ఎక్కువ రొమ్ము, సర్వైకల్ క్యాన్సర్
- తొలిదశలో గుర్తిస్తే నయం చేయవచ్చంటున్న వైద్యులు

నేడు ప్రపంచ క్యాన్సర్ దినం

పెరుగుతున్న కాలుష్యం.. మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలితో కొందరు.. వ్యసనాలకు అలవాటు పడి ఇంకొందరు క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఈ క్రమంలోనే ఉమ్మడి వరంగల్ జిల్లాలో క్యాన్సర్ క్రమంగా విస్తరిస్తున్నట్టు ఇటీవల వైద్యఆరోగ్యశాఖ, స్వచ్ఛంద సంస్థలు నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. గతేడాది మహబూబాబాద్ జిల్లాలో అత్యధిక కేసులు నమోదవగా.. అత్యల్పంగా ములుగు జిల్లాలో నమోదయ్యాయని అధికారిక సమాచారం. చాపకింద నీరులా విస్తరిస్తున్న క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి.. ఆందోళన చెందకుండా.. తగిన చికిత్స చేయించుకుంటే ప్రాణాపాయం తప్పుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

- వరంగల్ మెడికల్, ఆంధ్రజ్యోతి

హనుమకొండ 'కమలం' సారథిగా సంతోష్‌రెడ్డి

- జిల్లా అధ్యక్షులను నియమించిన అధిష్ఠానం
- వరంగల్ పగ్గాలు మళ్లీ రవికుమార్‌కే..
- పలు సమీకరణల నేపథ్యంలో గంటా వైపే మొగ్గు



కొలను సంతోష్‌రెడ్డి   గంటా రవికుమార్

రాంనగర్ / మిల్స్‌కాలనీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ జిల్లాల అధ్యక్షులను సోమవారం ప్రకటించింది. హనుమకొండ బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ప్రస్తుతం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న కొలను సంతోష్‌రెడ్డిని నియమించింది. అలాగే వరంగల్‌జిల్లా బీజేపీ అధ్యక్ష పీఠం మళ్లీ గంటా రవికుమార్‌కే దక్కింది. హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా ప్రస్తుతం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న కొలను సంతోష్‌రెడ్డిని రాష్ట్ర ఎన్నికల అధికారి యేండల లక్ష్మీనారాయణ నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి పెద్దోళ్ల గంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, జిల్లా అధ్యక్ష పదవికి పార్టీలోని చాలా మంది సీనియర్లు పోటీపడగా అధ్యక్షపదవి సంతోష్‌రెడ్డిని వరించింది. గత కొంత కాలం నుంచి సంతోష్‌రెడ్డి కాబోయే అధ్యక్షుడని తాజా మాజీ అధ్యక్షురాలు మీడియాతో పాటు పార్టీలోని నాయకులకు, కార్యకర్తలకు పరిచయం చేసి ముందునుంచే తాను అనుకున్నట్లు సంతోష్‌రెడ్డిని అధ్యక్ష సీటులో కూర్చోబెట్టి తన పంథాను నెగ్గించుకున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

నిన్నటి వరకు అధ్యక్షురాలుగా పనిచేసిన రావు పద్మ నుంచి సోమవారం హంటర్‌రోడ్డులోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో కొలను సంతోష్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రావు పద్మ సంతోష్‌రెడ్డి నుదట బొట్టుపెట్టి సీటులో కూర్చోబెట్టింది. అనంతరం సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతంతో పాటు ప్రజలకు సేవ చేయడానికి తన శక్తినంతా ఉపయోగించి పని చేస్తానన్నారు. నాయకులకు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. తన నియామకానికి కృషి చేసిన ప్రధాన మంత్రి మోదీ, జాతీయ అధ్యక్షుడు నడ్డా, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, మాజీ అధ్యక్షురాలు రావు పద్మకు కృతజ్ఞతలు తెలిపారు.

గంటా రవివైపే అధిష్ఠానం మొగ్గు..

వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్ష పీఠం మళ్లీ గంటా రవికుమారేకే దక్కబోతోందన్న విషయంపై 'ఆంధ్రజ్యోతి' ఇటీవల కథనాన్ని ప్రచురించింది. ఈ జిల్లా అధ్యక్షుడి ఎంపికలో అధిష్ఠానం మొదటి నుంచి స్పష్టంగానే ఉంది. జిల్లాలోని 33 మంది నాయకుల అభిప్రాయాలను సేకరించి చివరగా ముగ్గురి పేర్లను పరిగణలోకి తీసుకుంది. అన్ని సమీకరణలను బేరీజు వేసిన తర్వాత గంటా వైపే మొగ్గు చూపి.. జిల్లా అధ్యక్ష పీఠాన్ని కట్టబెట్టింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి చంద్రశేఖరజీకి గంటా రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు సోమవారం పెద్ద ఎత్తున తరలివచ్చారు. తూర్పు నియోజకవర్గ నాయకులు ముత్తినేని శ్రీనివాస్, ముద్దసాని కృష్ణ, కేశవ్, బైరి శ్యాం, కృష్ణ తదితరులు గంటాకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా సంతోష్‌రెడ్డిని పలువురు నాయకులు, కార్యకర్తలు కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభకాంక్షలు తెలియజేశారు. సన్మానించిన వారిలో రాష్ట్ర నాయకుడు పగడాల కాళీప్రసాద్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ నమఃస్తుభ్యం

- చదువుల తల్లికి అక్షర నీరాజనం
- ఘనంగా వసంత పంచమి



పంచమి అలంకరణలో జ్ఞాన సరస్వతి దేవి

వరంగల్ కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మాఘశుద్ధ పంచమి వసంత పంచమిగా చదువుల తల్లి సరస్వతిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజ, ఆరాధనలు, అభిషేకాలు కన్నుల పండువగా నిర్వహించారు. సోమవారం బ్రాహ్మీ ముహూర్తంలో భద్రకాళి రోడ్డులోని శ్రీజ్ఞాన సరస్వతి దేవి అమ్మవారికి ప్రత్యేక పూజ, అభిషేకం, అలంకరణలు, హారతులు నిర్వహించారు. ఈ రోజున చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తే చదువుల తల్లి నాలుకపై నిలుస్తుందని, విద్యావంతులవుతారని ప్రజల విశ్వాసం. అందుకే యేటా వసంత పంచమి రోజున సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తారు. జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి ఆలయంలో పెద్ద సంఖ్యలో భక్తులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. భద్రకాళి అమ్మవారి దేవాలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఎంజీఎం సెంటర్‌లోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో శిశిర నవరాత్రుల పూజలతోపాటు అక్షరాభ్యాసం నిర్వహించారు.



భద్రకాళి అమ్మవారి దేవాలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న అర్చకులు

కేంద్రం తీరుపై కాంగ్రెస్ ధర్నా

- బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని మండిపాటు
- బీజేపీ ఎంపీలు, మంత్రులు స్పందించాలని డిమాండ్



హనుమకొండ అశోకా జంక్షన్‌లో ధర్నా చేపట్టిన కాంగ్రెస్ నాయకులు

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీరును నిరసిస్తూ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ నేతలు ధర్నా చేపట్టారు. 2025-26 వార్షిక బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. సోమవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ నాయకులు అశోకా జంక్షన్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, టీపీసీసీ నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాలు, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచనల మేరకు ధర్నా చేపట్టినట్లు వెల్లడించారు. కేంద్ర వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించకపోవడంపై తెలంగాణ బీజేపీ నేతలు ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా రాష్ట్రానికి చెందిన 8మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు తక్షణమే స్పందించాలన్నారు. రాష్ట్రం నుంచి అత్యధిక సంఖ్యలో పన్నుల రూపంలో కేంద్రానికి ఆదాయం సమకూరుతుందన్నారు. కానీ కేంద్రం మాత్రం రాష్ట్రానికి నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. తక్షణమే నిధుల కేటాయింపు జరిపి ఆ మేరకు ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో కాంగ్రెస్ నాయకులు అశోక్‌రెడ్డి, మహ్మద్ అంకూస్, బంక సంపత్, బంక సరళా, నాయిని లక్ష్మారెడ్డి, రాజ్‌కుమార్, పులి రాజు, కూర వెంకట్, మార్క విజయ్, సారంగం, నసీం జహాన్, నలుబోల సతీశ్, చీకటి ఆనంద్, డాక్టర్ శ్రవణ్, నల్ల సత్యనారాయణ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అలాగే వరంగల్ పోచమ్మమైదాన్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని అన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- బల్దియాలో ప్రజావాణి కార్యక్రమం
- 64 దరఖాస్తులు స్వీకరించిన అధికారులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్, అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ ప్రజావాణిలో ప్రజలు అందించే ఫిర్యాదులపై అధికారులు సత్వర పరిష్కారం చూపాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయ కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర ప్రజలకు అందించాల్సిన సౌకర్యాలపై అధికారులు చొరవ చూపాలన్నారు. ప్రజలకు కల్పించాల్సిన మౌళిక సదుపాయాల విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 64 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌కు హాజరై సమస్యలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్, పన్నుల అధి కారి వైజ రామకృష్ణతో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఇంజనీరింగ్ - 12, హెల్త్, శానిటేషన్ - 9, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 8, టౌన్‌ప్లానింగ్ - 30, తాగునీటి సరఫరా - 4, హార్టికల్చర్- 1 ఇలా మొత్తం 64 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు.

ప్రజల ఫిర్యాదులు ఇలా..

హనుమకొండ కొత్తబస్ స్టేషన్ సమీపంలో స్మార్ట్‌సిటీ పనులు జరుగుతుడడంతో తన డబ్బాను రోడ్డు పక్క నుంచి తొలగించారు. కానీ పనులు పూర్తి అయినా రోడ్డుపై తీసిన గుంతను పూడ్చక పోవడంతో చాలా ఇబ్బందిగా ఉందని, కుటుంబం ఆర్థికంగా నష్టపోయిందని మనుమకొండ బస్‌స్టేషన్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ అనే వ్యక్తి కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు.

- హనుమకొండ కేయూ రెండో గేటు ఎదుట మైసూర్ బేకరి నుంచి పడేసిన వ్యర్థాల వల్ల విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోంది. ఈ కారణంగా అటుగా వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉందని అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు విన్నవించారు.
- వరంగల్ రంగశాయిపేట యాదవనగర్‌లో చాలా కాలంగా డ్రెయినేజీ, సీసీ రోడ్లు నిర్మాణం చేయక పోవడం వల్ల అటుగా ప్రయాణం ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ కారణంగా ఇండ్లలో నుంచి వచ్చే మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు తగిన చొరవ చూపాలని కోరారు.
- వరంగల్ కాశిబుగ్గ ప్రాంతంలోని ఇంటి నెంబర్ 11-22-444 ప్రాంతంలో కొందరు వ్యక్తులు మునిసిపల్ అధికారులు నిర్మించిన బ్రిడ్జిపై అక్రమ కట్టడాలు నిర్మించారు. దీంతో అటుగా ప్రయాణం నిలిచి పోయింది. ఇదేమిటని అడిగిన వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అధికారులు స్పందించాలని ఆ ప్రాంత వాసులు కోరారు.

పీఎంశ్రీ పథకాన్ని అమలు చేయాలి

» వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పీఎంశ్రీ పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని, ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు మెరుగైన విద్య అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల ప్రిన్సిపాళ్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రేజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో చదివే విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నతమైన స్థానాల్లో ఉండేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలయ్యే ఈ పథకానికి సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహణకు జిల్లాకు ఇప్పటివరకు వరకు రూ.1 కోటి 22 లక్షల 38 వేలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, సైన్స్ లేబరేటరీలు, లైబ్రరీల ఏర్పాటు, ఫిజికల్ ఫిట్‌నెస్ పరికరాలు, గ్రీన్ స్కూల్, వెజ్ కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలల్లో అవసరమైన మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. విద్యార్థుల స్టడీటూర్ కోసం వెంటనే ప్రణాళికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈవో జ్ఞానేశ్వర్, సెక్టోరల్ అధికారి వేణుగోపాల్, ప్రిన్సిపాళ్లు, డీఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేయూ ఓఎస్డీగా మల్లారెడ్డి బాధ్యతల స్వీకరణ



నియామక పత్రాన్ని అందజేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూక్యాంపస్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఓఎస్డీగా ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం వర్సిటీ పరిపాలన భవనంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మల్లారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా పదవీ బాధ్యతలు చేపట్టారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రంలు మల్లారెడ్డికి నియామక పత్రాన్ని అందచేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఓఎస్డీగా సోమవారం బాధ్యతలు చేపట్టిన మల్లారెడ్డిని ప్రొఫెసర్లు, ఉద్యోగ సంఘాల నేతలు, స్కాలర్లు, విద్యార్థులు కలిసి పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో కేయూ ఉద్యోగ సంఘాల నేతలు ఎల్.యాదగిరి, వల్లాల తిరుపతి, సతీశ్‌బాబు, నాల్గవ తరగతి ఉద్యోగులసంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎమ్డీ.షకూర్, పోలేపాక కోర్నేల్ ఉన్నారు.

గురుకుల పాఠశాలల్లో అధికారుల విచారణ



నెక్కొండలోని కస్తూర్బా పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

నెక్కొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ప్రభుత్వ హాస్టళ్లలో అధికారులు సోమవారం తనిఖీ నిర్వహించారు. ఈ నెల 2న కలెక్టర్ సత్యశారద మండలంలోని పలు హాస్టళ్లలో తనిఖీలు చేశారు. హాస్టల్, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్ రికార్డులను సమగ్రంగా తనిఖీలు నిర్వహించలేదు. సమగ్ర విచారణ జరిపి నివేదికలను ఇవ్వాలంటూ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ జరిపి నివేదికలను అందిస్తామని అధికారులు తెలిపారు. జిల్లా వ్యవసాయ, మండల ప్రత్యేకాధికారి అనురాధ, తనిఖీల్లో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో రత్నమాల, డీఈవో కార్యాలయం అధికారులు పాల్గొన్నారు.



వరంగల్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యశారద



హనుమకొండ ప్రజావాణిలో బాధితురాలి సమస్య వింటున్న కలెక్టర్ ప్రావీణ్య

ప్రజావాణి వినతులు పరిష్కరించాలి

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజావాణికి అధిక సంఖ్యలో భూ సంబంధిత దరఖాస్తులు వస్తున్నాయని, వాటిని సాధ్యమైనంత వరకు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మొత్తం 103 వినతులు అందగా సంబంధిత అధికారులకు వాటిని పంపించారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్‌కు 16, భూ సంబంధిత సమస్యలపై 34, డీఎంహెచ్‌ఓకు 3, జిల్లా విద్యా శాఖకు 3, జిల్లా సంక్షేమ శాఖకు 2, వ్యవసాయశాఖకు 2, జడ్పీ సీఈవోకు 3, గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్‌కు 7, ఉపాధి శాఖకు 3, పౌర సరఫరాల శాఖకు 3, డీఆర్‌డీఏకు 4, లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు 1, ఇరిగేషన్ శాఖకు 1, డీపీవోకు 2, పోలీసు శాఖకు 8, ఎస్సీ కార్పొరేషన్‌కు 2, ఆర్టీసీకి 1 వినతులు అందినట్లు తెలిపారు.కార్యక్రమంలో డీఆర్వో విజయలక్ష్మి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, హౌసింగ్ పీడీ గణపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్లు

బాధితులకు న్యాయం చేయాలి

హనుమకొండ కలెక్టరేట్(ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలనుంచి ప్రజావాణికి వచ్చిన బాధితుల నుంచి అర్జీలుస్వీకరించి వాటిని పరిశీలించి సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 71 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులను కలెక్టర్ ప్రావీణ్య ఓపికగా ప్రతీ ఒక్కరి సమస్య వింటూ సంబంధిత అధికారిని పిలిచి దరఖాస్తులు పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. బాధితుల సమస్యలు త్వరగా పరిశీలిస్తే ప్రజావాణికిపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందన్నారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులలో ఎక్కువగా జీడబ్ల్యూఎంసీకి సంబంధించినవి ఉన్నాయి. కార్యక్రమంలో డీఆర్‌ఓ వై.విగణేష్, పరకాల ఆర్డీఓ నారాయణ, డీఆర్‌డీఓ మేన శ్రీను, జడ్పీ సీఈఓ విద్యాలత, జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎన్‌సీసీ జవాన్ల శిక్షణ ముగింపు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేయూ కంప్యూటర్ సైన్స్ విభాగంలో రెండు వారాలుగా ఎన్‌సీసీ జవాన్లకు నిర్వహిస్తున్న ఎక్సల్ పవర్ ఐటీ ట్రైనింగ్ ముగింపు సమావేశం మంగళవారం తమ విభాగంలో నిర్వహిస్తామని కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బి.రమ తెలిపారు. ముగింపు సమావేశంలో ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నార్ సెంథిల్ రామదురై హాజరు కానున్నట్లు వెల్లడించారు.

మాజీ ఎమ్మెల్యే అరూరికి మాతృవియోగం

- పలువురు నేతల నివాళి
- నేడు ఉప్పుగల్లులో అంత్యక్రియలు





వెంకటమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న కడియం, రాఘవరెడ్డి

జఫర్‌గడ్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకులు అరూరి రమేశ్‌కు మాతృ వియోగం కలిగింది. స్వగ్రామమైన జఫర్‌గడ్ మండలం ఉప్పుగల్లులో నివసిస్తున్న ఆరూరి వెంకటమ్మ(92) సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. రమేశ్ చిన్నకుమారుడు, తల్లి మరణవార్త తెలియగానే ఆయన హనుమకొండ నుంచి హుటాహుటిన ఉప్పుగల్లుకు చేరుకున్నారు. మంగళవారం వెంకటమ్మ అంత్యక్రియలు స్వగ్రామంలో నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. కాగా, వెంకటమ్మ భౌతికకాయాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండరాజయ్య, మార్తినేని ధర్మారావు, బీజేపీజిల్లా అధ్యక్షుడు అరుట్ల దశమంతరెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మాజీ మేయర్ టి.రాజేశ్వర్‌రావు, కుడా మాజీ చైర్మన్ యాదవరెడ్డి, మాచర్ల కుమారస్వామి, మంచాల ఎల్లయ్య, అయోధ్య, కనకయ్య, నాగేశ్‌లు సందర్శించి నివాళులర్పించారు.

కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా నరసింహారావు



కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా (డ్యాక్యుమెంటేషన్) డాక్టర్ మండల నరసింహారావు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వుల జారీ చేయగా వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అందచేశారు. డాక్టర్ నరసింహారావు ప్రస్తుతం వర్సిటీ పబ్లికేషన్ సెల్ డైరెక్టర్‌గా, దూరవిద్య కేంద్రం అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారు.

జనవరి 31న డిప్యూటీ రిజిస్ట్రార్ ఓ.సారయ్య ఉద్యోగ విరమణ చేయడంతో ఖాళీ ఏర్పడింది. 1992లో వర్సిటీ సీసీటీగా ఉద్యోగంలోకి వచ్చిన నరసింహారావు సోషియాలజీ విభాగంలో డాక్టరేట్ సాధించారు. గతంలో నరసింహారావు వీసీ పేషీ, అడ్మినిస్ట్రేషన్ విభాగం, పీజీ, ఆర్ట్స్, ఇంజనీరింగ్ కాలేజీ, పరీక్షల విభాగం, హాస్టల్ ఆఫీస్‌లో పనిచేశారు. ఈ సందర్భంగా నరసింహారావును పలువురు బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి

- బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలి
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



జనగామలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కాంగ్రెస్ నాయకులు

జనగామరూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం సవితి తల్లి ప్రేమ చూపుతోందని, తెలంగాణ ద్రోహి మోదీ అని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరోపించారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని సోమవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి కొమ్మూరి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పూలమాల వేసి నివాళులర్పించి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. శ్రీహరి మాట్లాడుతూ సోనియాగాంధీ దయతో రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందని, అప్పుడు కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటే వచ్చేది కాదన్నారు. బీజేపీ ప్రభుత్వం 10 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి తెలంగాణ నిధులు కేటాయించకుండా అవమానిస్తోందన్నారు. కనీసం విభజన హామీలను కూడా అమలు చేయలేదన్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు వేల కోట్లతో బడ్జెట్‌లో పెద్దపీట వేసిందని మండిపడ్డారు. తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్రం ఎందుకు జాతీయ హోదా ఇవ్వడంలేదని ప్రశ్నించారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఎన్నికలు వస్తాయో కేవలం ఆ రాష్ట్రానికి మాత్రమే నిధులు కేటాయిస్తూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందన్నారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులను తిట్టడానికే కేంద్ర మంత్రులు అయ్యారని, మోదీ చెప్పినట్టు గంగిరెద్దుల తల ఊపడం తప్ప తెలంగాణ రాష్ట్రానికి ఒరగబెట్టింది ఏమిలేదన్నారు. బీజేపీ 8 మంది ఎంపీలు చవటలు, దద్దమ్మలు అని వారికి తెలంగాణ మీద ప్రేమ ఉంటే నిధులు తీసుకురావాలని అన్నారు. లేదంటే మూకుమ్మడిగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

- రూ.50 లక్షల మేర ఆస్తినష్టం
- ఇప్పగూడెంలో ప్రమాదం





మంటల్లో కాలిపోయిన బియ్యం, సామగ్రి, కాలిపోయిన డబ్బుల సంచిని చూపుతూ రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి మూడు కుటుంబాలు నివాసం ఉంటున్న ఉమ్మడి ఇల్లు మంటల్లో కాలిపోయింది. సోమవారం జనగామ జిల్లా ఇప్పగూడెంలో ప్రమాదం చోటు చేసుకుంది. బాధిత కుటుంబాల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన తొడెంగుల మల్లయ్య-సరోజన, తొడెంగుల క్రిష్ణమూర్తి-భాగ్యలక్ష్మి, తొడెంగుల ఐలయ్య-రజిత మూడు కుటుంబాలు మూడు పోర్షన్లుగా ఉన్నటువంటి ఉమ్మడి ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఇండ్లకు తాళాలు వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. ఉదయం 11గంటల సమయంలో మధ్య పోర్షన్‌లో ఉంటున్న కృష్ణమూర్తి ఇంట్లోని గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగాయి. ఐలయ్య ఇంట్లో ఉన్న ముగ్గురు సోదరుల తల్లి కొమురమ్మ పొగలు గమనించి కేకలు వేసింది. స్థానికులు ఇంట్లోకి వెళ్లి వృద్ధురాలని బయటకు తీసుకొచ్చారు. కాసేపటికే మంటలు తీవ్రమై, సిలిండర్‌పేలి భారీ శబ్దం వచ్చింది. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేయడంతో సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. మూడు ఇండ్లలోని ఫ్రిజ్‌లు, టీవీలు, బట్టలు, సామగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి.

తొడెంగుల మల్లయ్య మాట్లాడుతూ ఇంట్లో బ్యాగులో నిల్వ ఉంచిన రూ.3లక్షల నగదు, విలువైన వస్తువులు, భూమి పత్రాలు, 20క్వింటాళ్ల బియ్యం మంటల్లో కాలిబూడిదయ్యాయని మొత్తం రూ.15లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని భోరున విలపించాడు. తొడెంగుల క్రిష్ణమూర్తి మాట్లాడుతూ తమకు సంబంధించిన ఎకరం భూమిని ఇటీవలనే విక్రయించగా వచ్చిన రూ.10లక్షల నగదు, విలువైన భూమి పత్రాలు, రూ10లక్షల విలువైన అప్పు పత్రాలు, ఇటీవల కొనుగోలు చేసిన ఫ్రిజ్ టీవీ మంటల్లో కాలిపోయాయని రూ.25లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని విలపిస్తూ తెలిపారు.

మరో బాధితుడు తొడెంగుల ఐలయ్య-రజిత దంపతులు మాట్లాడుతూ రూ.5లక్షల విలువ చేసే తమ కుమారుడికి సంబంధించిన టెంట్ హౌస్ సామగ్రి, డెకరేషన్ వస్తువులు మంటల్లో కాలిపోయాయని మొత్తం రూ.10లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని భోరుమన్నాడు. ఇల్లు, ఇంట్లోని బట్టలు, వస్తువులు, నగదు, బియ్యం, వంట గిన్నెలు సర్వం కోల్పోయామని కేవలం కట్టుబట్టలే మిగిలాయని చెపుతూ రోదించడాన్ని చూసి స్థానికులు కంటతడి పెట్టారు.

ప్రభుత్వం ఆదుకోవాలి: మాజీ ఎమ్మెల్యే రాజయ్య

సంఘటన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య మంటల్లో కాలిపోయిన ఇంటిని సందర్శించి పరిశీలించారు. బాధిత కుటుంబాలను ఓదార్చి రూ.5వేల నగదు అందించారు. ఆర్డీవోతో మాట్లాడి బాధిత కుటుంబ సభ్యులకు ఆశ్రయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మారపాక రవి, చట్ల యాకయ్యగౌడ్, మైపాషా, దామెర రాజు పాల్గొన్నారు.

గుండెపోటుతో అడ్తి వ్యాపారి మృతి

- టీ తాగుతూనే కుప్పకూలిన సదానందం
- కరోనా సమయంలో భార్య, కొడుకు మరణం
- దిక్కులేని వారైన కోడలు, మనువడు, మనవరాలు



సదానందం (ఫైల్)

వరంగల్ వ్యవసాయం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : వరంగల్(ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్లో అడ్తి వ్యాపారి కడారి సదానందం(60) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. మార్కెట్ వర్గాల కథనం ప్రకారం... వరంగల్ కరీమాబాద్ గుండు బావుల ప్రాంతానికి చెందిన సదానందం యథావిధిగా మార్కెట్‌కు వచ్చి ఐదు బస్తాల విర్చి కాంటా పెట్టించాడు. అప్పటికే శరీరమంతా తిప్పినట్లు అనిపిస్తోందని సమీపంలో ఉన్న హోటల్ వద్ద టీ తాగుతున్నాడు. సగం తాగగానే ఉన్నట్టుండి కింద పడిపోయాడు. అక్కడున్న వారు సీపీఆర్ చేసినప్పటికీ ప్రాణాలు దక్కలేదు. కేవలం రెండు నిమిషాల్లోనే ఈ విషాదం జరగడంతో అక్కడున్న వారంతా షాక్‌కు గురయ్యారు.

గతంలో భార్య, కుమారుడి మృతి

కడారి సదానందం భార్య స్వరూప, కుమారుడు సందీప్ గతంలో కరోనా సమయంలో మృతి చెందారు. కుమారుడికి భార్య మౌనిక, కుమారుడు, కుమార్తె ఉన్నారు. జరిగిన దానికి చింతిస్తూనే సదానందం కోడలు, పిల్లలను పోషిస్తూ వస్తున్నాడు. ఇంతలోనే ఈ దుర్ఘటన జరగడం బంధుమిత్రుల హృదయాలను కలిచివేసింది.

జీర్ణించుకోలేకపోతున్న వ్యాపారులు, కార్మికులు

సదానందం మృతిని తోటి వ్యాపారులు, కార్మికులు జీర్ణించుకోలేకపోతున్నారు. అందరితో కలిసి టీ తాగుతూ గుండెపోటుతో కుప్పకూలడం క్షణాల్లో జరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అగ్రవర్ణ పేదల రిజర్వేషన్ ఎత్తివేస్తే ఊరుకోం

» రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి



ఐక్యత చాటుతున్న నేతలు

జూలైవాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : అగ్రవర్ణ పేదల రిజర్వేషన్ ఎత్తివేస్తే ఊరుకునేది లేదని రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలో పోస్టల్‌కాలనీలోనిరెడ్డి సంఘం కార్యాలయంలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపు జైపాల్‌రెడ్డి, కమ్మ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగవరపు రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ అగ్రవర్ణ పేదల రిజర్వేషన్‌ను రద్దు చేయాలని అనడం రాజ్యాంగాన్ని అవమానపర్చడమేనని అన్నారు. ఓసీలలోని నిరుపేదలకు లబ్ధి చేకూర్చేలా ప్రధాన నరేంద్రమోదీ 2019లో అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. దీంతో ఎంతో మందికి లాభం జరిగిందని, సాక్షాత్తు సుప్రీంకోర్టు కూడా రిజర్వేషన్ కల్పించాలని చెప్పినట్లు గుర్తు చేశారు. ఇటీవల హనుమకొండలో జరిగిన కుల సంఘాల సమావేశం లో ఓసీ ప్రజలను పరుష పదజాలంతో దూషించడం వారి అవగాహన రాహిత్యానికి నిదర్శనమని జైపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో వెలమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి పాపారావు, బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ సత్యమోహన్, అర్జుల కిషన్‌రెడ్డి, ఆళ్ల ప్రవీణ్ కుమార్, చాడా జైహింద్‌రెడ్డి, నల్ల సంజీవరెడ్డి, వెంకటరెడ్డి, గంగిడి ప్రభాకర్‌రెడ్డి, ఈసం రమణారెడ్డి, గొంది జగన్‌మోహన్‌రెడ్డి, కట్కూరి హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డుల అందజేత

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఐదుగురు ట్రాన్స్‌జెండర్లకు సోమవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ట్రాన్స్ జెండర్ గుర్తింపు కార్డులు అందేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, మహిళా, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉరివేసుకొని యువతి ఆత్మహత్య

హసన్‌పర్తి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న యువతి మనస్తాపం చెంది ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మండలంలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మడిపల్లికి చెందిన తొడుగు సమ్మయ్యకు ముగ్గురు సంతానం కాగా ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. చిన్న కూతురు స్రవంతి (24) ఇంటి వద్దే ఉంటోంది. సోమవారం కడుపునొప్పి భరించలేక మనస్తాపం చెందిన స్రవంతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు తండ్రి సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	-	-
పల్లికాయ (సూక)	6000	4600
పల్లికాయ (పచ్చిది)	5500	3100
కందులు	6582	5540
పెసళ్లు	6059	5133
పత్తి	7000	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13900	9000
తేజ మిర్చి (కొత్తది)	-	-
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	14800	11500
ఎల్లో మిర్చి	16500	13500
యూఎస్341	14000	11500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000


- వరంగల్ వ్యవసాయం

క్రమంగా.. విస్తరిస్తోంది!

ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న క్యాన్సర్ కేసులు

- పట్టణ ప్రాంతాల్లో తీవ్రత ఎక్కువ
- కేసుల్లో మహబూబాబాద్ జిల్లా టాప్
- ములుగు జిల్లాలో తక్కువ
- మహిళల్లో ఎక్కువ రొమ్ము, సర్వైకల్ క్యాన్సర్
- తొలిదశలో గుర్తిస్తే వ్యాధిని నయం చేయవచ్చు
- నేడు ప్రపంచ క్యాన్సర్ దినం

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో క్యాన్సర్ క్రమంగా విస్తరిస్తోంది. రాష్ట్రంలో క్యాన్సర్ ప్రభావం ఎక్కువగా ఉన్నట్టు ఇటీవల నిర్వహించిన ఓ సర్వేలో వెల్లడైంది. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి మహబూబాబాద్ జిల్లాలో క్యాన్సర్ తీవ్ర త అధికంగా ఉండగా.. ఆ తర్వాత స్థానాల్లో వరంగల్, హనుమకొండ జిల్లాలు ఉన్నాయి. ములుగులో అతిత క్కువ కేసులు నమోదయ్యాయి. ము ఖ్యంగా రొమ్ము క్యాన్సర్ కేసులు ఎక్కు వగా నమోదవుతున్నట్టు వైద్యవర్గాలు చెబుతున్నాయి. చాపకింద నీరులా విస్తరిస్తున్న ఈ తరహా క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి తగిన చికిత్స చేయించుకుంటే ప్రాణాపాయం తప్పుతుందంటున్నారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో క్యాన్సర్ ప్రభావంపై కథనం.



పట్టణాల్లోనే ఎక్కువ

హనుమకొండ, వరంగల్ జిల్లాలోనే ఎక్కువ మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లోని ప్రజలే ఎక్కువగా వ్యాధి బారిన పడుతున్నారు. ఆహారపు అలవాట్లు, జీవన శైలి ఇందుకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో మహిళలే ఎక్కువగా వ్యాధి బారిన పడుతున్నట్టు ఇటీవల జరిపిన సర్వేలో తేలింది. వీరిలో ఎక్కువ మంది రొమ్ము క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్‌కు గురవుతున్నారు. ఆరోగ్యవంతమైన జీవన శైలిని పాటించకపోవడం, ధూమ పానం, మద్యపానంకు అలవాటు పడడం తదితర కారణాల వల్ల పురుషుల్లో క్యాన్సర్ ఎక్కువగా వస్తోంది.

క్యాన్సర్ కేసులు ఇలా...

హనుమకొండ జిల్లాలో గత సంవత్సరం మొత్తం 598 కేసులు నమోదయ్యాయి. ఇందులో నోటి క్యాన్సర్ 83, రొమ్ము క్యాన్సర్ 215, సెర్వికల్ క్యాన్సర్ 111, ఇతర రకాల క్యాన్సర్ కేసులు 189. కాగా, వరంగల్ జిల్లాలో మొత్తం 552 కేసులు నమోదు కాగా ఇందులో నోటి క్యాన్సర్ 235, రొమ్ము క్యాన్సర్ 192, సెర్వికల్ క్యాన్సర్ 125. ములుగు జిల్లాలో మొత్తం 59 కేసులు నమోదు కాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొత్తం 162 మంది వ్యాధి బారిన పడ్డారు. వీరిలో రొమ్ము క్యాన్సర్ 38, నోటి క్యాన్సర్ 26, సర్వికల్ క్యాన్సర్ 48, ఊపిరితిత్తుల క్యాన్సర్ 32 కేసులు రికార్డయ్యాయి.

జనగామ జిల్లాలో మొత్తం 344 కేసులు నమోదయ్యాయి. ఇందులో సర్వైకల్ క్యాన్సర్ 97, రొమ్ము క్యాన్సర్ 79, నోటి క్యాన్సర్ 31, ఇతర కేసులు 137 రికార్డయ్యాయి. కాగా, మహబూబాబాద్ జిల్లాలో మొ త్తం 1,278 కేసులు నమోదయ్యాయి. వీటిలో ఎక్కువ రొమ్ము క్యాన్సర్ కేసులే ఎక్కువగా 383 ఉన్నాయి. సర్వైకల్ కేన్సర్ 252 కేసులు రికార్డు అయ్యాయి. యుటరస్ 80, బ్లడ్ 20, గొంతు 62, నాలుక 32, మిగతావి ఇతరత్రా కేసులు.

ప్రాథమిక దశలో గుర్తించాలి

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించినట్లయితే దానిని విజయవంతంగా నివారించవచ్చు. క్యాన్సర్ నాలుగు దశల్లో ఉంటుంది. అవగాహన లేకపోవడం వల్ల రోగులు చివరి దశలో చికిత్స కోసం వచ్చి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. క్యాన్సర్ ఎక్కువగా 40 ఏళ్ల పైబడిన మహిళలకు వచ్చే అవకాశం ఉంది. 60-70 ఏళ్ల మధ్య వయస్కులైనవారికీ వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మహిళల్లో రొమ్ము క్యాన్సర్ అత్యంత ప్రమాదకరమని డాక్టర్ చెబుతున్నారు. 30 ఏళ్ల పైబడిన మహిళలందరూ ఏడాదికోసారి పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. క్యాన్సర్ పరీక్షలు ఖరీదైనవనే అపోహ ఉంది.

ఆకలి మందగించినా, బరువు తగ్గినా క్యాన్సర్ వచ్చినట్టు అనుమానించాలి.

పొగాకు వల్ల..

పొగతాగడం వల్ల కూడా క్యాన్సర్ వస్తుంది. బీడీ, సిగరెట్, గుట్కా, పాన్ మసాల వంటివి అధికంగా వినియోగిస్తే అవి క్యాన్సర్‌కు దారి తీసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా బీడీ, సిగరెట్‌లోని టార్‌లో ఉండే ఆర్గానిక్ కాంపౌండ్లు రేడియం అస్బెస్టాస్. నికోటిన్, క్రోమియం వంటి పదార్థాలు వ్యాధికి కారణమవుతాయి. పొగ తాగే అలవాటు ఉన్నవారు దానిని వెంటనే మానినేయడం ఉత్తమం.

హెచ్చరికలు

క్యాన్సర్‌కు సంబంధించి కొన్ని హెచ్చరిక సంకేతాలను గుర్తించాలి. అవి అసాధారణ రక్తస్రావం, హఠాత్తుగా బరువు తగ్గడం, తీరని అలసట, నిరంత నొప్పి, చర్మం మార్పులు, గొంతులో అసాధారణ మార్పులు, గడ్డల ఉనికి, క్యాన్సర్‌కు సంబంధించి కొన్ని లక్షణాలను గమనించాలి. అవి- ఊపిరి తిత్తుల క్యాన్సర్‌కు సంబంధించి నిరంతర దగ్గు, శ్వాస ఆడకపోవడం, చాతినొప్పి, గురక వంటివి.

గొంతు క్యాన్సర్‌కు సంబంధించి గొంతునొప్పి, ఊపిరి అడక పోవడం, నిరంతర గొంతు నొప్పి, లేదా దగ్గు. రొమ్ము కేన్సర్‌కు విషయంలో రొమ్ము నొప్పి, అసౌకర్యంగా ఉండడం, వాపు బ్లడ్ క్యాన్సర్ విషయంలో దురద వంటివి క్యాన్సర్ లక్షణాలుగా అనుమానించాలి.

క్యాన్సర్ ఎలా వస్తుందంటే..

క్యాన్సర్ అనేది కణాలు అనియంత్రితంగా విభజించబడి చుట్టుపక్కల కణజాలాలలోకి వ్యాపించినప్పుడు.. డీఎన్ఏలో జరిగే మార్పుల వల్ల క్యాన్సర్ వస్తుంది. చాలా వరకు క్యాన్సర్ కలిగించే డీఎన్ఏ మార్పులు జన్యువులు డీఎన్ఏ విభాగాలలో సంభవిస్తాయి. ఈ మార్పులను జన్యు మార్పులు అని కూడా అంటారు.

క్యాన్సర్ బాధితులు ఆందోళన చెందవద్దు

క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు మానసికంగా ఆందోళనకు గురికాకుండా ప్రశాంతమైన జీవితాన్ని సాగించాలి. తొలి దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. మహిళలు బ్రెస్ట్ స్క్రీనింగ్, సర్వైకల్ క్యాన్సర్ గుర్తింపు కోసం పాప్‌స్మియర్ పరీక్షలను విధిగా చేయించుకోవాలి. 9 సంవత్సరాల నుంచి వివాహం జరిగేంత వరకు మహిళలు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకుంటే చాలా మంచిది. ఈ మధ్య కాలంలో పెద్ద పేగు క్యాన్సర్ చాలా మందిలో కనిపిస్తోంది. మాంసాహారం, ఆల్కహాల్, అధిక కొలెస్ట్రాల్ ఉన్న ఆహార పదార్థాలకు దూరంగా ఉండడం ఉత్తమం. ఒక వేళ కేన్సర్ సోకిన ఆందోళన చెందవద్దు. అనేక నూతన ఔషధాలు, ఆధునిక సాంకేతికత కలిగిన రేడియేషన్ చికిత్స, రోబోటిక్ సర్జరీ లాంటివి అందుబాటులో ఉన్నాయి. మొదటి, రెండవ దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను పూర్తిగా జయించవచ్చు.

డాక్టర్ అలేటి రవీందర్ రెడ్డి, సర్జికల్ అంకాలజిస్టు, హనుమకొండ



నేడు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం

» 2 వేల మందితో వాక్‌థాన్ » హాజరు కానున్న సినీ నటి గౌతమి

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రతిమ ఫౌండేషన్ ఫౌండర్ మెంబర్ డాక్టర్ హరిణి బోయినపల్లి ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 2 వేల మందితో వాకథాన్‌ను పబ్లిక్ గార్డెన్ నుంచి కళాక్షేత్రం వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా సినీ నటి గౌతమి హాజరవుతారని, ఈ అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎన్నాళ్లీ మౌనం ?

(5వ పేజీ తరువాయి)

అనుబంధ సంఘాలకు కూడా కమిటీలను నియమించింది. 2016వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా తక్కళ్లపల్లి రవీందర్‌రావుతో పాటు కార్యవర్గం కూడా ఉంది. అయితే 2016 అక్టోబరు 11న కొత్త జిల్లాల ఏర్పాటు తరువాత కొత్తజిల్లాలకు కమిటీలను ఏర్పాటు చేయటంలో అధిష్ఠానం తాత్సారం చేసి.. రేపుమాపు అంటు కాలం వెళ్లదీసింది. చివరకు ఐదున్నరేళ్ల తర్వాత 2022 జనవరి 26న కొత్త కమిటీలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీ ఛైర్మన్లకే జిల్లా అధ్యక్ష పదవులను అప్పగించారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా అరూరి రమేష్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా వినయ్‌భాస్కర్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలిగా గండ్ర జ్యోతి, ములుగు జిల్లా అధ్యక్షుడిగా కుసుమ జగదీష్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలిగా మాలోతు కవిత, జనగామ జిల్లా అధ్యక్షుడిగా పాగాల సంపత్‌రెడ్డిలను నియమించారు. కానీ కేవలం జిల్లా అధ్యక్షులను మాత్రమే నియమించిన అధిష్ఠానం.. ప్రధానకార్యదర్శులతో పాటు ఉపాధ్యక్షులు, సంయుక్తకార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, తదితర పదవులను ఎవరికీ కట్టబెట్టలేదు. వీటితో పాటు బీఆర్ఎస్ అనుబంధ సంఘాల కమిటీలు, మండల కమిటీలను కూడా ఏర్పాటు చేయలేదు. అనుబంధ సంఘాల కార్యవర్గాలు లేకపోవటంతో ఆ విభాగంలో పార్టీ కేడర్‌ను సమన్వయం చేసే అవకాశాలు లేకుండా పోయాయన్న విమర్శలున్నాయి. మహిళ, రైతు, యువత, విద్యార్థి తదితర కమిటీలు లేకపోవటంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి భారీగా నష్టం వాటిల్లిందనే చర్చ నేటికీ జరుగుతోంది. కేవలం జిల్లా అధ్యక్షులనే నియమించటంతో వారు ఏక్ నిరంజన్‌లుగా వ్యవహరించారని, మూడేళ్లుగా కార్యవర్గాలు లేకపోవటంతో కార్యవర్గ సమావేశాలు జరిగింది కూడా లేదన్న అపవాదు ఉంది. అయితే ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలకు పార్టీ కార్యాలయాలను మాత్రం నిర్మించగా.. కార్యవర్గం లేకుండా కార్యాలయాలను నిర్మించడంతో అవి ఎందుకు పనికి రాకుండా పోయాయనే విమర్శలున్నాయి. పైగా రాష్ట్ర కార్యవర్గం కూడా 2017 నుంచి లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు రాష్ట్ర స్థాయిలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఏడేళ్లుగా రాష్ట్ర కమిటీ లేకపోవడంతో ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీలో పదవులు లేకుండా మాజీలుగానే చెప్పుకోవల్సిన పరిస్థితి ఏర్పడిందనే చర్చ జరుగుతోంది.

స్థానిక పోరులో గెలిచేదెట్లా?

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయటంపై అధిష్ఠానం దృష్టి పెట్టకపోవడంతో కార్యకర్తల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నెల 27వతేదీన టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికతో పాటు వచ్చే మార్చి నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. గ్రామ స్థాయిలో అభ్యర్థులను నిలిపి ప్రచారం చేయటంతో పాటు గెలుపు కోసం వ్యూహరచన చేసే పార్టీ జిల్లా, మండల, గ్రామ అధ్యక్షులు లేకపోవటంపై కేడర్‌లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీలు సంస్థాగతంగా పార్టీలను బలోపేతం చేసేందుకు కసరత్తు చేస్తున్నాయి. బీజేపీ వార్డు, బూతు, గ్రామ, మండల, జిల్లా కమిటీలను కూడా ప్రకటించింది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ జిల్లా కమిటీలను ప్రకటించేందుకు కసరత్తు చేస్తుండగా.. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌లో మాత్రం ఆ సందడి లేకపోవటంపై కార్యకర్తలను ఆందోళనకు గురిచేస్తోంది. ఉద్యమ సమయంలోనే కాకుండా.. పదేళ్లుగా పార్టీ బలోపేతంతో పాటు గెలుపులో కీలకంగా వ్యవహరించిన కార్యకర్తలు ప్రస్తుతం అధినాయకత్వం వ్యవహరిస్తున్న తీరుతో అసంతృప్తిగా ఉన్నారు. ఒక్క జనగామ సెగ్మెంట్‌లో మినహా బీఆర్ఎస్‌కు ఎమ్మెల్యేలు లేరు. మిగతా అన్ని చోట్ల మాజీలే దిక్కయ్యారు. ఎన్నికల్లో క్యాడర్‌కు ఎన్నికల ఖర్చులను కూడా సర్దుబాటు చేసే నేతలు లేకపోవటంపై ద్వితీయ శ్రేణి నేతలు దిగులు చెందుతున్నారు. అధికార కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయటంతో పాటు ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి వెళ్లేలా ప్రణాళికలు ఉండాలని కార్యకర్తలు కోరుతున్నారు. లేదంటే స్థానిక సంస్థల్లో నిలిచేదెలా? గెలిచేదెలా? అని గులాబీ క్యాడర్ అధిష్ఠానాన్ని ప్రశ్నిస్తోంది. ఇప్పటికైనా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేలా దృష్టి పెట్టాలని కార్యకర్తలు కోరుతున్నారు.

టీచర్ ఎమ్మెల్సీ నోటిఫికేషన్ విడుదల

తొలి రోజు ఒక నామినేషన్ దాఖలు



ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సోమవారం ప్రారంభమైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగుతుందని, 8, 9 తేదీల్లో ప్రభుత్వ సెలవులు కావడంతో నామినేషన్లు స్వీకరించబోమని, 11న నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. 27న ఉద యం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని, మార్చి 3న తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుందని వివరించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు తాను రిటర్నింగ్ అధికారిగా, నల్లగొండ అదనపు కలెక్టర్ (రెవిన్యూ) జె.శ్రీనివాస్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నట్లు వరంగల్- ఖమ్మం- నల్లగొండ నియోజకవర్గ పరిధిలో మొత్తం 200 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ముసాయిదా జాబితా ప్రకారం 24, 905 మంది ఓటర్లున్నారని వెల్లడించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు నల్లగొండ సమీపంలోని అర్జాల బావి వద్ద ఉన్న మార్కెటింగ్ గోదాంలో ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ విషయమై ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. అనంతరం ఆమె కలెక్టరేట్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) మీడియా సెంటర్‌ను ప్రారంభించారు.

తొలిరోజు ఒక నామినేషన్ దాఖలు

నల్లగొండ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాయలయంలో నామినేషనల్ల స్వీకరణ ప్రారంభం కాగా.. తొలిరోజు సోమవారం సూర్యాపేటకు చెందిన లింగిడి వెంకటేశ్వర్లు ప్రజావాణి పార్టీ తరఫున నామినేషన్ వేశారు.



ఆశల పంట అందిన వేళ..

ఆరుగాలం శ్రమించి తమ చేతికందిన పంటను చూసుకుని ఆ గిరిజన రైతు దంపతులు మురిసిపోతున్నారు. మార్కెట్లో ఆశించిన మేర ధర లేకపోవడంతో.. అనుకూలమైన ధర వచ్చే వరకు దాచిపెట్టేందుకు వీలుగా ఇదిగో ఇలా పంటను ఆరబెడుతున్నారు గీసుగొండ మండలం మచ్చాపురానికి చెందిన వృద్ధ దంపతులు. తమకున్న రెండున్నర ఎకరాల్లో పండిన పంటను చూసుకుంటూ.. మరికొద్ది రోజులకైనా ఆశించిన ధర రాకపోతుందా అనుకుంటూ మిరపకాయలను ఎండబెడుతున్న దృశ్యాలివి.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

నమో సూర్యదేవా

• నేడు రథసప్తమి • వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

వరంగల్ కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రథ సప్తమి అంటే సూర్య భగవానుడి జన్మదినం. సప్తమి రోజున స్వామి వారు రథంపై పయనిస్తారని భావిస్తూ ఆ రోజును రథ సప్తమిగా నిర్వహించుకుంటారు. రథ సప్తమి రోజున యోగోపాసన చేసే వారు పూజలు, వైష్ణవ ఆలయాల్లో అభిషేకాలు నిర్వహిస్తారు.

సూర్య నమస్కారాలు..

యోగోపాసన చేసేవారు సూర్యనారాయణుడిని ఆరాధించే వారు రథ సప్తమి పర్వదినం రోజున సూర్యోదయం జరిగే బ్రహ్మీ ముహూర్తంలో సూర్య నమస్కారాలు చేస్తారు. ఆ సమయంలో సూర్య భగవానుడు బంగారు కిరణాలతో ఆయురారోగ్యం ప్రసాదిస్తాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం.



ఇంటింటా రథ సప్తమి మొక్కులు

రథ సప్తమి పర్వదినం రోజున శ్రీసమక్క-సారలమ్మలకు బెల్లం, పసుపు, కుంకుమలు, కొబ్బరి కాయలతో, బెల్లం పరమాన్నంతో అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు. ఏటా రథ సప్తమి రోజున సమ్మక్క- సారలమ్మ పూజలను నిర్వహించుకొని అమ్మవారి దర్శనానికి వెళ్తారు. ఇరుగుపొరుగు వారిని పిలుచుకొని పసుపు, కుంకుమలు, బెల్లం వాయినంగా అందజేస్తారు.

కొత్త కోడళ్లకు నూతన వస్త్రాలు

రథ సప్తమి రోజున కొత్తగా వచ్చిన కోడళ్లకు అత్తవారింటిలో నూతన వస్త్రాలను బహూకరిస్తారు. పసుపు, కుంకుమతో ఆశీర్వదిస్తారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రథ సప్తమి రోజున అమ్మవారి దేవాలయాల్లో, వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అమ్మవారి శిశిర నవరాత్రుల్లో భాగంగా వచ్చే మాఘ సప్తమి రోజు మంగళవారం రథ సప్తమి సందర్భంగా అమ్మవార్లకు ఒడిబియ్యాలు, నూతన వస్త్రాలను సమర్పిస్తారు. వైష్ణవ ఆలయాల్లో ఆదిత్య హృదయం, శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణాన్ని నిర్వహిస్తారు. అభిషేకాలు, అర్చనలు కొనసాగుతాయి.

నేడు ఆరు ప్రాంతాల్లో మనగుడి

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి ఉమ్మడి జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో మనగుడి కార్యక్రమంలో భాగంగా రథ సప్తమి వేడుకలను నిర్వహించనున్నట్లు టీటీడీ కార్యక్రమ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. హనుమకొండ జిల్లాలోని నక్కలగుట్ట శ్రీచైతన్య పాఠశాల, వరంగల్ జిల్లాలోని పిన్నవారి వీధిలో గల శ్రీశారద ఉన్నత పాఠశాల, ములుగు జిల్లాలోని శ్రీఅరవింద ఉన్నత పాఠశాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జనగామ జిల్లాలోని ఏకశిల ఉన్నత పాఠశాల, మహబూబాబాద్ జిల్లాలోని విశ్వశాంతి హైస్కూల్‌లో రథ సప్తమి వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. రథ సప్తమి పర్వదినం సందర్భంగా సూర్య భగవానుడికి విశేష పూజ, ఆదిత్యహృదయ పారాయణం విద్యార్థులతో సూర్య నమస్కారాల కార్యక్రమం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పాఠశాల విద్యార్థులు, భజన మండలి భక్తులు వారి గ్రామంలోని దేవాలయాల్లో రథ సప్తమి సందర్భంగా ఆదిత్య హృదయ పారాయణం, సూర్య నమస్కారాలు చేసి సాయంకాలం భజన నిర్వహించుకోవాలని పేర్కొన్నారు.

ఒకటే గమనం.. గమ్యం

- » మామునూరు పీటీసీలో రాటుదేలుతున్న పీసీలు
- » కొత్త న్యాయ చట్టాలపై ప్రత్యేక బోధన
- » ఇప్పటివరకు 6,857 మందికి శిక్షణ పూర్తి

మామునూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అదొక పోలీసులను తయారు చేసే కార్ఖానా. ఎక్కడెక్కడి నుంచో ఇక్కడికి శిక్షణ కోసం వస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కఠిన నిబంధనలతో తర్ఫీదు పొందుతారు. నేరస్థులను పట్టుకోవడంలో మెళకువలను నేర్చుకుంటారు. కఠోర శ్రమతో యుద్ధవీరుల్లాగా రాటుదేలుతారు. ఇలాంటివి రాష్ట్రంలో 10 శిక్షణ కేంద్రాలు ఉండగా అందులో మామునూరులోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్ (పీటీసీ) ఒకటి. ఇక్కడ ఏకకాలంలో 1200 మంది శిక్షణ పొందేందుకు ఏర్పాట్లు చేశారు.

ఇండోర్..అవుట్ డోర్ విభాగం

మామునూరు పీటీసీలో ఇండోర్ అవుట్ డోర్ విభాగాల్లో ట్రైనింగ్ ఇస్తారు. పోలీస్ శాఖలో ఉండే 12 రకాల తుపాకుల గురించి, అవి పనిచేసే విధానం గురించి వివరిస్తారు. బుల్లెట్స్ లోడ్ చేయడం, ఫైరింగ్, లాఠీ డ్రిల్, వెపన్ డ్రిల్, ఇన్వెస్టిగేషన్ ఆప్స్, హాక్ ఐ, హైడ్రా క్రాప్స్, థర్డ్ ఐ, లేటెస్ట్ ఆప్స్, కరాటే, వివిధ రకాల వెపన్స్, క్రిమినల్ లా వంటి వాటిపై శిక్షణ ఇస్తారు. ఇందులో భాగంగా గుట్టలలో వెపన్ ఫైరింగ్ నేర్పిస్తారు. వారానికి ఒకసారి 5కె రన్ నిర్వహిస్తారు. చట్టాలపై అవగాహన కల్పిస్తారు. సైబర్ క్రైం, ఫోరెన్సిక్, బాంబ్‌స్క్వాడ్ తదితర అంశాలపై ప్రత్యేకంగా తర్ఫీదు ఇస్తారు. అత్యవసర పరిస్థితులలో తప్పించుకోవడం ఎలాగో కూడా నేర్పిస్తారు.

ఇప్పటి వరకు 29 బ్యాచ్‌లకు శిక్షణ

మొదటగా 2014లో పరేడ్ మైదానం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ 29బ్యాచ్‌లలో 6857 మందికి శిక్షణ ఇచ్చారు.



రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి ఇక్కడికి శిక్షణ కోసం వస్తారు. ఉదయం 6 గంటలకే శిక్షణ ప్రారంభమవుతుంది. ఉదయం 8:30 వరకు గ్రౌండ్ ట్రైనింగ్, 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు ఇండోర్ క్లాసెస్ జరుగుతాయి. సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు ఆటలు, స్విమ్మింగ్ వ్యాయమం ఉంటుంది. శిక్షణ ఇచ్చేందుకు ఇండోర్ విభాగంలో 40 మంది, అవుట్ డోర్ విభాగంలో 120 మంది ఫ్యాకల్టీ ఉన్నారు.

మహిళలు, పురుషులకు వేర్వేరుగా శిక్షణ

పీటీసీలో ఇప్పటివరకు మొత్తం 6857 మంది కానిస్టేబుల్స్‌కు శిక్షణ ఇచ్చారు. వారిలో 2024లో 1148మంది మహిళలు 9నెలల పాటు శిక్షణ పొందారు. వీరిలో ఏఆర్ కానిస్టేబుల్స్ 309మంది, సివిల్ కానిస్టేబుల్స్ 843 మంది ఉన్నారు. వారిలో బీటెక్, పీజీ, డిగ్రీ పూర్తి చేసిన వారే అధికంగా ఉన్నారు.

వెపన్ ఫైరింగ్..

వరంగల్‌లోని జక్కలొద్దిలో రేంజ్ ఫైరింగ్ కోసం 9.5 వెపన్, 200మీటర్ వెపన్ ఫైరింగ్, 300 మీటర్ వెపన్ ఫైరింగ్‌పై ప్రత్యేక నిపుణుల చేత ట్రైనింగ్ ఇస్తారు.

గ్రిడ్ మిర్రర్..

శిక్షణపొందుతున్న కానిస్టేబుళ్లకు ఒక ప్రత్యేక గ్రిడ్ మిర్రర్ ఏర్పాటు చేశారు. ఇది వారి డ్రెస్ కోడ్‌ను, బ్యాడ్జ్‌లను సరిగా ధరించారా లేదా, క్యాప్ సరైనక్రమంలో పెట్టుకున్నారా, సెల్యూట్ చేసే విధానం, స్టాండర్డ్ అటేన్షన్ చేస్తున్నప్పుడు రెండు పాదాల మధ్య సరైన స్పేస్ ఉందా లేదా సూచిస్తుంది.



ఇతర వాటికంటే ఎక్కువ ప్రత్యేకతలు

రాష్ట్రంలోని ఇతర పీటీసీల కంటే మామునూరులో ప్రత్యేకతలు ఉన్నాయి. ఇక్కడ 3 ఆర్‌సీసీ బిల్డింగ్స్, 14 ఫ్యాబ్రికేటేడ్ బారక్స్, 14 విశాలమైన తరగతి గదులు ఏర్పాటు చేశారు.

80 మంది ఒకేసారి ఉపయేగించుకునేందుకు వీలుగా2 కంప్యూటర్ ల్యాబ్స్ ఉన్నాయి. 600 మందితో సమావేశం నిర్వహించేందుకు ఒక మీటింగ్ హాల్ ఉంది. వ్యాయామం కోసం జిమ్, రెండు మినరల్ వాటర్ ప్లాంట్లు, ఒక డ్రిల్ నర్సరీ కూడా అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థుల ఆరోగ్యం కోసం ప్రత్యేంగా ఒక యూనిట్ హాస్పిటల్ ఉంది.

నాణ్యమైన ఆహారం..

ఇక్కడ శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు అధిక ప్రోటీన్లతో కూడిన పోషకాహారం అందస్తారు. బ్రేక్ ఫాస్ట్‌లో కోడి గుడ్లు, పాలు, టీ, పండ్లు, మొలకెత్తిన విత్తనాలు, రాగిజావ, చపాతీ ఇస్తారు. మధ్యాహ్నం, రాత్రి భోజనంలో చికెన్‌తోపాటు రెండు రకాల కర్రీస్, పెరుగు ఉంటుంది.

ఒకొక్కరిని ఒక్కో ఆయుధంలా తయారు చేస్తున్నాం..

పీటీసీ ప్రిన్సిపాల్ ఎస్పీ ఇంజారపు పూజ



అన్ని వాతావరణాలను తట్టుకునేలా, ప్రజలకు అండగా ఉండేలా ఒక్కో కానిస్టేబుల్‌ను ఒక్కో ఆయుధంలా తయారు చేసి పంపుతున్నాం. పోలీస్ జాబ్ అంటే కేవలం ఉద్యోగమే కాదు కర్తవ్యంలా భావించి ప్రజల్లో ధైర్యం నింపేలా ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నాం.

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నందున వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు క్యాన్సర్ దినోత్సవాన్ని సోమవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్షమా దేశ్‌పాండే మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి వల్ల బీపీ, షుగర్‌తోపాటు క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని అన్నారు. పౌష్టికాహారం తీసుకుంటూ వైద్యులు సలహాలు తీసుకుంటూ ధైర్యంగా మిగతా జీవితాన్ని గడపాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఇఫ్తాకర్ అహ్మద్, పోచమ్మకుంట వైద్యాధికారి ఎన్.దీప్తి, మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, రామచందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే

సర్వీస్ ఆధారంగా డ్యూటీలు కేటాయించాలి


డీఐఈవో గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేటు లెక్చరర్లు

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు అధ్యాపకులకు సర్వీస్ ఆధారంగా ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్, పరీక్షల డ్యూటీలు కేటాయించాలని తెలంగాణ ప్రైవేటు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హనుమకొండలోని డీఐఈవో కార్యాలయంలో డీఐఈవో ఎ.గోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న లెక్చరర్లకు ప్రభుత్వ, కాంట్రాక్టు అధ్యాపకులకు సమానంగా డ్యూటీలు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి వి.మాధవరెడ్డి, ఫైనాన్స్ సెక్రెటరీ రాఘవేందర్, ఉపాధ్యక్షులు రవికిరణ్, రాజేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీధర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సతీష్ సేవలు అభినందనీయం

▸▸ రిటైర్డ్ పీజీ హెచ్ఎం ఘంటా రాంరెడ్డి


పూర్వ ఉపాధ్యాయుడు సతీష్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ఎంతో మందిని విద్యావంతులను చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కనుకుంట్ల సతీష్‌కుమార్ సేవలు అభినందనీయమని రిటైర్డ్ పీజీ హెచ్ఎం ఘంటా రాంరెడ్డి అన్నారు. సోమవారం భీమారంలోని ఫంక్షన్‌హాల్‌లో సీరుకుళ్ల ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో సతీష్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం మంగ రాజన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రిటైర్డ్ పీజీ హెచ్ఎం ఘంటా రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సుదీర్ఘ కాలంగా (41 సంవత్సరాలు) ఉపాధ్యాయుడిగా పనిచేసి ఎంతో మందిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడంలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ జల్లారపు రామస్వామి, కుందూరు నరసింహారెడ్డి, రాంనర్సింహాచారి, ఇ.నర్సింహారెడ్డి, ఐ.కృష్ణారెడ్డి, ఎం.సదానందం, ఎన్.సంపత్, పెరుమాండ్ల సాంబమూర్తి, కోటగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ఎల్లవేళలా ప్రోత్సహిస్తాం : సీపీ


పతకాలు సాధించిన క్రీడాకారులతో సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో ప్రతిభ చూపే పోలీస్ క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సాహిస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన పోలీసు క్రీడాకారులను సోమవారం కమిషనరేట్ కార్యాలయం ఆవరణలో సీపీ అభినందించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ పూర్తి స్థాయిలో క్రీడలకు సమయాన్ని కేటాయించే పోలీస్ అధికారులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, ఏసీపీలు నాగయ్య, పార్థసారధి, సురేంద్ర, మధుసూదన్,అనంతయ్య, ఆర్ఐలు చంద్రశేఖర్, శ్రీనువాస్, శ్రీధర్‌పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ నాయకుల నిరసన


నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై సోమవారం కాంగ్రెస్ నాయకులు ఎర్రగట్టుగుట్ట జంక్షన్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఏఐసీసీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆదేశాల మేరకు జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిళి వెంకట్రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, డైరెక్టర్ దయాకర్, పీఏసీఎస్ చైర్మన్‌లు బిల్ల ఉదయ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ బండ రత్నాకర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్‌పాల్గొన్నారు.

విద్యార్థులకు అక్షరాభ్యాసం


విశ్వవ్యాలీ పాఠశాలలో సరస్వతీ పూజ నిర్వహిస్తున్న పూజారి

హనుమకొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జవహర్‌నగర్ కాలనీలోని విశ్వవ్యాలీ పాఠశాలలో సోమవారం వసంతపంచమిని పురస్కరించుకొని చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. పూజారి రంజిత్ శర్మ సరస్వతి మాతకు పూజలు నిర్వహించి విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. సుమారు 20 మంది చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.కార్యక్రమంలో విశ్వవ్యాలీ స్కూల్ కరస్పాండెంట్ జగదీశ్వర్, డైరెక్టర్ శ్రీధర్ రావు, ప్రిన్సిపాల్ తిరుమలా రెడ్డి, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణ

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కేయూ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ విద్యార్థులకు 6 వారాల పాటు ఈనెల 5 నుంచి మార్చి 18 వరకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమణ సోమవారం తెలిపారు. ఈ మేరకు కేయూ పరిపాలన భవనంలోని కమిటీ హాల్‌లో శిక్షణకు సంబంధించిన గోడ పత్రికను వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఓఎస్డీ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రమణలు ఆవిష్కరించారు.

ఎస్సీ వర్గీకరణ సామాజిక న్యాయమే

▸▸ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జాతీయ అధ్యక్షుడు బాబు

▸▸ 7న లక్ష డప్పులు - వేల గొంతుల సాంస్కృతిక ప్రదర్శన

వడ్డెపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ సామాజిక న్యాయమేనని, రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు కొమ్ముల బాబు అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వాలే చేపట్టాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా వర్గీకరణను అమలు చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన హామీని అమలు చేస్తూ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కొమ్ములబాబు కోరారు. ఎస్సీ వర్గీకరణకు జాప్యం జరుగుతున్న నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు- వేల గొంతుల భారీ సాంస్కృతిక మహా ప్రదర్శనకు ఎస్సీ ఉపాధ్యాయులు, మాదిగలు, దాని అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంద రాజు మాదిగ, రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ జూపాక జనార్ధన్, రాష్ట్ర కార్యదర్శి పర్వతం తిరుపతయ్య, విద్యావేత్త జేఎస్ పరంజ్యోతి, మాదిగ ప్రజా సంఘాల నాయకులు దరిగి శ్రీనివాస్, రడపాక పరంజ్యోతి, మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా, డాక్టర్ మాదాసు కుమారస్వామి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కొమ్ముల బాబు

ు, గద్దల సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు భారీగా తరలిరావాలి

వరంగల్ కార్పొరేషన్: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఈనెల 7న చేస్తున్న లక్ష డప్పులు.. వెయ్యి గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మాదిగలంతా భారీగా తరలిరావాలని సినీ గేయ రచయిత, ప్రజాకవి మిట్టపెల్లి సురేందర్ పిలుపునిచ్చారు. సోమవారం గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ పెగడపెల్లిలో పుల్లా వంశస్తుల ఆర్థిక సహాయంతో స్థానిక డప్పు కళాకారులకు సురేందర్ చేతుల మీదుగా డప్పులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అడిషన్ ఎస్పీ పుల్లా సంజీవరావు, పుల్లా శ్రీనివాస్, పుల్ల కొంరయ్య, పుల్లా శోభన్ బాబు, పుల్లా కిషన్, కుమార్, ఇనుముల నాగరాజు, విజయ్ పాల్గొన్నారు.

అభిరామ్‌కు సూపర్ టాలెంట్ కిడ్ అవార్డు

▸▸ ఏకపాత్రాభినయానికి బుక్ ఆఫ్ రికార్డులో చోటు



అభిరామ్‌ను అభినందిస్తున్న స్కూల్ టీచర్లు

న్యాశాయంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ హంటర్‌రోడ్‌లోని వరంగల్ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఇమ్మడి అభిరామ్‌కు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కింది. స్కూల్‌లో సీనియర్ విద్యార్థులకు నిర్వహించిన సాంస్కృతిక దినోత్సవంలో అభిరామ్ మహాభారతంలోని కర్ణుడి వేషధారణలో 5 నిమిషాల 30 సెకన్ల పాటు అనర్గళంగా ఏకపాత్రాభినయం ప్రదర్శించాడు. దీంతో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు నమోదు చేసుకుని సూపర్ టాలెంట్ కిడ్ అవార్డుకు ఎంపిక చేశారు. ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్న అభిరామ్‌ను సోమవారం స్కూల్‌లో స్కూల్ కన్వీర్ ఈరసాని వెంకట్రామిరెడ్డి, డైరెక్టర్ శ్రీరాముల ఉమారాణి, అడిషనల్ డైరెక్టర్ గూడూరు జ్యోతి, ప్రిన్సిపాల్ గౌరీ కళ్యాణి, వైస్ ప్రిన్సిపాల్ కవిత, ప్రాథమిక తరగతుల ఇన్‌చార్జి పుష్పలత, గురువులు సోఫియా, మధుకార్, శోభారాణి, రమాదేవి, మాధవి అభినందించారు.



గాయపడిన క్షతగాత్రులు

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

▸▸ ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

▸▸ ఓఆర్ఆర్ దాటుతుండగా రోడ్డు ప్రమాదం

హసన్‌పర్తి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 1వ డివిజన్ పరిధి ముచ్చర్ల క్రాస్‌రోడ్డు వద్ద ఓఆర్ఆర్‌పై రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనాన్ని కారు వేగంగా ఢీకొట్టింది. సోమవారం జరిగిన ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురికి బలమైన గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని నాగారం గ్రామానికి చెందిన కుమారస్వామి(42), యాదగిరి(30), ప్రకాష్(30)లు సోమవారం హనుమకొండలోని ఓ ఫంక్షన్‌కు హాజరై తిరిగి ద్విచక్ర వాహనంపై నాగారం వెళ్తున్నారు. ఈ క్రమంలో ముచ్చర్ల క్రాసురోడ్డు వద్ద ఔటర్ రింగు రోడ్డు దాటుతుండగా కారు అతివేగంగా ఢీకొట్టింది. దీంతో ఒకే ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, స్థానికులు 108 అంబులెన్స్‌లలో క్షతగాత్రులను ఎంజీఎంకు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

రైల్వే స్టేషన్‌లో డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటు

కాజీపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే స్టేషన్‌లో అధునాతనమైన డిస్ప్లే బోర్డులు ఏర్పాటుకు రైల్వే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రయాణికులకు సమాచారం ఎప్పటికప్పుడు అందించడానికి రైలు బోగీలస్థానాలను తెలియజేయడానికి, అన్ని రైలు బోగీలు, జనరల్ బోగీలు ఆన్‌లైన్ బుకింగ్‌ల సమాచారం ఇతరత్రా విషయాలు ఈ బోర్డులు తెలియజేస్తాయి. ఈ డిస్ప్లే బోర్డులు త్వరలో ఏర్పాటు చేస్తామని టెలికాం సెక్షన్‌ఇంజనీర్ మౌనిక, స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్, కమర్షియల్ మేనేజర్ సజ్జనర్ చెప్పారు.

వాహనాల దారి మళ్లింపు

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ అలంకార్ జంక్షన్ నుంచి వేయిస్తంభాల ఆలయానికి వచ్చే దారిలో డ్రైయినేజీ పనులు చేపడుతుండటంతో మంగళవారం నుంచి వావాహలను దారి మళ్లించనున్నట్లు వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ నుంచి వచ్చే లారీలు, ఆర్టీసీ బస్సులు, రెడీమిక్స్ వాహనాలు, ట్రాక్టర్లను ములుగు రోడ్డు, వేయిస్తంభాల ఆలయం దారి గుండా అనుమతించమన్నారు. ములుగురోడ్డు నుంచి పెద్దమ్మగడ్డ, కేయూ క్రాస్ మీదుగా వెళ్లాలని సూచించారు. అదేవిధంగా వరంగల్ నుంచి హనుమకొండ బస్టాండ్, నక్కలగుట్ట, కాజీపేట వెళ్లాల్సిన ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలను కాపువాడ, బాలాంజనేయ స్వామి ఆలయం గుండా పంపించనున్నట్లు తెలిపారు. అలంకార్ నుంచి దేవాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి వాహనాలను పార్కింగ్ చేయరాదన్నారు. వేయిస్తంభాల ఆలయం నుంచి ములుగురోడ్డు వైపునకు వచ్చే దారిపై యథావిధిగా వాహనాలు ప్రయాణించవచ్చన్నారు.

ఆసరా స్టోర్‌ను ప్రారంభించిన కార్పొరేటర్

కాజీపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కాజీపేట 62వ డివిజన్ సోమిడిలో సోమవారం ఆసరా స్టోర్‌ను స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా అతితక్కువ ధరలకు నాణ్యమైన వస్తువులు అందించే ఓమ్ని మార్ట్ ముందుగా కాజీపేటలో ప్రారంభించడం అభినందనీయమన్నారు. నిరుద్యోగ యువకులకు ఇది ఒక జీవనోపాధి కేంద్రమన్నారు. ఓమ్ని మార్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ రాజేశ్‌బాబు మాట్లాడుతూ.. స్టోర్ కావల్సిన ఆసక్తిగల యువకులు 93989 10429 ఫోన్ నంబరుకు సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ అసోసియేట్ ఏలేటి సుధాకర్, డా. మంద అశోక్ కుమార్, ఆసరా స్టోర్ కమ్యూనిటీ మిత్ర ఆలేటి నవనీత, రాజేశ్‌బాబు, శ్రీవిద్య, చీఫ్ ప్రాజెక్ట్ బాకీ బైరెడ్డి పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ ఔన్నత్యాన్ని చాటి చెప్పాలి

▸▸ శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : విశ్వబ్రాహ్మణ జాతి ఔన్నత్యాన్ని సమాజానికి చాటి చెప్పి విలువలను పరిరక్షించే విధంగా సంఘాలు కృషి చేయాలని శాసన మండలి ప్రతిపక్ష నేత, విశ్వబ్రాహ్మణ సంఘం జాతీయ నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. సోమవారం సికింద్రాబాద్‌లోని బీఎస్ఆర్ గార్డెన్‌లో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర 5వ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంచదాయ వృత్తులైన కమ్మరం, వడ్రంగం, ఇత్తడి, శిలాశిల్పి, స్వర్ణకార వృత్తిదారుల అభ్యుదయానికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. అనంతరం విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతిలోని బత్తోజు సోమనర్సింహచారికి అమర శిల్పి జక్కనాచార్య, వీణవంక సదానందంకు విశ్వశిల్పిరామప్ప, కాశ అంజయ్య చారికి శిల్పి రామప్ప, కనపర్తి రామరత్నమాచారికి అమరశిల్పి జక్కనాచార్య, ముంజంపల్లి సోమనర్సింహచారికి అమర శిల్పి జక్కనాచార్య పురస్కరాలను ఆయన ప్రదానం చేశారు.


సిరికొండ మధుసూదనాచారితో పురస్కార గ్రహీతలు

ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వ కర్మ మాతృ సంఘం కోశాధికారి రాగిఫణి రవీంద్రాచారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలి

• సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు


కాళోజీ సెంటర్‌లో చిప్పలు చేత పట్టుకుని నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

న్యూశాయంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణకు నిధులు తీసుకురావడంలో విఫలమైన రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్ర మంత్రి పదవులకు వెంటనే రా జీనామా చేయాలని సీపీఐ రాష్ట సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీని వాస్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం చూపించిన వివక్షపై సోమవారం హనుమకొండలోని కాళోజీ సెంటర్‌లో సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చిప్పలు చేత పట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మా ట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ పట్ల సవతి తల్లి వైఖరిని ప్రదర్శిస్తుందన్నారు. ఏపీ పునర్విభజన చట్టం అమ లును బీజేపీ నిర్లక్ష్యం చేసిందని, నిర్లక్ష్యానికి గురైన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ములుగులోని తెలంగాణ గిరిజన విశ్వవిద్యాలయానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. లక్షలాది మందికి ఉపాధి కల్పించే బయ్యారం ఉక్కు పరిశ్రమ ప్రాజెక్టును మూలకు పడేయ డం దారుణమన్నారు. లింగ సమానత్వం, సామాజిక న్యాయ సమస్యలను పరిష్కరించడంలో కేంద్రం విఫలమైందని, బడ్జెట్‌లో పేదరికం శూన్యం అని చెప్పినా వాస్తవానికి దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారి సంఖ్య పెరుగుతోందన్నారు. ఇప్పటికైనా తెలంగాణకు బడ్జెట్‌లో సరైన న్యాయం చేయాలని శ్రీనివాస్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చ రించారు.

ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీపీఐ నాయ కులు ఆదరి శ్రీనివాస్, తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, మోతె లింగారెడ్డి, లక్ష్మణ్, రాములు, నర్సయ్య, సదానందంతోపాటు పెద్ద సంఖ్యలో జిల్లాకు చెందిన సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రావు పద్మ

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

రాంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో 12 లక్షల వార్షిక ఆదాయంపై పన్ను రద్దుచేస్తూ ప్రకటించినందుకు బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం హంటర్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ప్రధాని మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు రావు పద్మ, కాశీప్రసాద్ మాట్లాడుతూ ఇన్ని రోజులు దేశంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ చేయలేని పనులను మోదీ చేస్తుంటే ఓర్వలేక అక్కసుతో బీజేపీపై బురద జల్లే ప్రయత్నం చేస్తొన్నారన్నారు. బీఆర్ఎస్ పాలనను ప్రజలు తిరస్కరించి కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఒక్క ఏడాదిలోనే కాంగ్రెస్ చేయ్యి ఫాక్స్ అయిందన్నారు. దీంతోప్రజలు బీజేపీ వైపు చూస్తొన్నారన్నారు.

కల్పనను సత్కరించిన కలెక్టర్ ప్రావీణ్య



కల్పనను సన్మానిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ గణతంత్ర దినోత్సవ వేడుకలకు శాయంపేట మండల కేంద్రానికి చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలు దాసరి కల్పనకు ఆహ్వానం లభించింది. ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌ని కాన్ఫరెన్స్‌లో న్యూఢిల్లీకి వెళ్లొచ్చిన కల్పనను కలెక్టర్ ప్రావీణ్య శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో మేన శ్రీను, అడిషనల్ డీఆర్‌డీవో సుధీర్, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

నేడు కేయూలో మాదిగ కళాకారుల ప్రదర్శనలు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లో మంగళవారం మాదిగ ఉద్యోగులు, కళాకారుల నేతృత్వంలో కళాకారుల ప్రదర్శన, అలాగే దూరవిద్య కేంద్రంలోని ప్రొఫెసర్ జాఫర్ నిజాం సెమినార్ హాల్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 7న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ నేతృత్వంలో జరిగే లక్ష డప్పులు.. వేల గొంతుకలు బహిరంగ సభలో భాగంగా బుధవారం కేయూ మాదిగ ఉద్యోగులు, కళాకారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వర్సిటీ క్యాంపస్‌లో మాదిగ కళాకారుల డప్పుల ప్రదర్శలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సినీగేయ రచయిత మిట్టపల్లి సురేందర్, మాదిగ యుద్ధగీతిక ఏపూరి సోమన్న, డాక్టర్ నలిగంటి శరత్ చమార్‌తో పాటు కళాకారులు పెద్ద ఎత్తున హాజరు కానున్నట్లు వెల్లడించారు.

యువత స్థిరపడేందుకు గ్రంథాలయాలు దోహదం

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : యువత విద్య, ఉద్యోగ పరంగా జీవితంలో స్థిరపడేందుకు గ్రంథాలయాలు దోహదం చేస్తాయని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అన్నారు. సోమవారం కేయూ గ్రంథాలయ విభాగంలో విభాగాధిపతి డాక్టర్ బి.రాధికారాణి అధ్యక్షత బీఎల్ఐఎస్సీలో అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందచేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లైబ్రరీ సైన్స్ విద్యార్థులకు విస్తృతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయని అన్నారు. విద్యా పరంగా ఎదిగేందుకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఖమ్మంలోని శ్రీ వెంపటి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్టు వారు ఏటేటా విద్యార్థులకు అందిస్తున్న పురస్కారాలను 2023-24 బీఎల్ఐఎస్సీ బ్యాచ్‌లో ఉత్తమ మార్కులతో మొదటి ర్యాంకు సాధించిన ఎం.భాగ్యలక్ష్మికి అందచేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డు టీచర్ అసోసియేషన్ బాధ్యులు సత్యనారాయణరావు, పుల్లా కిశోర్, రవిచంద్రరావు, రాజు, సీకేఎంకళాశాల లైబ్రరీయన్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

▸▸ గోర్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిలాల్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త, బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని సాధారణ సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించాలని గోర్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిలాల్ బోండా, గోర్ బంజారా సంక్షేమ సంఘం(జీబీఎస్ఎస్) బాలాజీ నాయక్‌లు పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారితో పాటు గోర్ సేన జిల్లా అధ్యక్షుడు తేజావత్ ఫణికుమార్ నాయక్, మాలోత్ నానునాయక్‌లు మాట్లాడారు. ఈ నెల 15న సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం గోర్ బంజారా, లంబాడీల జనాభా ప్రతిపాధికన ప్రతీ నియోజకవర్గానికి రూ. 20 లక్షల వెచ్చించి జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో బంజారా సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గోర్ సేన రాష్ట్ర, జిల్లా నాయకులు శ్రీకాంత్ నాయక్, విష్ణు, శరత్, లకావత్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బాబురావును గెలిపించాలి

• ధర్మ టీచర్స్ యూనిటీ రాష్ట్ర అధ్యక్షుడు పాక లింగమల్లు

వడ్డెపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్గొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ధర్మ టీచర్స్ యూనిటీ అభ్యర్థి దామెర బాబురావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ధర్మ టీచర్స్ యూనిటీ అండ్అధ్యాపక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు పాక లింగమల్లు యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామెర ఉపేందర్ ఉపాధ్యాయులను కోరారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు, సామాజిక సేవాదృక్పథం కలిగిన బాబురావును శాసన మండలికి పంపిస్తే ఉపాధ్యాయుల సమస్యలను మండలిలో ప్రస్తావించి తగిన న్యాయం జరిగే విధంగా కృషి చేస్తారని అన్నారు. 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 10 శాతం లేని అగ్రకుల అభ్యర్థుల మధ్య ఎమ్మెల్సీ ధర్మయుద్ధం కొనసాగనుందని విజ్ఞులైన ఉపాధ్యాయులు బాబురావుకు పట్టం కట్టాలని కోరారు. సమావేశం లో ఎమ్మెల్సీ అభ్యర్థి దామెర బాబురావు, ఉపాధ్యాయ సంఘాల నేతలు బొల్లె సాంబయ్య, జంగం సంజీవ్, దాసారపు శ్యామ్, మామిడి సురేష్ పాల్గొన్నారు.

అవగాహన

విటమిన్లు మతలబులు

విటమిన్ లోపాలు కొన్ని లక్షణాలతో ప్రస్ఫుటంగా బయల్పడుతూ ఉంటాయి. ఆ లక్షణాల ఆధారంగా పోషకలోపాలను ఎలా కనిపెట్టవచ్చో తెలుసుకుందాం!

- **నిస్సత్తువ:** విపరీతమైన నిస్సత్తువ, తేలికపాటి పనులకే అలసిపోవడం, రోజంతా నీరసంగా, బడలికగా ఉండడం.. ఇవన్నీ విటమిన్ బి12 లోపం లక్షణాలు
- **కండరాల నొప్పులు:** కండరాలు పట్టేయడం, నొప్పులు వేధించడం మెగ్నీషియం లోపం లక్షణాలు
- రోగనిరోధకశక్తి: తరచూ స్వల్ప రుగ్మతలకు గురవుతూ ఉండడం రోగనిరోధకశక్తి తగ్గుదలకు సూచన. కాబట్టి రోగనిరోధక వ్యవస్థను బలంగా ఉంచుకోవడం కోసం విటమిన్ సి తీసుకోవాలి
- **చర్మ సమస్యలు:** చర్మం పొడిబారుతున్నా, పొట్టు రేగుతున్నా, చిట్లిపోతున్నా విటమిన్ ఇ లోపంగా పరిగణించి, ఆ పోషకాన్ని భర్తీ చేసుకోవాలి
- **వెంట్రుకలు ఊడిపోతుంటే:** వెంట్రుకలు రాలిపోతున్నా, చిట్లిపోతున్నా విటమిన్ డి లోపంగా భావించాలి.

ఎలాంటి పోషక లోపాన్నైనా ఆ పోషకం దొరికే ఆహారంతో భర్తీ చేసుకోవచ్చు. కాబట్టి సప్లిమెంట్లకు బదులుగా ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వాలి. అవసరాన్ని బట్టి వైద్యులు సూచించే సప్లిమెంట్లు వాడుకోవచ్చు.



ఇదీ సంగతి


పొట్ట చదునుగా...

ఎంత ప్రయత్నించినా పొట్ట దగ్గర కొవ్వు కరగడం లేదా? అయితే ఆహారపుటలవాట్లలో లోపాలున్నాయని అర్థం చేసుకోవాలి. అందుకోసం ఈ అలవాట్లకు స్వస్తి చెప్పాలి.

- **క్యాలరీలు తాగుతున్నారా?:** స్మూదీలు, పండ్లరసాలు ఆరోగ్యకరమే! కానీ వాటిలో ఉండే చక్కెరతో అదనపు క్యాలరీలు శరీరంలోకి చేరుకుంటాయి. కాబట్టి దాహం తీర్చుకోవడం కోసం వాటికి బదులుగా నీళ్లు, చక్కెర కలపని పలుచని మజ్జిగ, నిమ్మరసం తాగొచ్చు.



- **ఆహారం పరిమితం:** నచ్చిన పదార్థాలను పూర్తిగా తినడం మానేయవలసిన అవసరం లేదు. మితంగా తింటే సరిపోతుంది. పిండిపదార్థాలు శత్రువులు కావు. కాబట్టి వాటిని పూర్తిగా మానేయవలసిన అవసరం లేదు. కానీ తినే ముందు కంచంలో ఎంత అన్నం, ఎన్ని దుంపలు ఉన్నాయో గమనించుకోవాలి. పిండిపదార్థాలు తక్కువగా, మాంసకృత్తులు, పీచు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.
- **క్యాలరీలు తగ్గించి:** కడుపు మాడిస్తే, కచ్చితంగా పొట్ట చదునవుతుంది. కాబట్టి కడుపు నిండా తినడం మానేసి, పొట్టను కాస్త ఖాళీగా ఉంచాలి. తినే కొద్దిపాటి ఆహారం పోషకాలతో నిండి ఉండేలా చూసుకోవాలి.
- **నెమ్మదిగా:** ఆబగా, త్వరత్వరగా తినడం వల్ల సరిపడా తిన్నా ఆకలి తీరని భావన కలుగుతుంది. కాబట్టి మనసు పెట్టి ఏకాగ్రతగా, నెమ్మదిగా తినాలి. ఫోన్లు, టివి చూస్తూ తినే అలవాటు మానుకోవాలి. ఆహారాన్ని బాగా నమిలి తినాలి.
- భోజనాన్ని సలాడ్‌తో మొదలుపెడితే, పొట్ట సగం నిండిపోయి, మిగతా పదార్థాల మోతాదు తగ్గిపోతుంది.



ఫిబ్రవరి 4
ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం

క్యాన్సర్ వ్యాధి, చికిత్సలు, కోలుకునే అవకాశాల గురించి మనలో ఎన్నో అపోహలు, భయాలు. అత్యాధునికమైన కొత్త చికిత్సలు అందుబాటులోకొస్తున్నా, వాటిని తలదన్నే రూపాల్లో క్యాన్సర్ విజృంభిస్తూ ఉండడమే ఇందుకు కారణం. అయినప్పటికీ ఈ వ్యాధి పట్ల తగిన అవగాహనతో అప్రమత్తంగా మెలగాలని సూచిస్తూ, క్యాన్సర్ గురించిన కొన్ని కీలకమైన అంశాల గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

క్యాన్సర్ కథ కంచికే!

ఎక్కడో, ఎవరో క్యాన్సర్ బారిన పడ్డారని వినే రోజులు పోయాయి. ఇప్పుడు ఈ వ్యాధి అందరికీ సుపరిచితమే! ప్రపంచవ్యాప్తంగా ఇదే దుస్థితి. ఇందుకు ఎన్నో కారణాలు. ధూమపానం, మద్యపానం లాంటి దురలవాట్లకు తోడు, నాణ్యత లోపించిన కలుషిత ఆహారం, అస్తవ్యస్థ జీవనశైలులు, వాతావరణ కాలుష్యం క్యాన్సర్ ఉద్ధృతిని పెంచుతున్నాయి. ఇవే కాకుండా గత యాభై ఏళ్లలో మన ఆయుష్షు క్రమేపీ పెరిగింది. సాధారణ జనాభా ఆయుష్షు పెరిగేకొద్దీ, శరీర కణాలు దెబ్బతినడం, మరమ్మతు సక్రమంగా జరగకపోవడం, వ్యాధినిరోధకశక్తి తగ్గడం లాంటి కారణాల వల్ల ఆరోగ్యకరమైన కణాలు క్యాన్సర్ కణాలుగా పరిణామం చెందే అవకాశాలు పెరుగుతాయి. దాంతో సగటు జీవితకాలం పెరిగే కొద్దీ క్యాన్సర్ ముప్పు కూడా పెరుగుతోంది. ఫలితంగా సర్వత్రా క్యాన్సర్ విపరీతంగా ప్రబలుతోంది. ఆయుష్షు పెరగకుండా ఆపలేం! కానీ దురలవాట్లకు దూరంగా ఉండడం, ఆరోగ్యకరమైన ఆహార, జీవనశైలులను అనుసరించడం, వాయు కాలుష్యాన్ని నివారించే జాగ్రత్తలు చేపట్టడం ద్వారా ఈ వ్యాధి నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు.



ఈ లక్షణాల మీద కన్నేసి...

క్యాన్సర్ సోకిన ప్రదేశం మీదే వ్యాధి లక్షణాలు ఆధారపడి ఉంటాయి. అయితే ఈ లక్షణాల కంటే ముందు శరీరంలో క్యాన్సర్ పెరుగుతోందని తెలిపే కొన్ని సూచనలు కూడా బయల్పడుతూ ఉంటాయి. అవేంటంటే...

- అకారణంగా బరువు తగ్గడం
- ఆకలి మందగించడం, కొద్దిపాటి ఆహారంతోనే కడుపు నిండిపోతూ ఉండడం
- క్రమేపీ కాకుండా అకస్మాత్తుగా జీవనశైలి రుగ్మతల (మధుమేహం) బారిన పడడం
- మూడు వారాలకు మించిన అస్వస్థత (జ్వరం, దగ్గు, విరోచనాలు(మలబద్ధకం)

ఈ వ్యాధి వంశపారంపర్యమా?

కొన్ని రకాల ఫెమీలియల్ క్యాన్సర్లు మాత్రమే వంశపారంపర్యంగా సంక్రమించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఒక తరం నుంచి ఇంకొక తరానికీ మార్పిడి అయ్యే జన్యువుల్లో లోపాలు ఏర్పడడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్లు వంశపారంపర్యంగా సంక్రమిస్తాయి. రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, , గర్భాశయ క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్, పెద్దపేగు క్యాన్సర్, పొట్ట క్యాన్సర్ ఈ కోవకు చెందినవే! అలాగే ఒకే రకమైన క్యాన్సర్ కారకాలకు బహిర్గతమవడం వల్ల కూడా ఒకే ప్రాంతంలో ఎక్కువ మందికి క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ ఇందుకొక ఉదాహరణ. అయితే వంశపారంపర్య క్యాన్సర్లకు అడ్డుకట్ట వేయాలంటే క్యాన్సర్ సోకిన వ్యక్తిలోని క్యాన్సర్ జన్యువును పరీక్షించాల్సి ఉంటుంది. పాజిటివ్ ఫలితం వస్తే, వాళ్ల పిల్లలకు ఆ జన్యువు సంక్రమించిందో లేదో పరీక్షించుకోవచ్చు. సంక్రమిస్తే, 25 ఏళ్ల వయసు నుంచే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటూ అప్రమత్తంగా వ్యవహరించాలి. రొమ్ము క్యాన్సర్ విషయంలో మామోగ్రామ్‌తో పాటు ప్రతి ఆరు నెలలకూ ఎమ్మారై చేయించుకుంటూ ఉండాలి. ఒకవేళ క్యాన్సర్ సోకిన వ్యక్తి జన్యు పరీక్ష నెగిటివ్ ఫలితాన్నిచ్చిన పక్షంలో, వారి సంతానానికి కూడా జన్యు పరీక్ష చేసి, జన్యు ఉత్పరివర్తన లేదని నిర్ధారించుకోవాలి. ఈ కోవకు చెందినవాళ్లు 40 ఏళ్ల వయసు నుంచి క్రమం తప్పకుండా వ్యాధినిర్ధారణ పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి.

ఏ చికిత్స ప్రయోజనకరం?

క్యాన్సర్ చికిత్సలో ఎంతో పురోగతి సాధించాం. ఎన్నో రకాల చికిత్సా ప్రత్యామ్నాయాలున్నాయి. దాంతో ఫలితాలు కూడా మెరుగై, మరణాలు తగ్గుముఖం పట్టాయి. అయితే క్యాన్సర్ చికిత్సలు రకం, స్వభావం, దశలను బట్టి మారుతూ ఉంటాయి. ఒకరికి మెరుగైన ఫలితాన్నిచ్చిన చికిత్స మరొకరికి ఫలితాన్నివ్వకపోవచ్చు. కాబట్టి సత్ఫలితాన్ని పొందడం కోసం వేర్వేరు సందర్భాల్లో వేర్వేరు చికిత్సలను ఆశ్రయించవలసి వస్తుంది. క్యాన్సర్ చికిత్సలో సర్జరీ అవసరమవుతుంది. కీమోథెరపీ, రేడియోథెరపీలు అవసరమవుతాయి. అయితే ఈ చికిత్సలు అందించే వైద్యులందరూ ఒకే చోట ఒక బృందంలా పని చేసే ఆస్పత్రిని ఎంచుకోవడం ఎంతో కీలకం. ఇలా సమగ్రమైన క్యాన్సర్ చికిత్సను అందించే ఆస్పత్రిని ఆశ్రయించగలిగితే ఫలితాలు మెరుగ్గా ఉంటాయి. అలాగే ఆ ఆస్పత్రిలో తాజా చికిత్సలు, సాంకేతికతలను అనుసరిస్తున్నారని నిర్ధారించుకోవాలి.



క్యాన్సర్ మీద విజయం సాధ్యమా?

క్యాన్సర్ బారిన పడినంత మాత్రాన జీవితం అక్కడితో అంతమైపోదు. ప్రస్తుతం ఎంతో అత్యాధునిక క్యాన్సర్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి నిర్భయంగా క్యాన్సర్ చికిత్సకు సన్నద్ధం కావాలి. మరీ ముఖ్యంగా రెండు పడవల మీద కాళ్ల చందాన్ని అనుసరించకుండా, వైద్యుల బృందం సూచించే చికిత్సా ప్రణాళికకు కట్టుబడి, పూర్తి సహకారాన్ని అందించాలి. అన్నిటికంటే ముఖ్యంగా చికిత్సకు భయపడకుండా గుండె నిబ్బరంతో వ్యవహరించాలి. లేదంటే ఎంతటి సమర్థమైన చికిత్స అయినా ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు.

తిరగబెట్టకుండా ఏం చేయాలి?

క్యాన్సర్ తిరగబెట్టడానికి ప్రధానంగా రెండు అంశాలు దోహదపడతాయి. రోగి, చికిత్సకు ఎంత బాగా కట్టుబడి ఉన్నారు? వైద్యులు చికిత్సను ఎంత మెరుగ్గా అందించగలిగారు? అనే అంశాల మీదే క్యాన్సర్ తిరగబెట్టే అవకాశాలు ఆధారపడి ఉంటాయి. అలాగే క్యాన్సర్ తత్వం, పరిణామం చెందే తీరుల మీద కూడా ఈ వ్యాధి తిరగబెట్టే అవకాశాలు ఆధారపడి ఉంటాయి. క్యాన్సర్ కణితి బయాలజీ దూకుడుగా ఉంటే, ఆ వ్యాధి తిరగబెట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పదేళ్ల క్రితం క్యాన్సర్ తిరగబెట్టడానికి కారణాలు తెలుసుకునే పరిస్థితి ఉండేది కాదు. కానీ ఇప్పుడు క్యాన్సర్ కణితి దూకుడు వెనకున్న కారణాన్ని కచ్చితంగా కనిపెట్టగలుగుతున్నారు. ఎటువంటి జన్యు మార్పుల వల్ల, రోగనిరోధకశక్తిని కుంటుపరిచే ఎలాంటి అంశాల వల్ల కణితి దూకుడుగా ప్రవర్తిస్తోందో తెలుసుకోగలుగుతున్నారు. వీటికి తగ్గట్టు చికిత్సను అందించగలిగితే వ్యాధి తిరగబెట్టే అవకాశాలు తగ్గిపోతాయి. ఒకవేళ తిరగబెట్టినా, ఆయుష్షును పొడిగించే వీలు కలుగుతోంది. కాబట్టి క్యాన్సర్ తిరగబెట్టినంత మాత్రాన కంగారుపడిపోవలసిన అవసరం లేదు. వైద్యులను సంప్రతించి తగిన చికిత్స తీసుకుని పూర్తిగా కోలుకోవచ్చు.

పెద్దల్లో క్యాన్సర్ ముప్పు

క్యాన్సర్‌కు వయోపరిమితి లేదు. పుట్టింది మొదలు చనిపోయేవరకూ ఈ వ్యాధి ఎవరికైనా, ఎప్పుడైనా సోకవచ్చు. పిల్లల్లో రక్త క్యాన్సర్లు, పెద్దల్లో ప్రొస్టేట్, ఊపిరితిత్తుల క్యాన్సర్లు ఎక్కువ. మరీ ముఖ్యంగా ఆయుష్షు పెరిగేకొద్దీ శరీర కణాలు మార్పులకు గురవడం, కణ మరమ్మతు, రోగనిరోధక శక్తి కుంటుపడడం లాంటి సమస్యలు పెరుగుతాయి. కాబట్టి పిన్న వయస్కులతో పోలిస్తే పెద్దల్లో క్యాన్సర్ సోకే అవకాశాలు ఎక్కువ. కాబట్టి 60 ఏళ్లకు పైబడిన వాళ్లలో క్యాన్సర్ ముప్పు పెరుగుతూ ఉంటుంది.

కోలుకున్న తర్వాత ఎలా మసలుకోవాలి?

క్రమం తప్పక వైద్యులు సూచించిన పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల పర్యవేక్షణలో మెలుగుతూ ఉండాలి. క్యాన్సర్ కారకాలకు, అలవాట్లకు దూరంగా ఉండాలి. ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగిస్తూ, అనుకూల దృక్పథంతో ముందుకు సాగాలి. అలాగే రెడ్ మీట్, శుద్ధి చేసిన పదార్థాలు తినడం మానేసి, శరీరాన్ని వీలైనంత చురుగ్గా ఉంచుకోవాలి.

డాక్టర్ దీపక్ కొప్పాక
సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్,
కేర్ హాస్పిటల్స్ హైదరాబాద్.



మోరింగ

మునగాకు మహిమ

మునగాకుతో ఒరిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ప్రత్యేకించి చెప్పవలసిన అవసరం లేదు. అయితే ఆ ఆకును వంటల్లో ఎలా వినియోగించుకోవాలో తెలుసుకుందాం!



హెర్బల్ టీ

తులసి, అల్లం, మిరియాలు.. వేటితో టీ కాచుకున్నా దాన్లో కాస్త మునగాకు పొడి వేసుకుంటే, ఆ ఆకులోని పోషకాలను పొందవచ్చు. అయితే ఇలా తయారుచేసుకునే టీలో పాలు కలుపుకోకూడదు.

స్మూదీలు, మిల్క్‌షేక్స్

స్మూదీలు, మిల్క్‌షేక్స్‌లో కలుపుకుని తాగడం కోసం ఒక కప్పు పాలు, అరటి పండ్లు, యాపిల్ ముక్కలు, ఒక టీస్పూను మోరింగ పొడిని కలిపి బ్లెండ్ చేసుకోవాలి.

పరాఠా, రోటీలు

పరాఠా, రోటీల తయారీ కోసం సిద్ధం చేసుకునే గోధుమ పిండిలో ఒకట్రెండు టీస్పూన్ల మోరింగ పొడి కలుపుకోవచ్చు. రుచి కోసం నిమ్మరసం, ఉప్పు, కొద్దిగా కారం కూడా కలుపుకోవచ్చు.

సూప్స్, పప్పులు

సూప్ తయారుచేసుకునేటప్పుడు ఒక టీస్పూన్ మోరింగ పొడి జోడించవచ్చు. ఏ పప్పు వండుకున్నా మోరింగ పొడితో కలిపి వండుకోవచ్చు. వీటి రుచిని పెంచడం కోసం అల్లం, వెల్లుల్లి, కొత్తిమీర, పసుపు జోడించుకోవచ్చు.

పెరుగులో

జీలకర్ర పొడి, కీరా, క్యారట్ ముక్కలు, ఉప్పు, ఒక టీస్పూను మోరింగ పొడి పెరుగుకు జోడించి పెరుగు పచ్చడిలా వాడుకోవచ్చు.

బిరియానీ, పాస్తా

పాస్తా సాస్‌లో మోరింగ పొడి కలుపుకోవచ్చు. బిరియానీ వండేటప్పుడు, బియ్యంతో పాటు మోరింగ పొడి జోడించుకోవచ్చు.

తెలుసుకుందాం

గుండె గట్టిగా...

గుండెకు హాని కలిగించే అలవాట్ల గురించి మనకు అవగాహన ఉందనుకుంటాం. కానీ గుండెకు హాని కలిగించే మనకు తెలియని అంశాలు కూడా కొన్ని ఉన్నాయి. అవేంటంటే...

తీవ్రమైన ఒత్తిడి: దీర్ఘకాలం పాటు కొనసాగే కుటుంబ కలహాలు, వృత్తిపరమైన ఒత్తిడిలు గుండెకు హాని చేస్తాయి. ఇవి నేరుగా గుండె మీద ప్రభావం కనబరచకపోయినా, రక్తపోటును పెంచి పరోక్షంగా గుండెను ఒత్తిడికి లోను చేస్తాయి. ఒత్తిడితో ధూమపానం, ఆహారం మీద వ్యామోహం లాంటి అనారోగ్యకరమైన అలవాట్లు కూడా అలవడతాయి. ఇవి కూడా గుండెకు చేటు చేసేవే! కాబట్టి ఒత్తిడిని తగ్గించుకోవడం కోసం యోగా, ధ్యానం సాధన చేయాలి. వ్యక్తిగత, వృత్తిగత ఒత్తిడులను తగ్గించుకోవాలి.



నిద్రలేమి: నిద్ర లోపించడం, కంటినిండా నిద్ర పోకపోవడం.. ఈ రెండూ జీవగడియారాన్ని అస్తవ్యస్తం చేసి, రక్తపోటును పెంచి, ఊబకాయానికి దారి తీస్తాయి. దీర్ఘకాలంలో ఈ పరిస్థితి గుండె మీద దుష్ప్రభావాన్ని కనబరుస్తుంది. కాబట్టి కచ్చితమైన నిద్రవేళలు పాటిస్తూ, నిద్రకు రెండు గంటల ముందు ఫోన్లు, టివిలకు దూరం పెట్టాలి. పడగ్గదిని సౌకర్యవంతంగా, చీకటిగా ఉంచుకోవాలి. నిద్రాభంగం కలిగించే అంశాలేవీ పడగ్గదిలో లేకుండా చూసుకోవాలి.

సూర్యరశ్మి: విటమిన్ డి లోపం అధిక రక్తపోటు, ఇన్‌ఫ్లమేషన్‌కూ, అంతిమంగా గుండె జబ్బులకూ దారి తీస్తుంది. కాబట్టి రోజులో కనీసం 15 నుంచి 30 నిమిషాల పాటైనా సూర్యరశ్మికి బహిర్గతం కావాలి. అవసరాన్ని బట్టి సప్లిమెంట్లు వాడుకోవాలి.

పారాహుషార్

గులియన్ బార్‌తో గాభరా వద్దు

కొవిడ్ తర్వాత ప్రతి చిన్న సమస్యనూ భూతద్దంలో నుంచి చూసే ధోరణి పెరిగింది. వ్యాధితో మరణాలు నమోదు కాగానే, భయంతో బెంబేలుపడిపోయే స్వభావం ఏర్పడిపోయింది. అలాంటి కోవకు చెందినదే తాజా 'గులియన్ బార్' సిండ్రోమ్. అందర్నీ భయభ్రాంతులకు గురి చేస్తున్న ఈ వ్యాధి గురించి వైద్యులు ఏమంటున్నారంటే...

గులియన్ బార్ సిండ్రోమ్ కొత్తదేమీ కాదు. వందేళ్ల నుంచి మనుగడలో ఉన్న పాత వ్యాధే! సిండ్రోమ్ అంటే లక్షణాల సమాహారం అని అర్థం. కొన్ని నిర్దిష్టమైన లక్షణాలు బయల్పడతాయి కాబట్టే ఈ రుగ్మతను సిండ్రోమ్‌గా పేర్కొంటున్నారు. గులియన్ బార్ సిండ్రోమ్‌లో ప్రధానంగా నాడీవ్యవస్థ దెబ్బతిని, పక్షవాతాన్ని పోలిన లక్షణాలు కనిపిస్తాయి. అలాగని దీన్ని పక్షవాతంగా పొరపాటు పడకూడదు. ఈ వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయంటే...

- చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, బలహీనత
- నడవడం, మెట్లెక్కడంలో ఇబ్బంది
- నడక తడబడడం
- మింగడంలో ఇబ్బంది
- కనురెప్పలు మూయలేకపోవడం
- మొదట కాళ్లూ చేతులు పడిపోవచ్చు
- నీరసం, నిస్సత్తువ
- పక్షవాతం లక్షణాలు శరీరంలో పైనుంచి కిందకూ లేదా కిందనుంచి పైకీ వ్యాపించవచ్చు

శరీర తత్వాన్ని బట్టి తీవ్రం

కూర్చుని లేవడంలో ఇబ్బంది మొదలు వెంటిలేటర్ సపోర్ట్‌కు చేరుకునేవరకూ ఈ వ్యాధిలో ఆరు దశలుంటాయి. ఈ దశల మధ్య సమయ నిడివి కొందర్లో ఎంతో తక్కువగా ఉంటుంది. వ్యాధి తీవ్రరూపం దాల్చడానికి మూడు నుంచి నాలుగు వారాలు పడుతుంది. కానీ కొందర్లో కూర్చుని నిలబడడానికి ఇబ్బందిపడే తొలి దశ, వారం రోజుల్లోనే వెంటిలేటర్‌కు చేరుకునే చివరిదశకు పెరిగిపోతుంది. ప్రధానంగా నాడులను దెబ్బతీసే ఈ వ్యాధి సోకిన ఐదు శాతం మందిలో, అటానమిక్ డిస్టర్బెన్స్ సమస్య తలెత్తుతుంది. అంటే, సాధారణంగా స్పృహలో లేకపోయినా, మన శరీరం రక్తపోటును సక్రమంగా నియంత్రిస్తూనే ఉంటుంది. అయితే గులియన్ బార్ సిండ్రోమ్ వల్ల అటానమిక్ నాడీ వ్యవస్థ దెబ్బతిన్న అతి కొద్ది మందిలో రక్తపోటు నియంత్రణ కోల్పోయి, పరిస్థితి విషమించవచ్చు. అయితే ఇలాంటి స్థితిని అధికమించగలిగితే, ప్రాణాపాయం ఉండదు. 20 ఏళ్ల క్రితం ఇలాంటి నాలుగు, ఐదు, ఆరో దశలకు చేరుకున్న వాళ్ల కోలుకునే అవకాశాలు తక్కువగా ఉండేవి. కానీ నేడు అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకొచ్చాయి కాబట్టి ఆ రోగులు కూడా తిరిగి పూర్తిగా కోలుకోగలుగుతున్నారు.

సమస్య శరీరంలోనే....

ప్రధానంగా ఇది ఆటొఇమ్యూన్ డిజార్డర్. అంటే బయటి కారకాల వల్ల కాకుండా, మన శరీరంలోనే జనించే ఆరోగ్య సమస్య ఇది. వైరల్ జ్వరాలు తగ్గిన తర్వాత కీళ్ల వాతాలు వేధించడం సర్వసాధారణం. అలాగని కీళ్లవాతానికీ వైరస్‌కూ సంబంధం లేదు. వైరస్‌తో పోరాడే శరీర స్పందన ఫలితమే కీళ్ల వాతం. గులియన్ బార్ సిండ్రోమ్ కూడా అలాంటిదే! ఈ రుగ్మతకూ బ్యాక్టీరియాకూ ఎలాంటి సంబంధం లేదు. వ్యాధికారక బ్యాక్టీరియాకూ, మన శరీరంలోని మంచి బ్యాక్టీరియాకూ కొన్ని పోలికలుంటాయి. శరీరంలోని కామన్ బ్యాక్టీరియాను ఉపయోగకరమైన మంచి బ్యాక్టీరియాగా మన వ్యాధినిరోధకవ్యవస్థ గుర్తుపడుతుంది. కానీ వ్యాధికారక బ్యాక్టీరియా, మన శరీరంలోని మంచి బ్యాక్టీరియాల యాంటీజన్లు ఒకే రకమైనవి కావడం వల్ల 'మాలిక్యులర్ మిమిక్రీ' పరిస్థితి తలెత్తుతుంది. దాంతో మన శరీరంలోని యాంటీబాడీలు, వ్యాధికారక బ్యాక్టీరియాతో పాటు మంచి బ్యాక్టీరియా మీద దాడిని కొనసాగిస్తాయి. ఫలితంగా నాడులు దెబ్బతిని గులియన్ బార్ సిండ్రోమ్ తలెత్తుతుంది.



గులియన్ బార్ వాస్తవాలు ఇవే!

- ఇది కొత్త వ్యాధి కాదు. వందేళ్ల నుంచి మనుగడలో ఉన్నదే!
- ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అంటువ్యాధి కానే కాదు
- మన వ్యాధినిరోధక వ్యవస్థ మన మీదే దాడి చేసే ఆటొఇమ్యూన్ డిజార్డర్ ఇది
- ఎంత త్వరగా లక్షణాలను గుర్తించి వైద్య చికిత్స అందిస్తే, అంతే త్వరగా కోలుకోవచ్చు
- వ్యాధి ప్రాణాంతకంగా మారే అవకాశాలు తక్కువ
- శరీర తత్వం, జన్యు మేకప్‌ల మీదే గులియన్ బార్ సిండ్రోమ్ తలెత్తే అవకాశాలు ఆధారపడి ఉంటాయి
- ఈ రుగ్మత ఎవరికైనా, ఏ వయసువారికైనా రావచ్చు
- వ్యాధి దశ మీదే లక్షణాలు ఆధారపడి ఉంటాయి

ఎవరికైనా, ఎప్పుడైనా...

ఈ సిండ్రోమ్‌కు క్యాంపిలోబ్యాక్టర్ జెజుని అనే బ్యాక్టీరియా ప్రధాన కారణం. కలుషిత నీటిలో ఉండే ఈ బ్యాక్టీరియా సోకడంతో గులియన్ బార్ సిండ్రోమ్ రుగ్మతకు బీజాలు పడ్డాయి. ఈ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ సోకి, విరోచనాలు వేధించి, కోలుకున్న రెండు నుంచి మూడు వారాల తర్వాత పక్షవాత లక్షణాలు మొదలై, ఈ రుగ్మత వెలుగులోకొచ్చింది. నిజానికి విరోచనాలే కాకుండా జలుబు, దగ్గుతో కూడిన వైరల్ ఇన్‌ఫెక్షన్ నుంచి కోలుకున్న తర్వాత కూడా ఈ సిండ్రోమ్‌కు గురయ్యే అవకాశాలుంటాయి. ఇలా 30 నుంచి 40% మందిలో పూర్వ రుగ్మతలు తగ్గిన తర్వాత గులియన్ బార్ సిండ్రోమ్ తలెత్తవచ్చు. విగతా 60 నుంచి 70 శాతం మందిలో ఎలాంటి లక్షణాలు, రుగ్మతలు లేకుండా నేరుగా పక్షవాతంతోనే ఈ సిండ్రోమ్ బయల్పడవచ్చు. తీవ్ర రుగ్మత నుంచి, సర్జరీల నుంచి కోలుకున్న వారిలో కూడా ఆటో ఇమ్యూన్ స్ట్రెస్ తలెత్తి, నాడీ వ్యవస్థ దెబ్బతిని ఈ సిండ్రోమ్ తలెత్తవచ్చు.

సమర్థమైన చికిత్సలున్నాయి

ఈ రుగ్మతను ఎంత త్వరగా నిర్ధారించి, చికిత్సను అందించగలిగితే అంత మెరుగ్గా, వేగంగా కోలుకోగలుగుతారు. వంద మంది గులియన్ బార్ సిండ్రోమ్ రోగుల్లో కేవలం ఒకరిద్దరికి మాత్రమే పెరిఫెరల్ నాడీ వ్యవస్థతో పాటు మెదడు, రక్తపోటు కూడా ప్రభావితమవుతుంది. ఫలితంగా పరిస్థితి ప్రాణాంతకంగా మారుతుంది. అయితే రక్తపోటు, మెదడు ప్రభావితం కానంతవరకూ వెంటిలేటర్ స్థితికి చేరుకున్న రోగులను కూడా తిరిగి పూర్తిగా కోలుకోగలిగేలా చేసే చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ రుగ్మతకు ప్రారంభంలోనే అడ్డుకట్ట వేయాలంటే లక్షణాలను గుర్తించిన వెంటనే ఆలస్యం చేయకుండా వైద్యులను కలవాలి. చికిత్సతో రెండు నెలల్లోనే పూర్తిగా కోలుకోవచ్చు. చికిత్సలో భాగంగా యాంటీబాడీ ఇంజెక్షన్, ప్లాస్మా మార్పిడిని వైద్యులు అనుసరిస్తారు. ఈ చికిత్సతో శరీరంలోని యాంటీబాడీలను మార్పిడి చేసి, వ్యాధి తీవ్రతను తగ్గించడం వల్ల రోగి పూర్తిగా కోలుకునే అవకాశాలు పెరుగుతాయి.

డాక్టర్ మోహన్ కృష్ణ
సీనియర్ న్యూరాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్
సోమాజిగూడ, హైదరాబాద్.



గ్రూప్‌-1కు మార్గం సుగమం!

» జీవో 29 రద్దు చేయాలన్న పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం

» గతంలోనూ రిట్‌ పిటిషన్‌ను తిరస్కరించిన న్యాయస్థానం

» తెలంగాణలో గ్రూప్‌-1 ఫలితాలకు లైన్‌ క్లియర్‌

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రూప్‌-1 ఫలితాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు శుభవార్త! తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 29ను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. జీవో 29ని రద్దు చేయాలని కోరుతూ బి.శృతి, పి.రాంబాబుతోపాటు మరికొందరు గత నెల 22న సుప్రీంకోర్టులో రెండు వేర్వేరు స్పెషల్‌ లీవ్‌ పిటిషన్లు దాఖలు చేశారు. ఆ పిటిషన్లు సోమవారం జస్టిస్‌ పమిడిఘంటం శ్రీనరసింహ, జస్టిస్‌ మనోజ్‌ మిశ్రాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చాయి. పిటిషనర్ల తరఫున సీనియర్‌ న్యాయవాది ఆదిత్య సోంధి, మోహిత్‌ రావు వాదనలు వినిపిస్తూ.. జీవో 29తో వేలాది మంది విద్యార్థులకు నష్టం వాటిల్లే ప్రమాదముందని, దాన్ని రద్దు చేసి.. గ్రూప్‌-1 పరీక్షలను మరోసారి నిర్వహించాలని కోరారు. అయితే, గ్రూప్‌-1 పరీక్షలు పూర్తయ్యాయని, ఫలితాలు ప్రకటించేందుకు తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినందున ఆ విషయంలో కలగజేసుకోవడం సరికాదన్న ధర్మాసనం.. పిటిషన్‌ను కొట్టివేసింది. అయితే, గ్రూప్‌-1 పరీక్షలను వాయిదా వేయాలని, జీవో 29ని రద్దు చేయాలంటూ గతంలోనూ రాంబాబు సుప్రీంకోర్టులో రిట్‌ పిటిషన్‌ దాఖలు చేశారు. గ్రూప్‌-1 పరీక్షల్లో రూల్‌ ఆఫ్‌ రిజర్వేషన్‌ అనుసరించడం లేదని ఆరోపించారు. ఆ పిటిషన్‌ను అప్పటి సీజేఐ జస్టిస్‌ డీవై చంద్రచూడ్‌ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారించింది. స్వయంప్రతిపత్తి కలిగిన పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ను పరీక్షలు వాయిదా వేయాలని ఎలా ఆదేశించగలమని అప్పటి సీజేఐ ప్రశ్నించారు. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం కుదరదని చెబుతూ రిట్‌ పిటిషన్‌ను కొట్టేశారు. మొత్తం మీద సుప్రీంకోర్టులో దాఖలైన రెండు పిటిషన్లను కొట్టివేయడంతో తెలంగాణలో గ్రూప్‌-1 ఫలితాలకు మార్గం సుగమమైంది.

పోలీసుల ఉద్యోగాలు ఊడతాయ్‌

» ఎమ్మెల్యే సామేలు చెప్పారని కేసులు పెడితే ఖబడ్దార్‌

» వారికి అండగా నేనున్నా: ఎస్సీ కార్పొరేషన్‌ చైర్మన్‌ ప్రీతం

మోత్కూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే చెప్పారని కాంగ్రెస్‌ కార్యకర్తలపై పోలీసులు కేసులు పెడుతున్నట్టు తెలుస్తోందని, అలా చేస్తే వారి ఉద్యోగాలు ఊడతాయని ఎస్సీ కార్పొరేషన్‌ చైర్మన్‌ నాగరిగారి ప్రీతం హెచ్చరించారు. తుంగతుర్తి నియోజకవర్గం మోత్కూరులో సోమవారం ఎస్సీ కార్పొరేషన్‌ చైర్మన్‌ నాగరిగారి ప్రీతం, కాంగ్రెస్‌ జిల్లా ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి సన్మాన సభ నిర్వహించారు. అయితే అది కాస్తా తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలుపై తిరుగుబాటు సభగా నడిచింది. కాంగ్రెస్‌ కోసం పని చేసిన నాయకులను పక్కన బెట్టి.. బీఆర్‌ఎస్‌ నుంచి వచ్చిన వారిని సామేల్‌ ప్రోత్సహిస్తున్నారని సభలో మాట్లాడిన నాయకులంతా ఆరోపించారు. ఈ సందర్భంగా ప్రీతం మాట్లాడారు. సుమారు 35 ఏళ్లుగా పార్టీ కోసం పని చేసిన పైళ్ల సోమిరెడ్డికి ప్రభుత్వ నామినేటెడ్‌ పోస్టు రావాలని, అది ఇవ్వలేనప్పుడు పార్టీ పదవి ఇస్తే జీర్ణించుకోలేకపోతే ఎలా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ కార్యకర్తల జోలికి వస్తే తన పదవిని పక్కన బెట్టి వారికి అండగా నిలుస్తానని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీ-ఫాం ఇస్తారో.. ఇవ్వరో.. అని భయపడవద్దని, తాను బీ-ఫాంలు తెచ్చి ఇచ్చి, ముందుండి పని చేసి గెలిపించుకుంటానని హామీ ఇచ్చారు. తాను కాంగ్రెస్‌లోకి వస్తానని.. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వెంకట్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లానని సామేలును కోరగా.. మంత్రి ఎవరు, సీఎం ఎవరని అన్నారని కాసోజు శంకరమ్మ ఆరోపించారు. తెలంగాణ కోసం శ్రీకాంతచారి చనిపోయాడని అంటే.. "నీ కొడుకు నా కోసం చనిపోయాడా..?"అని కసురుకున్నారని తెలిపారు.

మోహన్‌బాబు, మనోజ్‌ మధ్య వాగ్వాదం?

కుటుంబ ఆస్తి వివాదంపై కలెక్టరేట్‌లో విచారణ

» అదనపు కలెక్టర్‌ ప్రతిమాసింగ్‌ ఎదుటే పరస్పరం దూషణ?

» పోలీసులను పిలిపించిన అధికారిణి.. విచారణ వాయిదా



రంగారెడ్డి అర్బన్‌, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కుటుంబ ఆస్తులకు సంబంధించి మోహన్‌బాబు చేసిన ఫిర్యాదు మేరకు విచారణ సందర్భంగా ఆయనకు, కుమారుడు మనోజ్‌కు మధ్య తీవ్రస్థాయిలో వాగ్యుద్ధం జరిగినట్లు సమాచారం. తాను సంపాదించిన ఇళ్లు, ఆస్తులను కుమారుడు మనోజ్‌ ఆక్రమించారని కొద్దిరోజుల క్రితం మోహన్‌బాబు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తన స్వార్జిత ఆస్తిపై ఎవరికీ హక్కులేదని, తన ఆస్తులను మనోజ్‌ నుంచి తనకు అప్పగించాలని ఫిర్యాదులో కోరారు. ఈ మేరకు ఇప్పటికే మనోజ్‌ను ప్రతిమా సింగ్‌ విచారించారు. అయితే విచారణ కోసం ఇద్దరినీ పిలవడంతో మోహన్‌బాబు, మనోజ్‌ను సోమవారం అదనపు కలెక్టర్‌ ప్రతిమా సింగ్‌ ఎదుట హాజరయ్యారు. ఆస్తులకు సంబంధించి వివరాలను ఆమెకు తండ్రీకొడుకులు అందజేశారు. దాదాపు రెండు గంటలపాటు ప్రతిమా సింగ్‌ వారిని విచారించారు. అయితే విచారణ సమయంలో మోహన్‌బాబు, మనోజ్‌ మధ్య వాగ్వాదం జరిగిందని, పరస్పరం దూషించుకున్నారని సమాచారం. అదనపు కలెక్టర్‌ సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోకపోవడంతో ఆమె పోలీసులను పిలిపించారు. ఇళ్లు, ఇతర ఆస్తులన్నీ తన స్వార్జితమని, వాటి నుంచి ఖాళీ చేయించాలని మోహన్‌బాబు పట్టుపట్టారు. నాన్నకు ఇళ్లే కాకుండా చాలా ఆస్తులు ఉన్నాయని, వారసత్వంగా తనకు ఆస్తిలో వాటా ఉంటుందని, విద్యాసంస్థలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించడంతోనే తనపై ఆయన లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మనోజ్‌ ఆరోపించారు. పలు ఆస్తులకు సంబంధించి దస్తావేజులను విచారణ అధికారి ఎదుట మనోజ్‌ ఉంచారు. వచ్చేవారం మరోసారి విచారణకు హాజరు కావాలని ప్రతిమా సింగ్‌ ఆదేశించారు. విచారణ ముగిసిన తర్వాత మంచు మనోజ్‌ ప్రధాన గేటు నుంచి, మోహన్‌బాబు వెనుక గేట్‌ నుంచి బయటకు వెళ్లారు.

నిర్మాత కేపీ చౌదరి ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

కమిషనరేట్‌ పరిధిలో ఓ డ్రగ్‌ కేసులో జైలుకు వెళ్లిన కేపీ చౌదరి.. బెయిల్‌పై బయటకు వచ్చాక, గోవాకు వెళ్లారు. అక్కడి సియోలిమ్‌ గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. సోమవారం ఆయన ఉరివేసుకుని, ఆత్మహత్య చేసుకున్నట్లు గోవా ఎస్పీ అక్షత్‌ కౌశల్‌ మీడియాకు తెలిపారు. "చౌదరికి గతంలో డ్రగ్స్‌ ముఠాలతో లింకులున్నట్లు సమాచారం ఉంది. గోవాలో ఆయన కాంటాక్ట్‌లో చాలా మంది ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ కేసును చాలెంజింగ్‌గా తీసుకున్నాం" అని ఆయన వివరించారు. కాగా.. 2023లో సైబరాబాద్‌ ఎస్‌వోటీ పోలీసులు కేపీ చౌదరిని ఓ డ్రగ్స్‌ కేసులో అరెస్టు చేసిన విషయం తెలిసిందే..! అప్పట్లో సంచలనం సృష్టించిన ఈ కేసులో చౌదరి అరెస్టయ్యారు. ఆ తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చిన కేపీ చౌదరి.. గోవాలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. కేపీ చౌదరి స్వస్థలం ఖమ్మం జిల్లా బోనకల్‌ మండలం రాయనపేట. ఆయన తండ్రి బోడేపుడి శేషగిరిరావు లాయర్‌గా.. తల్లి విజయ పాల్వంచలో ఉపాధ్యాయురాలిగా సేవలందించారు. కేపీ చౌదరి మెకానికల్‌ ఇంజనీరింగ్‌లో బీటెక్‌ పూర్తిచేసి, పుణెలోని ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఏరోనాటికల్‌ ఇంజనీరింగ్‌లో డైరెక్టర్‌(ఆపరేషన్స్‌)గా పనిచేశారు. 2016లో ఆ ఉద్యోగాన్ని వీడి.. సినీపరిశ్రమ వైపు అడుగులు వేశారు. పలు సినిమాలకు నిర్మాతగా, డిస్ట్రిబ్యూటర్‌గా వ్యవహరించారు. సినీ రంగంలో ఆశించిన స్థాయిలో లాభాలు లేకపోవడంతో గోవాకు మారిపోయారు. అక్కడ ఓహెచ్‌ఎం క్లబ్‌ను ఏర్పాటు చేసి.. హైదరాబాద్‌ నుంచి వచ్చే సెలబ్రిటీల కోసం పార్టీలు నిర్వహించేవారు. క్లబ్‌ వ్యాపారంలోనూ నష్టాలు రావడంతో.. 2023లో హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. అప్పట్లోనే 100 షీట్ల కొకైన్‌ను వెంట తెచ్చుకున్నారు. ఈ క్రమంలో 2023 జూన్‌ 14న పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్‌వోటీ పోలీసులు అతని నుంచి 90 షీట్ల కొకైన్‌ను సీజ్‌ చేశారు. బెయిల్‌పై జైలు నుంచి విడుదలయ్యాక.. మళ్లీ గోవాకు వెళ్లిపోయారు.



గోవాలో కేపీ ఆత్మహత్య చేసుకున్న ఇంటి వద్ద పోలీసులు

కేపీ చౌదరి ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులే కారణమని పోలీసులు భావిస్తున్నారు. డ్రగ్స్‌ కేసులో కేపీ చౌదరి అరెస్టయ్యాక.. ఆయన కాల్‌లిస్ట్‌లో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, వ్యాపారుల తోపాటు.. మొత్తం 800 మంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో 300 మందికి పైగా తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. రాజకీయ నాయకుల్లో అప్పటి అధికార పార్టీకి చెందిన ప్రముఖులు ఎక్కువగా ఉన్నట్లు పోలీసుల దృష్టికి రావడంతో.. దర్యాప్తు అధికారులు ఓ దశలో తలలు పట్టుకున్నట్లు తెలిసింది. దాంతో.. రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు ఎవరికి వారు.. "మాకు డ్రగ్స్‌ కేసుతో సంబంధం లేదు" అంటూ సోషల్‌ మీడియాలో పోస్టులు పెట్టడం గమనార్హం..!

నేడు ఖమ్మం జిల్లాకు భౌతికకాయం

కేపీ చౌదరి తండ్రి మూడేళ్ల క్రితం చనిపోగా.. తల్లి రాయనపేటలో ఉంటున్నారు. కేపీ చౌదరికి భార్య, కుమారుడు ఉన్నారు. ఆయన భౌతికకాయాన్ని తీసుకురావడానికి మేనమామలు గోవా వెళ్లినట్లు తెలిసింది. మంగళవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తారని సమాచారం.

అన్నా వెనక్కొచ్చేయ్‌: సుప్రీత

కేపీ మరణంపై నటి సురేఖవాణి కూతురు సుప్రీత భావోద్వేగానికి లోనయ్యారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఆయనతో కలిసి ఉన్న ఫొటోను షేర్‌ చేశారు. "నిన్ను ఎప్పటికీ మిస్‌ అవుతాం అన్నా. నా బాధలు ఎవరికి చెప్పుకోవాలి? నీ బాధలు నేను వినడానికి లేకుండా చేశావు. వెనక్కొచ్చేయ్‌ అన్నా.. నీ కోసం ఈ చెల్లి ఎదురుచూస్తోంది. నీ కోసం ఎప్పటికీ నేనుంటా. నువ్వు ఎక్కడ ఉన్నా టైగరే అంటావుగా. లవ్‌ యూ సో మచ్‌ అన్నా. నీ ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నా"అని వ్యాఖ్యానించారు.

'రాజ్‌తరుణ్‌-లావణ్య' కేసులో మలుపు!

(మొదటిపేజీ తరువాయి)

మహిళలకు మాదకద్రవ్యాలు అలవాటు చేశాడని తెలిపింది. వారు మత్తులో ఉన్నప్పుడు నగ్న వీడియోలు చిత్రీకరించినట్లు తాను గుర్తించానని ఫిర్యాదులో వివరించింది. అందుకు సంబంధించిన హార్డ్‌డిస్క్‌ తన చేతికి చిక్కిందని లావణ్య ఫిర్యాదు చేసినట్లు నార్సింగ్‌ పోలీసులు వెల్లడించారు. తన వీడియోలను డిలీట్‌ చేయాలని చూడగా.. అందులో వందలాది మహిళల నగ్న వీడియోలు ఉన్నాయని, వాటిని అడ్డం పెట్టుకొని మస్తాన్‌.. వారి జీవితాలతో చెలగాటమాడుతున్నాడని లావణ్య తెలిపింది. బాధిత మహిళల్లో పెళ్లయినవారు, పెళ్లికాని అమ్మాయిలు ఉన్నారని.. ఎక్కడ తమ జీవితాలు ఇబ్బందుల్లో పడతాయోనని వారు బయటకు రావట్లేదని ఫిర్యాదులో పేర్కొంది.

ఇంటికి వచ్చి దాడి చేయడంతో..

నగ్న వీడియోల హార్డ్‌ డిస్క్‌ తన దగ్గర ఉదని తెలుసుకున్న మస్తాన్‌.. పలుమార్లు ఇంటికి వచ్చి చంపేస్తానని బెదిరించాడని లావణ్య ఆరోపించింది. జనవరి 31న మరోసారి ఇంటికొచ్చి టీవీ, సీసీటీవీలు, ఇతర వస్తువులను ధ్వంసం చేసినట్లు తెలిపింది. సోమవారం మరో స్నేహితుడితో కలిసి వచ్చి తనపై దాడి చేయడానికి ప్రయత్నించడంతో డయల్‌-100కు ఫోన్‌ చేసింది. దీంతో కోకాపేటలోని లావణ్య ఇంటికి చేరుకున్న పోలీసులు అక్కడ డ్రగ్స్‌ మత్తులో ఉన్న మస్తాన్‌తో పాటు అతని స్నేహితుడు షేక్‌ ఖాజా మొహియుద్దీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ల్యాప్‌టాప్‌, ఫోన్‌, హార్డ్‌ డిస్క్‌ స్వాధీనం చేసుకున్నారు. నగ్న వీడియోలు తీసి, తనతో పాటు వందలాది మంది మహిళల జీవితాలతో ఆడుకుంటున్న మస్తాన్‌పై చర్యలు తీసుకోవాలని లావణ్య చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు అతనిపై బీఎన్‌ఎస్‌ సెక్షన్‌ 329(4), 324(4), 109, 77, 78ల కింద కేసు నమోదు చేశారు. మస్తాన్‌ను అరెస్టు చేశారు. మరో నిందితుడు ఖాజాకు నోటీసులు జారీ చేశారు.

మస్తాన్‌ హార్డ్‌ డిస్క్‌లో నిఖిల్‌ వీడియోలు

మస్తాన్‌ వద్ద ఉన్న మరో హార్డ్‌ డిస్క్‌లో వందలాది మహిళల నగ్న వీడియోలతో పాటు సినీ నటుడు నిఖిల్‌, గతంలో డ్రగ్స్‌ కేసులో అరెస్టయిన ఒక ప్రముఖ టిఫిన్‌ సెంటర్‌ యజమాని ప్రభాకర్‌రెడ్డి ఫోన్లను హ్యాక్‌చేసి వారి ప్రైవేట్‌ వీడియోలను సైతం స్టోర్‌ చేసినట్లు సమాచారం.

మస్తాన్‌పై పలు క్రిమినల్‌ కేసులు..

మస్తాన్‌పై ఇప్పటికే నాలుగు క్రిమినల్‌ కేసులు ఉన్నాయి. ఇందులో గుంటూరు జిల్లాలోని పట్టాభిపురం పోలీస్‌ స్టేషన్‌లో, సైబరాబాద్‌ పరిధిలోని మోకిల స్టేషన్‌లో, నార్సింగ్‌ స్టేషన్‌లో; విజయవాడ వెస్ట్‌ పోలీస్‌ స్టేషన్‌లో మరో కేసు నమోదయ్యాయి.

నాలాగా మరికొందరి జీవితాలు బలి కాకూడదు: లావణ్య

ఈ హార్డ్‌డిస్క్‌ను పోలీసులకు ఇచ్చినా సరే నాకు ప్రాణహాని తప్పదు. కానీ, నాలాగా ఇతర మహిళల జీవితాలు ఇలాంటి వెధవలు తీసే వీడియోల వల్ల బలికాకూడదు. నాకు న్యాయం జరిగినా, జరగకపోయినా కనీసం ఈ ఫిర్యాదు చూసైనా మహిళలు జాగ్రత్త పడతారు. పోలీసుల పట్ల పూర్తి విశ్వాసంతో అన్ని ఆధారాలున్న హార్డ్‌ డిస్క్‌ను అందిస్తున్నా. అదేవిధంగా మస్తాన్‌ దగ్గరున్న మరో రెండు హార్డ్‌ డిస్క్‌లను, అన్ని ఎలక్ట్రానిక్‌ పరికరాలను పోలీసులు తీసుకొని, మహిళల డేటాను డిలీట్‌ చేయాలని కోరుతున్నా.

చిత్రజ్యోతి

SINCE 1965

కె ర్యాంప్‌ షూటింగ్‌ షురూ



హీరో కిరణ్‌ అబ్బవరం నటించిన 'క' చిత్రం ఆయన కెరీర్‌లోనే హయ్యెస్ట్‌ గ్రాసర్‌గా నిలిచింది. కిరణ్‌ నటించే కొత్త చిత్రం 'కె.ర్యాంప్‌' షూటింగ్‌ సోమవారం ఉదయం రామానాయుడు స్టూడియోలో మొదలైంది. 'సామజవరగమన2, 'ఊరు పేరు భైరవకోన' వంటి చిత్రాల తర్వాత హాస్య మూవీస్‌ సంస్థ అధినేత రాజేశ్‌ దండా ఈ సినిమా నిర్మిస్తున్నారు. జైన్స్‌ నాని ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. పూజా కార్యక్రమం అనంతరం నిర్మాత అనిల్‌ సుంకర కెమెరా స్విచ్‌ ఆన్‌ చేయగా, మరో నిర్మాత దిల్‌ రాజు క్లాప్‌ ఇవ్వగా ముహూర్తపు షాట్‌ చిత్రీకరించారు. దర్శకుడు యోగి తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకులు విజయ్‌ కనకమేడల, రామ్‌ అబ్బరాజు, యదు వంశీ, , రచయిత ప్రసన్నకుమార్‌ స్క్రిప్ట్‌ అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు ధీరజ్‌ మొగిలినేని, వంశీ నందిపాటి, సీనియర్‌ నటుడు నరేశ్‌ తదితరులు పాల్గొన్నారు. కిరణ్‌ అబ్బవరం సరసన యుక్తి తరేజా నటిస్తున్నారు. 'కె.ర్యాంప్‌' చిత్రానికి సంగీతం: చేతన్‌ భరద్వాజ్‌, ఫొటోగ్రఫీ: సతీశ్‌ రెడ్డి మాసం, ఎడిటింగ్‌: ఛోటా కె.ప్రసాద్‌, సహ నిర్మాతలు: బాలాజీ గుట్ట, ప్రభాకర్‌ బురుగు.

ప్రళయకాల రుద్రుడు



'కన్నప్ప' సినిమాలో ప్రభాస్‌ ఓ కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ సినిమా నుంచి ప్రభాస్‌ ఫస్ట్‌ లుక్‌ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్‌. ఇందులో ఆయన రుద్ర పాత్రలో నటిస్తున్నారు. "ప్రళయ కాల రుద్రుడు.. త్రికాల మార్గదర్శకుడు.. శివాజ్ఞ పరిపాలకుడు" అని పోస్టర్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభాస్‌ ఇన్‌స్టాగ్రామ్‌లో తన లుక్‌ను షేర్‌ చేశారు. "శక్తికి.. వివేకానికి ప్రతీక అయిన రుద్ర పాత్రను పోషిస్తున్నందుకు ఆనందంగా ఉంది. ప్రేమ, భక్తి, త్యాగంతో నిండిన ఈ సాహసోపేత ప్రయాణాన్ని థియేటర్లో చూసేందుకు సిద్ధంగా ఉండండి" అని తెలిపారు. మంచు విష్ణు టైటిల్‌ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేశ్‌కుమార్‌ దర్శకత్వంలో డా.మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ఏప్రిల్‌ 25న సినిమా విడుదల కానుంది.

మానవ సంబంధాలను విశ్లేషించే కాంత



రానా దగ్గుబాటి, దుల్కర్‌ సల్మాన్‌ సంయుక్తంగా నిర్మిస్తున్న 'కాంత' చిత్రం షూటింగ్‌ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్‌ ప్రొడక్షన్‌ వర్క్‌ జరుగుతోంది. 1950ల నాటి మద్రాసు నేపథ్యంలో మానవ సంబంధాలు, సామాజిక, సంక్లిష్టతలను విశ్లేషిస్తూ రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథనాయిక. సముద్రఖని కీలక పాత్ర పోషిస్తున్నారు. నటుడిగా దుల్కర్‌ 13 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా 'కాంత' చిత్రంలోని ఆయన లుక్‌ని విడుదల చేశారు. 'దుల్కర్‌ కెరీర్‌లాగానే ఈ సినిమా కూడా గొప్ప ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుంది' అని చిత్ర దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్‌ చెప్పారు.

పార్వతీ నాయర్‌ నిశ్చితార్థం



చెన్నైకి చెందిన వ్యాపారవేత్త ఆశ్రిత్‌ అశోక్‌తో నటి పార్వతీ నాయర్‌ నిశ్చితార్థం ఇటీవలె జరిగింది. దానికి సంబంధించిన ఫొటోలు సోషల్‌ మీడియాలో వైరల్‌ అవుతున్నాయి. ఇరు కుటుంబాల పెద్దలు త్వరలోనే పెళ్లి తేదీని నిర్ణయించనున్నారు. పార్వతీ నాయర్‌ కేరళలో జన్మించారు. అబుదాబీలో పెరిగారు. ఆమె తండ్రి వ్యాపారవేత్తగా దుబాయ్‌లో స్థిరపడ్డారు. అబుదాబిలో పాఠశాల విద్యను పూర్తిచేసిన పార్వతి నాయర్‌, 15 ఏళ్లకే మోడలింగ్‌లోకి అడుగుపెట్టారు. ఇంజనీరింగ్‌ చదువుతూనే మోడలింగ్‌ కొనసాగించారు. కర్ణాటక 'మైసూర్‌ శాండల్‌ సోప్‌ బ్రాండ్‌ అంబాసిడర్‌గా వ్యవరించారు. మిస్‌ కర్ణాటక, ఫెమినా మిస్‌ ఇండియా పోటీల్లో బహుమతులు గెల్చుకున్నారు. 2012లో 'పాపిన్స్‌' అనే మలయాళ చిత్రంతో తెరంగేట్రం చేశారు. పలు కన్నడ, తమిళ చిత్రాల్లో నటించారు. చివరగా విజయ్‌ నటించిన 'ది గ్రేటెస్ట్‌ ఆఫ్‌ ఆల్‌టైమ్‌' చిత్రంలో కీలక పాత్రను పోషించారు.

తండేల్‌ .. పెద్ద హిట్‌ అవుతుంది



బన్నీ వాసు

'మత్స్యలేశ్యం అనే ఊరుని బేస్‌ చేసుకుని తయారు చేసిన కథ ఇది. అక్కడి వారు గుజరాత్‌ పోర్టుకి ఫిషింగ్‌కు వెళతారు. అక్కడ బోటు ఉన్న వారికి బిరుదులు ఉంటాయి. మొయిన్‌ లీడర్‌ని తండేల్‌ అంటారు. అది గుజరాతీ పదం. ఇది ప్యూర్‌ లవ్‌ స్టోరీ. అలాగే గూస్‌ బంప్స్‌ మూమెంట్స్‌ చాలా ఉంటాయి. సినిమా తప్పకుండా పెద్ద హిట్‌ అవుతుంది' అని చెప్పారు నిర్మాత బన్నీ వాసు. నాగచైతన్య, సాయి పల్లవి జంటగా చందు మొండేటి దర్శకత్వంలో రూపొందిన 'తండేల్‌' చిత్రం ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ సందర్భంగా బన్నీ వాసు మీడియాతో ముచ్చటిస్తూ చెప్పిన విషయాలివి.

- రచయిత కార్తీక్‌ది మత్స్యలేశ్యం పక్క ఊరు. అక్కడి సంఘటనల నుంచి స్ఫూర్తి పొంది ఈ చిత్రకథ తయారు చేశారు. నాకు బాగా నచ్చింది. కథను డెవలప్‌ చేస్తూ చాలా రీసెర్చ్‌ చేశాం. కొంతమందిని కలిసినప్పుడు వారు చెప్పిన కొన్ని విషయాలు గూస్‌ బంప్స్‌ తీసుకొచ్చాయి. ఆ విషయాలన్నీ చెప్పడానికి రాజు, సత్య అనే ఫిక్షనల్‌ క్యారెక్టర్స్‌ను దర్శకుడు చందు డిజైన్‌ చేశారు.
- రాజు, సత్యల ప్రేమకథ ఇది. ఆ లవ్‌స్టోరీ ద్వారా ఒరిజినల్‌గా జరిగిన కథను చూపించాం. ఇందులో యాభై శాతం ఫిక్షన్‌ ఉంటుంది. నాగచైతన్యకు ఈ చిత్రకథ బాగా నచ్చింది. ఇందులో చేపలు పట్టే వాడి పాత్రలో పరకాయ ప్రవేశం చేయడానికి ఆయన తీసుకున్న శ్రద్ధ అద్భుతం. యాస మీద కూడా వర్క్‌వుట్‌ చేశారు. అలాగే సాయిపల్లవి కూడా చైతుకి మ్యాచ్‌ అయ్యేలా నటించారు. శివుడి పాటలో వాళ్లిద్దరు చేసిన నృత్యం థియేటర్స్‌లో పూనకాలు తెప్పిస్తుంది.
- సినిమా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదలవుతోంది. అరవింద్‌గారు సినిమాను చూడడంతో చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. మాకు ఇంత లైఫ్‌ ఇచ్చిన ఆయన అంత ఎంజాయ్‌ చేస్తుంటే చూడముచ్చటగా ఉంది.

చివరి వరకూ ఉత్కంఠనిస్తుంది



- వినోద్‌కుమార్‌

సాయిరామ్‌ శంకర్‌ కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఒక పథకం ప్రకారం'. వినోద్‌కుమార్‌ విజయన్‌ దర్శకత్వంలో గార్లపాటి రమేశ్‌ నిర్మించారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు వినోద్‌ మీడియాతో ముచ్చటించారు. "ఇది ఒక స్క్రీన్‌ప్లే బేస్డ్‌ చిత్రం. చాలా నిజాయితీతో ఈ కథను తెరకెక్కించాం. ఇందులో వాణిజ్యాంశాలతో పాటు సందేశం కూడా ఉంటుంది. థియేటర్ల నుంచి బయటకు వెళ్లాక కూడా ప్రేక్షకులను వెంటాడే చిత్రమిది. సినిమా ప్రారంభం నుంచి ముగింపు వరకు ఉత్కంఠనిస్తుంది. తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందిస్తుంది. ఇందులో సాయిరామ్‌ శంకర్‌ విభిన్నంగా కనిపిస్తాడు. ఆయన పాత్రలో చాలా షేడ్స్‌ ఉంటాయి. సముద్రఖని, శృతి సోధి, ఆషిమా నర్వాల్‌ పోషించిన పాత్రలు ఆకట్టుకుంటాయి. సంగీతం, విజువల్స్‌ ఈ చిత్రానికి ప్రధానాకర్షణగా నిలుస్తాయి. నిర్మాత ఎక్కడా రాజీపడకుండా సినిమాను నిర్మించారు. ఒక్క క్షణం కూడా బోర్‌ కొట్టదు. ఈ ప్రయోగాత్మక చిత్రం ప్రేక్షకులకు విపరీతంగా నచ్చుతుంది. ఈ సీట్‌ ఎడ్జ్‌ సస్పెన్స్‌ థ్రిల్లర్‌ కచ్చితంగా విజయవంతమవుతుందనే నమ్మకం ఉంది" అని చెప్పారు.

కొత్తగా...

యూత్‌కు నచ్చే చిత్రం



'కొత్తగా మా ప్రయాణం' ఫేమ్‌ ఈశ్వర్‌, నైనా సర్వర్‌ జంటగా నటిస్తున్న చిత్రం 'సూర్యాపేట్‌ జంక్షన్‌'. రాజేశ్‌ నాదెండ్ల దర్శకత్వంలో అనిల్‌కుమార్‌ కాట్రగడ్డ, ఎన్‌.శ్రీనివాసరావు నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత అనిల్‌కుమార్‌ కాట్రగడ్డ మాట్లాడుతూ "ఇందులో హీరోగా నటించిన ఈశ్వర్‌ తన అద్భుతమైన నటనతో కథకు న్యాయం చేశాడు. పాటలు అందరినీ ఆకట్టుకుంటాయి" అని చెప్పారు. "ప్రభుత్వం అందించే ఉచిత పథకాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. వీటి వల్ల ప్రజలు ఎంతగా నష్టపోతున్నారో చూపించే చిత్రమిది" అని హీరో ఈశ్వర్‌ అన్నారు. "ఇది యూత్‌కు నచ్చే చిత్రం" అని హీరోయిన్‌ నైనా తెలిపారు.

ఆహ్లాదాన్ని పంచే 'సతీ లీలావతి'



లావణ్య త్రిపాఠి, మలయాళ నటుడు దేవ్‌ మోహన్‌ ప్రధాన పాత్రల్లో తాతినేని సత్య దర్శకత్వంలో నాగమోహన్‌ బాబు.ఎమ్‌, రాజేశ్‌ నిర్మించనున్న చిత్రం 'సతీ లీలావతి' పూజా కార్యక్రమాలు సోమవారం జరిగాయి. నటుడు వరుణ్‌తేజ్‌, చిత్ర సమర్పకులు జెమినీ కిరణ్‌, నిర్మాతలు హరీశ్‌ పెద్ది, వి.ఆనంద ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత హరీశ్‌ పెద్ది క్లాప్‌ కొట్టారు. వరుణ్‌తేజ్‌ కెమెరా స్విచ్‌ ఆన్‌ చేయగా, సీనియర్‌ డైరెక్టర్‌ టి.ఎల్‌.వి.ప్రసాద్‌ గౌరవ దర్శకత్వం వహించారు. చిత్ర దర్శకుడు తాతినేని సత్య మాట్లాడుతూ 'ఆహ్లాదాన్ని కలిగించే చక్కటి ఎంటర్‌టైనర్‌గా 'సతీ లీలావతి' రూపొందుతోంది. ఈ రోజు నుంచే రెగ్యులర్‌ షూటింగ్‌ ప్రారంభిస్తున్నాం' అని అన్నారు.

మహిషాసుర మర్దిని నేపథ్యంతో



రాయ్‌ ఫిల్మ్స్‌ బేనర్‌పై శ్రీనివాస్‌ సుబ్రహ్మణ్య నిర్మాణంలో రాకీ షెర్మన్‌ తెరకెక్కించిన చిత్రం 'కర్మస్థలం'. అర్చన శాస్త్రి, విఁతాలి చౌహాన్‌, వినోద్‌ అల్వా, కాలకేయ ప్రభాకర్‌, బలగం సంజయ్‌ ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సందర్భంగా ఫస్ట్‌లుక్‌ పోస్టర్‌ రిలీజ్‌ చేశారు. ఈ పోస్టర్‌లో కనిపించిన పాత్రలు, డిజైన్‌ చేసిన తీరు ఆకట్టుకునేలా ఉంది. హీరోయిన్‌ అర్చన మాట్లాడుతూ 'మహిషాసుర మర్దిని నేపథ్యంతో ఈ మూవీని తెరకెక్కించారు' అని తెలిపారు. చిత్ర దర్శకుడు రాకీ షెర్మన్‌ మాట్లాడుతూ 'పాన్‌ ఇండియా రేంజ్‌లో ఆకట్టుకునేలా ఈ సినిమా ఉంటుంది' అని చెప్పారు.

శివరాత్రికి విడుదల



కన్నడ హీరో ప్రజ్వల్‌ దేవరాజ్‌ హీరోగా లోహిత్‌ హెచ్‌ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రాక్షస'. ఈ చిత్రం తెలుగు రైట్స్‌ని ఎంవీఆర్‌ కృష్ణ దక్కించుకున్నారు. శివరాత్రి సందర్భంగా ఈనెల 26న థియేటర్లలో విడుదలవుతోంది. తాజాగా ఈ మూవీ తెలుగు ట్రైలర్‌ను రిలీజ్‌ చేశారు. ఇందులో ప్రజ్వల్‌ దేవరాజ్‌ డిఫరెంట్‌ లుక్‌లో కనిపిస్తూ ఆకట్టుకున్నారు. కూతురుపై ప్రేమతో హీరో చేసే చర్యలు సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ సందర్భంగా నిర్మాత ఎంవిఆర్‌ కృష్ణ మాట్లాడుతూ..'ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్‌ ఎక్స్‌పీరియెన్స్‌ను అందిస్తుంది. అందరూ ఇష్టపడేలా సినిమా ఉంటుంది' అని అన్నారు.

తీవ్ర ఒత్తిడికి లోనయ్యా..



టాటా స్టీల్ చెస్ విజేత ప్రజ్ఞానంద

వి కాన్‌జీ: తన కెరీర్‌లోనే..ఆదివారంనాడు ఎంతో ఒత్తిడికి లోనయ్యానని టాటా స్టీల్ చెస్ చాంపియన్ ప్రజ్ఞానంద తెలిపాడు. ఉత్కంఠభరిత టైబ్రేకర్‌లో 2-1తో సహచర గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ చాంపియన్ గుకేష్‌ను కంగుతినిపించిన ప్రజ్ఞానంద ఈ టోర్నీ మాస్టర్స్ విభాగం విజేతగా నిలిచిన విషయం విదితమే. 13 రౌండ్ల ప్రతిష్ఠాత్మక టాటా చెస్ టోర్నీ ఆదివారం ఇక్కడ ముగిసింది. అయితే టైటిల్ రేస్‌లో నిలిచిన భారత గ్రాండ్‌మాస్టర్లు గుకేష్, ప్రజ్ఞానంద చివరి రౌండ్‌లో ఓడారు. విన్సెంట్ కీమర్ (జర్మనీ) చేతిలో ఆఖరి రౌండ్‌లో ప్రజ్ఞానంద ఓటమి చవిచూశాడు. మరోవైపు తెలంగాణ గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసి..గుకేష్‌కి షాకిచ్చాడు. దాంతో చెన్నై టీనేజర్లు గుకేష్, ప్రజ్ఞానంద చెరో 8.5 పాయింట్లతో సమవుజ్జీలుగా నిలిచారు. ఫలితంగా విజేతను నిర్ధారించేందుకు రెండు బ్లిట్జ్ గేమ్‌ల టైబ్రేకర్ నిర్వహించాల్సి వచ్చింది. హోరాహోరీగా సాగిన తొలి గేమ్‌లో 18 ఏళ్ల గుకేష్ గెలిచాడు. నువ్వా..నేనా అనేలా జరిగిన రెండో గేమ్‌లో 19 ఏళ్ల ప్రజ్ఞానంద నెగ్గడంతో స్కోరు సమమైంది. దాంతో సడెన్ డెత్ అనివార్యమైంది. ఇందులో నెగ్గిన ప్రజ్ఞానంద తొలిసారి 'టాటా' టైటిల్ అందుకున్నాడు. చాలెంజర్స్ విభాగం టైటిల్‌ను వాన్ ఎంగ్యుయెన్ (చెక్ రిపబ్లిక్) దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా ప్రజ్ఞానంద మాట్లాడుతూ.. 'టైటిల్ సొంతం చేసుకోవాలన్న లక్ష్యంతోనే ఇక్కడికి వచ్చా. పోటీ చాలా తీవ్రంగా ఉన్నా ఫలితం రాబట్టా. అందువల్ల ఈ విజయాన్ని మాటల్లో వర్ణించలేను. విజేతగా నిలిచినందుకు చాలా సంతోషంగా ఉంది' అని చెప్పాడు. 'ఆదివారంనాటి ఒత్తిడి నా కెరీర్‌లో ఎప్పుడూ ఎదురు కాలేదు. కొన్ని సంవత్సరాల కిందట సహచరుడు అర్జున్‌తో జరిగిన సడెన్ డెత్ పోరులో కూడా ఇంత ఒత్తిడికి లోనుకాలేదు' అని ప్రజ్ఞానంద తెలిపాడు. కాగా..వరుసగా రెండో ఏడాదీ గుకేష్‌కు టాటా టైటిల్ అందని ద్రాక్షే అయ్యింది. గతేడాది వీ యి (చైనా)తో జరిగిన టైబ్రేకర్‌లోనూ గుకేష్‌కు నిరాశే ఎదురైంది.

నా దగ్గర ఐదున్నాయ్: విషీ



టాటా స్టీల్ చెస్ టోర్నీ ట్రోఫీ అందుకున్న ప్రజ్ఞానందను దిగ్గజ గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ అభినందించాడు. ఆనంద్ తర్వాత ఈ టోర్నమెంట్ టైటిల్ గెలిచిన రెండో భారత ఆటగాడు ప్రజ్ఞానంద కావడం విశేషం. ప్రజ్ఞానందను అభినందిస్తూ..అతడు టాటా ట్రోఫీతో ఉన్న ఫొటోను పోస్ట్ చేసిన విషీ.. దానికి ఓ సరదా క్యాప్షన్ జత చేశాడు. 'నా వద్ద అలాంటివి ఐదున్నాయి' అని రాశాడు. టాటా చెస్ టోర్నీలో ఆనంద్ ఏకంగా ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచాడు. దాన్ని గుర్తు చేస్తూ ఆనంద్ అలా కామెంట్ చేశాడు.

నమ్మకాన్ని నిలబెట్టా!

గొంగడి త్రిషా రెడ్డి.. ఐసీసీ అండర్-19 వరల్డ్‌కప్ విజయంతో దేశం మొత్తం ఇప్పుడు ఈ తెలుగమ్మాయి పేరు మార్మోగుతోంది. ఆ మెగా టోర్నీలో ధనాధన్ బ్యాటింగ్‌తో పాటు జట్టుకు అవసరమైన సమయంలో కీలక వికెట్లు పడగొట్టి నమ్మదగ్గ ఆల్‌రౌండర్‌గా ముద్ర వేసుకుంది. ప్లాస్టిక్ బ్యాట్, టెన్నిస్ బాల్‌తో మొదలైన తన క్రికెట్ ప్రయాణం ఇప్పుడు జాతీయ జట్టులో కీలక సభ్యురాలి స్థాయికి ఎదిగింది. ఏడాది కిందటే మొదలైన మిషన్ వరల్డ్‌కప్‌ను విజయవంతంగా ఎలా అమలు చేశారు? ఇందులో త్రిష పాత్ర ఏమిటి? తదితర అంశాలపై ఆంధ్రజ్యోతితో త్రిష పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లోనే..



అండర్-19 వరల్డ్‌కప్ స్టార్ త్రిష

ఈ వరల్డ్‌కప్ మిషన్‌ను బీసీసీఐ నిరుడే ప్రారంభించింది. మెగా టోర్నీ ప్రాబబుల్స్‌ను కుదించాక మిగిలిన బృందంలోని ప్రతి ఒక్క క్రికెటర్‌తో సెలెక్టర్లు, టీమ్ మేనేజ్‌మెంట్ విడివిడిగా మాట్లాడి మా నుంచి జట్టు ఏం ఆశిస్తోందో వివరంగా చెప్పారు. కొన్ని లక్ష్యాలను నిర్దేశించారు. వాటిని అందుకోవడానికి అనుసరించాల్సిన ప్రణాళికలను ముందుంచారు. వారి మాటలు విన్నాక ఈ ఏడాది కాలం నా జీవితంలో ఎంత ముఖ్యమైనదో అర్థమైంది. ఆ లక్ష్యాలను చేరుకునేందుకు మానసికంగా, శారీరకంగా, ఆట పరంగా నన్ను నేను మలుచుకున్నా. ఈ ప్రయాణంలో నాకు ఏ పనీ కష్టంగా అనిపించలేదు. సుదీర్ఘ కాలం టీమిండియాకు ప్రాతినిథ్యం వహించాలనేది నా ఆశయం. దీన్ని చేరుకోవాలంటే ఒక బలమైన పునాది వేసుకోవాలి. అందుకు ఈ వరల్డ్‌కప్‌ను సరైన వేదికగా భావించా. 2023 టీ20 ప్రపంచకప్ గెలిచిన జట్టులో నేను సభ్యురాలినే అయినా నాకు అన్ని మ్యాచ్‌ల్లోనూ ఆడే అవకాశం రాలేదు. ఈసారి వరల్డ్‌కప్ మొదలయ్యే ముందు టీమ్ మేనేజ్‌మెంట్ నుంచి నాకు ఈ విషయంలో ఒక స్పష్టమైన హామీ లభించింది. వారి నుంచి పూర్తి మద్దతు, స్వేచ్ఛ లభించడంతో నా పూర్తి శక్తి సామర్థ్యాలను ప్రదర్శించడానికి అవకాశం చిక్కింది. అవకాశాలు రానప్పుడు పడిన బాధ, పుట్టిన కసితో ఈ వరల్డ్‌కప్‌లో నేనేంటో రుజువు చేసుకోగలిగా. టీమ్ మేనేజ్‌మెంట్, జట్టు నాపైన ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టినందుకు, నాకు అప్పగించిన బాధ్యతలను పరిపూర్ణంగా నిర్వర్తించినందుకు సంతోషంగా ఉంది.

టెన్నిస్ బాల్‌తో పవర్ హిట్టింగ్..

బాల్యంలో ప్లాస్టిక్ బ్యాట్, టెన్నిస్ బాల్‌తో క్రికెట్ ఆడేదాణ్ని. ఆ తర్వాత హిట్టింగ్‌ను అవపోసన పట్టడానికి నా వ్యక్తిగత కోచ్ సూచన మేరకు టెన్నిస్ బాల్‌తో ఎక్కువ సాధన చేశా. ఇది పవర్ హిట్టింగ్‌కు బాగా ఉపయోగపడింది. బౌలింగ్ యాక్షన్‌లో చేసుకున్న కొద్దిపాటి మార్పులు కూడా ఈ టోర్నీలో ఎక్కువ వికెట్లు తీసేందుకు ఉపయోగపడింది.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

మిథాలీ, ధోనీ నుంచి నేర్చుకున్నా

ఒత్తిడిలో బ్యాటింగ్, బౌలింగ్ చేయడాన్ని ఆస్వాదిస్తా. హైదరాబాద్ జట్టుకు ఆడుతున్నప్పట్నుంచే ఇది అలవర్చుకున్నా. నా ఆరాధ్య క్రికెటర్ మిథాలీ రాజ్‌పై ఉన్న అభిమానంతో ఆమె ఆటను నిశితంగా గమనించేదాన్ని. మైదానంలో మిథాలీ దృక్పథం మిగిలిన క్రికెటర్లతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. అలానే ప్రత్యర్థులకు తగ్గట్టు మైదానంలో చురుగ్గా వ్యూహాలను మార్చే నైపుణ్యాలను ధోనీని చూసి నేర్చుకున్నా. ఈ ఇద్దరు క్రికెటర్లలోని ఈ రెండు అంశాలు నాపై తెలియని ప్రభావం చూపాయి. సాధ్యమైనంత త్వరగా పిచ్‌పై ఒక అంచనా వస్తే తర్వాత ఎలాంటి బౌలర్‌నైనా సులభంగా ఎదుర్కోవచ్చు అనేది నా నమ్మకం. ఆ విధంగానే ఆడడంతో ఈ టోర్నీలో నాకు ఏ బౌలర్ నుంచీ పెద్దగా ఇబ్బందులు ఎదురుకాలేదు.

ఆ ఇద్దరి త్యాగాల వల్లే..

నా క్రికెట్ ప్రయాణంలో నాన్న (రామిరెడ్డి) కష్టం ఎంత ఉందో, అమ్మ (మాధవి) శ్రమ కూడా అంతే దాగి ఉంది. వారిద్దరి పట్టుదల, త్యాగాలతోనే ఈ స్థాయికి రాగలిగా. ఒక అమ్మాయి క్రీడల్లో ఈ స్థాయికి చేరిందంటే అందులో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమైనది. నా కుటుంబసభ్యుల సహకారం, ప్రోత్సాహంతో మున్ముందు మరిన్ని విజయాలు సాధిస్తా.

ఐసీసీ జట్టులో త్రిష, కమలిని



కమలిని

దుబాయ్: మహిళల అండర్-19 టీ20 వరల్డ్‌కప్‌లో విశేషంగా రాణించిన ప్లేయర్లతో కలిపి ఐసీసీ ఓ జట్టును ప్రకటించింది. ఇందులో భారత్ నుంచి ఏకంగా నలుగురికి చోటు దక్కడం విశేషం. ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా నిలిచిన జి.త్రిషతో పాటు కమలిని, ఆయుషి శుక్లా, వైష్ణవి శర్మ ఈ ఐసీసీ మహిళల అండర్-19 టీ20 వరల్డ్‌కప్ జట్టులో ఉన్నారు. దక్షిణాఫ్రికాకు చెందిన కైలా రెనెకెను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఇక నిక్కీ ప్రసాద్ కెప్టెన్సీలో భారత అమ్మాయిల జట్టు అజేయంగా ఫైనల్‌కు చేరి, రెండోసారి చాంపియన్ అయిన విషయం తెలిసిందే.

సంజూకు గాయం

ఆరు వారాల విశ్రాంతి

ముంబై: భారత టీ20 జట్టు వికెట్ కీపర్ సంజూ శాంసన్ చేతి వేలికి గాయమైంది. ఆదివారం ఇంగ్లండ్‌తో జరిగిన ఐదో టీ20లో పేసర్ ఆర్చర్ వేసిన బంతి సంజూ కుడిచేతి చూపుడు వేలికి బలంగా తాకింది. ఆ తర్వాత ఫీల్డింగ్‌కు దూరమైన తను స్కానింగ్‌కు వెళ్లగా.. ఫ్రాక్చర్ అయినట్టు తేలింది. దీంతో ఐదు నుంచి ఆరు వారాల పాటు అతడు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సూచించారు. ప్రస్తుతం తన స్వస్థలం తిరువనంతపురం చేరుకున్నాడని, పునరావాసం కోసం త్వరలోనే బెంగళూరులోని ఎన్‌సీఏకు వెళ్లనున్నట్టు సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. గాయం వల్ల ఈనెల 8 నుంచి జరిగే రంజీ క్వార్టర్స్ మ్యాచ్‌కు సంజూ దూరమయ్యాడు. తాజా టీ20 సిరీస్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన సంజూ 5 మ్యాచ్‌ల్లో 51 రన్స్ మాత్రమే చేసి నిరాశపరిచాడు. పేసర్లు ఆర్చర్, ఉడ్, సకీబ్ షార్ట్ పిచ్ బంతులను ఆడలేక పవర్‌ప్లేలోనే వికెట్ సమర్పించుకున్నాడు. ప్రస్తుతం భారత వన్డే జట్టులో కూడా లేని శాంసన్ తిరిగి టీ20 బరిలోకి దిగాలంటే ఆగస్టులో బంగ్లాదేశ్‌తో సిరీస్ వరకు వేచిచూడాలి.

జట్టు మారింది..

సూర్యకుమార్ కెప్టెన్సీలో భారత టీ20 జట్టు ఇంగ్లండ్‌పై 4-1తో సిరీస్ గెలుచుకుంది. ఇక ఇప్పుడు మూడు వన్డేల సిరీస్‌లో రోహిత్ కెప్టెన్సీలో సరికొత్త జట్టుతో బరిలోకి దిగనుంది. ఈనెల 6,9,12తేదీల్లో ఈ మ్యాచ్‌లు జరుగనున్నాయి. చాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత్ ఆడే సన్నాహక మ్యాచ్‌లు ఇవే కానున్నాయి. దీంతో ఈ సిరీస్ ద్వారా తుది జట్టుపై ఓ అంచనాకు రావచ్చు. టీ20 సిరీస్‌లో ఆడిన హార్దిక్, సుందర్, షమి, అక్షర్, అర్ష్‌దీప్, హర్షిత్ మాత్రమే వన్డే టీమ్‌లో ఉన్నారు. సూర్య, తిలక్, దూబే, అభిషేక్, వరుణ్, బిష్ణోయ్, రింకూ తదితరులకు వన్డే జట్టులో చోటు లభించలేదు. కాగా, కోహ్లీ, జైస్వాల్, గిల్, రాహుల్, పంత్, జడేజా, కుల్దీప్‌లాంటి స్టార్లతో కూడిన భారత్ వన్డే సిరీస్‌లోనూ ఇంగ్లండ్‌ను ఓడించాలన్న పట్టుదలతో ఉంది.

సురభి, జ్యోతికి కాంస్యాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ క్రీడల్లో తెలుగు రాష్ట్రాల ఖాతాలో చెరో కాంస్య పతకం చేరింది. సోమవారం డెహ్రాడూన్‌లో జరిగిన మహిళల షూటింగ్ 50 మీటర్ల 3పీ విభాగంలో తెలంగాణలోని జమ్మికుంటకు చెందిన షూటర్ రాపోలు సురభీ భరద్వాజ్ 448.8 పాయింట్లతో కాంస్యం కైవసం చేసుకుంది. వెయిట్ లిఫ్టింగ్ 87 ప్లస్ కిలోల విభాగంలో ఏపీకి చెందిన విజయనగరం లిఫ్టర్ సత్య జ్యోతి కాంస్యం గెలుచుకుంది. జ్యోతి స్నాచ్‌లో 92 కి., క్లీన్ అండ్ జెర్క్‌లో 109 కి., మొత్తంగా 201 కిలోల బరువెత్తి మూడో స్థానంలో నిలిచింది. ఇతర పోటీల్లో ఆర్చరీ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ఆంధ్ర జట్టు ఫైనల్ చేరి పతకం ఖాయం చేసుకుంది. సెమీస్‌లో గణేష్ (నెల్లూరు), సూర్య హన్సిని (భీమవరం) జోడీ 153-148తో జమ్మూకశ్మీర్ జంటపై నెగ్గింది. ఈనెల 7న హరియాణాతో ఫైనల్ జరగనుంది. తెలంగాణ మహిళల జట్టు 3X3 బాస్కెట్‌బాల్ ఈవెంట్ ఫైనల్ చేరి పతకం ఖాయం చేసుకుంది. ఇదే విభాగంలో పురుషుల జట్టు సెమీస్‌లో ఓడి, మూడో స్థానం కోసం మంగళవారం తమిళనాడుతో పోటీపడనుంది.

మోడల్‌తో అభిషేక్ డేటింగ్?



న్యూఢిల్లీ: టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ ఇంగ్లండ్‌తో చివరి టీ20లో సూపర్ సెంచరీ కొట్టి అందరి దృష్టినీ ఆకర్షించాడు. దీంతో అతడి వ్యక్తిగత విషయాల గురించి నెట్‌లో వెతకడం ఎక్కువైంది. ఈ క్రమంలో అతడు మోడల్ లైలా ఫైజల్‌తో డేటింగ్‌లో ఉన్నాడనే వార్తలు వినిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే లైలా..ప్రముఖ లగ్జరీ దుస్తుల బ్రాండ్ యజమాని అని తెలుస్తోంది. వీరిద్దరూ చనువుగా ఉన్న ఫొటోలు కూడా నెట్‌లో చక్కర్లు కొడుతున్నాయి. కాగా, అభిషేక్ గతంలో తాన్యా సింగ్ అనే మోడల్‌తో ప్రేమాయణం నడిపాడనే వార్తలు కూడా ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. నిరుడు ఫిబ్రవరిలో ఆమె ఆత్మహత్య చేసుకోగా..అభిషేక్‌ను పోలీసులు విచారించారని సమాచారం.

బీపీఎల్‌లో జీతాల గోల!

● ఆటగాళ్ల కిట్‌లు ఇవ్వనన్న డ్రైవర్
● బస్సులోనే ఉంచి తాళం

ఢాకా: బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్)లో నాటకీయ పరిణామం చోటు చేసుకొంది. ఫ్రాంచైజీ దర్బార్ రాజ్‌షాహి జీతాలు చెల్లించక పోవడంతో ఆ జట్టును తీసుకెళ్లే బస్సు డ్రైవర్ ఆటగాళ్ల కిట్‌లను బస్సులో ఉంచి తాళం వేయడం చర్చనీయాంశంగా మారింది. తనకు బకాయిపడిన జీతాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశాడు. 'ఇదెంతో సిగ్గుపడాల్సిన విషయం. మా జీతం బకాయిలు చాలా ఉన్నాయి. పూర్తి జీతాలు చెల్లిస్తేనే కిట్ బ్యాగులు ఇస్తా. ఇకపై నేనిక్కడ పనిచేయాలనుకోవడం లేద'ని ఆ డ్రైవర్ విలేకరులతో చెప్పాడు. కొందరు విదేశీ క్రికెటర్లకు కూడా రాజ్‌షాహి జీతాలు ఇవ్వలేదట.

బిజినెస్

ఈసారి పావు శాతం 'రెపో కోత'

రేపటి నుంచి ఎంపీసీ సమావేశం

ముంబై: వినియోగ ఆధారిత వృద్ధి కోసం కేంద్ర బడ్జెట్లో తీసుకున్న చర్యలకు మద్దతుగా ఈ వారంలో ఆర్‌బీఐ రెపో రేటులో 0.25 శాతం కోత విధించవచ్చని నిపుణులంటున్నారు. అదే జరిగితే రెండేళ్ల పాటు యథాతథంగా కొనసాగించిన అనంతరం రెపో రేటు తగ్గించినట్టవుతుంది. 2023 ఫిబ్రవరి సమీక్ష నుంచి (2022-23 ఆర్థిక సంవత్సరంలో చివరి సమీక్ష) రెపో రేటు 6.5 శాతం వద్దనే నిలకడగా ఉంది. 2020 మే నెలలో (కొవిడ్ సమయం) ఆర్‌బీఐ చివరి సారిగా రెపో రేటును తగ్గించింది. గత ఏడాదిలో ఎక్కువ కాలం ద్రవ్యోల్బణం ప్రభుత్వం ఆర్‌బీఐకి నిర్దేశించిన గరిష్ఠ కట్టడి పరిధి (6 శాతం) కన్నా దిగువనే ఉండడం ఆర్‌బీఐకి సానుకూలాంశమని వారంటున్నారు. ఆర్‌బీఐ గవర్నర్‌గా పగ్గాలు చేపట్టిన సంజయ్ మల్హోత్రా నాయకత్వంలో ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం బుధవారం ప్రారంభ కానుంది. శుక్రవారం నాడు ఎంపీసీ నిర్ణయాలను మల్హోత్రా ప్రకటిస్తారు.

దివీస్ లేబొరేటరీస్ లాభం రూ.589 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.2,401 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.589 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.358 కోట్లు)తో పోల్చితే లాభం 65 శాతం వృద్ధి చెందింది. కాగా ఈ ఏడాది జనవరి 1 నుంచి కాకినాడ ప్రాజెక్ట్‌లోని యూనిట్ 3 వాణిజ్యపరమైన కార్యకలాపాలు ప్రారంభించిందని తెలిపింది. ప్రాజెక్ట్‌లోని మిగిలిన యూనిట్లు వచ్చే ఆరు నెలల్లో అందుబాటులోకి వస్తాయని అంచనా వేస్తున్నట్లు దివీస్ లేబొరేటరీస్ పేర్కొంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	103	విజయవాడ	119
వరంగల్	103	గుంటూరు	112
కరీంనగర్	103	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	90
కర్నూలు	103	నెల్లూరు	95
విశాఖపట్నం	111	అనంతపురం	95
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	84,050 ▼	77,050 ▼	1,07,000 ▲
విజయవాడ	85,500 ▲	80,500 ▲	94,000 ▼
విశాఖపట్నం	83,050 ▲	76,130 ▲	94,200 ▼
రాజమండ్రి	84,050 ▼	77,050 ▼	96,400 ▲
ప్రొద్దుటూరు	83,600 ▼	77,460 ▼	94,000 ▼
ముంబై	82,704 ▲	75,757 ▲	93,313 ▼

ట్రంప్.. టారిఫ్.. టెర్రర్!

అమెరికా అధ్యక్షుడి సుంకాల మోత.. వాణిజ్య యుద్ధ భయాలతో గజగజ



అగ్రరాజ్యాధిపతి డొనాల్డ్ ట్రంప్ అన్నంత పని చేశాడు. చైనా, కెనడా, మెక్సికో.. ఇలా ఒక్కో దేశంపై వరుసపెట్టి సుంకాల మోత మోగించేస్తున్నాడు. దాంతో ఆ దేశాలూ ప్రతికార చర్యలకు సిద్ధమవుతున్నాయి. ఇది అంతర్జాతీయ వాణిజ్య యుద్ధానికి దారితీయవచ్చని మార్కెట్ వర్గాలు భయాందోళనలకు గురవుతున్నాయి. ఈక్విటీ పెట్టుబడులను వారు పెద్దఎత్తున వెనక్కి తీసుకుంటుండటంతో ప్రపంచ మార్కెట్లు నష్టాల్లో పయనిస్తున్నాయి. మరోవైపు టారిఫ్ షాక్‌తో మన కరెన్సీ మరింత బక్కచిక్కింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ సరికొత్త జీవితకాల కనిష్ఠానికి పతనమైంది. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరున్న బంగారానికి డిమాండ్ పెరగడంతో ధరలు ఆల్‌టైమ్ గరిష్ఠానికి ఎగబాకాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలూ మళ్లీ పుంజుకుంటున్నాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే రూపాయి మరింత క్షీణించవచ్చని, పసిడి పరుగు ఆపకపోవచ్చని విశ్లేషకులంటున్నారు.

- ఈక్విటీ మార్కెట్ సూచీలు కుదేలు
- సరికొత్త రికార్డు కనిష్ఠానికి రూపాయి
- ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయికి బంగారం
- మళ్లీ ఎగబాకుతున్న ముడి చమురు



రూ.87 దాటిన డాలర్

భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక్కరోజే 49 పైసలు క్షీణించి రూ.87.11 వద్ద ముగిసింది. ఒక దశలో ఎక్స్ఛేంజ్ రేటు ఏకంగా 67 పైసల నష్టంతో రూ.87.29 స్థాయికి చేరినప్పటికీ.. మన కరెన్సీ మళ్లీ కాస్త కోలుకుంది. డాలర్‌తో మారకం రేటు రూ.87 స్థాయిని దాటడం ఇదే తొలిసారి. టారిఫ్‌ల ప్రభావంతో అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ బలపడటంతో పాటు ఈక్విటీ మార్కెట్లో నష్టాలు ఇందుకు కారణమయ్యాయి. ముడి చమురు ధరల పెరుగుదల కూడా రూపాయిపై ఒత్తిడి పెంచింది. డాలర్ క్రమంగా బలపడుతుండటంతో పాటు మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోతున్న నేపథ్యంలో రూపాయిపై ఒత్తిడి కొనసాగనుందని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి అన్నారు. ఆర్‌బీఐ జోక్యం చేసుకుంటే మన కరెన్సీకి కొంత మద్దతు లభించవచ్చన్నారు. కాగా, 6 అంతర్జాతీయ కరెన్సీలతో పోలిస్తే డాలర్ ఇండెక్స్ 1.01 శాతం పెరిగి 109.46కు చేరుకుంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ రకం ముడి చమురు పీపా ధర ఒక దశలో 1.41 శాతం పెరిగి 76.74 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

ఆరంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 750 పాయింట్లు డౌన్

ప్రామాణిక ఈక్విటీ సూచీలు సోమవారం భారీ నష్టాలతో ట్రేడింగ్ ఆరంభించాయి. సెన్సెక్స్ ఒక దశలో 749.87 పాయింట్లు కోల్పోయి 76,756.09 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. మధ్యాహ్నం నుంచి కాస్త కోలుకున్న సూచీ.. 319.22 పాయింట్ల నష్టంతో 77,186.74 వద్ద ముగిసింది. నిఫ్టీ 121.10 పాయింట్లు కోల్పోయి 23,361.05 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 20 నష్టపోయాయి. ఎల్ అండ్ టీ షేరు 4.64 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. టాటా మోటార్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఏషియన్ పెయింట్స్, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ షేర్లు 2 శాతానికి పైగా విలువను కోల్పోయాయి. ప్రధాన షేర్లతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి కంపెనీల స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి అధికమైంది. దాంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.77 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.89 శాతం పతనమయ్యాయి. రంగాల వారీ సూచీల్లో క్యాపిటల్ గూడ్స్ అత్యధికంగా 4.29 శాతం క్షీణించగా.. ఇండస్ట్రియల్స్ 3.79 శాతం, పవర్ 3.30 శాతం నష్టపోయాయి. ఆయిల్ అండ్ గ్యాస్, ఎనర్జీ ఇండెక్స్‌లు 2 శాతానికి పైగా నష్టపోయాయి. బీఎస్ఈలో మొత్తం 4,184 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 2,962 నేల చూపు చూశాయి. 1,075 లాభపడగా..147 యథాతథంగా ముగిశాయి. 117 కంపెనీల షేర్లు ఏడాది కనిష్ఠానికి జారుకోగా.. 3 స్టాక్స్ లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. కాగా, మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.419.54 లక్షల కోట్లకు (4.82 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

గోల్డ్ @ రూ.85,000

పసిడి మళ్లీ కొండెక్కుతోంది. దేశీయంగా ధరలు సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయికి ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 స్వచ్ఛత బంగారం రేటు 10 గ్రాములు మరో రూ.400 పెరుగుదలతో రూ.85,300కు చేరుకుంది. పసిడి రూ.85,000 మైలురాయిని దాటడం ఇదే తొలిసారి. వెండి సైతం కిలోపై రూ.300 పెరుగుదలతో రూ.96,000 చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో వీటి ధరలు ఎగబాకడంతో పాటు దేశీయంగా రూపాయి విలువ పతనం ఇందుకు ప్రధాన కారణమయ్యాయని బులియన్ మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితుల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఈక్విటీల్లోని పెట్టుబడులను క్రమంగా బులియన్ వైపు మళ్లిస్తున్నారని బులియన్ నిపుణులు చెబుతున్నారు.

ఐటీలో నియామకాలు పెరుగుతున్నాయ్

కీలకంగా మారుతున్న జీసీసీలు.. ఎస్‌టీపీఐ డైరెక్టర్ కవిత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో మళ్లీ నియామకాలు ఊపందుకున్నాయని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) డైరెక్టర్ కవిత తెలిపారు. సోమవారం నాడిక్కడ హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐటీ సర్వీసులు సహా అన్ని విభాగాల్లో రిక్రూట్‌మెంట్స్ తిరిగి సాధారణ స్థాయికి చేరుకుంటున్నాయన్నారు. గతంలో కొంత స్తబ్దత నెలకొన్నప్పటికీ ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదన్నారు. ప్రధానంగా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ (జీసీసీ)లో పెద్దఎత్తున ఏర్పాటు అవుతుండటంతో పాటు ఉద్యోగాల కల్పన కూడా అదే స్థాయిలో ఉంటోందని తెలిపారు. హైదరాబాద్‌లో దాదాపు 110 జీసీసీలు ఉండగా నియామకాల్లో వాటి వాటా 25 శాతం వరకు ఉందన్నారు. కాగా గడచిన ఆర్థిక సంవత్సరంలో మొత్తం దేశ ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ వాటా 16.8 శాతంగా ఉందని కవిత తెలిపారు. ఇందులో జీసీసీల వాటానే 38 శాతం వరకు ఉందని ఆమె పేర్కొన్నారు. కొత్త జీసీసీలు పెద్దఎత్తున ఏర్పాటు కానుండటంతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఈ వాటా మరింత పెరగవచ్చని అంచనా వేస్తున్నట్లు ఆమె చెప్పారు.

11న హైసియా జాతీయ సమ్మిట్: ఈ నెల 11న హైదరాబాద్‌లో 32వ హైసియా జాతీయ సదస్సు, అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హైసియా ప్రెసిడెంట్ ప్రశాంత్ నందెళ్ల తెలిపారు. ఏఐ అండ్ బియాండ్: రీడిఫైనింగ్ ది ఫ్యూచర్ పేరుతో ఈ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. సదస్సులో భాగంగా లైఫ్ సైన్సెస్, సస్టేనబల్ సిస్టమ్స్, గ్రీన్ సాఫ్ట్‌వేర్, సిటీ సర్వీసులు, ఈ-గవర్నెన్స్ విభాగాల్లో ఏఐ ద్వారా వస్తున్న మార్పులపై విస్తృత స్థాయిలో చర్చాగోష్ఠిని నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.

పెరిగిన జీవీకే హోటల్స్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్ స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.33.89 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.24.21 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ రెవెన్యూ కూడా రూ.111.93 కోట్ల నుంచి రూ.128.66 కోట్లకు పెరిగింది. డిమాండ్ కొనసాగటంతో పాటు విస్తరణ కారణంగా ఆదాయం 15 శాతం పెరగటం ఎంతగానో కలిసి వచ్చిందని కంపెనీ పేర్కొంది. కాగా బెంగళూరులోని యెలహంకలో ఏర్పాటు చేస్తున్న హోటల్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని, వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో అందుబాటులోకి రావచ్చని అంచనా వేస్తున్నట్లు జీవీకే హోటల్స్ వెల్లడించింది.

గ్లాండ్ ఫార్మా లాభం రూ.205 కోట్లు

డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి గ్లాండ్ ఫార్మా.. రూ.1,384 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.205 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే లాభం 7 శాతం పెరిగినా ఆదాయం మాత్రం 10.4 శాతం తగ్గింది. ఫ్రాన్స్‌లోని యూనిట్‌లో ఉత్పత్తి సమస్యలు తలెత్తడం మూడో త్రైమాసికంలో కంపెనీ ఆదాయాన్ని దెబ్బతీసింది. అయితే ఖర్చులు 11 శాతం తగ్గడం కలిసివచ్చిందని కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్రీనివాస్ సాదు చెప్పారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	500
వరంగల్	462	గోదావరి	465
చిత్తూరు	533	విశాఖపట్నం	490
		డజను గుడ్లు రూ. 72	

జీఆర్‌టీ జువెలర్స్.. స్వర్ణ అవతారం



హైదరాబాద్: జీఆర్‌టీ జువెలర్స్ తన 60వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా వినియోగదారులు తమ పాత బంగారు ఆభరణాలను సరికొత్త ఆభరణాలుగా మార్చుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లో 'స్వర్ణ అవతారం', తమిళనాడులో 'తంగ అవతారం' పేరుతో దీన్ని అందుబాటులోకి తెచ్చింది. అంతేకాకుండా వినియోగదారులు తమ పాత బంగారాన్ని మార్పిడి చేసుకున్నప్పుడు గ్రాముకు అదనంగా రూ.75 అందించనున్నట్లు జీఆర్‌టీ జువెలర్స్ వెల్లడించింది. ఈ పరిమిత కాల ఆఫర్ కేవలం బంగారం ఎక్స్ఛేంజీలో మాత్రమే అందుబాటులో ఉండనుంది. బంగారు నాణేలు లేదా కడ్డీల కొనుగోళ్లకు ఈ ఆఫర్ అందుబాటులో ఉండదని జీఆర్‌టీ జువెలర్స్ తెలిపింది.

10 మంది ఎమ్మెల్యేల అనర్హతపై ఒకేసారి వాదనలు వింటాం!

బీఆర్‌ఎస్ శాసనసభ్యుల పార్టీ ఫిరాయింపులపై సుప్రీం స్పష్టీకరణ

ఏడుగురిపై చర్యలు కోరుతూ కేటీఆర్ పిటిషన్

ముగ్గురిపై అనర్హత వేయాలంటూ మరొకటి..

రెండింటినీ కలిపి విచారిస్తామన్న కోర్టు

విచారణ 10కి వాయిదా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. అదే పార్టీకి చెందిన మరో ముగ్గురు ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసుతో కలిపి ఈ నెల 10న విచారిస్తామని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. బీఆర్‌ఎస్ పార్టీ తరఫున కారు గుర్తుపై ఎమ్మెల్యేలుగా గెలిచిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్ కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్ గౌడ్, గూడెం మహిపాల్‌రెడ్డి, అరెకపూడి గాంధీలపై చర్యలు తీసుకునేలా అసెంబ్లీ స్పీకర్‌కు ఆదేశాలివ్వాలని కోరుతూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గత నెల 15న సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. కేటీఆర్ తరఫున సీనియర్ న్యాయవాది ఆర్యమ సుందరం వాదనలు వినిపించేందుకు సిద్ధమవుతుండగా.. మరో ముగ్గురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ ఈ నెల 10న విచారణకు రానుందని, దాంతో కలిపి దీన్ని కూడా విచారిస్తామని జస్టిస్ గవాయ్ స్పష్టం చేశారు. కాగా, బీఆర్‌ఎస్ టికెట్‌పై గెలిచి పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరిపై చర్యలు తీసుకునేలా అసెంబ్లీ స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద గత నెల 15న సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్లు (ఎస్‌ఎల్పీ) దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై గత నెల 31న విచారణ జరిపిన జస్టిస్ గవాయ్ ధర్మాసనం కేసును ఈ నెల 10కి వాయిదా వేసింది. అదే రోజున 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హతకు సంబంధించిన వాదనలను సుప్రీంకోర్టు విననుంది.

ఉప ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

» **పార్టీ నాయకులు, కార్యకర్తలకు కేటీఆర్ పిలుపు**



హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల స్థానాల్లో ఎప్పుడైనా ఉప ఎన్నికలు రావొచ్చని, సిద్ధంగా ఉండాలని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోకుండా స్పీకర్ కాలయాపన చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలని కేటీఆర్ జనవరి 29న సుప్రీంకోర్టులో రిట్ దాఖలు చేశారు. కాగా, ఈ పిటిషన్ సోమవారం ధర్మాసనం ముందుకు రాగా ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం తదుపరి విచారణను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు గత తీర్పులు చూస్తుంటే.. పార్టీ మారిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై వేటు పడడం ఖాయంగా కనిపిస్తోందని, ఫిరాయింపుదారులను కాంగ్రెస్ పార్టీ కాపాడటం అసాధ్యమని ఎక్స్ వేదికగా కేటీఆర్ పేర్కొన్నారు.



బాసర సరస్వతీ ఆలయంలో పిల్లలకు అక్షర శ్రీకారం జరిపిస్తున్న భక్తులు

బాసరలో చదువుల తల్లికి నీరాజనం

» **వేలాదిగా అక్షర శ్రీకార పూజలు**

బాసర, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని బాసర సరస్వతీ అమ్మవారి పుణ్యక్షేత్రం సోమవారం భక్తులతో కళకళలాడింది. వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని వేలాది సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అధికారులు పూజలకు రూ. వెయ్యి, రూ. 150 టికెట్‌లు ఏర్పాటు చేశారు. అయితే రూ. వెయ్యి టికెట్ క్యూలైన్‌లు భక్తులతో కిక్కిరిసి పోగా.. రూ. 150 టికెట్ గల క్యూలైన్‌లో భక్తుల రద్దీ పలుచగా కనిపించింది. ఎక్కువ డబ్బులు చెల్లించిన భక్తులకు 5 నుంచి 8 గంటల పాటు సమయం పట్టగా.. రూ. 150 టికెట్ తీసుకున్న వారికి 2 గంటల లోపే పూజలు పూర్తవడం గమనార్హం.

కామారెడ్డి డిక్లరేషన్ ఏమైంది?:పాయల శంకర్

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలను కాంగ్రెస్ పార్టీ మరోసారి మోసం చేస్తోందని బీజేఎల్పీ ఉప నేత పాయల శంకర్ మండిపడ్డారు. అధికారంలోకి వస్తే బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామంటూ ఎన్నికల ముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో ఆర్భాటంగా ప్రకటించారని, ఇప్పుడా హామీ ఏమైందని ఆయన నిలదీశారు. బీసీ సబ్ కమిటీకి నేతృత్వం వహించేందుకు బీసీ నేతలు లేకుండా పోయారని, పదేళ్లలో బీసీల సంఖ్య పెరిగితే, సర్వేలో తగ్గినట్లు చూపించారని ఆరోపించారు.

రుణమాఫీపై చర్చకు సిద్ధమా..!

» **కేటీఆర్‌కు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సవాల్**

పరిగి నియోజకవర్గంలో శివారెడ్డిపల్లిలో రైతు రుణమాఫీ.. బీఆర్‌ఎస్ హయాంలో ఎంతయిందో.. కాంగ్రెస్ హయాంలో ఎంతయిందో చర్చించేందుకు సిద్ధమా అంటూ కేటీఆర్‌కు ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సవాల్ విసిరారు. పరిగి నియోజకవర్గంలో రూ. వెయ్యి కోట్ల మేర రుణమాఫీ అయిందని, ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేసుకుంటే అది తెలుస్తుందని ఆయన చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో చేసిన చారాణా రుణమాఫీ వడ్డీలకే సరిపోలేదని ఎద్దేవా చేశారు.

త్వరలో లక్షమందితో రెడ్డి జనధర్మ యుద్ధభేరి సభ

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): త్వరలో లక్ష మందితో హైదరాబాదులో రెడ్డి జనధర్మ యుద్ధభేరి సభ నిర్వహించనున్నట్లు అఖిల భారత రెడ్డి జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లపై జరుగుతున్న కుట్రలను అడ్డుకోవడానికి ఈ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వరంగల్ బీసీ యుద్ధభేరి సభలో హద్దు మీరి, అసభ్యంగా మాట్లాడిన తీన్మార్ మల్లన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

ఏసీబీ వలకు చిక్కుతున్న లంచావతరాలు!

» **జనవరిలోనే 20 అవినీతి కేసుల నమోదు**

» **సోషల్ మీడియాలోనూ ఏసీబీకి ఫిర్యాదులు**



హైదరాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రజలతో నేరుగా సంబంధం ఉండే రెవెన్యూ, హోం, మునిసిపల్, విద్యా, ఆర్థిక, పశు సంవర్థక తదితర విభాగాల్లో అవినీతి పెరిగిపోయినట్లు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వరుస కేసులతో మరోసారి తేటతెల్లమవుతోంది. ఈ ఏడాది ప్రారంభం నుంచే అవినీతి అధికారులు, సిబ్బందిపై కొరడా ఝుళిపించిన ఏసీబీ.. జనవరిలో 20 కేసులు నమోదు చేసింది. వీటిలో సగం కేసులు నేరుగా లంచం తీసుకుంటూ పట్టుబడ్డవారివే. వారి నుంచి రూ.1.45 లక్షలు స్వాధీనం చేసుకుంది. కొందరు తెలివిగా ఆలోచించి తమ చేతికి మట్టి అంటకుండా ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని లంచం తీసుకుంటున్నారు. ఆయా కేసుల్లో మొత్తం 17 మందిని అరెస్టు చేయగా వారిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులు కూడా ఉన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో ఒకరిపై నమోదు చేసిన ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రూ. 65.50 లక్షల విలువైన స్థిర, చర ఆస్తులను గుర్తించారు. లంచం డిమాండ్ చేస్తున్న అధికారులు, సిబ్బందిపై గతంతో పోలిస్తే ఇటీవల కాలంలో ఫిర్యాదులు పెరిగాయి. నేరుగా ఏసీబీ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేస్తున్నవారు కొందరైతే, ఆకాశరామన్న ఉత్తరాలు రాసి ఉప్పందిస్తున్నవారు మరికొందరు. ఏసీబీ టోల్‌ఫ్రీ నెంబరు 1064కు ఫిర్యాదులు వస్తున్నాయి. టెక్నాలజీ వాడకం పెరిగిన నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా కూడా ఫిర్యాదులు అందుతున్నాయి. తెలంగాణ ఏసీబీ పేరుతో ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలకు ఫిర్యాదులు, అవినీతి అధికారుల సమాచారం అందుతోందని ఆ శాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిపై ప్రజలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారుల వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని వారు భరోసా ఇస్తున్నారు.

పంతానికిపోతే నష్టమే

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు హాజరయ్యారు. ఈ భేటీలో విభజన చట్టంలోని 9, 10 షెడ్యూల్‌లోని సంస్థల ఆస్తులు, అప్పుల పంపకాలపై ప్రధానంగా చర్చ జరిగినట్టు సమాచారం. దాదాపు రెండేళ్ల తర్వాత విభజన చట్టం అమలుపై హోంశాఖ లోతుగా సమీక్షించింది. విభజన చట్టం కింద కేంద్రం పంపిణీ చేయాల్సిన నిధులపైనా చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఆస్తులు, నిధుల పంపకాలలో సమస్యలపై ఇరు రాష్ట్రాలూ సానుకూల దృక్పథంతో ఉండాలని, సమన్వయంతో సమస్యలు పరిష్కరించుకోవాలని హోంశాఖ అధికారులు హితవు పలికారు. రెండు రాష్ట్రాల్లో మౌలిక వసతుల ప్రాజెక్టులకు మద్దతు ఉంటుందని తెలిపారు. తమకే ఎక్కువ కావాలని పట్టుబడితే ఇద్దరికీ నష్టం వస్తుందని చెప్పినట్టు సమాచారం. 9, 10 షెడ్యూల్‌లోని సంస్థల విషయంలో న్యాయ సలహాలు తీసుకుని ముందుకెళ్లాలని అధికారులు నిర్ణయించారు. తదుపరి భేటీలో ఒక నిర్ణయం తీసుకుందామని హోంశాఖ కార్యదర్శి చెప్పినట్టు తెలిసింది.

వేసవికి ముందే విద్యుత్తు కొనుగోళ్లు!

భారీగా కొనుగోలు చేస్తున్న డిస్కమ్‌లు.. రోజుకు సగటున 70 మిలియన్ యూనిట్ల కొనుగోలు.. 50 కోట్ల చెల్లింపు


బహిరంగ విపణిలో టాప్‌లో తెలంగాణ

దక్షిణాదిలో ఐఈఎక్స్ విక్రయిస్తున్న..

విద్యుత్తులో 90 శాతం కొనుగోళ్లు మనవే

జెన్‌కోలో విద్యుత్తు ఉత్పత్తి తగ్గడమే కారణం

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వేసవి ఇంకా ప్రారంభం కాకముందే రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ పెరిగింది. దీంతో విద్యుత్తు పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) పవర్ ఎక్స్‌చేంజ్‌ల నుంచి భారీగా విద్యుత్తు కొనుగోలు చేస్తున్నాయి. ఈ కొనుగోలు సాధారణంగా వేసవిలో కొనుగోలు చేసే విద్యుత్తు కన్నా ఎక్కువగా రికార్డు స్థాయిలో ఉంటుండడం గమనార్హం. మునుపెన్నడూ లేనివిధంగా గత నెల రోజులుగా తెలంగాణ డిస్కమ్‌లు రోజుకు సగటున 70 మిలియన్ యూనిట్ల (ఎంయూ) విద్యుత్తు కొనుగోలు చేస్తున్నాయి. గతంలో ఎన్నడూ జనవరి నెలలో ఈ స్థాయిలో విద్యుత్తు ఎక్స్‌చేంజ్‌ల నుంచి కొనుగోలు చేయలేదని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే గతేడాది డిసెంబరు నుంచి జనవరి తొలివారం వరకు రోజుకు సగటున 100-125 ఎంయూల విద్యుత్తును కొనుగోలు చేసి డిస్కమ్‌లు కొత్త రికార్డు సృష్టించాయి. గత డిసెంబరు 29న అత్యధికంగా 124.54 ఎంయూల విద్యుత్తును కొనుగోలు చేయడం గమనార్హం. విద్యుత్తు డిమాండ్ పెద్దగా లేని సమయాల్లో యూనిట్‌కు రూ.2.5 కనిష్ఠ ధరతో పవర్ ఎక్స్‌చేంజిల్లో విద్యుత్తును విక్రయిస్తుండగా, డిమాండ్ గరిష్ఠంగా పెరిగే వేళల్లో యూనిట్‌కు రూ.10 గరిష్ఠ ధరతో విక్రయిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రం పవర్ ఎక్స్‌చేంజ్‌ల నుంచి విద్యుత్తు కొనుగోలు చేసేందుకు రోజుకు సగటున రూ.50 కోట్ల వరకు వెచ్చిస్తోందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందుకుగాను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డిస్కమ్‌లకు రూ.2వేల కోట్లను ప్రత్యేకంగా మంజూరు చేసింది.



ఎక్స్‌చేంజ్ కొనుగోళ్లలో తెలంగాణ టాప్..

ఇండియన్ ఎనర్జీ ఎక్స్‌చేంజ్ (ఐఈఎక్స్) ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు విక్రయిస్తున్న విద్యుత్తులో 90 శాతానికి పైగా తెలంగాణ రాష్ట్రమే కొనుగోలు చేస్తుండటం గమనార్హం. దక్షిణాదిలో తమిళనాడు, ఏపీ, కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాలు నామమాత్రంగా విద్యుత్తు కొనుగోలు చేస్తుండగా, వీటిలో కొన్ని రాష్ట్రాలు తమ మిగులు విద్యుత్తునే ఐఈఎక్స్‌కి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాయి. ఇంకా వేసవి ప్రారంభం కాకపోవడం, ఇతర రాష్ట్రాల్లో విద్యుత్తు డిమాండ్ నిలకడగా ఉండడంతో పెద్దగా విద్యుత్తు కొనుగోలు చేయడం లేదు. గతేడాది డిసెంబరు 29న ఐఈఎక్స్ విక్రయించిన విద్యుత్తులో ఏకంగా 87 శాతాన్ని తెలంగాణ రాష్ట్రమే కొనుగోలు చేసింది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) థర్మల్, హైడల్ విద్యుత్తు కేంద్రాల్లో స్థాపిత సామర్థ్యంతో పోలిస్తే ఉత్పత్తి గణనీయంగా పడిపోవడం వల్లే పవర్ ఎక్స్‌చేంజ్‌ల నుంచి ప్రైవేటు విద్యుత్తును భారీ మొత్తంలో కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొన్ని యూనిట్లలో మరమ్మతులు చేయకపోవడంతో ఉత్పత్తి నిలిచిపోగా, మరికొన్ని యూనిట్లలో ఉత్పత్తిని తగ్గించి బ్యాక్‌డౌన్ చేస్తున్నట్టు ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) గణాంకాలు చెబుతున్నాయి. జెన్‌కో ప్రస్తుతం 4842.5 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాలు, 2441.8 మెగావాట్ల జలవిద్యుత్తు కేంద్రాలను కలిగి ఉండగా, ఇవి 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 ఫిబ్రవరి 2 వరకు కేవలం 63.72 శాతం సామర్థ్యం (పీఎల్ఎఫ్)తో మాత్రమే విద్యుదుత్పత్తి చేశాయి. గతంలో సగటున 80 శాతం వార్షిక విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని జెన్‌కో థర్మల్ విద్యుత్తు కేంద్రాలు కలిగి ఉండేవి.

జలవిద్యుత్ జోష్

5 వేల మిలియన్ యూనిట్లు దాటిన ఉత్పత్తి

పలు స్టేషన్లు మూతపడినా మెరుగైన పనితీరు

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు చేయకుండా పలు యూనిట్లు మూతపెట్టినప్పటికీ తెలంగాణలోని జలాశయాల కింద జెన్ కో భారీగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసింది. సోమవారంతో రాష్ట్రంలోని వివిధ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో తయారైన కరెంటు 5 వేల మిలియన్ యూనిట్లను తాకింది. రాష్ట్రంలో కృష్ణా, గోదావరి బేసిన్‌లో 2,441.8 మెగావాట్ల సామర్థ్యం కలిగిన జలవిద్యుత్ కేంద్రాలున్నాయి. ఇందులో రెండు మూడేళ్లుగా 200 మెగావాట్లకు పైగా సామర్థ్యం కలిగిన విద్యుత్ కేంద్రాలు మూతపడ్డాయి. 2024-25 జల సంవత్సరంలో రాష్ట్రంలో ప్రతీ జలాశయానికి భారీగా వరదలు వచ్చాయి. అయితే విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవడంలో అధికారుల వైఫల్యంతో రోజుకు రూ.కోట్ల ఆదాయాన్ని జెన్‌కో కోల్పోయింది. ప్రస్తుతం వివిధ జలాశయాల కింద రోజుకు 6 మిలియన్ యూనిట్ల దాకా విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. 11 ఏళ్ల లెక్కలను పరిశీలిస్తే 2022-23లో అత్యధికంగా 6,057.9 మిలియన్ యూనిట్ల జలవిద్యుత్ ఉత్పాదన జరిగింది

మే 2న ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష

ఏప్రిల్ 29,30న అగ్రికల్చర్, ఫార్మసీ ఎంట్రన్స్‌లు

జూన్ 8, 9న ఐసెట్, 16-19 మధ్య పీజీ ఈసెట్

షెడ్యూల్ ప్రకటించిన ఉన్నత విద్యామండలి

హైదరాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఎప్‌సెట్ పరీక్షలు ఏప్రిల్ 29 నుంచి జరగనున్నాయి. ఏప్రిల్ 29, 30న అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు.. మే 2 నుంచి 5 వరకు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు ఉంటాయని తెలంగాణ ఉన్నత విద్యామండలి తెలిపింది. ఎప్‌సెట్, ఐసెట్, పీజీఈసెట్ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, వైస్‌చైర్మన్లు పురుషోత్తం, ఎస్‌కే.మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఎప్‌సెట్ కన్వీనర్ ఆచార్య కుమార్ సోమవారం విడుదల చేశారు. ఎప్‌సెట్ పరీక్షల నోటిఫికేషన్ ఈనెల 20న విడుదల చేస్తామని, 25 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుందని బాలకిష్టారెడ్డి తెలిపారు. ఏప్రిల్ 4 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అలాగే పీజీ ఈసెట్ ప్రవేశ పరీక్ష జూన్ 16-19 మధ్య జరగనుంది. దీనికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ మార్చి 17 నుంచి మే 19 వరకు ఉంటుందని పీజీఈసెట్ కన్వీనర్ అరుణకుమారి తెలిపారు. ఐసెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మార్చి 10న ప్రారంభమై మే 3తో ముగియనుంది. జూన్ 8, 9 తేదీల్లో ఈ పరీక్ష జరుగుతుందని ఐసెట్ కన్వీనర్ ఆచార్య అలువాల రవి తెలిపారు. ఈసారి అన్ని సెట్‌లకు సంబంధించిన 'కీ' విషయంలో కొత్త మార్పు చోటుచేసుకుంది. కీపై అభ్యర్థులు అభ్యంతరాలను తెలపడం ఇప్పటి వరకు ఉచితంగా ఉండగా.. ఇక నుంచి ప్రశ్నకు రూ.500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఉన్నత విద్యామండలి ఈ నిర్ణయం తీసుకుంది. ఉచితం కావడంతో అభ్యంతరాలు వందల సంఖ్యలో వస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి తెలిపారు. సరైన అభ్యంతరం వ్యక్తం చేసిన వారికి రుసుము తిరిగి చెల్లిస్తామని చెప్పారు.

ఎమ్మెల్యేలను ప్రభుత్వం.. ఓడినోళ్లను పార్టీ.. విశ్వాసంలోకి తీసుకోవాలి

ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఎమ్మెల్యేలకు ప్రాధాన్యమివ్వాలి

» **మా సర్కారులో మంత్రులకు స్వేచ్ఛ ఎక్కువ**

» **ఇంపార్టెంట్ అయితేనే సీఎం జోక్యం**

» **రాహుల్ చెప్పిన తర్వాత నేను అంతర్గత విషయాలు మాట్లాడట్లే**

» **కొన్ని విషయాలు షేర్ చేయలేను**

» **సమయం వచ్చినప్పుడు మాట్లాడతా**

» **ప్రభుత్వం బద్నాం కావద్దు.. పార్టీ ఇబ్బంది పడొద్దు**

» **మాకు ఇంకా నాలుగేళ్ల సమయం ఉంది**

» **అధికార పార్టీ ఎమ్మెల్యేల భేటీపై జగ్గారెడ్డి**

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఏ పార్టీ ఉన్నా.. పాలనతో పాటు ఎమ్మెల్యేలకూ ప్రాధాన్యమిచ్చి చూసుకోవాల్సి ఉంటుందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. ఎమ్మెల్యేలను ప్రభుత్వం విశ్వాసంలోకి తీసుకుంటే.. ఓడిన వారిని పార్టీ నాయకత్వం చూసుకోవాలని చెప్పారు. గాంధీభవన్‌లో సోమవారం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. ఈ మేరకు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొందరు మీటింగ్ పెట్టుకున్నట్లు వార్తలు వచ్చాయని, అయితే కొన్ని విషయాలను తాను ఇప్పుడే షేర్ చేయలేనని అన్నారు. సమయం, సందర్భం వచ్చినప్పుడు మాట్లాడతానని చెప్పారు. పరిస్థితి చూస్తే ఇబ్బందిగా అనిపించినా తాను బయటికి చెప్పలేనన్నారు. పార్టీ అంతర్గత విషయాలు బయట మాట్లాడొద్దంటూ రాహుల్ గాంధీ చెప్పినప్పటి నుంచీ తాను మాట్లాడడం లేదని తెలిపారు. సహజంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులకు స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుందని, ఇంపార్టెంట్ అయితేనే ముఖ్యమంత్రి జోక్యం చేసుకుంటారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులకు స్వేచ్ఛ ఇవ్వాలన్న ఆలోచనలో ఉన్నట్లున్నారన్నారు. ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా ఇలాంటి ఇబ్బందులు తప్పవని చెప్పారు. ఇలాంటి వాటికి సంబంధించి నిర్ణయాలు తీసుకునే ప్రొటోకాల్ పరిధిలో తాను లేనన్నారు. పార్టీ పరిధిలో తనకు ప్రొటోకాల్ ఉన్నా.. టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీలకు సలహాలు ఇచ్చే ప్రొటోకాల్‌లో తాను లేనని చెప్పారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా చిన్న, చిన్న సమస్యలు ఉంటాయని వ్యాఖ్యానించారు. తమకు ఇంకా నాలుగేళ్ల సమయం ఉందన్నారు. ప్రభుత్వం బద్నాం కావద్దని, పార్టీ ఇబ్బంది పడొద్దని అన్నారు.



లక్ష డప్పులు, వేల గొంతుల ప్రదర్శనకు

అనుమతి నిరాకరణ అన్యాయం

మా ప్రదర్శనను ప్రభుత్వానికి వ్యతిరేకంగా చూడొద్దు

ఎప్పుడూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించలేదు

మళ్లీ వినతిపత్రం ఇస్తాం.. సీఎం రేవంత్ స్పందించాలి

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

పంజాగుట్ట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్నో సభలు, సమావేశాలు, ఆందోళనలు, చలో హైదరాబాద్ కార్యక్రమాలు నిర్వహించామని, ఎప్పుడూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించలేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. తమ సంస్కృతిని, డప్పు వాయిద్యాన్ని కాపాడుకోవడానికి ఈ నెల 7న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నుంచి పెద్ద అంబేడ్కర్ విగ్రహం వరకు లక్ష డప్పులు, వేల గొంతుల పేరుతో తలపెట్టిన తమ సంస్కృతీ ప్రదర్శనకు ప్రభుత్వం, పోలీసు శాఖ వివిధ సాకులు చూపుతూ అనుమతి ఇవ్వకపోవడాన్ని తప్పుపట్టారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వర్గీకరణకు మద్దతు ఇస్తున్న సంఘాలు, కుల సంఘాల నాయకులతో కలిసి మంద కృష్ణ మాదిగ మాట్లాడారు. పోలీసులు ఆరు అంశాలను చూపుతూ తమ ప్రదర్శనకు అనుమతి నిరాకరించారని పేర్కొన్న ఆయన.. శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని, అసాంఘిక శక్తులు వచ్చే ప్రమాదం ఉందనడం అన్యాయమని చెప్పారు. తమ ప్రదర్శనకు అనుమతి ఇవ్వవద్దని సీఎం ఏమైనా చెప్పారా అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ ప్రదర్శనను చూడవద్దని, శాంతియుతంగా జరుగుతుందని చెప్పారు. డీజీపీ, సీపీతో సీఎం మాట్లాడాలని కోరారు. ప్రభుత్వం గత ఏడాది డిసెంబరు 9న సచివాలయం వద్ద లక్ష మందితో బహిరంగ సభ నిర్వహించిందని, తమ ప్రదర్శనకు అనుమతి ఎందుకు ఇవ్వరని నిలదీశారు. ప్రభుత్వానికో న్యాయం తమకో న్యాయమా అని ప్రశ్నించారు. తమ ప్రదర్శన గిన్నిస్ బుక్‌లో చోటుదక్కేలా ఉంటుందన్నారు.



వివిధ సంఘాల నాయకులతో కలిసి డప్పు కొడుతున్న మంద కృష్ణ మాదిగ

శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం

ఎమ్మార్పీఎస్ ర్యాలీకి అనుమతి నిరాకరణపై పోలీసుశాఖ వివరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఈ నెల 7న తలపెట్టిన ర్యాలీ, బహిరంగ సభకు అనుమతిస్తే శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలుగుతుందని పోలీసులు పేర్కొన్నారు. అనుమతి నిరాకరించడానికి కారణాలను శాంతిభద్రతల విభాగం అదనపు కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్ సోమవారం తెలిపారు. 'ర్యాలీ, సభకు హాజరయ్యేవారి సంఖ్యను ఎమ్మార్పీఎస్ తెలపలేదు. ఎక్కువ మంది వస్తే ట్రాఫిక్ నిర్వహణతో పాటు ఇతర సమస్యలు ఎదురవుతాయి. ఇలాంటి సమయాల్లో సంఘ విద్రోహ శక్తులు సమస్యలు సృష్టించే అవకాశాలు ఉంటాయ'ని పోలీసులు పేర్కొన్నారు. ఈ నెల 7న పనిదినం కావడం, ర్యాలీ నిర్వహించాలనుకున్న ప్రాంతం హైసెక్యూరిటీ జోన్‌లో ఉండటంతో సచివాలయానికి వచ్చే వీవీఐపీలు, ఉద్యోగులు, సందర్శకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు.

లక్ష డప్పులు.. వేయి గొంతులు సభకు అనుమతి ఇవ్వండి: సీఎంకు మోత్కుపల్లి విజ్ఞప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈ నెల 7న మాదిగలు నిర్వహించ తలపెట్టిన 'లక్ష డప్పులు-వేయి గొంతులు' బహిరంగ సభకు ప్రభుత్వం, పోలీసులు అనుమతులివ్వాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం కలగకుండా సభను నిర్వహిస్తామని, బాధ్యతను తాను తీసుకుంటానని ఆ లేఖలో పేర్కొన్నారు. ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ బిల్లుకు ఒకవైపు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పునివ్వగా.. రాష్ట్ర ప్రభుత్వం కూడా దానికి అనుగుణంగా తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

దేశవ్యాప్తంగా వర్గీకరణకు అభ్యంతరం లేదు

» **రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తే అడ్డుకుంటాం**

» **మంద కృష్ణ మాదిగది బీజేపీకి భజన డప్పు**

» **మాదిగ బిడ్డల పోరాటం కేంద్రానికి తాకట్టు**

» **మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య**

బర్కత్‌పుర, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను దేశవ్యాప్తంగా అమలుచేస్తే ఎలాంటి అభ్యంతరం లేదని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తే తీవ్రస్థాయిలో అడ్డుకుంటామని, న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని మాల సంఘాల జేఏసీ జాతీయ చైర్మన్ జీ చెన్నయ్య హెచ్చరించారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణను అడ్డుకుంటున్నది మాలలు కాదని, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిలేనని ఆరోపించారు. ఈ నెల 7న లక్ష డప్పులు వెయ్యి గొంతుల కార్యక్రమం మాలలకు చావుడప్పులేనని మందకృష్ణ మాదిగ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆయన కొట్టాల్సిన చావుడప్పులు మాలలకు కాదని మోదీ, కిషన్ రెడ్డి, ఎం.వెంకయ్యనాయుడుకేనని వ్యాఖ్యానించారు. వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ ప్రధాని మోదీపై ఎందుకు ఒత్తిడి తీసుకురావడం లేదని ప్రశ్నించారు. బీజేపీకి భజన డప్పు కొడుతూ మాలలకు చావు డప్పు కొడతానంటే సహించేది లేదని, తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. పద్మశ్రీ అవార్డు కోసం 30 ఏళ్ల మాదిగ బిడ్డల పోరాటాన్ని కేంద్ర ప్రభుత్వానికి మంద కృష్ణ మాదిగ తాకట్టుపెట్టారని ఆరోపించారు. వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేస్తే సహించేది లేదని, తీవ్రస్థాయిలో తిరగబడతామన్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిపై ఇకనైనా విమర్శలు మానుకోవాలని, లేకపోతే సరైన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. లక్ష డప్పులు వెయ్యి గొంతుల కార్యక్రమంలో ఏదైనా సంఘటన జరిగితే సీఎం రేవంత్‌రెడ్డి నైతిక బాధ్యత వహించాలని హెచ్చరించారు.

భట్టితో బీసీ కమిషన్ చైర్మన్, సభ్యుల భేటీ

- కమిషన్‌కు వచ్చిన విజ్ఞప్తులపై చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి భట్టితో సోమవారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు భేటీ అయ్యారు. సోమవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో వారు భట్టితో సమావేశమై బీసీ కమిషన్‌కు వచ్చిన విజ్ఞప్తులపై ఆయనతో చర్చించారు. ప్రజల నుంచి వచ్చిన కులాల పేర్ల మార్పు తదితర విజ్ఞప్తులను అమలు చేసినట్లయితే తలెత్తే పరిణామాలు, వీటిపై కమిషన్ స్వీకరించిన అభ్యంతరాలు, తదుపరి కమిషన్ సిఫారసులు ఎలా ఉన్నాయన్న విషయాలు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. బీసీ కమిషన్‌కు మరిన్ని అధికారాలు కల్పిస్తూ చట్ట సవరణ చేయాల్సిన విషయమై బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి ఉపముఖ్యమంత్రి భట్టితో చర్చించారు.

ఏప్రిల్ 14 నుంచి ప్రజల సందర్శనకు అంబేడ్కర్!

- 125 అడుగుల విగ్రహ పీఠంలో లైబ్రరీ, మ్యూజియం, గ్యాలరీల నిర్మాణం పూర్తి చేయాలని సర్కారు ఆదేశం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): హుస్సేన్ సాగర్ తీరంలోని అంబేడ్కర్ విగ్రహ పీఠంలో గ్రంథాలయం, మ్యూజియం, జ్ఞాన మందిరం, అంబేడ్కర్ జీవిత ముఖ్య ఘట్టాలతో ఫోటో గ్యాలరీ.. వీటితో పాటు 2.93 ఎకరాల్లో ఏర్పాటు చేసిన థీమ్ పార్కు సందర్శనకు త్వరలో ప్రజలను అనుమతించనున్నారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని 2023 ఏప్రిల్ 14న పనులు పూర్తి కాకముందే హడావుడిగా ప్రారంభించారు. దీంతో, రెండేళ్లుగా సందర్శకులను అనుమతించడం లేదు. ఈ నేపథ్యంలోనే అంబేడ్కర్ విగ్రహ సందర్శనకు అనుమతి కోసం ఇటీవల ఆందోళనలు జరిగాయి. దీంతో, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విగ్రహ నిర్వహణను హెచ్ఎండీఏకు అప్పగించింది. మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేయాలని ఆదేశించింది. పనులన్నీ పూర్తైతే అంబేడ్కర్ జయంతి (ఏప్రిల్ 14) లోపు సందర్శకులను అనుమతివ్వాలా? లేకుంటే జయంతి రోజు నుంచే అనుమతివ్వాలా? అనేది ప్రభుత్వం నిర్ణయించనుంది.

సంస్కరణలతోనే మెరుగైన పోలీసింగ్: డీజీపీ

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తగిన సంస్కరణలతోనే మెరుగైన పోలీసింగ్‌కు అవకాశం ఉంటుందని డీజీపీ జితేందర్ అన్నారు. ఇండియన్ పోలీస్ ఫౌండేషన్ (ఐపీఎఫ్) ఆధ్వర్యంలో "పోలీస్ సంస్కరణల ద్వారా మెరుగైన పోలీసింగ్" అనే అంశంపై డీజీపీ కార్యాలయంలో సోమవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ..పోలీస్‌శాఖ పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్షించుకుని పోలీసింగ్ మెరుగుపరచుకోవాలని, ఉన్నతాధికారులు పోలీస్‌స్టేషన్లు, కార్యాలయాల్ని ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తే కొంత మార్పు జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర పోలీస్ శాఖను ముందంజలో ఉంచేందుకు నూతన విధానాలను అవలంబిస్తూ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని డీజీపీ తెలిపారు. బాధితులపట్ల సానుకూలంగా స్పందించడం, నైపుణ్యంతో దర్యాప్తు, కమ్యూనిటీ పోలీసింగ్, సిబ్బంది ప్రవర్తన వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. అంతర్గత పోలీస్ సంస్కరణల ప్రాజెక్టు.. పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో ఉందని ఐపీఎఫ్ ఉపాధ్యక్షుడు ఈశ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజల అభిప్రాయాలు సేకరించి తగిన శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు.

కృష్ణాలో వాటాలు తేల్చాకే గోదావరి-కావేరీ అనుసంధానం చేపట్టాలి

- ఎన్‌డబ్ల్యూడీఏ మినిట్స్‌లో చేరిన తెలంగాణ వాదన

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల పంపిణీని జస్టిస్ బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్(కృష్ణా ట్రైబ్యునల్) తేల్చిన తర్వాతే గోదావరి-కావేరీ అనుసంధానం చేపట్టాలని తెలంగాణ పేర్కొంది. జాతీయ నీటి అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) 38వ వార్షిక సర్వసభ్య సమావేశం గత డిసెంబరు 19న జరగ్గా... ఆ సమావేశానికి సంబంధించిన మినిట్స్ సోమవారం రాష్ట్రాలకు చేరాయి. ఆ సమావేశంలో తెలంగాణ తరఫున ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ లేవనెత్తిన అంశాలను చేర్చుతూ మినిట్స్ విడుదల చేశారు. గోదావరి-కావేరీ అనుసంధానంలో తరలించే 141 టీఎంసీల్లో 50 శాతం వాటా ఇవ్వాలని తెలంగాణ కోరింది. గోదావరి-కావేరీని ఇచ్చంపల్లి నుంచి కాకుండా సమ్మక్క సాగర్ నుంచి తరలించాలని తెలంగాణ కోరింది. కృష్ణా జలాల పంపిణీపై విచారణ జరుగుతున్నందున... నీటి వాటాలు తేల్చేక, ప్రాజెక్టుల ఆపరేషన్ ప్రొటోకాల్ ఖరారు అయ్యాక గోదావరి-కావేరిపై ముందుకెళదామని పేర్కొన్నారు.

ఏపీ నగరపాలికల్లో కూటమి జెండా

- అన్నింటా విజయం.. టీడీపీ ఖాతాలో హిందూపురం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

సార్వత్రిక ఎన్నికల్లో ఏపీలో దాదాపు 93 శాతం స్థానాలను గెలుచుకున్న టీడీపీ కూటమి... తాజాగా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం విజయం సాధించింది. రాష్ట్రవ్యాప్తంగా పలు మునిసిపాలిటీలు, నగర పాలక సంస్థల పదవులకు జరిగిన ఎన్నికల్లో అన్నింటినీ కూటమి అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. వివిధ కారణాలతో ఖాళీ అయిన పదవులకు సోమవారం ఎన్నికలు నిర్వహించారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మునిసిపల్ చైర్మన్ స్థానాన్ని టీడీపీ సొంతం చేసుకుంది. ఏలూరు కార్పొరేషన్‌లో రెండు డిప్యూటీ మేయర్ పదవులను, నూజివీడు మునిసిపల్ వైస్ చైర్మన్ పదవిని, నెల్లూరు డిప్యూటీ మేయర్ పదవిని, నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని రెండు వైస్ చైర్మన్ పదవులను టీడీపీ దక్కించుకుంది. ఇక గుంటూరు నగర పాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్‌కు జరిగిన ఎన్నికల్లో ఆరు స్థానాల్లో తెలుగుదేశం ఐదు, జనసేన ఒకటి కైవసం చేసుకున్నాయి. పలు కారణాల వల్ల నిలిచిపోయిన స్థానిక సంస్థల ఎన్నికలను మంగళవారం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని తెలిపారు.

నాన్న శవాన్ని 2 ముక్కలు చేద్దాం!

- ఎవరి భాగం వారు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహిద్దాం
- తమ్ముడితో గొడవపడి.. విచిత్ర ప్రతిపాదన పెట్టిన అన్న

భోపాల్, ఫిబ్రవరి 3: పరమానందయ్యకు కాళ్లు పడుతూ ఆయన ఇద్దరు శిష్యులు, పరస్పరం గొడవ పడి ఆ కోపాన్నంతా గురువుగారి కాళ్ల మీద చూపుతూ.. చివరికి గొడ్డలితో నరికేందుకు సిద్ధపడిన విధంగానే ప్రవర్తించారు ఆ ఇద్దరు అన్నదమ్ములు. కన్నతండ్రికి అంత్యక్రియలను నేను చేస్తానంటే నేను చేస్తానంటూ పోటీపడ్డారు. పంచాయితీ ఎటూ తెగకపోవడంతో మృతదేహాన్ని రెండుగా నరికి చెరో భాగాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు చేద్దాం అని ప్రతిపాదించాడు వారిలో ఓ సోదరుడు. ఊర్లోవారిని నోరెళ్లబెట్టేలా చేసిన ఈ ఘటన మధ్యప్రదేశ్‌లో జరిగింది. టికామ్‌గఢ్ జిల్లా లిధోరతాల్ గ్రామానికి చెందిన ధ్యానీసింగ్ ఘోష్ (84)కు కుమారులు కిషన్ సింగ్, దేశ్‌రాజ్ సింగ్ ఉన్నారు. చిన్న కుమారుడు దేశ్‌రాజ్ ఊర్లోనే ఉంటుండగా, కిషన్‌సింగ్ భార్యాపిల్లలతో దూరంగా మరో ఊర్లో నివసిస్తున్నాడు. చాన్నాళ్లుగా అన్నదమ్ముల మధ్య మనస్పర్థలున్నాయి. దేశ్‌రాజ్ వద్ద ఉంటున్న ధ్యానీసింగ్ తీవ్ర అనారోగ్య సమస్యలతో ఆదివారం మృతి చెందాడు. ఇది తెలిసి.. ఊరికొచ్చిన కిషన్ సింగ్ తండ్రి మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలను తానే నిర్వహిస్తానని చెప్పాడు. దీనికి దేశ్‌రాజ్ ఒప్పుకోలేదు. తన చేతుల మీదుగానే అంత్యక్రియలు జరగాలని తండ్రి కోరుకున్నాడని, అందుకే తానే నిర్వహిస్తానని అన్నకు దేశ్‌రాజ్ సర్దిచెప్పాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఒళ్లు గగుర్పాటుకు గురిచేసే ఓ ప్రతిపాదన పెట్టాడు పూటుగా తాగిన మత్తులో ఉన్న పెద్దకొడుకు కిషన్ సింగ్. తండ్రి మృతదేహాన్ని రెండు ముక్కలు చేసి.. చెరో ముక్క తీసుకుందామని.. తనకొచ్చిన భాగాన్ని తానుంటున్న చోటుకు తీసుకెళ్లి అంత్యక్రియలు చేస్తానని చెప్పాడు. ఆ దిశగా ఏర్పాట్లూ మొదలుపెట్టాడు అప్రమత్తమైన స్థానికులు, పోలీసులకు సమాచారమిచ్చారు. వారొచ్చి పెద్దకొడుకు కిషన్ సింగ్‌కు సర్దిచెప్పడంతో వెనక్కితగ్గాడు. తండ్రి అంత్యక్రియలను చిన్న కుమారుడు దేశ్ రాజ్ సింగ్ నిర్వహించాడు.

సమాజాభివృద్ధిలో మహిళా సాధికారత కీలకం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ... వి-హబ్ సందర్శన

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో మహిళా సాధికారత అత్యంత కీలకమైన అంశమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మహిళా సాధికారతలేకుండా స్థిరమైన భవిష్యత్తును ఊహించలేమని, ఆర్థికాభివృద్ధిలో వీరి పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. మహిళలకు సమాన అవకాశాల కల్పనకు, సుస్థిరమైన భవిష్యత్తును అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.. అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని విమెన్ ఆంత్రప్రెన్యూర్ హబ్ (వి-హబ్)ను సోమవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి గవర్నర్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి మహిళా స్టార్టప్‌లు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. స్టార్టప్‌ల ప్రతినిధులతో మాట్లాడారు. వి-హబ్‌కు వచ్చాక తమ ఆలోచనలు కార్యరూపం దాల్చాయని, ప్రభుత్వపరంగా పూర్తి సహకారం లభిస్తోందని మహిళా స్టార్టప్‌ల ప్రతినిధులు గవర్నర్‌తో పేర్కొన్నారు. గ్రామీణ మహిళల సాధికారతకు అమలుచేస్తున్న పథకాలను గవర్నర్‌కు మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. వి-హబ్ సీఈవో సీతా పల్లచోళ్ల మాట్లాడుతూ.. వి-హబ్‌తో మారుమూల గ్రామాల వరకు సేవలు అందిస్తున్నామన్నారు.

ఏఐ వర్సిటీలో పరిశ్రమల భాగస్వామ్యం: దుద్దిళ్ల

ఏఐ యూనివర్సిటీలో పరిశ్రమలు, నిపుణులను భాగస్వామ్యం చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం హైటెక్ సిటీలో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సేవల టెక్నాలజీ అందిస్తున్న డిపాజిటరీ ట్రస్ట్, క్లియరింగ్ కార్పొరేషన్ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామని తెలిపారు. కొత్త కార్యాలయంతో దాదాపు 2వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఉద్యోగ నియామకాల్లో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి కోరగా.. కంపెనీ అంగీకరించింది.



వి-హబ్‌లో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్, చిత్రంలో శ్రీధర్ బాబు

ఏ.. బీ.. సీ..!

(మొదటిపేజీ తరువాయి)

నేతృత్వంలోని ఉప సంఘం సోమవారం మధ్యాహ్నం, సాయంత్రం రెండు దఫాలుగా సమావేశమై నివేదికలోని పలు అంశాలను పరిశీలించి చర్చించింది. దీనిలో సభ్యులుగా మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎంపీ మల్లు రవి ఉన్న విషయం తెలిసిందే. అనంతరం సబ్ కమిటీ సీఎం రేవంత్ రెడ్డిని కలిసి.. నివేదికలోని విషయాలను వివరించింది. మంగళవారం ఆ నివేదికను తొలుత క్యాబినెట్‌లో; అనంతరం శాసనసభలో ప్రవేశపెట్టి చర్చ చేయనున్నారు.

రిజర్వేషన్లు ఎవరికి ఎలా!?

ఆయా కులాల్లోని విద్య, ఉపాధి, రాజకీయ, ఆర్థిక విషయాలతో పాటు పలు అంశాలపై 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకుని కమిషన్ అధ్యయనం చేసింది. మొత్తం ఎస్సీల్లో ఏ కులం వారు ఎంతమంది ఉన్నారు? ఉప కులాల జనాభా ఎంత!? తదితర అంశాలపై సమగ్రంగా అధ్యయనం చేసింది. ఎవరెవరిని ఏయే గ్రూపుల్లో ఉంచాలనే అంశాన్ని పరిశీలించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం.. రాష్ట్రంలో సుమారు 52.50 లక్షల మంది ఎస్సీలుండగా.. వీరిలో మాదిగలు 33.50 లక్షలు, మాలలు 19 లక్షల మంది ఉన్నారు. వీరిలో అక్షరాస్యత శాతం ఎంత!? విద్యా సంస్థల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఎంతమంది? ఉపకార వేతనాలను ఎంతమంది అందుకున్నారు? ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం అందించే ఆర్థిక సాయాన్ని ఎంతమంది పొందారనే వివరాలను కూడా సేకరించి, పరిశీలించింది. అలాగే, ఎస్సీల్లో ఎంతమంది ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నారనే వివరాలను కూడా సేకరించింది. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో కలిపి దాదాపు 94 వేల మందికి పైచిలుకు ఉన్నట్టు ఆయా శాఖలు కమిషన్‌కు ఇచ్చిన రిపోర్టుల్లో తేలింది. ఇక ఎస్సీలకు రాజకీయ అవకాశాలపైనా వివరాలు సేకరించింది. గ్రామ, మునిసిపాలిటీ ల్లో వార్డు సభ్యుని నుంచి ఎమ్మెల్యే, మంత్రి, ఎంపీ సహా ఇప్పటి వరకూ వారు రాజకీయ ప్రాతినిధ్యం వహించిన వివరాలను తీసుకుంది. ఈ అంశాలన్నిటినీ అధ్యయనం చేసి.. మాదిగ, మాల సహా ఉప కులాలకు కేటాయించాల్సిన రిజర్వేషన్లపై పలు సూచనలు చేస్తూ ప్రభుత్వానికి నివేదికను అందజేసింది. కాగా, ఎస్సీ వర్గీకరణ కోసం ఏర్పాటైన కమిషన్ ఫిబ్రవరి మొదటి వారంలోనే ప్రభుత్వానికి నివేదిక ఇవ్వబోతోందనే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. 'ఎస్సీ వర్గీకరణ నివేదిక కొలిక్కి' శీర్షికన జనవరి 25న కథనాన్ని ప్రచురించింది.

అప్పుడు నాలుగు.. ఇప్పుడు మూడు

ఎస్సీ వర్గీకరణ, రిజర్వేషన్ల అంశంపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పటి నుంచే ఉద్యమాలు సాగుతున్నాయి. జనాభా ఆధారంగా ఎస్సీలకు ప్రస్తుతం 15 శాతం రిజర్వేషన్ అమలవుతోంది. అయితే, సంఖ్యాపరంగా అధికంగా ఉన్న తమకు తక్కువ కోటా అమలవుతోందని, దీనికి 1965నాటి లోకూర్ కమిషన్ నివేదికలే నిదర్శనమని మాదిగలు అంటున్నారు. ఎస్సీలను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా వర్గీకరించాలనే డిమాండ్ 1994లో తెరపైకి వచ్చింది. దీనిపై 1997లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం జస్టిస్ రామచంద్ర రాజు కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దాని సూచనల మేరకు ఎస్సీలను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజించి.. వారికి 15 శాతం రిజర్వేషన్‌ను ఆయా గ్రూపుల వారీగా కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దాని ప్రకారం.. గ్రూప్-ఏలో రెల్లి సహా దానికి అనుబంధంగా ఉన్న 12 కులాలకు 1 శాతం రిజర్వేషన్ కేటాయించింది. వాటిని అట్టడుగు కులాలుగా గుర్తించింది. గ్రూప్-బీలో మాదిగ, దాని అనుబంధంగా ఉన్న 18 కులాలను చేర్చి.. వీరికి 7 శాతం కోటాను ఇచ్చింది. ఇక, గ్రూప్-సిలో మాల సహా 25 కులాలను చేర్చి, వీరికి 6 శాతం రిజర్వేషన్ కేటాయించింది. గ్రూప్-డిలో ఆది ఆంధ్రులతోపాటు మరో 4 కులాలను చేర్చి వీరికి కూడా 1 శాతం రిజర్వేషన్‌ను ఇచ్చింది. అయితే, ఈ కేటాయింపులపై పలువురు కోర్టుకెళ్లడంతో ఆ ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. దాంతో, వర్గీకరణ కోసం 2000లో మరోసారి రేషనలైజేషన్ ఆఫ్ రిజర్వేషన్ చట్టాన్ని అప్పటి ప్రభుత్వం ఆమోదించింది. దీనిని 2004లో సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఉమ్మడి ఏపీలో అప్పటి ప్రభుత్వం ఎస్సీలను నాలుగు గ్రూపులుగా విభజించగా.. అక్తర్ కమిషన్ మూడు గ్రూపులుగా విభజించాలని సూచించినట్టు సమాచారం.



గాంధీ భవన్‌లో ఓబీసీ చైర్మన్ శ్రీకాంత్‌కు స్వీట్ తినిపిస్తున్న మంత్రి పొన్నం

వాడిగా.. వేడిగా..!

- కుల గణన సర్వే నివేదికపై నేడు అసెంబ్లీలో చర్చ
- ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై కూడా
- అస్త్ర శస్త్రాలతో సిద్ధమైన అధికార, ప్రతిపక్షాలు
- రోజంతా కసరత్తు చేసిన సీఎం రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుల గణన సర్వే నివేదికను ప్రభుత్వం మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. అనంతరం దీనిపై చర్చను చేపట్టనుంది. అలాగే, ఎస్సీ ఉప కులాల వర్గీకరణ అంశంపైనా చర్చించనుంది. ఇందుకు శాసనసభ, మండలి సమావేశాలు ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్నాయి. అయితే, కుల గణన సర్వే నివేదికపై ప్రతిపక్షం, వివిధ సంఘాల నుంచి ఇప్పటికే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు వాడి వేడిగా జరిగే అవకాశం కనిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను కల్పిస్తామని, ఎస్సీ వర్గీకరణకు అనుకూలమని ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. కుల గణన సర్వే నివేదికతోపాటు బీసీ కోటా, ఎస్సీ వర్గీకరణ అంశాలు ఒకేసారి శాసనసభలో చర్చకు వస్తున్న నేపథ్యంలో అధికార, ప్రతిపక్షాలు అస్త్ర శస్త్రాలతో సిద్ధమవుతున్నాయి. ఈ చర్చకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి సోమవారం పూర్తిస్థాయిలో కసరత్తు చేసినట్లు చెబుతున్నారు. కాగా, అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు ఉదయం 10 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశం కానుంది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని సబ్ కమిటీకి ప్రణాళిక శాఖ సమర్పించిన కులగణన సర్వే నివేదికను క్యాబినెట్ ఆమోదించనుంది. అలాగే, వర్గీకరణపై షమీమ్ అక్తర్ నేతృత్వంలోని కమిషన్ ఇచ్చిన నివేదిక, బీసీ కోటాపై బూసాని వెంకటేశ్వర్‌రావు నేతృత్వంలోని కమిషన్ ఇవ్వనున్న నివేదికనూ క్యాబినెట్ చర్చించి ఆమోదించనుంది.

తప్పులతడకగా కులగణన నివేదిక

- 'ఈడబ్ల్యూఎస్'ను కాపాడేందుకు కుట్ర
- సీఎం సమీక్షించాలి: ఆర్.కృష్ణయ్య
- మరో బీసీ ఉద్యమం: శ్రీనివాస్‌గౌడ్
- పదేళ్లలో బీసీ జనాభానే ఎలా తగ్గింది?
- దీన్ని ఒప్పుకోం: జాజుల, చిరంజీవులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కులగణన సర్వే నివేదిక తప్పుల తడకగా ఉందని బీసీ ఉద్యమ నేత, బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. గతంలో కన్నా బీసీల జనాభా తగ్గిందని, ఓసీల జనాభా పెరిగిందని చూపడం వెనుక కుట్ర ఉందన్నారు. ఈడబ్ల్యూస్ రిజర్వేషన్‌ను కాపాడే, బీసీ రిజర్వేషన్‌ను నీరు గార్చే కుట్రలో భాగంగానే బీసీల జనాభాను తక్కువ చేసి చూపించారని ఆరోపించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నివేదికపై సీఎం రేవంత్ సమగ్రంగా సమీక్షించాలని, పూర్తి పారదర్శకతతో గణంకాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా బీసీల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన సమగ్ర కుటుంబ సర్వే లెక్కల ప్రకారం 10శాతం ఉన్న ఓసీల జనాభా.. ప్రస్తుతం 15శాతానికి పెరిగినప్పుడు, బీసీల జనాభా మాత్రం 52 శాతం నుంచి 46శాతానికి ఎలా తగ్గుతుందని నిలదీశారు. కులగణన సర్వే నివేదిక గందరగోళంగా ఉందని, ఈ వివరాలపై సమగ్ర సమీక్ష జరపాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 2.20కోట్ల మంది బీసీలు ఉంటే.. 1.64కోట్లు మాత్రమేనని ప్రకటించడం ఏంటని ప్రశ్నించారు. కాగా, స్థానిక ఎన్నికల్లో గెలవాలన్న కుట్రతోనే కాంగ్రెస్ పార్టీ తప్పుడు నివేదికను ప్రకటించిందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. తమ అంచనా ప్రకారం రాష్ట్రంలో బీసీల జనాభా 60శాతానికి పైగా ఉండాలని, అరకొర సర్వేలతో కాంగ్రెస్ సర్కార్ బీసీలను మోసంచేస్తోందని విమర్శించారు. వారి మోసాలను తిప్పి కొట్టేందుకు తెలంగాణలో మరో బీసీ ఉద్యమం రానుందని పేర్కొన్నారు. కాగా, బీసీ కులగణన నివేదిక ఆధారంగా ఎన్నికలతోపాటు విద్యా, ఉద్యోగ రంగాలలో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ జీవో జారీ చేయాలని నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్ నారగోని డిమాండ్ చేశారు. ఈ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేసి ప్రత్యేక జీవోను జారీ చేయాలని సూచించారు. త్వరలో భర్తీ చేయనున్న ఆరు మంత్రుల పోస్టులను బీసీలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. పదేళ్లలో బీసీ జనాభా మాత్రమే తగ్గిందా? ఈ నివేదికను తాము ఒప్పుకోబోమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ మేధావుల ఫోరం వ్యవస్థాపకుడు టి.చిరంజీవులు స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 90 శాతం, పట్టణాల్లో 40శాతం కుటుంబాల్లో మాత్రమే సర్వే జరిగిందని, ఈ నివేదికను అసెంబ్లీలో ఆమోదిస్తే బీసీలకు అన్ని రంగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ లెక్కలను సరి చేయడానికి రెండో సారి కులగణన నిర్వహించాలన్నారు.

దేశవ్యాప్తంగా కులగణన చేయాలి

తెలంగాణలో సర్వే పూర్తి చేశాం.. జనాభాలో 90% బీసీ, దళిత, ఆదివాసీ, మైనారిటీలే.. లోక్‌సభలో రాహుల్

- బీసీలకు న్యాయం జరగాలని ఉంటే.. కేసీఆర్ అసెంబ్లీకి హాజరు కావాలి
- ఎవరుఅడ్డుకోవాలని చూసినా ఊరుకోం
- బీసీలంతా సంబరాలు జరపాలి: పొన్నం
- కులగణన సర్వేతో ముస్లిం రిజర్వేషన్.. పరిరక్షణకు ఆధారం లభించింది: షబ్బీర్



కులగణన విజయవంతంగా పూర్తయిన సందర్భంగా గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతల సంబురాలు

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కులగణన సర్వే చేపట్టాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం కులగణన పూర్తి చేసిందని తెలిపారు. జనాభాలో 90% ఓబీసీ, దళిత, ఆదివాసీ, మైనారిటీలు వర్గాలకు చెందిన వారే ఉన్నారని పేర్కొన్నారు. దేశంలోనూ ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందన్నారు. సోమవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో తెలంగాణలో చేపట్టిన కులగణన అంశాన్ని రాహుల్ ప్రస్తావించారు. దేశంలో ఓబీసీ జనాభా 50 నుంచి 55 శాతం వరకు ఉండొచ్చని, దళితులు 16%, ఆదివాసీలు 9%, మైనారిటీలు 15% ఉండొచ్చని అంచనా వేశారు. వీరందరికీ రాజ్యాంగ బద్ధంగా దక్కాల్సిన హక్కులు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, కులగణన సర్వే నివేదికపై అసెంబ్లీలో చర్చ జరగనున్న నేపథ్యంలో కేసీఆర్ అసెంబ్లీకి రావాలని తాము కోరుకుంటున్నామని మంత్రి పొన్నం అన్నారు. బీసీలకు న్యాయం జరగాలని కేసీఆర్ కోరుకుంటే అసెంబ్లీకి రావాలన్నారు. సోమవారం గాంధీభవన్‌లో మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడుతూ కులగణన సర్వేలో ప్రధాన రాజకీయ పార్టీ పెద్దలు వివరాలు ఇవ్వలేదన్నారు. కల్వకుంట్ల కుటుంబంలో కేసీఆర్ కూతురు కవిత తప్ప ఎవరూ వివరాలు ఇవ్వలేదని తెలిపారు. వారు ఎందుకు ఇవ్వలేదో కవిత ప్రశ్నించాలన్నారు.

అన్ని పార్టీలు తమ విధానమేంటో చెప్పాలి..

కులగణన సర్వేకు వివరాలు చెప్పేందుకు కొంత మంది నిరాకరించారని మంత్రి పొన్నం తెలిపారు. సర్వే కోసం వెళ్లిన వారిపై కుక్కలను వదిలిన వారూ ఉన్నారని చెప్పారు. కులగణనపై తమ విధానమేంటో అన్ని రాజకీయ పార్టీలూ అసెంబ్లీలో చెప్పాలని, బలహీన వర్గాల కోసం తమ వాదన వినిపించాలని కోరారు. బీసీలకు న్యాయం జరిగే సమయం వచ్చిందని, దీనిని ఎవరు అడ్డుకోవాలని చూసినా ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. కులగణనలో వివరాలు ఇవ్వనివారు మండల స్థాయి అధికారులకు ఇప్పటికైనా ఇవ్వవచ్చునని మంత్రి సూచించారు. కులగణన ఒక చరిత్రాత్మక కార్యక్రమమని, నిర్ణయం నుంచి నివేదిక వరకు ప్రక్రియలో తాను భాగమైనందుకు గర్విస్తున్నానని తెలిపారు. కులగణన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెడుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని బీసీ సోదరులు మంగళవారం ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ సంబరాలు చేయాలని పిలుపునిచ్చారు. గతంలో మాదిరిగా సర్వే నివేదికను ఫ్రిజ్‌లోనో, అల్మారాలోనో పెట్టే ప్రభుత్వం తమది కాదని, రహస్య ఎజెండా కోసం ఉపయోగించుకునే పార్టీ కూడా కాదని అన్నారు. కాగా, కులగణన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెడుతున్న నేపథ్యంలో సోమవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతలు సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ బీసీ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం పాల్గొన్నారు.

ముస్లింల రిజర్వేషన్‌కు బలం..

కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వే.. రాష్ట్రంలో ముస్లింలకు అమలవుతున్న 4శాతం రిజర్వేషన్ పరిరక్షణకు బలమైన ఆధారాలను అందించిందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ముస్లింలలో బీసీ కేటగిరీ కిందికి వచ్చే ముస్లింలను వర్గీకరించిన సర్వే.. వీరు 10.08 శాతంగా ఉన్నట్లు తేల్చిందన్నారు. ఏపీ, తెలంగాణల్లో బీసీ ముస్లింలకు ఇస్తున్న 4శాతం రిజర్వేషన్‌ను ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మతపరమైన రిజర్వేషన్‌గా చిత్రిస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. హిందువుల్లో వెనుకబడిన వర్గాలకు ఇచ్చినట్లే.. ముస్లింలలోనూ వెనుకబడిన వర్గాలకే బీసీ రిజర్వేషన్ కల్పిస్తున్నారని తెలిపారు. బీసీ ఉపకులాల వివరాలు సహా అన్నింటినీ ప్రభుత్వం త్వరలో వెబ్‌సైట్‌లో పెడుతుందని, కుల సంఘాలకు ఏమైనా అనుమానాలుంటే చూసుకోవచ్చునని అన్నారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన 10 శాతం ఈడబూఎస్ రిజర్వేషన్ కోటాతో 50 శాతం సీలింగ్ దాటి పోయిందని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

అప్రజాస్వామికంగా కేంద్ర బడ్జెట్

- బీజేపీయేతర రాష్ట్రాలపై ఆర్థిక వివక్ష
- 'విభజన' హామీలను మరిచిన కేంద్రం
- నిరసనల్లో కాంగ్రెస్ నేతల మండిపాటు
- రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ధర్నాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అప్రజాస్వామికంగా ఉందని కాంగ్రెస్ నేతలు ధ్వజమెత్తారు. బీజేపీయేతర పాలిత రాష్ట్రాలకు నిధులివ్వకుండా కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిందని మండిపడ్డారు. టీపీసీసీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో సోమవారం నిరసన ధర్నాలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఖమ్మంలో నల్లజెండాలతో ర్యాలీ నిర్వహించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అంబేడ్కర్ విగ్రహం ఎదుట కూర్చొని నిరసన తెలిపారు. అనంతరం విలేకరులతో తుమ్మల మాట్లాడుతూ విభజన చట్టం హామీలను కేంద్రం విస్మరించిందని దుయ్యబట్టారు. బయ్యారం ఉక్కు పరిశ్రమపై నోరు మెదపలేదని, రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి కూడా నిధులు కేటాయించలేదని విమర్శించారు. ఏడాదిగా సీఎం రేవంత్‌రెడ్డి నుంచి మంత్రుల వరకు పలు సమస్యలపై 30సార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కలిసినా.. స్పందన లేదన్నారు. మహబూబ్‌నగర్‌లో జరిగిన ధర్నాలో దేవరకద్ర, మహబూబ్‌నగ్ ఎమ్మెల్యేలు జి మధుసూదన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలలో లబ్ధి పొందాలన్న ఉద్దేశంతో కొన్ని రాష్ట్రాలకే నిధులు కేటాయించి, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకు మొండి చేయి చూపించారని ఆరోపించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. గద్వాలలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, వంశీకృష్ణ ఆధ్వర్యంలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కరీంనగర్‌లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డితోపాటు నేతలు నిరసన చేపట్టారు. జగిత్యాలలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్రం వైఖరిని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. సిరిసిల్లలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు.

రిజిస్ట్రేషన్ల ఆదాయం కుదేలు!



(మొదటిపేజీ తరువాయి)

అయింది ఒక్కటి తీరున.. రియల్ ఎస్టేట్ జోరు తగ్గడంతో రాబడి సమకూరే పరిస్థితి లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో కనీసం నిరుటి ఆదాయానికి తగ్గకుండా అయినా చూడాలని ప్రత్యేక దృష్టిసారించారు. ఫిబ్రవరి, మార్చిలో నెలకు రూ.1,700 కోట్ల చొప్పున రూ.3,400 కోట్లు రాబట్టాలని భావిస్తున్నారు. కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం రూ.18,299 కోట్లు. ఈ మొత్తం రావాలంటే రెండు నెలల్లో రూ.6,629 కోట్లు ఆర్జించాలి. అంటే నెలకు రూ.3,314 కోట్లు. కానీ, గత పది నెలల సగటు చూస్తే నెలకు రూ.1,160 కోట్లు మాత్రమే. దీన్నిబట్టి ఇప్పుడున్న పరిస్థితుల్లో అసలు టార్గెట్ చేరడం అసాధ్యమని తేలిపోతోంది. అందుకనే నెలకు కనీసం రూ.1700 కోట్ల చొప్పున అయినా రాబట్టాలని రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం ఆదాయం రూ.14,588 కోట్లను చేరాలన్నా మిగిలిన రెండు నెలల్లో రూ.2,988 కోట్లు రావాలి. అయితే, గత ఏడాది ఏప్రిల్-జనవరి కాలంలో ఆదాయం రూ.11,940 కోట్లు ఉంది. ఇందులో జనవరిలోనే రూ.1,061 కోట్లు వచ్చాయి. 2024-25లో ఏప్రిల్-జనవరి మధ్య రాబడి రూ.11,600 కోట్లు. కానీ, జనవరిలో ఆదాయం తగ్గి.. రూ.980 కోట్లే వచ్చాయి.

● లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) కింద 2020లో వచ్చిన దరఖాస్తులపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నా ఆరు నెలల నుంచి పురోగతి అంతంతమాత్రమే. దీన్ని సద్వినియోగం చేసుకుని ఆదాయం పెంచుకోవాలని రిజిస్ట్రేషన్ల శాఖ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. గత ఏడాదికి మించి రాబడి రాబట్టుకునేందుకు ఈ రెండు నెలల్లో ఉన్న ఏకైక మార్గం ఎల్ఆర్ఎస్. అందుకని ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఎక్కువ దరఖాస్తులను పరిష్కరిస్తే రిజిస్ట్రేషన్లు పెరిగే అవకాశం ఉంటుందనే భావనలో అధికారులు ఉన్నారు. పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి దాదాపు 25.70 లక్షల మంది ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్నారు. హెచ్ఎండీఏ పరిధిలో 3.58 లక్షలు, జీహెచ్ఎంసీలో 1.06 లక్షలు, కార్పొరేషన్లు, మున్సిపాలిటీల నుంచి 13.69 లక్షలు, పంచాయతీల నుంచి 6 లక్షలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల నుంచి 1.35 లక్షల దరఖాస్తులు అందాయి. వీటి పరిష్కారం ఊపందుకుంటే ఆదాయం పెరిగే అవకాశాలు లేకపోలేదు.

● ఏప్రిల్ నుంచి కొత్త మార్కెట్ విలువలు వచ్చే అవకాశం ఉండడంతో ఫిబ్రవరి, మార్చిలో రిజిస్ట్రేషన్లు పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు. గృహ రుణాలు, వాణిజ్య ఒప్పందాల రిజిస్ట్రేషన్లను ప్రోత్సహించే విధానాలు అమలు చేయడంపై ఆలోచనలు చేస్తున్నారు. మార్కెట్ విలువలను సమీక్షించి తక్కువగా ఉన్నచోట్ల సవరించడం, ఎక్కువగా ఉన్నదగ్గర హేతుబద్ధీకరణ ద్వారా రిజిస్ట్రేషన్లు పెరిగేలా చూడాలనే ఉద్దేశంలో ఉన్నారు.

స్నేహం ముసుగులో మోసం

- నెట్‌లో న్యూడ్ ఫొటోలు పెడతామని బెదిరింపులు
- బాధితురాలి నుంచి రూ.2.54 కోట్లు వసూలు
- నిందితుడి అరెస్టు.. ఆస్తులు సీజ్

నిడదవోలు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నెట్‌లో న్యూడ్ ఫొటోలు పెడతామని బెదిరించి.. ఒక యువతి నుంచి రూ.కోట్లలో డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతని ఆస్తులను కూడా సీజ్ చేశారు. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణానికి చెందిన బాధిత యువతి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. హాస్టల్‌లో ఆమెకు గుంటూరుకు చెందిన కాజా అనూషాదేవి పరిచయమైంది. వీరిద్దరూ మంచి స్నేహితులయ్యారు. అనూషాదేవికి వివాహం అయింది. ఆమె భర్త పేరు సాయికుమార్. కొంతకాలం ఇద్దరి స్నేహం బాగానే సాగింది. ఇదిలా ఉండగా అనూషాదేవి, ఆమె భర్త సాయికుమార్ కలిసి బాధిత యువతిని డబ్బులు డిమాండ్ చేయసాగారు. డబ్బులివ్వకపోతే మార్ఫింగ్ చేసిన న్యూడ్ ఫొటోలు ఇంటర్నెట్‌లో పెడుతామని బెదిరించారు. దీంతో బాధితురాలు తనతో పాటు బంధువుల ఖాతాల నుంచి పలు దఫాలుగా రూ.2,53,76,000 నగదును వారికి పంపించింది. దీనిపై ఆమె మూడు రోజులు కిందట నిడదవోలు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును సీఐ తిలక్ సవాలుగా తీసుకున్నారు. కేసు నమోదు చేసి.. నిందితుడు సాయికుమార్‌ను సోమవారం గుంటూరులో అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.1,81,45,000 విలువ గల నగదు, స్థిర, చరాస్తులను సీజ్ చేశారు. అనూషాదేవి పరారైనట్లు సాయికుమార్‌ను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. ఆ తర్వాత రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

పాఠశాల హెచ్ఎం, ఇద్దరు టీచర్ల సస్పెన్షన్

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో.. నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి)లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో పాటు ఇద్దరు ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం సస్పెండ్ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావుతో పాటు గణితం బోధిస్తున్న మనోహర్‌రెడ్డి, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు మోహన్‌రావు తమపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఇటీవల పలువురు విద్యార్థినులు ఆరోపించారు. దీంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడితో పాటు ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ అభిలాష అభినవ్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఖమ్మం మార్కెట్‌కు 60 వేల మిర్చి బస్తాల రాక

- సీజన్‌లో తొలిసారి పోటెత్తిన ఎర్రబంగారం

ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఎర్రబంగారం(తేజ రకం కొత్త మిర్చి) పోటెత్తింది. ఈ మార్కెట్‌కు సోమవారం సుమారు 60 వేల మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. కొత్త మిర్చి సీజన్ ప్రారంభమైన తరువాత తొలిసారి పంట ఇంత భారీ మొత్తంలో వచ్చింది. మార్కెట్‌కు వారం రోజుల క్రితం 50 వేల బస్తాలు రాగా, శని ఆదివారాలు సెలవుల అనంతరం మరోసారి రైతులు భారీగా పంటను అమ్మకానికి తీసుకొచ్చారు. దీంతో మార్కెట్ యార్డులు ఉదయం 7 గంటలకల్లా మిర్చి బస్తాలతో నిండిపోయాయి. మార్కెట్లో క్వింటాలు మిర్చికి రూ.14,200 జెండాపాట నిర్ణయించగా నాణ్యతనుబట్టి వ్యాపారులు క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.13,500 వరకు కొనుగోలు చేశారు.

మార్చి 6 నుంచి పదో తరగతి ప్రి ఫైనల్ పరీక్షలు

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు మార్చి 6వ తేదీ నుంచి 15 వరకు జరగనున్నాయి. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ సోమవారం షెడ్యూల్ ప్రకటించింది. రంజాన్ నేపథ్యంలో పరీక్షలను మధ్యాహ్నం 12.15 గంటల నుంచి 3.15 వరకు నిర్వహిస్తామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ.నరసింహారెడ్డి తెలిపారు. మార్చి 6న ప్రథమ భాష, 7న ద్వితీయ భాష, 10న తృతీయ భాష, 11న గణితశాస్త్రం, 12న సామాన్యశాస్త్రం, 15న సాంఘీక శాస్త్రం పరీక్షలు ఉంటాయని తెలిపారు. పరీక్షలు జరిగే రోజుల్లో పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పరీక్షలకు ముందే ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

గ్రూప్-డి రైల్వే ఉద్యోగాలపై నేటి నుంచి టి-శాట్‌లో ప్రసారాలు

- సీఈవో వేణుగోపాల్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ) ఆధ్వర్యంలో నిర్వహించబోయే గ్రూప్-డి ఉద్యోగ నియామకాలపై మంగళవారం నుంచి టి-శాట్‌లో ప్రత్యేక ప్రసారాలు అందిస్తున్నామని టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు గ్రూప్-డి పరీక్షల్లో భాగంగా టెక్నికల్ పోస్టుల భర్తీ కోసం జనవరి నెలలో 32,438 ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఆ ఉద్యోగాలకు సంబంధించి మార్చి నెలలో పరీక్ష నిర్వహించబోతుందన్నారు. సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే జోన్‌లో 3,992 ఉద్యోగాల భర్తీ జరగనుందన్నారు. పరీక్ష నిర్వహించే కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ విభాగాలకు హాజరయ్యే అభ్యర్థులకు ఈ పాఠ్యాంశాలు ఉపయోగపడతాయని సీఈవో అన్నారు. జనరల్ సైన్స్, లెక్కలు, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, అవేర్‌నెస్ అండ్ కరెంట్ అఫైర్స్ సబ్జెక్టులపై సుమారు 200 ఎపిసోడ్‌లు ప్రసారం చేస్తున్నామన్నారు. టి-సాట్ నిపుణ చానల్‌లో సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు, విద్య చానల్‌లో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ఎపిసోడ్‌లు ప్రసారమవుతాయని సీఈవో వేణుగోపాల్ రెడ్డి వివరించారు.

సీపీఎస్ అభ్యర్థికి పండితులు, పాలిటెక్నిక్ లెక్చరర్ల మద్దతు

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ పడుతున్న సీపీఎస్ అభ్యర్థి తిరుమలరెడ్డి అన్నారెడ్డికి రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్, పాలిటెక్నిక్ లెక్చరర్ల సంఘం మద్దతు ప్రకటించినట్లు సీపీఎస్ అధ్యక్షుడు స్థితప్రజ్ఞ తెలిపారు. సీపీఎస్ రద్దు, ఏప్రిల్ 1నుంచి రాబోతున్న యూపీఎస్‌ను అడ్డుకునేందుకు చట్టసభల్లో సీపీఎస్ యూనియన్ ఎమ్మెల్సీ ఆవశ్యకత ఉన్నందున మద్దతు ప్రకటించినట్లు పండిత పరిషత్ అధ్యక్షుడు జగదీశ్ పేర్కొన్నారు. సీపీఎస్ విధానం ప్రభుత్వ లెక్చరర్లు, ఉపాధ్యాయుల ఆర్థిక భద్రత దెబ్బతీస్తుందని పాలిటెక్నిక్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు అంజయ్య పేర్కొన్నారు.

'రైల్వే బడ్జెట్'లో తెలంగాణకు 5,337కోట్లు

గత పదేళ్లలో రూ. 41,667కోట్లతో రాష్ట్రంలో రైల్వే సదుపాయాల అభివృద్ధి

- 2014 నుంచి ఇప్పటి వరకు 753 కిలోమీటర్లలో కొత్త ట్రాకుల నిర్మాణం
- 'కాజీపేట్'ను మల్టీ పర్పస్ ప్రొడక్షన్ యూనిట్‌గా అభివృద్ధి చేస్తాం
- రూ.327కోట్లతో హైదరాబాద్, రూ.715కోట్లతో సికింద్రాబాద్
- తెలంగాణలో 1,326కిలోమీటర్లలో కవచ్ వ్యవస్థ అందుబాటులోకి
- రాబోయే రెండేళ్లలో దేశవ్యాప్తంగా కొత్తగా 200 వందే భారత్‌లు
- కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్



మీడియాతో మాట్లాడుతున్న దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్

న్యూఢిల్లీ/హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రబడ్జెట్‌లో రైల్వేకు సంబంధించి తెలంగాణకు రూ.5,337 కోట్లు కేటాయించినట్లు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ కేటాయింపులు యూపీఏ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రతీ ఏట కేటాయించినదాని కంటే 6 రెట్లు ఎక్కువని అన్నారు. యూపీఏ హయాంలో ఉమ్మడి ఏపీకి ఏటా సగటున రూ.886 కోట్లు మాత్రమే కేటాయించినట్లు తెలిపారు. సోమవారం, ఢిల్లీలోని రైల్వే భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో అశ్వినీ వైష్ణవ్ మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో రైల్వే జోన్ల వారీగా చేసిన కేటాయింపుల గురించి వివరించారు. తెలంగాణలో గత పదేళ్లలో వివిధ రైల్వే ప్రాజెక్టులకు రూ.41,677కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. 2014 నాటి నుంచి చూస్తే రాష్ట్రంలో 753 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే ట్రాకులను నిర్మించినట్లు చెప్పారు. రైల్వే ట్రాకుల విద్యుదీకరణను 100% పూర్తి చేసినట్లు తెలిపారు. కాజీపేట్‌లో చేపట్టిన రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను మల్టీపర్పస్ రైల్వే ప్రొడక్షన్ యూనిట్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. కొత్త రైళ్లను, కొత్త ప్రాజెక్టులను దశలవారీగా ప్రకటించేలా బడ్జెట్ పాలసీలో మార్పులు చేశామని అశ్వినీ వైష్ణవ్ వివరించారు. హైదరాబాద్ రైల్వే స్టేషన్‌ను రూ.327 కోట్లు, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను రూ.715 కోట్లతో ఆధునీకస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. రాబోయే ఆరేళ్లలో దేశవ్యాప్తంగా కవచ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తెలంగాణలో ఇప్పటివరకు 1,326 కిలోమీటర్ల మేర కవచ్ సాంకేతికత అందుబాటులోకి వచ్చిందన్నారు. మరో వెయ్యి కిలోమీటర్ల మేర అమలు చేయాల్సి ఉందన్నారు.

హైదరాబాద్-విజయవాడ మధ్య నమో భారత్

రాష్ట్రంలో ఏడు జిల్లాల పరిధిలో 5 వందేభారత్ రైళ్లను నడుపుతున్నామని, రాబోయే రోజుల్లో మరిన్నింటిని నడుపుతామని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. రెండుమూడేళ్లలో దేశవ్యాప్తంగా కొత్తగా 200 వందే భారత్ రైళ్లను తీసుకువస్తామన్నారు. రాష్ట్రంలో 40 రైల్వేస్టేషన్లను అమృత్‌భారత్ స్టేషన్ పథకం కింద పునరభివృద్ధి చేస్తున్నామన్నారు. త్వరలో హైదరాబాద్-విజయవాడ మధ్య నమో భారత్ రైళ్లు అందుబాటులోకి వస్తాయన్నారు. పేద, మధ్యతరగతి ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని 1000 కిలోమీటర్ల దూరానికి రూ.450 చార్జీ ఉండే విధంగా అమృత్ భారత్ (నాన్ ఏసీ) రైళ్లను నడపనున్నట్లు చెప్పారు. మరోవైపు, దేశవ్యాప్తంగా 7వేల కిలో మీటర్ల పాత రైల్వే ట్రాక్‌లను మార్చే పనులను చేపట్టామని ఆయన వివరించారు. 2026కల్లా దేశవ్యాప్తంగా రైల్వే నెట్‌వర్క్ విద్యుదీకరణను పూర్తి చేస్తామని చెప్పారు.

రూ.650కోట్లతో త్వరలో ఘట్‌కేసర్-యాదాద్రి ఎంఎంటీఎస్

ఘటకేసర్-యాదాద్రి ఎంఎంటీఎస్ ప్రాజెక్టు త్వరలోనే పట్టాలెక్కనుందని దక్షిణ మధ్య రైల్వే(ఎస్‌సీఆర్) జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని రైల్ నిలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎంఎంటీఎస్ రెండో దశలో భాగంగా రూ.650కోట్ల బడ్జెట్ అంచనాతో ఘటకేసర్-యాదాద్రి రైల్వేలైన్ పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. సికింద్రాబాద్ నుంచి మేడ్చల్, మౌలాలి నుంచి సనత్‌నగర్, ఫలక్‌నుమా నుంచి ఉమ్దానగర్ వరకు ఎంఎంటీఎస్ ప్రాజెక్టు నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.491కోట్లు బకాయి పడిందని జైన్ చెప్పారు. అయినప్పటికీ రెండోదశ విస్తరణ పనులను ప్రారంభించే దిశగా ముందుకు వెళుతున్నామన్నారు. అయితే, ఔటర్ రింగ్ రోడ్‌కు వెలుపల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే రీజినల్ రింగ్‌రోడ్‌కు సమాంతరంగా రీజినల్ రింగ్ రైల్వేలైన్ వేసే ప్రతిపాదన ఏదీ బడ్జెట్‌లో లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ జరిపి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును సమర్పిస్తేనే రైల్వేశాఖ నుంచి అనుమతి లభిస్తుందన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు రూ.9,417కోట్లు

కేంద్రబడ్జెట్‌లో రైల్వేకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌కు రూ.9,417 కోట్లు కేటాయించినట్లు అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. యూపీఏ ప్రభుత్వంలో కేటాయింపులతో పోలిస్తే 11 రెట్లు ఎక్కువని అన్నారు. ఏపీలో రైల్వే అభివృద్ధి పనులకు ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు సహకరిస్తున్నారంటూ ఆయనకు కేంద్ర మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.



డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డిని సత్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

డా.నాగేశ్వర్‌రెడ్డి భారతరత్న అందుకోవాలి

మంత్రి కోమటి రెడ్డి ఆకాంక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పద్మ విభూషణ్ అవార్డు పొందిన ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డిని సత్కరించడం తెలుగువారందరికి గర్వకారణమని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు. సోమవారం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి మంత్రి వెళ్లి నాగేశ్వర్‌రెడ్డికి ప్రతిమ అందజేసి సన్మానించారు. వైద్య రంగంలో అనేక పరిశోధనల ద్వారా ఎందరికో ప్రాణం పోస్తున్నారని ఆయన సేవలను మంత్రి కొనియాడారు. ఏ ప్రభుత్వం ఉన్నప్పటికీ నాగేశ్వర్ రెడ్డి సేవలను గుర్తించి పద్మ అవార్డులు ఇవ్వడం చాలా సంతోషమన్నారు. డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి ఇంతకు ముందు పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులు అందుకున్నారని, ఇప్పుడు రెండో అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ అవార్డు పొందినట్లు తెలిపారు. మూడు పద్మ అవార్డులను అందుకున్న తొలి డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లో ఆయన భారతరత్న, నోబెల్ బహుమతి అందుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

ఎవరా 'కమీషన్' చైర్మన్?

- నిఘా వర్గాల ఆరా.. ప్రభుత్వానికి నివేదిక
- కలకలం రేపిన 'ఆంధ్రజ్యోతి' కథనం

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తన కమీషన్ కోసం వస్తువుల సరఫరాదారులకు పెండింగ్ బిల్లులు రాకుండా అడ్డుకుంటున్న ఓ కార్పొరేషన్ చైర్మన్ వ్యవహారం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. పెండింగ్ బిల్లులు ఇప్పిస్తానంటూ ఒప్పందం కుదుర్చుకొని.. ఆ పని చేయకపోగా, హైకోర్టు ఆదేశాల మేరకు జరుగుతున్న బిల్లుల చెల్లింపునూ ఆయన అడ్డుకుంటుండడంపై 'ఓ చైర్మన్ కమీషన్ కహానీ' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' సోమవారం ప్రచురించిన కథనం కలకలం రేపింది. నిఘా వర్గాలు ఎవరా చైర్మన్? ఏమా కథ? అంటూ ఆరా తీశాయి. ఇందుకు సంబంధించి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాయి. వస్తువుల సరఫరాదారులకు సదరు కార్పొరేషన్ నుంచి రూ.90 కోట్ల పెండింగ్ బిల్లులు రావాల్సి ఉండగా.. తనకు 10 శాతం కమీషన్ ఇస్తే తానే బిల్లులు ఇప్పిస్తానని ఆ కార్పొరేషన్ చైర్మన్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఆయన బిల్లులు ఇప్పించకపోవడంతో వారు హైకోర్టుకు వెళ్లడం, నిర్ణీత సమయంలోగా బిల్లులు చెల్లించాలని న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించడం జరిగాయి. దీంతో కోర్టు ఉత్తర్వుల ప్రకారం సరఫరాదారులకు బిల్లులు వచ్చేస్తే.. తనకు కమీషన్ రాకుండా పోతుందనే ఉద్దేశంతో సదరు కార్పొరేషన్ చైర్మన్ కొర్రీలు పెట్టడం ప్రారంభించారు. వస్తువుల సరఫరాపైనే విజిలెన్స్ విచారణ వేయాలంటూ విజిలెన్స్ విభాగానికి లేఖ రాశారు. దీంతోపాటు విజిలెన్స్ నివేదిక వచ్చేవరకు బిల్లులు చెల్లించవద్దంటూ ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శికి కూడా లేఖ రాశారు. జిల్లాలో జరిగిన సరఫరాపై విజిలెన్స్ కూడా విచారణ వేయించారు. విగతా జిల్లాల్లోనూ ఇలాగే విచారణ వేయించే ప్రయత్నాల్లో ఉన్నారు. ఎప్పుడో పరిశీలన పూర్తయి, జిల్లా కలెక్టర్ల ఆమోదంతో బిల్లుల చెల్లింపునకు ఆర్థిక శాఖకు ఫైలు వెళ్లిన చాలా కాలం తర్వాత.. కేవలం తనకు కమీషన్ దక్కదన్న ఉద్దేశంతో అడ్డుపుల్ల వేస్తున్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం కూడా దృష్టి పెట్టినట్లు సమాచారం.

రియల్ ఎస్టేట్ కోలుకుందిప్పుడే: కుంభం అనిల్

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోయిందంటూ కేటీఆర్, హరీశ్‌రావు అపోహలు సృష్టిస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. వారు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. వాస్తవానికి ఎన్నికలకు ఐదారు నెలల ముందే రియల్ ఎస్టేట్ పడిపోయిందని, గడిచిన మూడు నెలలుగా మళ్లీ కోలుకుంటోందని చెప్పారు. గతంతో పోలిస్తే రిజిస్ట్రేషన్లు పెరిగాయన్నారు.

కమలదళంలో నవ, యువతరానికి పెద్దపీట

19 జిల్లాలకు బీజేపీ అధ్యక్షులు ఖరారు .. జిల్లా అధ్యక్ష పదవుల్లో రెడ్లకు 6

- మున్నూరు కాపు, గౌడ సామాజికవర్గాలకు 4
- మహిళలకు తొలి జాబితాలో దక్కని చోటు



హైదరాబాద్,ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): కమలం జిల్లా సారథ్య బాధ్యతలను పార్టీ జాతీయ నాయకత్వం నవ, యువతరానికి కట్టబెట్టింది. సంస్థాగత నియమావళిని పక్కాగా అమలు చేయడంతో పలువురు సీనియర్ నాయకులు అర్హత కోల్పోయారు. దీంతో, యువనాయకులకు అవకాశం లభించింది. జిల్లా పార్టీ అధ్యక్షుల తొలి జాబితాలో 45 నుంచి 55 ఏళ్ల మధ్య వయస్సు వారే ఎక్కువగా ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 19 జిల్లాలకు కొత్త అధ్యక్షులను పార్టీ సంస్థాగత ఎన్నికల అధికారి యెండల లక్ష్మీనారాయణ సోమవారం ప్రకటించారు. వీరితో పాటు 52 మంది రాష్ట్ర పార్టీ కౌన్సిల్ సభ్యులను కూడా ఆయన ప్రకటించారు. జిల్లాపార్టీ అధ్యక్ష పదవుల్లో రెడ్డి సామాజికవర్గానికి 6 జిల్లాలు దక్కాయి. బీసీల్లో ప్రధానంగా మున్నూరుకాపు, గౌడ సామాజికవర్గాలకు నాలుగు చొప్పున దక్కాయి. పార్టీ విడుదల చేసిన తొలి జాబితాలో ఒక్క మహిళ కూడా లేరు. మిగతా 19 జిల్లాల్లో ఎంతమంది మహిళలకు అధ్యక్ష పదవులు కేటాయించబోతున్నారన్నది ఆసక్తికరంగా మారింది.

19 జిల్లాలకు పార్టీ అధ్యక్షులు వీరే

ఆదిలాబాద్- పతంగి బ్రహ్మానంద్, మంచిర్యాల- వెంకటేశ్వర్‌గౌడ్, కొమ్రంభీం ఆసిఫాబాద్- శ్రీశైలం ముదిరాజ్, నిజామాబాద్-దినేశ్ కులాచారి, కామారెడ్డి-నీలం చిన్నరాజులు, జగిత్యాల- రాచకొండ యాదగిరిబాబు, పెద్దపల్లి- కర్రె సంజీవరెడ్డి, మెదక్-వల్దాస్ రాధామల్లేష్‌గౌడ్, మేడ్చల్ మల్కాజ్‌గిరి రూరల్- బుద్ధి శ్రీనివాస్, నల్గొండ- నాగం వర్షిత్‌రెడ్డి, మహబూబ్‌నగర్- పి. శ్రీనివాస్‌రెడ్డి, వనపర్తి- దుప్పల్లి నారాయణ, హన్మకొండ- కొలను సంతోష్ రెడ్డి, వరంగల్- గంట రవికుమార్, జయశంకర్ భూపాల్‌పల్లి- నిశిధర్‌రెడ్డి, జనగామ- సౌడ రమేశ్, ములుగు- సిరికొండ బలరాం, సికింద్రాబాద్ మహంకాళి-గుండగోని భరత్‌గౌడ్, హైదరాబాద్ సెంట్రల్- లంకాల దీపక్‌రెడ్డి. కాగా, 19 జిల్లాల అధ్యక్షులతో పాటు, 52 మంది రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల నియామకం తక్షణం అమల్లోకి వస్తుందని యెండల లక్ష్మీనారాయణ తెలిపారు.

రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు లైన్ క్లియర్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు లైన్ క్లియర్ అయ్యింది. పార్టీ సంస్థాగత నియమావళి ప్రకారం, 50శాతం జిల్లా అధ్యక్షుల ఎన్నిక పూర్తయితేనే రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. బీజేపీకి సంస్థాగతంగా 38 జిల్లాలు ఉన్నాయి. ఇందులో సరిగ్గా 50శాతం జిల్లా(19)లకు సోమవారం కొత్త అధ్యక్షులను ప్రకటించారు. కొత్త రాష్ట్ర అధ్యక్షుడికి సంబంధించి ఇప్పటికే పార్టీ జాతీయ నాయకత్వం, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకుల అభిప్రాయ సేకరణ జరిపింది. మరోసారి ఈ ప్రక్రియ కొనసాగించే అవకాశం ఉందని పార్టీ ముఖ్యనేత ఒకరు తెలిపారు. వారం రోజుల్లోపే కొత్త అధ్యక్షుడి నియామకం జరగవచ్చని ఆయన చెప్పారు.

'ఆంధ్రజ్యోతి'పై పరువునష్టం కేసులో

న్యాయవాదిగా సుబ్రమణ్యస్వామి తొలగింపు

స్టాండింగ్ కౌన్సిల్‌కు కేసు అప్పగిస్తూ టీటీడీ నిర్ణయం.. సుబ్రమణ్య స్వామి కోసం గత ప్రభుత్వం ఆరాటం

- న్యాయవాది కాకపోయినా నియామకం
- భారీ మొత్తంలో ఫీజులు చెల్లింపు
- వాయిదాలకు ప్రత్యేక విమానంలో స్వామి రాక
- ఆ ఖర్చులు ఎవరు భరించారో ఇంకా తేలని వైనం
- ఆర్థిక భారాన్ని తప్పించుకోవడానికి స్వామిని తప్పించిన టీటీడీ

తిరుపతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆంధ్రజ్యోతి దినపత్రికపై టీటీడీ దాఖలు చేసిన పరువునష్టం కేసులో టీటీడీ తరపు న్యాయవాదిగా వ్యవహరిస్తున్న మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామిని తొలగించారు. కేసును టీటీడీ స్టాండింగ్ కౌన్సిల్‌కు అప్పగించారు. దీంతో టీటీడీ తరపున స్టాండింగ్ కౌన్సిల్ జయచంద్ర తాజాగా తిరుపతి కోర్టులో వకాల్తా దాఖలు చేశారు. వివరాలు ఇవీ.. టీటీడీ ఆన్‌లైన్ పంచాంగంలో ఏసయ్య అన్న పదం పేర్కొని ఉండటాన్ని 2019 నవంబరులో పలువురు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పరిశీలించి ధ్రువీకరించుకున్న మీదట ఆంధ్రజ్యోతి దానిపై వార్త ప్రచురించింది. అప్పట్లో ఈ కథనం సంచలనం సృష్టించింది. ఆంధ్రజ్యోతితో పాటు పలు ఇతర ఎలక్ట్రానిక్ న్యూస్ చానెళ్లలో కూడా ఆ వార్త ప్రముఖంగా ప్రసారమైంది. అయితే అప్పటి ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో టీటీడీ 2021లో ఆంధ్రజ్యోతిపై మాత్రమే రూ. వంద కోట్లకు పరువు నష్టం దావా వేసింది. తిరుపతిలోని పదవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో ఓఎస్ నంబరు 44-2021 పేరిట నమోదైన ఆ కేసులో న్యాయవాదిగా బీజేపీ నేత, మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామిని టీటీడీ నియమించింది. ఆయన న్యాయవాది కాకపోయినా అడ్వొకేట్ యాక్ట్ సెక్షన్ 32ను ఆధారంగా చేసుకుని ఆ నిర్ణయం తీసుకుంది. ఆంధ్రజ్యోతి తరపున పౌర హక్కుల నాయకుడు, న్యాయవాది క్రాంతి చైతన్య వాదనలు వినిపిస్తున్నారు. వాయిదాలకు సుబ్రమణ్యస్వామి తన శిష్యులతో కలిసి ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి వచ్చేవారు. కేసు వాయిదా పడగానే కోర్టు బయటే ప్రెస్‌మీట్ పెట్టి ఆరోపణలు చేసేవారు. సుబ్రమణ్యస్వామి ప్రత్యేక విమానాల ఖర్చు ఎవరు భరించేవారో ఇంకా తేలాల్సి ఉంది.

టీటీడీ తీరుపై గతంలోనే విమర్శలు

దేశంలోనే అత్యంత సంపన్నమైన దేవస్థానంగా ఉన్న టీటీడీకి బలమైన న్యాయ విభాగం ఉంది. ఫీజు చెల్లించి నిపుణులైన న్యాయవాదులను నియమించుకునే అవకాశముంది. అయినా న్యాయవాది కాని సుబ్రమణ్యస్వామిని న్యాయవాదిగా నియమించుకోవడం అప్పట్లో అందరినీ ఆశ్చర్యపరిచింది. అదే సమయంలో అప్పటి వైసీపీ ప్రభుత్వ పెద్దల కక్షసాధింపు వైఖరిని కూడా ఈ నియామకం బయటపెట్టింది. గతంలో తమిళనాడు మాజీ సీఎం జయలలిత వంటి వారిపై కేసులు వేసి ఇబ్బంది పెట్టిన నేపథ్యం సుబ్రమణ్యస్వామికి ఉన్నందునే వైసీపీ ప్రభుత్వ పెద్దలు ఆంధ్రజ్యోతి యాజమాన్యాన్ని ఇబ్బంది పెట్టడానికి ఏరికోరి ఆయన్ను ఎంపిక చేసుకున్నారనే ప్రచారం జరిగింది. కాగా గతేడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో టీటీడీలో ప్రక్షాళన మొదలైంది. అందులో భాగంగా అర్హత లేని వ్యక్తిని న్యాయవాదిగా నియమించుకోవడంపై టీటీడీ అధికారులు పునరాలోచన చేసినట్టు సమాచారం. దానికి తోడు ఆయనకు భారీ మొత్తంలో ఫీజు చెల్లించాల్సి ఉండడం వల్ల టీటీడీపై ఆర్థిక భారం పడుతుందన్న ఆలోచనతో కూడా ఆయన నియామకాన్ని రద్దు చేసినట్టు తెలుస్తోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.